# వరివస్యా రహస్యము

స్వామి పరమానందనాథ
(డా॥ క్రోవి పార్థసారధి)



శివకామేశ్వరి గ్రంథమాల
విజయవాడ - 13.

# వరివస్యా రహస్యము

గ్రంథకర్త :
స్వామి పరమానందనాథ
(డా॥ క్రోవి పార్థసారథి)

ప్రకాశకులు :
శివకామేశ్వరి గ్రంథమాల
41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక,
విజయవాడ - 520 013.   ఫోన్ : 0866-2522824

**వరివస్యా రహస్యము**

గ్రంథకర్త :
**స్వామి పరమానందనాథ (డా॥ క్రోవి పార్థసారథి)**

ప్రథమ ముద్రణ : మే, 2008

ప్రతులు : 1000

హక్కులు : ప్రకాశకులవి

**మూల్యము : రూ. 60-00**

ప్రతులకు :
**శివకామేశ్వరి గ్రంథమాల**
41-22/4-36, భ్రమరాంబాపురం,
కృష్ణలంక, విజయవాడ-520 013
ఫోన్ : 0866-2522824

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్ : 0866-2574828

## ప్రణతులు

'వరివస్య' అంటే అర్చన, పూజ, ఉపచారము అని అర్థం. 'వరివస్యా రహస్యము' అంటే ఆ పరమేశ్వరి యొక్క పూజావిధానము. పూజ రెండు రకాలు. 1. అంతరంగికము 2. బాహ్యము. మంత్రంలోని అక్షరాల నియమము, కాలము, ఉచ్చారణ, అక్షరాల ఉత్పత్తి స్థానాలు, వాటి ప్రయత్నము, రూపము, ఇవన్నీ అంతరంగికాలు. ఈ అంతరంగ సాధనలు అందరికీ సాధ్యం కావు. అంతర్ముఖులకే సాధ్యమవుతాయి. అందుచేత 'వరివస్యా రహస్యము' అంతా అంతర్ముఖుల కోసం చెప్పబడింది అన్నారు గ్రంథంయొక్క రెండవభాగంలోని 106, 107 శ్లోకాలలో.

ఈ గ్రంథం మొత్తం రెండు భాగాలుగా ఉన్నది. మొదటి భాగంలో 'శ్రీవిద్య వేదవిద్య' అని నిరూపిస్తూ, పంచదశి మహామంత్రం ఏ రకంగా ఆవిర్భవించింది ? వర్ణోత్పత్తి స్థానాలు, ఉచ్చారణ కాలము, శూన్యషట్కము, విషువ నిరూపణ, జపస్వరూపము మొదలైన విషయాలు చెప్పి, రెండవ భాగంలో మంత్రానికి 15 రకాలయిన అర్థాలు చెబుతూ, మంచి గురువు దగ్గర ఉపదేశం పొంది జపం చేసిన మంచి ఫలితం వస్తుందన్నారు.

భాస్కరరాయలవారు మంచి పండితుడు. శ్రీవిద్యోపాసకుడు, సిద్ధపురుషుడు, మహాజ్ఞాని. అటువంటి మహాపురుషుడు మన తెలుగువాడు కావటం, ఆయన వ్రాసిన పుస్తకానికి నేను నాచేతనైనంత వరకు వివరణ వ్రాయటం అనేది నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఈ గ్రంథ రచనలో నాకు అన్ని విధాలా సాయమందించిన నా భార్య రమాదేవికి కృతజ్ఞతలు.

ఏమీ తెలియని నన్ను ఆస్థాన విద్వాంసునిగా నియమించిన అవధూత, దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారికి ఈ గ్రంథాన్ని అంకితం చేస్తున్నాను.

యోగినీ హృదయము, కామకళావిలాసము, సౌందర్యలహరి, సుభగోదయస్తుతి, లలితా సహస్రము, ఉపనిషత్తులు మొదలయిన గ్రంథాలను ఉటంకిస్తూ, ఈ గ్రంథరచన చేస్తున్నాను. మిగిలినటువంటి గ్రంథాల మాదిరిగానే శ్రీవిద్యా సంబంధమైన **'వరివస్యారహస్యాన్ని'** కూడా ఆదరిస్తారని భావిస్తూ ...

సర్వధారినామ సంవత్సర
వైశాఖ బహుళ దశమి
శుక్రవారము, 30-5-2008

బుధజన విధేయుడు
**క్రోవి పార్థసారథి**

### అవధూత దత్త పీఠాధిపతి జగద్గురు పరమపూజ్య
### శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి
## ఆశీస్సందేశము

'సృష్టికర్త్ర్యై నమః'

'సృష్టికర్త్రిగా అమ్మే అన్నిటినీ సృష్టించింది. అన్నీ అమ్మలోనే ఉనానయి.

'అ'కారాది 'హ' కారాంతం వరకూ గల వర్ణాలూ ఉన్నాయి, త్రికోణాలు ఉన్నాయి. నాడులూ ఉన్నాయి. కళలూ ఉన్నాయి. పంచతన్మాత్రలున్నాయి. మహావాక్యాలున్నాయి. చక్రాలున్నాయి. చక్రాల వివరణలూ ఉన్నాయి. గాయత్రీ మంత్రార్థమూ ఉంది. పంచకోశాల తత్త్వమూ ఉంది.

అయితే ఇవన్నీ విపులంగా వివరించటానికి గ్రంథాలు చాలవు. పోనీ నోటివాక్యాలతో ఇవి అర్థమూకావు. అందుకే అమ్మ స్తోత్రాలన్నీ గుహ్యాతి గుహ్యములు. రహస్యాతి రహస్యములు.

మనం పైన చెప్పకున్నవన్నీ ఈ 'వరివస్యా రహస్యం'లో ఉన్నవే.

దేవీ ఉపాసకులైన భాస్కరరాయలవారు అమ్మకు సంబంధించిన రహస్యాలలో కొన్నిటిని మనకు పరిచయంకోసమని అందించారు.

అవి మామూలు వారికి అర్థం కావు. అమ్మను ఉపాసించిన వారికే కాస్తో కూస్తో అర్థమవుతాయి. దేవీ ఉపాసకులు, దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు, క్రోవి పార్థసారథిగారు, భాస్కరరాయలు రచించిన ఈ గ్రంథాన్ని వివరించటానికి ప్రయత్నం చేశారు. చాలా సంతోషం.

అమ్మ గురించి తెలుసుకోవటానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉండాలి. చక్రాలను అధిగమించి సహస్రార చక్రంలోగల అమ్మను సాక్షాత్కరింప చేసుకోవచ్చు.

'అంతర్ముఖ సమారాధ్యాయై నమః బహిర్ముఖ సుదుర్లభాయై నమః ' అటువంటి అమ్మ రహస్యాలను పార్థసారథిగారు మరిన్ని వెలికి తీసి, దేవీ భక్తులకు ఉపయోగపడు అక్షరార్చనను చేతురుగాక !

పార్థసారథిగారు, వారి కుటుంబంపై ఆదిగురు శ్రీకాలాగ్ని శమన దత్తాత్రేయస్వామి అనుగ్రహం వర్షించుగాక ! అని ఆశీర్వదిస్తూ .......

# భాస్కరరాయులు

లలితాసహస్రానికి అనేకమంది వ్యాఖ్యలు వ్రాశారు. వాటన్నింటిలోకి మొట్టమొదటిది, మూలమైనది భాస్కరరాయలవారు వ్రాసిన "సౌభాగ్య భాస్కరము". తరువాత వచ్చిన వ్యాఖ్యలన్నింటికీ ఇదే మాతృక అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. వీరు క్రీస్తుశకం17, 18 శతాబ్దాల మధ్య జీవించారు.

కర్ణాటక రాష్ట్రంలోని బీజపూరు నందు బీజపూరు నవాబుకు విశ్వామిత్ర గోత్రీకుడైన గంభీరరాయ దీక్షితులు మంత్రిగా ఉండేవాడు. గంభీరరాయలు మహాపండితుడు. సోమయాజి, బహు గ్రంథకర్త, రాజనీతిజ్ఞుడు. మహాభారతాన్ని పార్శీభాషలోకి అనువదించి "భారతి" అని బిరుదు పొందాడు. ఈయన భార్య కోనమాంబ. రాచకార్యము మీద ఈయన హైదరాబాదు నగరానికి వచ్చినప్పుడు అక్కడ ఈ పుణ్యదంపతులకు భాస్కరరాయలు జన్మించాడు. బాలభాస్కరుడు దినదిన ప్రవర్ధమానుడై నారాయణపేట దగ్గరగల 'లోకాపల్లి' అనే గ్రామంలో సాక్షాత్తూ సరస్వతీస్వరూపమైన నృశింహయాజి దగ్గర సమస్త విద్యలు అభ్యసించి, ఆ తరువాత సూరత్ నగరవాసి అయిన "ప్రకాశానంద నాథ" అనే దీక్షానామంగల శివదత్తశుక్ల దగ్గర ఉపదేశం పొందాడు. గురువు యొక్క అనుగ్రహంతో పరదేవతా సాక్షాత్కారం పొందిన భాస్కరాచార్యుడు దేశాటన చెయ్యటం ప్రారంభించాడు.

ఆ రోజుల్లో మహారాష్ట్ర దేశానికి సేనాధిపతి అయిన 'చంద్రసేన జాదవు' భాస్కరాచార్యుని శిష్యుడైనాడు. చంద్రసేనుడికి సంతానం లేదు. అందుచేత అతడు భార్యతో సహా గురువుగారైన భాస్కరాచార్యుని దగ్గరకువెళ్ళి, సంతానాన్ని ప్రసాదించమని వేడుకున్నాడు. కరుణామయుడైన భాస్కరాచార్యుడు చంద్రసేనుడికి పుత్రసంతానం కలుగుతుంది అని దీవించాడు. కాలక్రమంలో చంద్రసేనుడి భార్య గర్భవతి అయింది.

ఆ రోజులలో నారాయణదేవుడు అనేవాడు భాస్కరునికి శిష్యుడుగా ఉండేవాడు. అతడు పండితుడు, సద్గుణసంపన్నుడు. అన్నిటికీ మించి గురువుగారి మీద అచంచలమైన భక్తిప్రపత్తులు కలవాడు. నారాయణదేవుని యొక్క దీక్షకు మెచ్చి భాస్కరాచార్యుడు అతడికి వాగ్దేవీ మంత్రాన్ని ఉపదేశించాడు. గురుకటాక్షవీక్షణాల వల్ల మంత్రసిద్ధి జరిగి నారాయణదేవుడికి వాక్సిద్ధి లభించింది. ఈ రకంగా వాక్సిద్ధిని పొందిన నారాయణదేవుడు కూడా దేశాటన చేస్తూ మహారాష్ట్ర ప్రాంతంలో చంద్రసేనుడున్న నగరానికి వచ్చాడు. అతడి గొప్పతనాన్ని విన్నటువంటివాడై చంద్రసేనుడు అతని వద్దకు వెళ్ళి, తన భార్య గర్భవతి అని చెప్పి, తనకు ఏ సంతానం కలుగుతుంది ? అని అడిగాడు. దానికి నారాయణదేవుడు స్త్రీ సంతానము కలుగుతుంది అని చెప్పాడు. ఆ మాటలు వినగానే చంద్రసేనుడు "అయ్యో ! అదెలా జరుగుతుంది ? మా గురువుగారు భాస్కరాచార్యుల వారు పుత్ర సంతానం కలుగుతుందని చెప్పారు కదా!" అన్నాడు. ఆ మాటలు వినగానే నారాయణదేవుడు ఎక్కడో పొరపాటు జరిగిపోయిందని గ్రహించి "ఓ మూర్ఖుడా ? భాస్కరాచార్యుల వారే నాకు కూడా గురువుగారు. వారి దయవల్లనే నాకు వాక్సిద్ధి లభించింది. అటువంటి నాతో వేరేరకంగా చెప్పించావు. కాబట్టి నీకు ఆడామగా కాని శిశువు జన్మిస్తుంది." అని శాపం పెట్టాడు. చంద్రసేనుడు తను చేసిన పనికి విచారించసాగాడు. కొంతకాలానికి చంద్రసేనుని భార్య ప్రసవించింది. నారాయణదేవుడు చెప్పినట్లే నపుంసకుడు జన్మించినాడు. ఈ పరిణామానికి చంద్రసేనుడు విపరీతంగా దుఃఖించసాగాడు. కొంతకాలానికి భాస్కరరాయలవారు 'భలాకి' అనే నగరానికి వచ్చినట్లుగా తెలిసి, కుమారుణ్ణి వెంటపెట్టుకుని అక్కడకు వెళ్ళి గురువుగారి పాదాలనాశ్రయించి, నపుంసకుడైన తన కుమారుని పురుషుడుగా చెయ్యమని కోరాడు. కరుణాంతరంగుడైన భాస్కరాచార్యుడు రామచంద్ర జాదవుడనే పేరు గల ఆ బాలుణ్ణి వెంటపెట్టుకుని కృష్ణాతీర మందలి "మలీమడుగు" అనే పుణ్యక్షేత్రానికి పోయి కృష్ణలో తృచార్ఘ్యదానానుష్ఠానము మొదలుపెట్టాడు.

మలీమడుగు నుంచి కృష్ణానది కొంచెం దూరంగా ఉన్నది. ప్రతిరోజూ ఆచార్యుడు నదీ తీరానికి కాలినడకన ఏగి అనుష్ఠానం పూర్తి చేసుకుని వస్తుండేవాడు. ఇలా చెయ్యటం వల్ల అతడి కాళ్ళు బొబ్బలెక్కి

పుండ్లు పడిపోసాగాయి. అది చూసిన శిష్యులు “గురుదేవా! మన నివాసం నదీతీరానికి మారుద్దాం !” అన్నారు. ఆ మాటలు విన్న భాస్కరుడు “కృష్ణానదినే మన దగ్గరకు రప్పిద్దాం” అన్నాడు. దానికోసం మరునాటి నుండి సూర్యోపాసన ప్రారంభించాడు. సూర్యభగవానుడు ప్రత్యక్షమై భాస్కరాచార్యుని కోరిక తెలుసుకుని, “బ్రహ్మ యొక్క సృష్టిని ఎదిరించటం కూడని పని. రామచంద్రుడికి పుంసత్వాన్ని నేను ప్రసాదిస్తాను. ఆ పని మానుకో” అన్నాడు. ఆ మాటలు విన్న భాస్కరాచార్యుడు కుపితుడై, “రామచంద్రుణ్ణి పురుషునిగా చెయ్యగల సామర్థ్యం నాకున్నది. నేనడిగినట్లుగా నువ్వు కృష్ణానదిని మళ్ళించు లేకపోతే సూర్యోపాసన ప్రయోజనం లేనిది అని ప్రచారం చేస్తాను” అన్నాడు. ఆ మాటలు విన్న సూర్యభగవానుడు భాస్కరుని కోరిక మన్నించి, నదీ ప్రవాహాన్ని మలీమడుగుకు మళ్ళించాడు. ఆ సందర్భంలోనే భాస్కరాచార్యుడు “తృచభాస్కరము” అనే గ్రంథాన్ని రచించాడు. తరువాత భాస్కరుని ఉపాసనతో రామచంద్రుని నపుంసకత్వం కూడా పోయింది. దీనికి ఆనందించిన రామచంద్రుని తండ్రి చంద్రసేనుడు మలీమడుగు గ్రామాన్ని భాస్కరునకివ్వగా, భాస్కరాచార్యుడు ఆ గ్రామాన్ని బ్రాహ్మణులకు దానమిచ్చాడు. ఆ గ్రామంలో చింత చెట్లు ఎక్కువగా ఉండేవి. అందుచేత చింతకాయలను ఎవరూ అమ్మరాదు. ఎవరికి కావలసినవి వారు కోసుకుని వాడుకోండి. ఒకవేళ ఎవరైనా వాటిని అమ్మాలని చూస్తే, వాటిల్లో పురుగులొస్తాయని ఆంక్ష పెట్టాడు భాస్కరుడు.

భాస్కరాచార్యుడు శంకరాచార్యుని పరంపరగా అద్వైతమతాన్నే ప్రచారం చేశాడు. ఆ రోజులలో సత్యబోధస్వామి మధ్వమఠాధిపతిగా ఉండేవాడు. భాస్కరాచార్యుడు దేశాటనచేస్తూ సత్యబోధస్వామిని వాదనలో జయించాడు. ఈ సత్యబోధుని సోదరుని కుమార్తె పార్వతి. శాస్త్రప్రకారము ముద్రాంకితురాలు. మధ్వ సంప్రదాయంలో శంఖు చక్ర ముద్రలు వేయించుకున్న వారే సంప్రదాయులు. అటువంటి ఆమెకు ప్రాయశ్చిత్తం చేయించి స్మార్తవిధిని ఆమెను వివాహం చేసుకున్నాడు. ఈ రకంగా మధ్వుల కుమార్తెను వివాహమాడాడు కాబట్టి మధ్వులు భాస్కరుడికి వ్యతిరేకులైనారు.

ఆ రకంగా దేశాటనచేస్తూ క్రీ॥శ॥ 1750 ప్రాంతంలో కాశీక్షేత్రానికి వచ్చి ‘సౌభాగ్యభాస్కరము’ అనే పేరుతో లలితా సహస్రానికి భాష్యం వ్రాశాడు. ఆ రోజులలో కాశీక్షేత్రంలో ఉన్న పండితులకందరికీ ఈ విషయం బాధాకరంగా తయారయి వారంతా ఒకచోట చేరి భాస్కరాచార్యుణ్ణి పరీక్షించాలి అనుకున్నారు. అప్పటి పండితులలో కుంకుమానందస్వామి చాలా ప్రసిద్ధుడు. అందుచేత కాశీలోని పండితులందరూ ఆతని అనుజ్ఞ తీసుకుని భాస్కరుని దగ్గరకు వచ్చి “అయ్యా ! మీరు పరదేవతాకటాక్షంతో లలితా సహస్రానికి భాష్యం వ్రాశారు అని చెబుతున్నారు. అలాగయినప్పడు ఆ దేవి ‘మహాచతుష్షష్టి కోటియోగినీ గణసేవితా’ అని చెప్పబడిందికదా. ఆ నామంలో ఉన్న యోగినీ దేవతల పేర్లు, రూపాలు, వారి చరిత్రలు వివరించండి” అన్నారు. వారి మాటలు విన్న భాస్కరుడు “అయ్యా మీరందరూ మీమీ పనులు పూర్తిచేసుకుని సాయంకాలం గంగానదీ తీరానికి రండి. నేను కూడా అక్కడికి వస్తాను. ఆ ప్రదేశంలోనే మీ సంశయం కూడా తీరుస్తాను” అన్నాడు. సరే అన్నారు. పండితులు సాయంకాలం నిర్ణీతసమయానికి ముందుగానే వచ్చారు. పండిత లోకమంతా గంగాతీరాన చేరింది. అప్పడు వారిలోనుంచి ఒక పండితుడు లేచి, ‘ఆర్యా ! చతుష్షష్టి కోటియోగినీ దేవతల రూపాలను వివరించండి’ అన్నాడు. అప్పడు భాస్కరులవారు, పండితులందరినీ సావధానులు కమ్మని చెప్పి యోగినీ చరిత్ర వివరించటం ప్రారంభించారు. అప్పడు అనేక గొంతులతో, అనేక స్వరాలతో యోగినుల చరిత్ర ఒక్కసారిగా వినిపించసాగింది. అది విన్న పండితలోకం ఆశ్చర్యబోయింది. ఒకే మనిషి ఒక్కసారిగా అన్ని గొంతులతో ఎలా మాట్లాడగలడో అర్థం కాలేదు వారికి. ఏమీ మాట్లాడలేక అక్కడ నుంచి కుంకుమానందస్వామి దగ్గరకు వెళ్ళి, జరిగినదంతా చెప్పి అదెలా సంభవమో చెప్పమని ప్రాధేయపడ్డారు. ఆ మాటలు విన్న కుంకుమానంద స్వామి చిరునవ్వుతో తన కమండలంలోని నీళ్ళతో పండితులకళ్ళు తుడిచి ఇప్పడు చూడండి అన్నాడు. గంగానదిలో ఆకాశభాగంలో యోగినీ దేవతలు వారివారి వాహనాలు ఎక్కి, వారి చరిత్రలు వారే చెబుతున్నారు. ఆ సమయంలో భాస్కరాచార్యుని కుడిభుజం మీద లలితాదేవి,

ఎడమభుజం మీద శ్యామలాదేవి కూర్చుని ఉన్నారు. ఆ దృశ్యం చూసిన పండితులనోట మాటరాలేదు. భాస్కరాచార్యుని శక్తి గమనించిన వారందరూ వెంటనే అతని పాదాలు పట్టుకుని క్షమించమని వేడుకున్నారు. అంతేకాకుండా భాస్కరాచార్యులు పరదేవతా స్వరూపులని, సౌభాగ్య భాస్కరము అత్యంత ప్రమాణగ్రంథమని విశ్వసించారు.

క్రీస్తు శకము 1700-1768 మధ్యకాలంలో భాస్కరాచార్యులవారు సౌభాగ్య భాస్కరము, సేతుబంధము, చండాభాస్కరము, తృచభాస్కరము, వరివస్యా రహస్యము మొదలైన 43 గ్రంథాలను రచించారు. భాస్కరరాయల వారిని గురించి అతని శిష్యుడు జగన్నాథుడు 'భాస్కరవిలాస కావ్యము' అనే గ్రంథాన్ని కూడా వ్రాశాడు.

భాస్కరాచార్యుడు వేదవిదుడు. సకలశాస్త్రాలు క్షుణ్ణంగా చదివినవాడు. శ్రీవిద్యా సంప్రదాయంలో పూర్ణదీక్షాపరుడు. దక్షిణాచార సంపన్నుడు. గ్రంథాలను వ్రాసేటప్పుడు వాటిలో ఉన్న రహస్యాలను వివరించాలి కాబట్టి వామాచార పద్ధతులను కూడా వివరించారు. దీనిని బట్టి వారు అన్ని ఆచారాలను, సంప్రదాయాలను పూర్తిగా తెలిసినవారు అని తెలుస్తుంది. ఆయన మాత్రం స్వయంగా దక్షిణాచార సంపన్నుడు. మహామంత్రవేత్త.

భాస్కరరాయలవారి తండ్రిగారైన గంభీరరాయలవారు మహాభారతాన్ని పార్శీభాషలోకి అనువదించారు అనీ, ఆ సందర్భంగా వారికి 'భారతి' అని బిరుదు ప్రదానం చెయ్యటం జరిగింది అని ముందే చెప్పాము. కొన్నిచోట్ల ఈ బిరుదులు కాలక్రమేణా ఇంటిపేర్లుగా మారిపోతుంటాయి. మన ప్రాంతంలో 'శ్రీమాన్' అనే బిరుదు ఈ రకంగా మారినదే. అదేవిధంగా 'భారతి' అనే బిరుదు కూడా 'భారతుల' అయి ఇంటిపేరయింది. ఈ రోజున భారతుల అనే ఇంటిపేరుగల వారు కృష్ణానదీప్రాంతంలో ఉన్నారు. వీరు వైదిక బ్రాహ్మణులు. తెలగాణ్యులు. ఇన్ని గ్రంథాలు వ్రాసిన పరదేవతాస్వరూపమైన భాస్కరాచార్యుడు కృష్ణాతీరవాసి, వైదికబ్రాహ్మణుడు. విశ్వామిత్రగోత్రీకుడు, ప్రత్యేకించి ఆంధ్రుడు కావటం మన పూర్వజన్మల పుణ్యఫలం.



**ఈ గ్రంథము**

**అవధూత, దత్తపీఠాధిపతి**

**శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామివారికి**

**అంకితము ఇవ్వబడినది.**

**- గ్రంథకర్త**

# వరివస్యా రహస్యము

## ప్రథమ భాగము

**శ్లో॥ విద్యానాంచ మనూనాం మనుసంఖ్యానాంచ విద్యానామ్ ।**
**ఉపదేష్టా జయతితరాం నరసింహానందనాథ గురుః ॥**
**వరివస్యా రహస్యాఖ్యో గ్రన్థోయన్తేన నిర్మితః ।**
**తత్రదుర్ఘట శబ్దానా మర్థస్సంక్షిప్య కథ్యతే ॥** 1

బాల, పంచదశి, షోడశి మొదలైన విద్యలను, గణపతి, దక్షిణామూర్తి, హయగ్రీవము మొదలైన మంత్రాలను, వేదవేదాంగ న్యాయ మీమాంసాది చతుర్దశ విద్యలను ఉపదేశించిన శ్రీ నృసింహానంద నాథునికి నమస్కారము.

భాస్కరరాయల గురువు నృసింహానంద నాథుడు. అందుచేత ముందుగా తన గురువుగారికి నమస్కరిస్తున్నాడు భాస్కరరాయలు. అసలు గురువంటే ఎవరు ?

**గుకారో అంధకారశ్చ రుకారో తన్నిరోధకః**

గు కారము అంటే అంధకారము. ఆ అంధకారాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు గురువు. సాధన కోసం మంత్రాన్ని ఉపదేశించి, దీక్ష ఇచ్చి సాధనా విధానము చెప్పి, ముక్తిమార్గం చూపేవాడు గురువు. ఏ మహాత్ముడు నీకు బాగా గుర్తుంటాడో, ఏ మహానుభావుని రూపం నీ మదిలో సదా నిలిచిపోతుందో, ఏ సన్యాసి నీకు స్వప్నంలో కూడా కనిపించి సన్మార్గాన్ని బోధిస్తుంటాడో, ఏ మహనీయుడు చెప్పిన ధర్మసూత్రాలు నీ మదిలో నిలిచిపోతాయో, ఎవరిదగ్గరకు వెళ్ళగానే నీ అనుమానాలు తీరిపోతాయో, ఏ వ్యక్తి దగ్గర నీకు ప్రశాంతత దొరుకుతుందో, ఆనందం కలుగుతుందో, ఎవరి మీద నీకు నమ్మకము, గురి కలుగుతుందో, అతడే నీకు గురువు. తన శిష్యుడికి సన్మార్గాన్ని బోధించి తరుణోపాయం చూపేవాడే గురువు. మనకు అనేక రకాల గురువులున్నారు.

1. సూచక గురువు - చదువు చెప్పేవాడు.
2. వాచక గురువు - కులధర్మాలు, ఆశ్రమ ధర్మాలు చెప్పేవాడు.
3. బోధక గురువు - మహామంత్రాలు ఉపదేశించేవాడు.
4. నిషిద్ధ గురువు - వశీకరణ, మారణప్రయోగాలు చెప్పేవాడు.
5. విహిత గురువు - విషయ భోగాలమీద విరక్తి కలిగించేవాడు.
6. కారణగురువు - జీవబ్రహ్మైక్యాన్ని బోధించేవాడు.
7. పరమ గురువు - జీవాత్మ, పరమాత్మ ఒక్కటే. అనే ప్రత్యక్షానుభవం కలిగించేవాడు.

గురువు తన శిష్యుడికి దీక్ష ఇచ్చి సాధన వివరాలు తెలియచేస్తాడు. ఈ దీక్ష అనేక రకాలు. అందులో ముఖ్యమైనవి.

1. స్పర్శదీక్ష - గురువు శిష్యుని తాకినంత మాత్రంచేతనే శిష్యుడికి శక్తి వస్తుంది.
2. ధ్యానదీక్ష - గురువు దూరంగా ఉన్నప్పటికీ, శిష్యుడి కోసం ధ్యానంచేసి, అతనికి శక్తి ఇస్తాడు.
3. దృగ్దీక్ష - ఇది కంటిచూపుతో ఇచ్చే దీక్ష.
4. మంత్రదీక్ష - గురువు శిష్యుడికి సాధన వివరాలు, ధర్మసూత్రాలు చెప్పి మంత్రదీక్ష ఇచ్చి తరుణోపాయం చూపుతాడు.

గురువు ఏ జాతివాడైనా, ఏ కులంవాడైనా, ఏ మతంవాడైనా అతన్ని పూజించాలి. గౌరవించాలి. ఆరాధించాలి. లోకంలో అస్థిరమైనవి, ఐహిక సుఖాలనిచ్చేవి ఎన్ని సంపాదించినా గురుకటాక్షం పొందలేకపోయినట్లైతే ఇవన్నీ నిష్ప్రయోజనం. అందుకే

**శరీరం సురూపం తథావా కళత్రం యశశ్చారు చిత్రం ధనం మేరుతుల్యం।**
**మనశ్చేన్నలగ్నం గురోరంఘ్రి పద్మే తతఃకిం తతఃకిం తతఃకిం తతఃకిం॥**

మంచి యవ్వనముంది. రూపముంది, ఆరోగ్యముంది, ధనధాన్యాలు పుష్కలంగా ఉన్నాయి, మంచి అందమైన గుణవతి అయిన భార్య ఉంది. అయినప్పటికీ గురువుగారి పాదపద్మాలమీద గనక మనసు నిలుపలేక పోయినట్లైతే, గురువుయొక్క కృపాకటాక్ష వీక్షణాలు పొందలేక పోయినట్లైతే ఏమీ ప్రయోజనంలేదు. అంటూ



శంకరాచార్యులవారు 'గుర్వష్టకం' అనే పేరుతో ఎనిమిది శ్లోకాలు వ్రాశారు ఈ కారణంచేతనే.

**నగురోరధికం తత్త్వం నగురోరధికం తపః ।**
**తత్త్వజ్ఞాన పరం నాస్తి తస్మై శ్రీగురవే నమః ॥**

గురువును మించిన తత్త్వం లేదు. గురువును మించి తపస్సులేదు. గురువు చూపలేని జ్ఞానమార్గంలేదు. అటువంటి గురువుకు నమస్కారము.

**అఖండ మండలాకారం వ్యాప్తమేన చరాచరం ।**
**తత్పదం దర్శితంయేన తస్మై శ్రీ గురవే నమః ॥**

విశాలమైన ఈ జగత్తంతా వ్యాపించినవాడు, శిష్యునియొక్క అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతులు వెలిగించేవాడు అయిన గురువుయొక్క పాదపద్మాలకు నమస్కారము.

అందుకే గ్రంథాన్ని ప్రారంభించబోయే ముందు తన గురువుగారైన నృసింహానందనాథుడికి నమస్కరిస్తున్నాడు. ఆ గురువు ఎలాంటివాడు అంటే బాల, పంచదశి, షోడశి, మొదలైన విద్యలను, గణపతి, దక్షిణామూర్తి మొదలైన మంత్రాలను, వేదవేదాంగాలను, షట్శాస్త్రాలను బోధించిన మహానుభావుడు.

ఇక్కడ విద్యలు, మంత్రాలు అని రెండు పదాలు వాడారు. విద్య అంటే ఏమిటి? మంత్రమంటే ఏమిటి ? **మననాత్ త్రాయత ఇతిమంత్రః** మననము చేయుటవలన మననము చేయువాడిని రక్షించేది మంత్రము. ఒకే అక్షరము, మాట, పదము లేదా వాక్యాన్ని పదేపదే ఉచ్చరించినట్లైతే దానిని మననము అంటారు. ఆ రకంగా మననం చెయ్యటంవల్ల కొంత శక్తి పుడుతుంది. అలా పుట్టిన శక్తి మననము చేసిన వాడి కోరిక తీరుస్తుంది. మంత్రాలు రెండు రకాలు 1. స్త్రీ దేవతలను ఉపాసించేవి. 2. పురుష దేవతలను ఉపాసించేవి. స్త్రీ దేవతలను ఉపాసించే మంత్రాలను 'విద్య' అంటారు. పురుష దేవతలను ఉపాసించేవాటిని మంత్రాలు అంటారు. ఇప్పుడు నృసింహానందనాథుడు ఈ రెండు రకాలైన మంత్రాలను భాస్కరరాయలవారికి ఉపదేశించాడు.

ప్రత్యేకంగా పరమేశ్వరి ఉపాసనకు వాడే మంత్రాలను 'శ్రీవిద్య' అంటారు. ఇక్కడ విద్యకు, శ్రీవిద్యకు తేడా ఉంది. స్త్రీ దేవతలను ఉపాసించేది విద్య. ఉదా॥ దుర్గ,

కాళి, చండి వంటివి. పరమేశ్వరిని ఉపాసించేది శ్రీవిద్య. దేవతలు మానవులకన్న శక్తి సంపన్నులు. వారు మానవులకు కావలసిన అన్ని రకాల శక్తులు ఇవ్వగలుగుతారు. సిరిసంపదలు, సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు మొదలైనవన్నీ ఇస్తారు. కాని మోక్షాన్ని మాత్రం ఇవ్వలేరు. మోక్షాన్ని ఇవ్వగలిగింది పరమేశ్వరి ఒక్కతే. ఆ పరమేశ్వరిని ఉపాసించేది 'శ్రీవిద్య'. ఈ పదంలో శ్రీ విశేషణం కాదు. వ్రాసేటప్పుడు, పలికేటప్పుడు మూడు అక్షరాలను కలిపి ఒకటిగానే పలకాలి. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతుల స్వరూపమైన ఆ పరమేశ్వరిని ఉపాసించేదే శ్రీవిద్య.

శ్రీవిద్యలో మూడు అంచెలు లేదా స్థానాలున్నాయి. అవే మూడు మంత్రాలు. 1. బాల, 2. పంచదశి, 3. షోడశి.

బాలామంత్రం ఆరు అక్షరాలుగల మంత్రం. దీనిలో నిజంగా ఉండేవి మూడు అక్షరాలే. అవికూడా మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతుల బీజాలు. ఆ బీజాక్షరాలే అనులోమ విలోమంగా ఉంటాయి. అందుకే ఆ మంత్రానికి అంత శక్తి ఉన్నది. ఈ మంత్రాన్ని గనక అక్షరలక్షలు చేసినట్లైతే సాధకుడి కోరికలు తీరతాయి. సభాస్తంభన జరుగుతుంది. ఇక రెండవది పంచదశీ మహామంత్రము. దీనిలో పదిహేను అక్షరాలు ఉంటాయి. ఇది మొత్తం మూడు భాగాలుగా ఉంటుంది. ఈ భాగాలనే కూటములు లేక ఖండములు అంటారు. ఈ మంత్రజపం వల్ల ఇహపరాలు అన్నీ సిద్ధిస్తాయి. ఇక మూడవది షోడశి. అంటే పదహారు అక్షరాలు గల మంత్రం. కాని ఇది మహాషోడశి. ఇందులో ఇరవై ఎనిమిది అక్షరాలుంటాయి. పంచదశీ మహామంత్రానికీ ముందు ఎనిమిది, తరువాత ఐదు వెరసి పదమూడు బీజాక్షరాలుంటాయి. అయితే పంచదశీ మహామంత్రంలోని మూడు ఖండాలను మూడు బీజాక్షరాలుగా తీసుకోవాలి. ఈ రకంగా మొత్తం పదహారు బీజాక్షరాలు ఉంటాయి. నిజంగా గనక లెక్క పెట్టినట్లైతే పదమూడు బీజాక్షరాలు, పంచదశి మంత్రంలోని పదిహేను వెరసి ఇరవై ఎనిమిది అక్షరాలుంటాయి. ఇదే మహాషోడశి. ఇది మోక్షకారకమైన మంత్రము.

ఈ రకంగా నృసింహానందనాథులవారు బాల, పంచదశి, షోడశి మొదలైన శ్రీవిద్యను, గణపతి, దక్షిణామూర్తి, హయగ్రీవము మొదలైన మంత్రాలు చెప్పారు. అంటే స్త్రీ పురుష దేవతలతో కూడిన మంత్రశాస్త్రాన్ని పూర్తిగా చెప్పారన్నమాట.

మంత్రశాస్త్రమే కాకుండా వేదవేదాంగాలు. **వేదాలు నాలుగు.** 1. ఋగ్వేదము 2. యజుర్వేదము 3. సామవేదము 4. అధర్వణ వేదము.



**వేదాంగాలు ఆరు :** 1. శిక్ష (పాణిని) 2. వ్యాకరణము (పాణిని) 3. ఛందస్సు (పింగలముని) 4. నిరుక్తము (యాస్కుడు) 5. జ్యోతిషము (ఆదిత్యుడు మొదలైనవారు) 6. కల్పము.

**షట్శాస్త్రములు :** 1. తర్కము 2. వ్యాకరణము 3. న్యాయము 4. మీమాంస 5. పురాణము 6. జ్యోతిషము. మొత్తం వేదాలు 4, వేదాంగాలు 6, షట్శాస్త్రాలు 6 వెరసి పదహారు. వీటిలో వ్యాకరణము, జ్యోతిషము రెండుసార్లు వచ్చినాయి. వాటిని మినహాయిస్తే మొత్తం పద్నాలుగు అవుతాయి. వీటినే 'చతుర్దశ విద్యలు" అంటారు.

ఈ విద్యలన్నీ బోధించాడు. అటువంటి మహానుభావుడు నృసింహానంద నాథుడు. అందుకే ముందుగా తన గురువుగారికి నమస్కరించి ఈ గ్రంథాన్ని వ్రాయటానికి ఉపక్రమిస్తున్నాడు. అలా గ్రంథాన్ని ప్రారంభిస్తూ దానిలో క్లిష్టమైన శబ్దాలకు సంక్షిప్త వివరణ ఇస్తున్నాను అంటున్నాడు.

**ప్రహ్లాదాభీష్టదానే విబుధసముదయ స్తూయమానా పదానే**
**శేషక్ష్మోణీభృదన్తః ప్రవిలసిత పదాహోబల క్షేత్రగర్భాత్ ।**
**ప్రాదుర్భూతే హిరణ్యద్విరద మతిమద ధ్వాంత తంత్రం నిహస్తుం**
**ధీరే సచ్ఛాస్త్రయోనౌ మమ భువన గురా వస్తు భక్తిః నృసింహే ॥ 2**

ప్రహ్లాదుని యొక్క అభీష్టమును తీర్చినవాడు, సకల దేవతలచేత స్తుతించ బడేవాడు, హిరణ్యకశ్యపుని సంహరించినవాడు, ముల్లోకములకు గురువు, సకల శాస్త్రములకు మూలకారణమైనవాడు, శేషాచలము అనే పర్వతం మీద 'అహోబిలము' అనే క్షేత్రమునందు అవతరించినవాడు, ఋగ్యజుస్సామ వేదాలకు కారణభూతుడు, వేదవేద్యుడు అయిన నృసింహస్వామివలె బ్రహ్మానందాన్ని ఇచ్చేవాడు, పండిత సముదాయముచే కీర్తించబడేవాడు, ద్వైతమతాన్ని ఖండించినవాడు, పండితుడు, సర్వశాస్త్ర పారీణుడు, లోకగురువు, రాజపూజితుడు, అయిన అహోబిల పండితుని కుమారుడు బహుగ్రంథకర్త అయిన నా గురువు నృసింహానందనాథుని యందు నాకు నిత్యము భక్తి ఉండుగాక.

ఈ శ్లోకంలో తన గురువైన నృసింహానందనాథుని సాక్షత్తు నృసింహస్వామితో పోల్చి చెబుతున్నాడు. శ్రీ మహావిష్ణువు నృసింహావతారమెత్తి, తన భక్తుడైన ప్రహ్లాదుని కోరికలు తీర్చాడు. ఆ సమయంలో నృసింహస్వామిని దేవతలందరు వేనోళ్ళ

కొనియాడారు. ఆ నారసింహుడు శేషాచలంమీద ఉన్నటువంటి అహోబిలంలో వెలిశాడు. అటువంటి నృసింహ దేవునికి నా నమస్కారము అంటున్నారు. అయితే భాస్కరరాయలవారి గురువుగారు నృసింహానందనాథులు. ఈయన గ్రంథకర్తకు బ్రహ్మానందాన్ని ప్రసాదించారు. అసలు బ్రహ్మానందము అంటే ఏమిటి ? ఈ లోకంలో సంపూర్ణ ఆరోగ్యము, సిరిసంపదలు, భోగభాగ్యాలు, విద్య, యవ్వనము అన్నీ ఉన్న మానవుడు అనుభవించే ఆనందము మానుషానందము. ఈ మానుషానందానికి ఒకటి ప్రక్కన పదిహేడు సున్నాలు పెడితే వచ్చేది బ్రహ్మానందం. ఈ విషయమంతా 'తైత్తిరీయోపనిషత్తు'లోని 'ఆనందవల్లి'లో వివరించబడింది. ఆ బ్రహ్మానందం ఏరకంగా సిద్ధిస్తుంది? అనే విషయం తైత్తిరీయోపనిషత్తులోనే 'భృగువల్లి' లో వివరించబడింది.

బ్రహ్మత్వ సిద్ధి కావాలంటే గురువుయొక్క అనుగ్రహం కావాలి. గురువు ఏమీ చెప్పనవసరంలేదు. కేవలం వీక్షణ మాత్రంచేతనే శిష్యుడి సంశయాలు తీరిపోతాయి. దక్షిణామూర్తి స్తవంలో

**చిత్రం వటతరోర్మూలే వృద్ధశిష్యా గురుర్యువా ।**
**గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు శ్చిన్న సంశయః ॥**

వటము అంటే మర్రి, గవ్వ, చిన్నగోళము, ఉండ, మాత్ర, పూర్ణబిందువు, అంటూ అనేక అర్థాలున్నాయి. వటతరువు అంటే మర్రిచెట్టు అనే అర్థంలోనే చెప్పుకోవాలి. యువకుడైన దక్షిణామూర్తి మర్రిచెట్టు క్రింద ఒళ్ళంతా భస్మలేపనం గావించుకుని, దక్షిణదిశగా తిరిగి కూర్చుని ఉన్నాడు. వయస్సులో ఆయనకన్న పెద్దవాళ్ళంతా, తమ సందేహాలను నివృత్తి చేసుకుందామని ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు. ఇక్కడ అసలు విచిత్రం ఏమిటంటే గురువుగారు మౌనంగా కూర్చుని ఉన్నాడు. ఏమీ చెప్పటంలేదు. ఏ విధమైన వ్యాఖ్య చెయ్యటంలేదు. వాళ్ళ అనుమానం ఏమిటో కూడా అడగటంలేదు. కాని శిష్యుల అనుమానాలు వాటంతట అవే తీరిపోతున్నాయి. ఇక్కడ రహస్యం ఏమంటే దీక్షలలో 'దృగ్దీక్ష' ఒకటి అని చెప్పుకున్నాం. అందులో గురువుగారు కేవలం వీక్షణ మాత్రంచేతనే తన శిష్యుడికి కావలసిన దీక్షఇస్తాడు. అలాగే సంశయాలు కూడా తీరుస్తాడు. గురుదర్శనం కాగానే శిష్యుల అనుమానాలు పూర్తిగా తీరిపోతాయి. కాబట్టి కేవలం గురువుయొక్క అనుగ్రహం ఉన్నంతమాత్రం చేతనే బ్రహ్మత్వ సిద్ధి కలుగుతుంది. ఈ రకంగా భాస్కరరాయలవారికి బ్రహ్మసిద్ధి కలుగజేసినవాడు నృసింహానందనాథుడు. పశుత్వాన్ని సింహం అణచి



వేసినట్లుగా, శిష్యులయొక్క అజ్ఞానాన్ని అణచివేసినవాడు నృసింహానందనాథుడు. అందుచేతనే నృసింహానందుడికి, నృసింహావతారానికి తేడాలేదు అంటున్నారు.

రాక్షస రాజులలో ప్రహ్లాదుడు ఒకడు. ఆ ప్రహ్లాదుని యొక్క అభీష్టాన్ని నెరవేర్చినవాడు. అసలు ప్రహ్లాదుని అభీష్టం ఏమిటి ? జ్ఞానసముపార్జన. ఈ రకంగా ప్రహ్లాదునికి జ్ఞానాన్ని ప్రసాదించినవాడు నారసింహుడు.

అసలు 'ప్ర' అంటే గొప్పదైన, 'హ్లాదము' – ఆనందము. గొప్పదైన ఆనందము. అదే బ్రహ్మానందం. ఆ బ్రహ్మానందాన్ని ఇచ్చినవాడు.

హిరణ్యకశిపుడికి తనయొక్క బలపరాక్రమాల యందు అతిశయమదమున్నది. అలాగే ఇక్కడ శిష్యుడికి కూడా శాస్త్రపాండిత్యము, తంత్ర శాస్త్రపారంగత అనే అతిశయ మదమున్నది. హిరణ్యకశ్యపుని మదాన్ని అణచివేసినట్లుగానే, శిష్యునియొక్క పాండిత్య మదాన్ని అణచివేసినవాడు నారసింహుడు.

ఆ నారసింహునితో సమానమైనవాడైన తనయొక్క గురువు నృసింహానంద నాథుడికి నమస్కరిస్తున్నాడు.

**ఆప్రాచః కామరూపా ద్ద్రుహిణ సుతనద ప్లావితాదా ప్రతీచః**
**గాంధారా త్సింధుసాంద్రాత్ రఘువరచరితా దాచసేతో రవాచః ।**
**ఆకేదారా దుదీచః తుహినగహనతః సంతి విద్వత్సమాజాః**
**యే యే తానేషయత్న స్సుఖయతు సమజాన్కశ్చమత్కర్తు మీష్టే ॥ 3**

తూర్పున కామరూపము (అస్సాం), పడమర గాంధార దేశము (ఆఫ్ఘనిస్తాన్), దక్షిణాన సేతుబంధము, ఉత్తరాన హిమాలయ శ్రేణులమధ్య గల, యావద్భారతదేశం లోని పండితులకందరకు నా యీ ప్రయత్నము ఆనందమునిస్తుంది. పశుప్రాయులను, మూర్ఖులను సంతోష పెట్టటానికి ఎవరు ప్రయత్నించగలరు?

ముందుగా తాను వ్రాయబోతున్నటువంటి "వరివశ్యా రహస్యము" అనే ఈ గ్రంథము చాలా గొప్పదని, ఆసేతు హిమాచల పర్యంతము పండిత లోకమంతా ఈ గ్రంథాన్ని ఆదరిస్తుందని భావిస్తూ, ఒకవేళ దీన్ని ఎవరైనా ఆదరించలేకపోతే, వారు అజ్ఞానులు, మూర్ఖులు అంటున్నారు. ఈమాట భాస్కరరాయలవారికి తన పాండిత్యంమీద, శాస్త్ర ప్రామాణ్యం మీద ఉన్నటువంటి విశ్వాసాన్ని చెబుతోంది. అంటే 'వరివస్యా రహస్యము' అనే ఈ గ్రంథం అంత గొప్పదన్న మాట.

నేనుకూడా ముందుగా నా గురుదేవులైన విరజానందనాథ, సదానందనాథ, శుకానందనాథులకు నమస్కరించి, ఏమీ తెలియని నన్ను ఆ స్థాన విద్వాంసునిగా నియమించిన అవధూత దత్తపీఠాధిపతి, దత్తాంశ సంభూతులు అయిన శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారికి సాష్టాంగ దండప్రణామాలర్పించి, కంచి, శృంగేరి, పూరి, ద్వారక, బదరీ పీఠాధిపతులకు వందనాలర్పించి, దేశంలో ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామిజీలు, మాతాజీలకు అందరికీ నమస్కరించి **'పరమానందనాథ'** దీక్షానామం గలిగిన హరితస గోత్రీకుడనైన క్రోవి పార్థసారథి అను నేను **'వరివస్యా రహస్యము'** అనే ఈ గ్రంథానికి వివరణ వ్రాయటానికి ఉపక్రమిస్తున్నాను. పండితులు, శ్రీవిద్యోపాసకులు నా యీ సాహసాన్ని మన్నించి, నన్ను ఆశీర్వదింతురుగాక.

**సజయతి మహాప్రకాశో యస్మిన్ దృష్టే న దృశ్యతే కిమపి ।**
**కథమివ తస్మిన్ జ్ఞాతే సర్వం జ్ఞాతం కిలోచ్యతే వేదే ॥** **4**

పరమేశ్వర స్వరూపము సత్యము, నిత్యము, శాశ్వతమైనది. అసలు సత్యము అంటే ఏమిటి? సత్యము అనగా నిజము, యదార్థము, ప్రత్యక్షమైన నిజము, ఋజువు చేయబడిన నిజము, పరబ్రహ్మ అని అర్థం. నిత్యము అంటే ఎడతెగనిది, ఉత్పత్తి నాశనములు లేనిది, శాశ్వతమైనది, మూడు కాలములయందు ఉండేది. శాశ్వతము అంటే ఎప్పటికీ ఉండేది, నాశనము లేనిది. కాబట్టి పరమాత్మ ఋజువు చేయబడిన నిజము, ఉత్పత్తి నాశనములు లేకుండా భూతభవిష్యద్వర్తమానకాలాలు మూడింటి యందు శాశ్వతముగా ఉండేది, నాశనము లేనిది. ఈ పరమాత్మ అనంతమైనది. అంటే ఆది, అంతములు లేనిది. ఎల్లలు లేనిది. దేశకాల వస్తు పరిచ్ఛిన్నము కానిది. (పరిచ్ఛిత్తి – ఛేదించుట, పరిచ్ఛిన్నము – ఛేదింపబడినది. పరిచ్ఛిన్నముకానిది అంటే ఛేదింపబడనిది.) ఈ పరమాత్మ దేశకాల వస్తువులచేత నాశనంకాదు. ఛేదించ బడకుండా అలాగే ఎడదెగనిదిగా ఉంటుంది. అంటే శాశ్వతమైనది. ఈ పరమాత్మ ఆవరణరహితమైనది. అంటే దీనికి ఎల్లలు (హద్దులు) లేవు. చిత్స్వరూపమైనది. చిత్ అంటే జ్ఞానము. పరమేశ్వరుడికి ఒక ఆకారము అనేది లేదు. జ్ఞానమే దాని ఆకారము. సత్యజ్ఞానానంద స్వరూపమైనది. అటువంటి పరబ్రహ్మను గూర్చి తెలుసుకోవటం చాలా కష్టం. ఆ పరబ్రహ్మను గురించి గనక తెలుసుకున్నట్లైతే, ఇంకా తెలుసుకోవలసినది ఏమీ ఉండదు. ఆ సమయంలో ఎల్లలు లేనటువంటి అదే ఆవరణ రహితమైన ఆత్మసాక్షాత్కారమవుతుంది. ఇక్కడ ఆత్మ అన్నా పరమాత్మ



అన్నా రెండూ ఒకటే. వేరుకాదు. అంటే పరమాత్మ సాక్షాత్కారమవుతుంది. పరమాత్మ నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు కదా. అటువంటి పరమాత్మ సాక్షాత్కారము ఎలా జరుగుతుంది ? అతని యొక్క ప్రతిరూపమే చరాచర జగత్తు. కాబట్టి పరమాత్మను గురించి తెలుసుకున్నట్లైతే చరాచర జగత్తును తెలుసుకున్నట్లే. విశ్వమానవాళిని గురించి తెలుసుకున్నట్లే.

ఒకానొక రోజున పుణ్యానందముని సాయంత్రం పూట, తన ఆశ్రమ ప్రాంగణంలో ఆరుబయట కూర్చుని ఉన్నాడు. ఆకాశంలో రెండు హంసలు ఎగురుతున్నాయి. అందులోని ఆడుహంస మగహంసతో "నాథా ! లోకంలో ఏ విషయాన్ని తెలుసుకున్నంత మాత్రంచేత ప్రతివిషయము తెలుస్తుందో, దాన్ని నాకు వివరించవలసింది." అన్నది. ఆ మాటలు విన్న మగహంస "దేవీ ! కుమ్మరివాడు మట్టిని తెచ్చి, నీటితో కలిపి, తొక్కి, దానితో కుండలు, చట్లు, బానలు ఇలా అనేకమైన వస్తువులు తయారుచేస్తాడు. ఆ వస్తువుల పేరు ఏదైనా, ఆకారం ఏదైనా, అందులో ఉన్నది మట్టి. బంగారు ఆభరణాలు ఏ రూపంలో ఉన్నా, ఏ పేరుతో పిలువబడ్డా, అందులో ఉన్నది బంగారమే" అన్నది. ఈ మాటలు విన్న ఆడహంస "నాథా ! తెలిసింది. ఈ జగత్తంతా పరమేశ్వరుణ్ణుంచే సృష్టించబడింది. పరమేశ్వరుడి కన్న భిన్నమైన వస్తువు ఏదీ ఈ జగత్తులో లేదు. కాబట్టి పరమాత్మను గురించి తెలుసుకుంటే, చరాచర జగత్తును గురించి తెలుసుకున్నట్లే" అన్నది. ఈ లోపల ఆ హంసలు ఆశ్రమందాటి వెళ్ళిపోయినాయి. ఆ మాటలు విన్న పుణ్యానందముని, ఆ హంసలు అనాహతంలోని శివశక్తులని, వారు తనకోసమే ఈ ఉపదేశం చేశారని భావించి 55 సూత్రాలతో **"కామకలా విలాసము"** అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ గ్రంథానికి నేను వ్రాసిన వ్యాఖ్యయే **"శ్రీవిద్యాసర్వస్వము"**

కాబట్టి పరమాత్మను గురించి తెలుసుకున్నట్లైతే ఈ చరాచర జగత్తును గురించీ తెలుసుకున్నట్లే. అందుచేతనే ఆత్మకన్న వ్యతిరేకమైన వస్తువు ఏదీలేదని చెబుతోంది వేదం. అందుకనే అన్నింటికీ అధిష్ఠానభూతమయిన పరబ్రహ్మ సాక్షాత్కారం కాగానే ఇంకా ఏమీ కనపడదు. ఎందుకుని? అంటే ఇంకా కనబడటానికి ఏమీలేదు. ఉన్నది ఒక్కటే. అదే పరబ్రహ్మ. అది సాక్షాత్కరించింది. ఈ జగత్తంతా మిథ్య. అంటే జగత్తు లేదు అని కాదు. ఈ జగత్తంతా పరమేశ్వరుడికి ప్రతిరూపం. అది పరమేశ్వరుడి కన్న భిన్నం కాదు. జగత్తుకు, పరమేశ్వరుడికీ భేదంలేదు. మిథ్యాత్వము అంటే

తనకన్న వేరుకాని రూపము కలిగి ఉండికూడా వేరుగా ఉన్నట్లుగా అనిపించటం. ఉదాహరణకు మట్టితో తయారైంది కుండ. ఇది మట్టికన్న వేరైనది కాదు. కాని వేరుగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది మిధ్య. అలాగే పరబ్రహ్మ కన్న వేరుకాని ఈ జగత్తు, వేరుగా కనిపిస్తుంది. అందుకే జగత్తు మిధ్య అనబడుతోంది.

ఆత్మ సర్వాంతర్యామి అంటే అన్నింటియందు అంతర్యామిగా ఉండేది. బృహదారణ్యకోపనిషత్తులో ఉద్దాలకుడు అంతర్యామిని గురించి వివరించవలసింది అంటాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. ఎవడు భూమిపైన, భూమిలోపల ఉంటాడో, తనలో ఉన్నప్పటికీ ఎవరినైతే భూమి ఎరుగదో, ఎవరి శరీరమే భూమియో, భూమిలో ఉంటూనే భూమిని నియంత్రించేవాడెవరో అతడే అంతర్యామి. అతడే ఆత్మ. అగ్నిలో ఉంటాడు, అగ్ని అతన్నెరుగదు. అగ్నే అతని శరీరం. అగ్నిలో ఉంటూనే అగ్నిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

ఈ రకంగా పంచభూతాలు, దశదిశలు, ముల్లోకాలలోనూ ఉంటాడు. కాని అవి ఏవీ అతన్నెరుగవు. అవే అతని శరీరం. వాటిలో ఉంటూనే, వాటిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ. కాబట్టి ఆత్మ సర్వత్రా వ్యాపించి ఉన్నది. అది దివ్యమైన మహాజ్యోతి. అలాగని పంచభూతాల్లోని అగ్నికాదు. తేజోమయమైన కాంతిపుంజము. సర్వకాల సర్వావస్థలయందు ప్రకాశిస్తూనే ఉంటుంది. అదే జ్ఞానజ్యోతి. ఇంద్రియాలద్వారా దాన్ని మనం తెలుసుకోలేం. ఎందుకంటే ఆత్మ ఉన్న చోటికి ఈ ఇంద్రియాలు వెళ్ళలేవు. కంటికి చూసేశక్తినిచ్చేది ఆత్మ. చెవికి వినే శక్తినిచ్చేది ఆత్మ. బుద్ధికి నిర్ణయించే శక్తినిచ్చేది ఆత్మ. అందుచేతనే ఇంద్రియాలద్వారా ఆత్మను తెలుసుకోవటం సాధ్యంకాదు. అన్నింటికన్నా పరమోత్కృష్టమైనది ఆత్మ. ఆ ఆత్మని గురించి గనక తెలుసుకుంటే అన్నింటిని గురించి తెలుసుకున్నట్లే. ఆత్మసాక్షాత్కారం గనక పొందినట్లైతే ఇంక ఈ జగత్తనేది కనిపించదు. ఈ జగత్తంతా "రజ్జుసర్పభ్రాంతి"లాంటిది. అదే పాము అనే భ్రాంతి గనక తొలగిపోయినట్లైతే, అజ్ఞానం వదిలిపోతుంది. ఆత్మసాక్షాత్కారమవుతుంది. కాబట్టి ఆత్మసాక్షాత్కారమైంది అంటే భ్రాంతి, అజ్ఞానము పోయిందన్న మాట. అప్పుడు ఈ జగత్తు అంతా మిధ్య అనిపిస్తుంది.

ఆ పరమేశ్వర స్వరూపమే 'అహంత'. దానియొక్క పరిణామమే 'ఇదంతా'. ఈ జగత్తు అంటే ఈ జగత్తంతా ఆ పరమేశ్వరుని యొక్క పరిణామమేతప్ప వేరుకాదు. కాబట్టి ఆ పరమేశ్వరుడికి, ఈ జగత్తుకూ భేదములేదు.



పరమేశ్వరుడు, పరబ్రహ్మ అన్నప్పుడు అది స్త్రీ లింగమా ? పుం లింగమా ? అని అనుమానం వస్తుంది. పరమాత్మకు రూపంలేదు. లింగబేధం అంతకన్నా లేదు. దేవీభాగవతంలో తారకాసుర సంహారం కోసం దేవతలు ఆ పరమేశ్వరిని ప్రార్థించారు. అప్పుడు ఆ పరంజ్యోతి వారికి ప్రత్యక్షమైంది. ఆవిడ ఎలా ఉన్నది అంటే ....

**న స్త్రీ రూపం, అథవా న పుంరూపం, అథోభయమ్**

అది స్త్రీ కాదు. పురుషుడు కాదు. అలా అని రెండూకానిది అంతకన్నా కాదు. ఉన్నది ఒక్కటే. అది నిరాకారము నిర్గుణము. కాని ఈ జగత్తును సృష్టించటం కోసం తాను రెండు రూపాలు పొందింది. అవే ప్రకాశాంశ, విమర్శాంశ. ఈ విమర్శశక్తే లలితా పరాభట్టారిక, మహా త్రిపురసుందరి అని చెప్పబడుతున్నది. ఈ ప్రకాశ, విమర్శాంశలే శివశక్తులు. వీరిద్దరూ వేరుకాదు. వీరిద్దరి వల్లనే అంటే ఈ ఆత్మవల్లనే సృష్టి అంతా జరుగుతున్నది.

**మనస్త్వం వ్యోమ త్వం మరుదసి మరుత్సారథి రసి**
**త్వ మాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహి పరం ।**
**త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా**
**చిదానన్దాకారం శివయువతి భావేన బిభృషే ॥ (హరమహిషి)**

శివుని పట్టపురాణి అయిన ఓ పరమేశ్వరీ ! ఆజ్ఞాచక్రమందున్న మనస్తత్త్వము నీవే. విశుద్ధిచక్రంలో ఉన్న ఆకాశతత్త్వము నీవే. అనాహతంలోని వాయుతత్వం నీవే. స్వాధిష్ఠానములోని అగ్నితత్త్వము, మణిపూరంలోని జలతత్త్వము, ఆధారచక్రం లోని పృథివీతత్త్వము కూడా నీవే. నీకన్న వేరైనది ఏదీలేదు. నీ స్వరూపాన్ని ఈ జగత్తుగా పరిణమింప చెయ్యటానికి నీవే శివతత్త్వమైన బ్రహ్మస్వరూపమగు ఆనందభైరవునిగా రూపుధరించావు.

'లలితా సహస్రం'లో 735వ నామము **"మిధ్యాజగదధిష్ఠానా"** ఈ జగత్తు అంతా మిధ్య. మిధ్య అయిన జగత్తునకు ఆధారమైనది. ద్వైతబుద్ధి మాయతో కల్పించబడుతుంది. అద్వైతమే పరమార్థం. **"బ్రహ్మ ఒక్కటే సత్యం. ఈ జగత్తంతా మిధ్య"** ముత్యపుచిప్పని చూసి వెండి అని, చీకట్లో రాయిని చూసి దొంగని అనుకుంటాం. ఇదంతా భ్రాంతి. ఈ భ్రాంతి మాయవల్ల కలుగుతుంది. ఆ మాయే పరమేశ్వరి.

## విమర్శాత్మకశక్తి స్వరూప నిరూపణ

**నైసర్గికీ స్ఫురత్తా విమర్శరూపా ఽ స్యవర్తతే శక్తిః ।**
**తద్యోగాదేవ శివోజగదుత్పాదయతి పాతి సంహరతి ॥ 5**

పరబ్రహ్మ అంటే పూర్ణపురుషుడు. ఎక్కడైనా ఏ పురుషుడైనా 'పూర్ణపురుషుడు' అని ఎప్పుడనబడతాడు అంటే, భార్య అయినటువంటి స్త్రీతో కలసినప్పుడు. ఇదే విధంగా పరబ్రహ్మ అంటే శివశక్తుల స్వరూపం. ఇందులో శివుడు ప్రకాశాంశ, శక్తి విమర్శాంశ. ఈ శక్తికే 'స్ఫురణశక్తి' అని పేరు. స్ఫురణ అంటే ప్రకాశము, అదరుట, ప్రత్యక్షమగుట, జ్ఞప్తికి వచ్చుట అని అర్థం. దీన్నే వేదాలలో 'దేవాత్మశక్తి' అన్నారు. ఈ శక్తి పరమాత్మతో కలిసి ఉన్నది కాబట్టే, పరమాత్మ సృష్టి స్థితి లయాలు చెయ్యగలుగుతున్నాడు. శక్తి గనక లేకపోయినట్లైతే, ఆ పరబ్రహ్మ ఈ జగత్తును సృష్టించలేడు సరికదా కదలటానికి కూడా శక్తి లేనివాడవుతాడు. ఈ విషయాన్ని శంకరభగవత్పాదులవారు తమ 'సౌందర్యలహరి'లోని మొదటి శ్లోకంలో వివరించారు.

**శివ శక్త్యాయుక్తోయది భవతి శక్తః ప్రభవితుం**
**న చే దేవం దేవో నఖలు కుశలః స్పన్దితు మపి ।**
**అతస్త్వా మారాధ్యాం హరిహర విరఞ్చాదిభిరపి**
**ప్రణన్తుం స్తోతుం వా కథ మకృతపుణ్యః ప్రభవతి ॥**

అమ్మా ! ఓ పరమేశ్వరీ ! సర్వమంగళకారకుడైన శివుడు కూడా జగన్నిర్మాణ శక్తివైన నీతో కూడితేనే కాని ఈ జగత్తులను నిర్మించలేడు. నీతో కలువకపోయినట్లైతే అతడు కదలటానికి కూడా శక్తి లేనివాడవుతాడు. కాబట్టి త్రిమూర్తులచేత కూడా పూజింపబడే నీకు నమస్కరించాలన్నా, నిన్ను పూజించాలన్నా, నిన్ను స్తుతించాలన్నా, కనీసం నీ పేరు తలచాలన్నప్పటికీ కూడా, గత జన్మలలో పుణ్యం చెయ్యనివాడు సమర్థుడు కాదు. అంటే పూర్వజన్మ సుకృతం లేనిదే నిన్ను అర్చించటం కాదు కదా, కనీసం నీ పేరు తలచటానికి కూడా అర్హత ఉండదు.

ఈ జగత్తు 'అహంత' యొక్క స్ఫురణశక్తివల్ల పుట్టింది. ఈ జగత్తును 'ఇదం ఇదం' అంటారు. ఈ 'ఇదం' అహంతకు స్వాధీనమై ఉంటుంది. 'అహంత' గనక లేకపోయినట్లైతే 'ఇదం అనేది ఉండదు.' అంటే చరాచర జగత్తంతా పరమేశ్వరుడి



యొక్క రూపమే. ఆ పరమేశ్వరుడే గనక లేకపోయినట్లైతే, ఈ జగత్తే ఉండదు. ఈ జగత్తంతా పరమేశ్వరుని స్వాధీనంలోనే ఉంటుంది. సమస్త జగత్తుకు కారణము ఆత్మ అని తెలిసినప్పటికీ, 'ఇదం' అని ఈ వస్తువులు, ఈ జగత్తు కనిపిస్తుంటాయి. ఈ జగత్తుకు కారణము అహంత స్వరూపమైన పరాశక్తే కాని వేరుకాదు. ఈ పరాశక్తే బ్రహ్మయందు స్వస్వరూప జ్ఞానాన్ని కలుగజేస్తుంది. ఈ శక్తి ఎక్కడ ఉంటుందీ అంటే ఒకసారి ఈ జగత్తులో లీనమై ఉంటుంది. ఇంకోసారి బ్రహ్మలో లీనమై ఉంటుంది. అలా బ్రహ్మలో లీనమైన శక్తి మళ్ళీ జగత్తు రూపంలో బయటకు వస్తుంది. అందుచేత శక్తి అనేది బ్రహ్మలో కలిసే ఉంటుంది. అంతేగాని విడిగా ఉండదు. అందుకే శివుడికీ శక్తికీ భేదం లేదు. అగ్నిలో వేడి ఉన్నది. కాంతి ఉన్నది. ఈ రెండూ కలిస్తేనే అగ్ని అవుతుంది. ఇక్కడ కాంతిలోనుంచి వేడిని విడదీయటం సాధ్యంకాదు. పరబ్రహ్మ నిరాకారుడు, నిర్గుణుడు, నిష్క్రియుడు. ఆయన స్వతహాగా ఏ పనీ చెయ్యడు. అందుచేత శక్తితో కలిస్తేనే ఈ జగత్తును సృష్టి చేయగలుగుతున్నాడు. అందుకే ఈ జగత్తును సృష్టించటానికి శివశక్తులిద్దరూ కారణం అవుతున్నారు. శక్తి మాయాస్వరూపిణి. అందుచేతనే లోకంలోని అనేక బంధాలకు కారణం అవుతోంది. ఈ మాయ గనక విడిపోయినట్లైతే మానవుడు ముక్తుడౌతాడు. పరమాత్మ నిత్యసిద్ధుడు, నిత్యముక్తుడు, ఆనంద స్వరూపుడు, ప్రజ్ఞానఘనుడు. ఆ పరమేశ్వరుడే ఈ జగత్తుకు సృష్టికర్త. సృష్టికి ముందు ఈ జగత్తంతా పరమేశ్వరునిలో లీనమై ఉన్నది. ఈ రకంగా తనలో ఇమిడి ఉన్న జగత్తును బహిర్గతం చేశాడు. అంటే సృష్టి చేశాడన్న మాట. అలాగే ప్రళయకాలంలో ఈ జగత్తులన్నింటినీ తనలో లీనం చేసుకుంటున్నాడు. అంటే సృష్టి, లయము రెండూ తానే చేస్తున్నాడు. ఈ రకంగా సృష్టి స్థితి లయాలు చేస్తూ జగత్తులను ప్రవర్తిల్ల చేస్తున్నాడు. తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా,

**యతోవా ఇమాని భూతాని జాయంతే । యేనజాతాని జీవంతి**

వరుణ మహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తి చేసి తండ్రి దగ్గరకు వచ్చి బ్రహ్మోపదేశం చెయ్యమని అడిగాడు. బ్రహ్మను గురించి ఒకరు చెబితే తెలిసేది కాదు. ఎవరికి వారే తపస్సు చేసి తెలుసుకోవాలి. కాబట్టి వెళ్ళి తపస్సు చెయ్యమన్నాడు తండ్రి. భృగువు అరణ్యాలకు వెళ్ళి అనేక సంవత్సరాలు తపస్సు చేసి చివరకు ఆనందమే పరబ్రహ్మ అని తెలుసుకున్నాడు. ఆ మాట విని



Varivasya 01 (Final) 8-5-08 7

సంతోషించాడు తండ్రి. కుమారుడికి బ్రహ్మోపదేశం చేశాడు. సమస్త భూతాలు ఎవరివల్ల పుట్టి, ఎవరి వల్ల జీవించి, ఎవరియందు లయమవుతున్నాయో, అతడే బ్రహ్మ. ఆ పరబ్రహ్మ ఆదిమధ్యాంత రహితుడు, జన్మమృత్యుజరాదులు లేనివాడు. **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ.** అతడు సత్యస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, అనంతుడు, అవ్యయుడు, దేశకాల వస్తు కృతమైన మార్పులు లేనివాడు. జగత్తుకు ఆధారమైనవాడు.

కాబట్టి బ్రహ్మని అంటే ప్రకాశాంశని గురించి తెలుసుకోవటానికి ఏమీలేదు. ఈ జగత్తుకు, బంధమోక్షాలకు కారణము శక్తి. అందుచేత ఆ శక్తిని గురించే మనం తెలుసుకోవాలి. అదే విమర్శ రూపమైన శక్తి. ఈ శక్తివల్లనే జగత్తు ఉత్పత్తి అవుతున్నది. **'త్రికోణరూపిణీ శక్తిః'** ఈ శక్తి త్రికోణ రూపంలో ఉంటుంది. అదే యోని. యోని అంటే జన్మస్థానము, ఉత్పత్తిస్థానము, కారణము అని అర్థం. కాబట్టి ఈ జగత్తుకు కారణము త్రికోణ రూపంలో ఉండే విమర్శశక్తి. దాన్ని గురించే ఇప్పుడు మనం తెలుసుకోవాలి.

**సావశ్యం విజ్ఞేయా యత్పరిణామాదభూదేషా ।**
**అర్థమయీ శబ్దమయీ చక్రమయీ దేహమయ్యపిచ సృష్టిః ॥ 6**

ఏ శక్తియొక్క పరిణామముచేత ఈ సృష్టి అర్థమయి, శబ్దమయి, చక్రమయి, దేహమయి అవుతున్నదో, ఆ శక్తిని గురించి మనం తప్పక తెలుసుకోవాలి.

ఇక్కడ అర్థమయి, శబ్దమయి, చక్రమయి, దేహమయి అని నాలుగు పదాలు వాడారు. ముందు వాటిని విడివిడిగా చూద్దాం.

**అర్థమయి:** శివాది క్షితిపర్యంతము ఉన్నటువంటి తత్త్వాలతో నిండినది. అసలు తత్త్వము అంటే ఏమిటి ? తత్త్వము అంటే యదార్థము, సత్యము, బ్రహ్మము, స్వభావము, సృష్టికి ప్రప్రథమావయవభూతమైన ప్రకృతి మొదలైన పదార్థము అని అర్థము. ఈ తత్త్వాలు ఎన్ని అనే విషయంలో ఒక్కొక్క మతస్థులు ఒక్కొక్క రకంగా చెప్పారు.

| మతస్థులు | తత్త్వముల సంఖ్య | తత్త్వములు |
|---|---|---|
| 1. బౌద్ధులు | 1 | శూన్యము |
| 2. చార్వాకులు | 4 | భూమి, నీరు నిప్పు, గాలి |
| 3. అర్హతులు | 2 | జీవము, అజీవము. |
| 4. అర్హతులలో కొందరు | 5 | జీవము, ఆకాశము, ధర్మము, అధర్మము, పుద్గలము. |
| 5. అర్హతులలో మరికొందరు | 7 | జీవము, అజీవము, అస్రవము, బంధము, సంవరము, నిర్జరము, మోక్షము. |
| 6. ద్వైతులు | 2 | స్వతంత్రము, అస్వతంత్రము. |
| 7. విశిష్టాద్వైతులు | 3 | చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు. |
| 8. శైవులు | 3 | పశువు, పతి, పాశము. |
| 9. సాంఖ్యులు | 25 | పంచభూతాలు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు, అవ్యక్తము, బుద్ధి, అహంకారము, ఆత్మ. |
| 10. యోగులు | 26 | సాంఖ్యులు చెప్పిన 25, ఈశ్వరుడు. |
| 11. అద్వైతులు | 1 | బ్రహ్మము. |

అద్వైత సిద్ధాంతంలో ఈ జగత్తుకు కారణము పరబ్రహ్మమే. అయితే అది అనేక రకాలుగా పరిణామం చెందుతున్నది. కాబట్టి వీటన్నింటినీ తత్త్వములు అనే అంటారు. ఈ తత్త్వాలు 51 అని కొందరు, 36 అని మరికొందరు చెప్పటం జరిగింది. వీరు చెప్పిన 51గాని, 36 గాని లెక్కలోకి తీసుకున్నట్లైతే, వాటిలో కొన్నింటిలో మరికొన్ని కలిసిపోతున్నాయి. ఉదాహరణకు త్వగాది ధాతులు 7. ఇవి పంచభూతాలలో కలిసిపోతున్నాయి. అలాగే పంచప్రాణాలు వాయువునందు కలిసిపోతాయి. ఈ రకంగా కలిసిపోయిన వాటిని వదలి వెయ్యగా మిగిలినవి 25 ధాతువులే అవుతాయి. అందుకే 'సుభగోదయస్తుతి'లోని 5వ శ్లోకంలో గౌడపాదాచార్యుల వారు .....



Varivasya 01 (Final) 8-5-08 8

పృథివ్యాపస్తేజః పవనగగనే తత్ప్రకృతయః
స్థితా తన్మాత్రాస్థా విషయ దశకం మానసమితి ।
తతో మాయావిద్యా తదనుచ మహేశః శివ ఇతి
పరం తత్త్వాతీతం మిలిత వపురిందోః పరకళా ॥

పంచభూతాలు – 5, తన్మాత్రలు – 5, జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు – 5, మనస్సు, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు. వెరసి తత్త్వాలు 25 అన్నారు. ఇక్కడ శివాది క్షితి పర్యంతము అన్నారు కదా అని అనుమానం వస్తుంది. ఈ శ్లోకం మొదటి పదం చూడండి. పృథివి అంటే క్షితి, భూమి, అలాగే మూడవపాదం చివర చూడండి 'శివ' ఇది ఆఖరుది. క్రింది నుంచి పైకి చెబితే క్షితి మొదలు శివ వరకు అలాగే పై నుంచి క్రిందికి చెబితే శివాది క్షితి పర్యంతము అవుతుంది. ఈ రకంగా 25 తత్త్వాలతో కూడి ఉన్న సృష్టి 'అర్థమయి' అనబడుతుంది.

**శబ్దమయి :** శబ్దము అంటే ధ్వని, వాక్కు అని అర్థం. ఈ వాక్కు నాలుగు రకాలుగా ఉంటుంది. అవే 1. పరా 2. పశ్యంతి 3. మధ్యమ 4. వైఖరి.

పరా స్థానం వాక్కుకు ప్రథమ స్థానం. అక్కడ ఆలోచన పుడుతుంది. తరువాత రెండవది పశ్యంతీ స్థానం. వాక్కు యొక్క రూపాలలో కౌళ, సమయాచారులకు తేడా లేదు. వాక్కు యొక్క స్థానాలలోనే తేడా ఉంది. సమయాచారుల ప్రకారం పరావాక్కుకు స్థానం సహస్రారం. పశ్యంతి స్థానం ఆధారచక్రం. కాగా కౌళాచారులకు పరావాక్కుకు స్థానం ఆధారచక్రం. పశ్యంతీ వాక్కుకు స్థానం మణిపూరం. అక్కడ నుంచి ముందుకు వెడితే మధ్యమ వైఖరి స్థానాలలోగాని, ఆ రూపాలలోగాని వారికి తేడాలేదు.

ఏదైనా విషయం చెప్పాలంటే ముందుగా ఆలోచన రావాలి. అదే పరావాక్కు. ఆ తరువాత వాక్కు ఆధారచక్రం నుండి బయలుదేరి, నెమ్మదిగా స్వాధిష్ఠాన, మణిపూరాలు దాటి, అనాహతం చేరి అక్కడ నుండి కంఠస్థానమైన విశుద్ధి చేరి, ముఖం ద్వారా, వైఖరీ వాక్కుగా బయటకు వచ్చి, శబ్దతరంగాలుగా చెవిరంధ్రాన్ని చేరుతుంది.

1. **పరావాక్కు:** ప్రత్యక్చితీ రూపం గలది. ఆత్మజ్ఞానం పొందటాన్ని 'ప్రత్యక్చితి' అంటారు. దీనికి రూపంలేదు.



2. **పశ్యంతీ వాక్కు :** పరదేవత అనబడుతుంది. ఇది పూర్తిగా అస్పష్టమైనది. పసిపిల్లవాడి ఏడుపులా ఉంటుంది.
3. **మధ్యమావాక్కు:** పూర్తిగా అస్పష్టంకాదు. అలా అని స్పష్టంగానూ ఉండదు. మాటలు వచ్చీ రాని పిల్లలు మాట్లాడినట్లుంటుంది. ఇది పూర్తిగా హల్లులతో కూడి ఉంది.
4. **వైఖరీవాక్కు:** ఇది స్పష్టమైన వాక్కు.

గాలి బుడగలాగా ఆధార చక్రంలో ప్రారంభమైన వాక్కు రూపాంతరం చెంది, విశుద్ధి చక్రంలో ఉన్న అచ్చులతో కలసి, స్పష్టమైన వైఖరీ వాక్కుగా అవుతుంది.

ఈ విషయమంతా 'లలితా సహస్రం'లోని 366 నుండి 374వ నామం దాకా వివరించబడింది. దీనిమీద ఇంకా వివరణ కావాలంటే నాచే వ్రాయబడిన **శ్రీవిద్యాసారథి** (లలితా రహస్యనామ భాష్యము) చూడండి. ఈ రకంగా చతుర్విధ శబ్దాలతో కూడిన సృష్టి **'శబ్దమయి'** అనబడుతుంది.

**చక్రమయి :** ఇక్కడ చక్రము అంటే శ్రీచక్రము. ఇందులో తొమ్మిది ఆవరణలు ఉన్నాయి. వీటినే చక్రాలు అంటారు.

| | | |
|---|---|---|
| 1. | భూపురము | – త్రైలోక్య మోహన చక్రము |
| 2. | షోడశదళము | – సర్వాశా పరిపూరక చక్రము |
| 3. | అష్టదళము | – సర్వసంక్షోభణ చక్రము |
| 4. | చతుర్దశారము | – సర్వసౌభాగ్యదాయక చక్రము |
| 5. | బహిర్దశారము | – సర్వార్థసాధక చక్రము |
| 6. | అంతర్దశారము | – సర్వరక్షాకర చక్రము |
| 7. | అష్టకోణము | – సర్వరోగహర చక్రము |
| 8. | త్రికోణము | – సర్వసిద్ధిప్రద చక్రము |
| 9. | బిందువు | – సర్వానందమయ చక్రము |

ఈ రకంగా బిందువు నుండి భూపురమువరకు గల సృష్టి 'చక్రమయి' అనబడుతుంది. శ్రీచక్రము మీద ఇంకా వివరాలు కావాలంటే నేను వ్రాసిన **'శ్రీవిద్యా మహాయంత్రము'** లేదా **'శ్రీచక్రము'** పుస్తకాలు చూడండి.

**దేహమయి :** దేహము అంటే మానవ శరీరము. ఇది పాంచభౌతికమైనది. ఈ శరీరము మూడురకాలుగా చెప్పబడుతుంది. 1. స్థూలశరీరము 2. సూక్ష్మ శరీరము 3. కారణ శరీరము

**1. స్థూలశరీరము :** చర్మము, మాంసము, రక్తము, నరాలు, మేద, మజ్జ, ఎముకలు మొదలైన వాటితోను, మలమూత్రాలతోను కూడిన ఈ స్థూలదేహం అసహ్యకరమైనవి. పూర్వకర్మలననుసరించి, పంచభూతాల కలయికచేత ఈ దేహము ఏర్పడింది. భోగాలు అనుభవించటానికి ఆధారము ఈ దేహమే. జీవుడు ఈ శరీరంతోనే సుఖదుఃఖాలు అనుభవిస్తాడు. స్థూలశరీరము ఎల్లప్పుడూ జాగ్రదావస్థలోనే అనుభవం పొందుతుంది. మిగిలిన అవస్థలేవీ దానికి తెలియవు. కాబట్టి జాగ్రదావస్థలో ఈ శరీరానికి ప్రాధాన్యత ఉంది. ఈ శరీరం గృహస్థుకు గృహంలాగా జీవాత్మకు ఆవాసమై ఉన్నది. మానవుడు తాను చేసిన పాపపుణ్యాలన్నీ ఈ దేహంద్వారానే ఈ లోకంలో అనుభవిస్తాడు. జనన మరణాలు, బాల్య కౌమార యవ్వన, వార్ధక్యదశలు, వర్ణాశ్రమ ధర్మాలు, మానావమానాలు అన్నీ ఈ దేహానికే చెందుతాయి.

**2. సూక్ష్మశరీరము :** వాక్కు మొదలైన కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, పంచప్రాణాలు, పంచభూతాలు, అంతఃకరణ చతుష్టయము, విద్య, కామము, కర్మ అనేవన్నీ కలిసి సూక్ష్మశరీరము అనబడుతుంది. సూక్ష్మశరీరాన్నే లింగశరీరము అంటారు. ఇది పంచీకృత భూతాలవల్ల ఏర్పడి, వాసనలతో కూడినదై, కర్మఫలాలు అనుభవిస్తూ ఉంటుంది. స్వప్నాన్ని ఈ సూక్ష్మశరీరమే అనుభవిస్తుంది. స్వప్న జగత్తులో స్వయంప్రకాశమైన పరమాత్మ భిన్నరూపాలతో ప్రకాశిస్తుంది. బుద్ధి స్వప్నంలో జాగ్రదావస్థలోని అనేక రకాలయిన వాసనలతో, కర్మ మొదలైన భావాలు పొంది తానే స్వయంగా ప్రకాశిస్తుంది.

బుద్ధియే ఉపాధిగా కలిగినట్టి ఆ సర్వసాక్షి ఆ బుద్ధి చేసిన కర్మలతో ఏమీ సంబంధం లేకుండా ఆ కర్మలు ఏ మాత్రం అంటకుండా ఉంటాడు. అందుకే అతడికి కర్మలు అంటవు.

వడ్రంగివాడి చేతిలోని బాడిస అన్ని పనులకు అతడికి ఏ రకంగా ఉపయోగిస్తుందో, అదే విధంగా ఈ లింగదేహం చిదాత్మ అయిన పురుషుని యొక్క సమస్త వ్యాపారాలకు అంటే అన్ని పనులకు ఉపయోగిస్తుంది.



**3. కారణశరీరము :** గుణత్రయమే ఆత్మయొక్క కారణశరీరము. ఇది సుషుప్తావస్థలో ఉంటుంది. సుషుప్తిలో అన్ని రకాలైన జ్ఞానము శాంతిస్తుంది. బుద్ధి కేవలము బీజరూపంలో మాత్రమే ఉంటుంది. సామాన్యంగా 'నిద్రలో నాకేం తెలియదు' అంటాం. అదే సుషుప్తి. ఆ స్థితిలో శరీరంలోని అన్ని అవయవాలు పూర్తిగా విశ్రమిస్తాయి. అప్పుడు ఉండేదే కారణ శరీరము.

ఈ రకంగా స్థూల సూక్ష్మ కారణ శరీరాలతో కూడిన సృష్టి 'దేహమయి' అనబడుతుంది.

ఆ శక్తి పరిణామము చెంది అర్థమయి, శబ్దమయి, చక్రమయి, దేహమయి అయిన సృష్టిగా ప్రకాశిస్తున్నది. అందుచేత మోక్షం కావాలి అనుకున్నవాడు, ఈ విధంగా పరిణామం చెందిన ఆ శక్తిని గురించి తెలుసుకోవాలి. పరమేశ్వరుడికి, ఈ జగత్తుకు భేదం లేదు. ప్రపంచానికి పరబ్రహ్మకీ కనపడే భేదము కేవలము వ్యావహారికము. అంతేగాని నిజంగా సత్యంకాదు. ఈ విషయం, శక్తి జ్ఞానము ఒక మంచి గురువువల్ల పొంది, ఆ శక్తికి, బ్రహ్మకు, తనకు, గురువుకు భేదం లేదు. అంతా ఒక్కటే ! అనే విషయం తెలుసుకున్నట్లైతే, సాధకుడు అద్వైతానందాన్ని అనుభవిస్తాడు. అంటే తానే పరబ్రహ్మ అయి, బ్రహ్మానందం పొందుతాడు.

## వేదసారభూత గాయత్రి

**తద్జ్ఞానార్థ ముపాయా విద్యాలోకే చతుర్దశ ప్రోక్తాః ।**
**తేష్వపి చ సారభూతావేదాః తత్రాపి గాయత్రీ ॥** **7**

ఆ శక్తియొక్క స్వరూపం తెలుసుకోవటానికి ఈ లోకంలో పద్నాలుగు విద్యలు చెప్పబడ్డాయి. వీటినే 'చతుర్దశ విద్యలు' అంటారు. అవి

1. ఋగ్వేదము, 2. యజుర్వేదము, 3. సామవేదము, 4. అధర్వణవేదము, 5. శిక్ష, 6. వ్యాకరణము, 7. ఛందస్సు, 8. నిరుక్తము, 9. జ్యోతిషము, 10. కల్పము, 11 మీమాంస, 12. న్యాయము, 13. పురాణము, 14. ధర్మశాస్త్రము. వీటన్నింటిలోకి వేదాలు సారభూతాలు. అసలు వేదాలలో ఉన్న రహస్యాన్ని పూర్తిగా తెలుసుకునేందుకే మిగిలిన విద్యలన్నీ చెప్పబడ్డాయి. అసలు 'వేదము' అంటే ఏమిటో ముందుగా చూద్దాం. "ఇష్టప్రాప్తిని, అనిష్టపరిహారాన్ని సాధించటానికి అలౌకికమైన ఉపాయాన్ని చెప్పేదే వేదము". సకల దేవతలను, ధర్మాన్నీ పరబ్రహ్మ తత్త్వాన్నీ

ప్రతిపాదిస్తుంది. కాబట్టి వేదసామ్రాజ్యం ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలకు మించి ఉన్నది.

'వేదం' అనే మాటకు సాధారణ అర్థం 'విద్య'. వేదంలో పరా, అపరా అనే రెండు రకాల విద్యలున్నాయి. అంటే వేదంలో రెండు రకాల కాండలున్నాయన్న మాట. 1. జ్ఞానకాండ 2. కర్మకాండ. వీటిలో కర్మకాండ అపరావిద్యను అంటే కర్మలు, నియమాలు, విధులు, ఆచారాలను వివరించగా, జ్ఞానకాండ ఆత్మ, పరమాత్మ, జగత్తులను వివరిస్తుంది. మొత్తంమీద నువ్వులలో నూనెలాగా వేదమంతటా వేదాంతం సుప్రతిష్ఠితమై ఉన్నది.

వేదానికి నిగమము, శ్రుతి, ఆమ్నాయము అని కూడా పేరు.

**1. నిగమము :** అనాదిగా వస్తున్న నిర్ధారితమైన మూలగ్రంథము

**2. శ్రుతి :** గురువు నుంచి శిష్యుడికి చేరే దివ్యవాణి

**3. ఆమ్నాయము :** మననము ద్వారా నేర్చుకొనే విద్య.

కృతయుగం, త్రేతాయుగాల్లో వేదం అంతా ఒకటిగానే ఉండేది. కాని ద్వాపరయుగంలో బ్రహ్మయొక్క ఆజ్ఞచేత వేదం నాలుగు భాగాలుగా చేసి, వాటిని భూలోకంలో ప్రచారం చేశాడు వేదవ్యాసుడు. ఈ రకంగా వచ్చినవే ఋగ్, యజు, స్సామ, అధర్వణ వేదాలు.

**1. ఋగ్వేదము :** వేదాలన్నింటిలోకీ ముఖ్యమైనది. అన్ని వేదాలలోనూ ఎక్కువ భాగం దీనికి పునరుక్తిగానో, అనుసరణగానో ఉంటుంది. దీనిలో 1028 దేవతాస్తుతులున్నాయి.

**2. యజుర్వేదము :** ఇది రెండు భాగాలుగా ఉంటుంది. 1. కృష్ణ యజుర్వేదము 2. శుక్లయజుర్వేదము. కృష్ణయజుర్వేదము చాలావరకు గద్యరూపంలో ఉంటుంది. దీనికి క్రియావిధులుంటాయి. శుక్లయజుర్వేదము 40 అధ్యాయాలుగల గ్రంథం. యజ్ఞయాగాలకు సంబంధించిన విషయాలు ఇందులో ఉన్నాయి.

**3. సామవేదము :** దీనిలో 75 మంత్రాలు తప్ప మిగిలినవన్నీ ఋగ్వేదంలోని 8, 9 మండలాల నుంచి తీసుకోబడ్డవే. ఇదంతా సంగీతపరంగా ఉంటుంది.

**4. అధర్వణవేదము :** దీనిలో ప్రాపంచిక అభ్యుదయాన్ని తేగల మంత్రాలు, తంత్రాలు ఉన్నాయి.



ప్రతివేదము నాలుగు భాగాలుగా విభజింపబడింది. 1. సంహిత 2.బ్రాహ్మణము 3. ఆరణ్యకము 4. ఉపనిషత్తు

**1. సంహిత :** ఇది మంత్రభాగం. ఇందులో స్తోత్రాలు, ఆవాహనాలు ఉంటాయి.

**2. బ్రాహ్మణము :** సంహితలోని విషయాన్ని వివరించేది బ్రాహ్మణము

**3. ఆరణ్యకము :** ఇది బ్రాహ్మణాలకు, ఉపనిషత్తులకు, మధ్యస్థాయిలో ఉంటుంది. ఇవికూడా బ్రాహ్మణాలలాగే కర్మవిధులను ప్రతిపాదిస్తాయి. కాని వీటిలో కర్మలయొక్క భౌతిక భాగం ఉండదు. కర్మల వెనుక ఉన్న నిగూఢమైన తత్త్వాలమీద ధ్యానానికి ప్రాముఖ్యత ఇవ్వబడింది.

**4. ఉపనిషత్తు :** ఇది బ్రహ్మవిద్య, జీవాత్మ, పరమాత్మ, జ్ఞానము, మోక్షాలను వివరిస్తుంది.

ఈ చతుర్దశ విద్యలలోను వేదాలు ముఖ్యమైనవి. ఆ వేదాలలో సారభూతమైనది గాయత్రీ మంత్రము.

**తస్యారూపద్వితయం తత్రైకం ప్రపర్యతేఽ స్పష్టమ్ ।**
**వేదేషు చతుర్ష్వపి పర మత్యంతం గోపనీయతరమ్ ॥ 8**

గాయత్రీ మంత్రము అని సాధారణంగా వాడేస్తుంటాము. కాని నిజానికి గాయత్రి అనేది ఒక ఛందస్సు. ఛందస్సులు 26 రకాలున్నాయి. అవి ఉక్త, అత్యుక్త, మధ్య, ప్రతిష్ఠ, సుప్రతిష్ఠ, గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి, అతిజగతి, శక్వరి, అతిశక్వరి, అష్టి, అత్యష్టి, ధృతి, అతిధృతి, కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అభికృతి, ఉత్కృతి. వీటిల్లో గాయత్రి శ్రేష్ఠమైనది అని బృహదారణ్యకోపనిషత్తులో చెప్పబడింది.

**'గయాన్ ప్రాణాన్ త్రాయత ఇతి గాయత్రీ'** ప్రాణములను రక్షించునది గాయత్రి అని **ఐతరేయ బ్రాహ్మణం**లో చెప్పబడింది. ఇక్కడ గయలు అంటే ప్రాణాలు అని అర్థం. **'తద్యత్ప్రాణాన్ త్రాయతే తద్గాయత్రీ'** ప్రాణరక్షణ చేయునది గాయత్రి అని బృహదారణ్యకోపనిషత్తు చెబుతోంది. **'తస్మాద్గాయంతం త్రాయతే యతః'** గానము చేయువానిని రక్షించునది. **'గీయతే తత్త్వమనయా గాయత్రీతి'** అని శంకర భాష్యం. ఈ మంత్రంలో దైవత్వం గానం చెయ్యబడింది కాబట్టి గాయత్రి అయింది. గాయత్రీ మంత్రం రెండువిధాలుగా ఉన్నది. 1. స్పష్టము 2. గుప్తము.

స్పష్టమైన గాయత్రి మళ్ళీ రెండు రకాలుగా ఉంది. 1. త్రిపద గాయత్రి 2. చతుష్పాదగాయత్రి.

**1) త్రిపదగాయత్రి :** ఇందులో మూడుపాదాలు, ఒక్కొక్క పాదానికి ఎనిమిది అక్షరాల చొప్పున 24 అక్షరాలు ఉంటాయి.

**ఓం భూర్భువస్సువః తత్సవితుః వరేణ్యం ।**
**భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ॥**

ఇది ఉపనయన కాలంలో బ్రాహ్మణులకు ఉపదేశించేది. ఈ మంత్రోపదేశం తరువాత వటువు సంస్కారవంతుడౌతాడు. మంత్రసిద్ధి పొందిన తరువాత, బ్రహ్మోపదేశం పొందటానికి అర్హుడవుతాడు.

శరీరాదులను రక్షించటంచేత గాయత్రి అని, తేజస్వరూపం కావటంచేత సావిత్రి అని, వాగ్రూపం కావటంచేత సరస్వతి అని చెప్పబడుతోంది.

**2. చతుష్పాద గాయత్రి :** ఇందులో నాలుగు పాదాలు. ఒక్కొక్క పాదానికి ఎనిమిది అక్షరాల చొప్పున మొత్తం 32 అక్షరాలుంటాయి. త్రిపదగాయత్రిలోని మూడుపాదాలు కాక **పరోరజసి సావదోం** అనే నాల్గవ పాదం ఉంటుంది.

ఓంకారం పరబ్రహ్మ స్వరూపం. వ్యాహృతులు దాని అంగాలు. గాయత్రీ మంత్రంలో ఏడు వ్యాహృతులున్నాయి. అవి 1) ఓం భూః 2) ఓం భువః 3) ఓగ్ం సువః 4) ఓం మహః 5) ఓం జనః 6) ఓం తపః 7) ఓగ్ం సత్యం

ప్రస్తుతము ఉపాసనలో ఉన్న గాయత్రీ మంత్రానికి విశ్వామిత్రుడు ఋషి. ఇది 28వ మహాయుగం. గతంలో అంటే క్రిందటి యుగాల్లో కూడా ఈ మంత్రం ఉపాసన చెయ్యబడ్డది. ఆ సమయంలో ఋషి, ఛందస్సు విడివిడిగా ఉన్నాయి. వాటి వివరాలు దేవీభాగవతంలోని 12వ స్కంధంలో ఇవ్వబడ్డాయి. ఈ మంత్రానికి 24 మంది ఋషులు, 24 ఛందస్సులు, దేవతలు, శక్తులు ఉన్నాయని చెప్పబడింది.

లలితాసహస్రంలో 420 నుండి 468 నామం వరకు గాయత్రీమంత్రం వివరించబడింది. ఇది స్పష్టమైన గాయత్రి. ఇక గుప్తగాయత్రి. ఇది వేదాలలో నిగూఢంగా ఉన్నది. ఇదే పంచదశీ మహామంత్రము.

అందుచేతనే గాయత్రీ మంత్రం బ్రాహ్మణుల కోసం ఏర్పడగా, పంచదశీ మహామంత్రం అన్ని వర్ణాలవారికోసం ఏర్పడింది అన్నాడు అగస్త్య మహర్షి. ఇంకా



చెప్పాలంటే గాయత్రీమంత్రము, పంచదశీమహామంత్రము రెండూ ఒక్కటే. ఈ రెండింటి అర్థంకూడా ఒక్కటే.

శ్రీవిద్యలో పంచదశీ మహామంత్రం ప్రసిద్ధమైనది. శాక్తేయానికి ఇది గాయత్రి వంటిది. పంచదశీ మహామంత్రం మాయను పోగొట్టి పరబ్రహ్మను ప్రకాశింప చేస్తుంది. సూర్యుడికి కిరణాలు ఉన్నట్లుగానే పరబ్రహ్మకు (శివునకు) మాయ (శక్తి) సహజంగా ఉంటుంది. కాబట్టి కేవలం శివుణ్ణిగాని, శక్తినిగాని ఆరాధించటం కుదరదు. శివప్రధానమైనది సమయాచారము కాగా, శక్తి ప్రధానమైనది వామాచారము.

ఇది మొత్తం పదిహేను అక్షరాలు గల మంత్రం. ఈ అక్షరాలు ఏ విధంగా వచ్చాయి అనేది 10, 11, 12 శ్లోకాలలో వివరించబడుతుంది. పంచదశీ మహామంత్రము 'హాదివిద్య', 'కాదివిద్య' అని రెండు రకాలుగా చెప్పబడుతుంది. అకారాది క్షకారాంతము గల అక్షర సమామ్నాయానికి మాత్రుకలు అని పేరు. వీటిలో కకారముతో మొదలయ్యే అక్షరాలను కాదిమాత్రుకలు అని, హకారముతో మొదలయ్యే అక్షరాలను హాదిమాత్రుకలు అని అంటారు. కాదిమాత్రుకలను 'శబరవర్మ' అనే ఆయన ప్రచారం చేశాడు. కాగా పాణిని చెప్పినవి హాదిమాత్రుకలు.

పాణిని శివుణ్ణి గురించి ఘోరమైన తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై తనచేతిలోని ఢక్కను 14 సార్లు వాయించాడు. అప్పుడు దాని నుంచి 14 రకాలైన ధ్వనులు 14 సూత్రాలుగా పుట్టినాయి. ఆ సూత్రాలే సంస్కృత భాషకు వర్ణసమామ్నాయమైంది.

**నృత్తావసానే నటరాజరాజో ననాదఢక్కాం నవపంచవారమ్ ।**
**ఉద్ధర్తుకామ స్సనకాది సిద్ధా ఏతద్విమర్శే శివసూత్రజాలమ్ ॥**

శివుడు తన నాట్యాన్ని పూర్తి చేస్తూ సనకాది సిద్ధుల నుద్ధరింపగోరినవాడై తనఢక్కను 14సార్లు వాయించాడు. ఆ సమయంలో పుట్టినవే 14 సూత్రాలు. ఇవే శివసూత్రాలు అనబడతాయి. వీటిలో మొదటి సూత్రం అకారంతో మొదలవుతుంది. నాల్గవసూత్రం చకారంతో పూర్తవుతుంది. ఈ మధ్యలో ఉన్నవాటిని అచ్చులు అంటారు. అలాగే ఐదవ సూత్రం హకారముతో మొదలయి, పద్నాల్గవ సూత్రం లకారంతో పూర్తి అవుతుంది. ఈ మధ్య ఉన్నవాటిని హల్లులు అంటారు. అంటే ఇక్కడ హల్లులు హకారంతో మొదలవుతాయన్న మాట. అందుచేతనే ఇవి హాదిమాత్రుకలు.

ఇదే విధంగా పంచదశీ మహామంత్రం కూడా కాదిహాది విద్యలలో చెప్పబడింది. ఈ మంత్రం కకారంతో మొదలైతే కాదివిద్య అని, హకారంలో మొదలైతే హాది విద్య అని చెప్పబడుతుంది. ఈ మంత్రాన్ని గతంలో అనేకమంది ఉపాసించి తరించారు. వారిలో ....

**మనుశ్చంద్ర కుబేరశ్చ లోపాముద్రా చ మన్మథః**
**అగస్తి రగ్ని సూర్యశ్చ ఇంద్ర స్కంద శ్శివ స్తథా**
**క్రోధభట్టారకో దేవ్యా ద్వాదశాదో ఉపాసకాః ॥**

మనువు, చంద్రుడు, కుబేరుడు, లోపాముద్ర, మన్మథుడు, అగస్త్యుడు, అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు, స్కందుడు, శివుడు, దుర్వాసుడు మొదలైన 12మంది గతంలో ఈ మంత్రాన్ని ఉపాసించి తరించారు. అయితే వీరిలో ఇంద్రుడు, చంద్రుడు, కుబేరుడు, మనువు, మన్మథుడు వంటి కొంతమంది కాదివిద్యను ఉపాసించగా, లోపాముద్ర, సూర్యుడు, శివుడు మొదలైనవారు హాదివిద్యను ఉపాసించారు. హాది విద్యలో యమ, నియమాలు ఎక్కువగా ఉంటాయి. కాని కాదివిద్యలో అవి ఎక్కువగా ఉండవు. ధర్మాచరణలో స్వేచ్ఛ ఇవ్వబడిందని **శక్తి సంగమతంత్రం** చెబుతోంది.

**తేషుద్వా మనురాజౌతు వరిష్టా వింద్యమర్ధనః**
**లోపాముద్రా కామరాజా ఇతిఖ్యాతి ముపాగతౌః ।**
**హాదిస్తు లోపాముద్రాస్యా కామరాజస్తు కాదికః**
**తయోస్తు కామరాజోయం సిద్ధిదో భక్తి శాలినః ॥**

శ్రీవిద్యలో హాదివిద్య, కాదివిద్య అని రెండురకాల విద్యలున్నాయి. హాదివిద్యలో 'లోపాముద్రీయము', కాదివిద్యలో 'కామరాజీయము' శ్రేష్ఠమైనవి. ఈ రెండింటిలోనూ చూసినప్పుడు, అంటే హాది, కాది విద్యలను గనక పరిశీలించినట్లైతే, ఆ రెండింటిలోను కాదివిద్య శ్రేష్ఠమైనది. కాబట్టి పంచదశీ మహామంత్రాన్ని కాదివిద్యలో ఉపాసించటం ఉత్తమము.

స్థూలంగా చూసినట్లైతే మంత్రాలు రెండు రకాలు. 1. వైదిక మంత్రాలు 2. తాంత్రిక మంత్రాలు. వేదములయందు చెప్పబడినవి వైదికమంత్రాలు. ఇవి జ్ఞానప్రదాలు. కామ్యప్రదమైనవి తాంత్రికాలు. ఈ రెండూ కాక 'అపభ్రంశములు' అని ఇంకో రకం ఉన్నాయి. సంస్కృతంలో కాకుండా ఇతర భాషలలో చెప్పబడ్డ



వాటిని అపభ్రంశములు అంటారు. మళయాళ మంత్రాలు, తెలుగు, హిందీ మొదలైన ఇతర భాషలలో మంత్రాలన్నీ ఈ కోవకు చెందినవే.

అయితే లోకంలో తంత్రాలు బాగా ప్రసిద్ధి చెందినాయి. అసలు తంత్రము అంటే ఏమిటి ? తంత్రము అంటే ఒక శక్తిని వశము లేదా అధీనంలోకి తెచ్చుకొనే పద్ధతి. తేలికగా వశంలోకి తెచ్చుకునే మార్గము. ఉదాహరణకు సూర్యరశ్మిలో కాగితం పెడితే కాలదు. ఆ కాగితంమీద తగిన ఎత్తులో భూతద్దం పెడితే, కొద్దిసేపటికే ఆ కాగితం మండిపోతుంది. ఇదే తంత్రము. అలాగే మంత్రభాగంలో 'అవిశె' చెట్టుక్రింద కూర్చుని జపం చేస్తే, ఆ జపం త్వరగా సిద్ధిస్తుంది. ఇలా తేలిక పద్ధతుల ద్వారా పనులు సాధించుకునే ఉపాయాన్నే తంత్రము అంటారు. ఈ రకంగా ఫలితాలు సాధించటం మొదలుపెడితే ఎంతటి విద్వాంసులైనా సరే భ్రష్టుపట్టిపోతారు. శంకర భగవత్పాదులవారు తమ **'సౌందర్యలహరి'**లోని 31వ శ్లోకంలో ....

**చతుష్షష్ట్యా తన్త్రైః సకల మతిసన్ధాయ భువనం**
**స్థిత స్తత్త త్సిద్ధి ప్రసవపరతన్త్రైః పశుపతిః ।**
**పునస్త్వన్నిర్బన్ధా దఖిల పురుషార్థైకఘటనా**
**స్వతన్త్రం తే తన్త్రం క్షితితల మవాతీతరదిదమ్ ॥**

"తల్లీ ! పశుపతి అయిన నీ భర్త ఆ పరమేశ్వరుడు, ఐహికసంబంధమైన అగ్ని స్తంభన, వాయుస్తంభన, ఆకాశగమనము, పరకాయప్రవేశమువంటి విద్యలను లోకానికి అందజేశాడు. ఈ విద్యలను ఆధారం చేసుకుని లోకంలోని పండితులు కూడా మహామోహములో పడిపోయి మోక్షాన్ని మరచిపోతున్నారు. అది గమనించిన నీవు మోక్షసాధనమైన ఒక తంత్రాన్ని చెప్పమని అడగగా పరమేశ్వరుడు శ్రీవిద్యా తంత్రాన్ని ఉపదేశించాడు అన్నారు. కాబట్టి ఎంతటి పండితులైనాసరే తంత్రశాస్త్రం జోలికి వెళ్ళినట్లైతే నాశనమై పోతారు. కుడితితొట్టిలో పడ్డ ఈగలాగా సంసారమనే లంపటంలోపడి కొట్టుమిట్టాడుతుంటారు. శక్తులు సంపాదించటం గనక మొదలు పెడితే, ఇక దానికి అంతం అంటూ ఉండదు. ఆ శక్తుల కోసం చేయకూడని పనులుకూడా చేసి చివరకు అథః పతనమయిపోతారు. అందుచేతనే తాంత్రికం వద్దు అనే మాటను పదేపదే చెప్పటం జరుగుతోంది.

## శ్రీవిద్య వేదవిద్య

**కామోయోనిః కమలేత్యేవం సంకేతితైః శబ్దైః ।**
**వ్యవహరతి న ప్రకాశం యాం విద్యాం వేదపురుషోఽపి ॥ 9**

శ్రీవిద్యవేదవిద్య అనే విషయాన్ని ప్రతిపాదిస్తున్నారు ఈ శ్లోకంలో. అసలు వేదవిద్య అంటే ఏమిటి ? వేదములయందు చెప్పబడిన విద్య, మోక్షవిద్య అని అర్థం. అసలు వేదాలలో విద్యలు, మంత్రాలు చెప్పబడ్డాయా అని అనుమానం.

వేదం నాలుగు భాగాలుగా ఉన్నది. 1. సంహితలు 2. బ్రాహ్మణాలు 3. ఆరణ్యకాలు 4. ఉపనిషత్తులు. వీటిని గురించి గతంలో చెప్పుకున్నాం. ఇప్పుడు ఈ మంత్రభాగమంతా ఉపనిషత్తులలో చెప్పబడింది. ఉదాహరణకి నారాయణోపనిషత్తును చూడండి.

**ఓమిత్యేకాక్షరం, నమ ఇతి ద్వేక్షరే నారాయణేతి**
**పంచాక్షరాణి । ఏతద్వై నారాయణస్యాష్టారం పదమ్ ॥**

**'ఓం నమో నారాయణాయ'** అనేది అష్టాక్షరీ మంత్రము అని చెబుతోంది. 'గోపాలతాపినీ ఉపనిషత్తు'లో **"క్లీం కృష్ణాయ, గోవిందాయ, గోపీజనవల్లభాయ స్వాహా"** అంటూ గోపాలమంత్రం చెప్పటం జరిగింది. ఈ రకంగా మహామంత్రాలన్నీ వేదాలలో చెప్పబడ్డాయి. అందుకే అవి వైదికమంత్రాలయినాయి. మరి పంచదశీ మహామంత్రం వైదికమంత్రమేనా ? అయితే ఎక్కడ చెప్పబడింది ? అనే అనుమానం జనంలో ప్రబలంగా ఉన్నది. ఆ అనుమానం నివృత్తి చెయ్యటానికే ఈ శ్లోకం చెబుతున్నారు.

శ్రీవిద్య అనేది వేదంలో గుప్తంగా చెప్పబడిన విద్య. ఇది రహస్యాతి రహస్యమైనది. ఋగ్వేదంలో **'త్రిపురోపనిషత్తు'** అని ఉంది. ఆ త్రిపురోపనిషత్తులోని రెండవ మంత్రం చివరలో

**కామోయోనిః కమలా వజ్రపాణిః గుహాహసా మాతరిశ్వాఽభ్రమింద్రః ।**
**పునర్గుహా సకలా మాయయాచ పురూచ్యేషా విశ్వమాతాది విద్యా ॥**

ఇక్కడ కాముడు, యోని, కమల మొదలైన సాంకేతిక పదాలతో ఈ విద్య చెప్పబడింది. అయితే ఇది పంచదశీ మహామంత్రం ఎలా అవుతుంది ? అంటే



**కామో (క) యోనిః (ఏ) కమలా (ఈ) వజ్రపాణిః (ల) గుహా (హ్రీం) హసా (హస) మాతరిశ్వా (క) భ్ర (హ) మింద్రః (ల) పునర్గుహా (హ్రీం) సకలా (సకల) మాయయా (హ్రీం).** ఇది వేదంలో చెప్పబడిన పంచదశీ మహామంత్రం.

అసలు పంచదశీ మహామంత్రం 15 అక్షరాలు కలిగి ఉంటుంది. ఆ మంత్రం మూడు భాగాలుగా, మూడు కూటములుగా ఉంటుంది. అథర్వణవేదంలోని "త్రిపురతాపినీ ఉపనిషత్తు"లోని మొదటి అధ్యాయంలో గాయత్రీ మంత్రము, పంచదశీ మహామంత్రము ఒక్కటే అని నిరూపించారు. అలాగే 'త్రిపురసుందరీ ఉపనిషత్తు'లో

**దక్షిణామూర్తి ఋషిః । పంక్తిచ్ఛందః । లలితా త్రిపురసుందరీ దేవతా । ఐం బీజం । సౌః శక్తిః । క్లీం కీలకమ్ । క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । సకల హ్రీం ॥ ఇతి మంత్రః** అని చెప్పబడింది.

ఈ రకంగా పంచదశీమహామంత్రం వేదభాగమైన ఉపనిషత్తులలో చెప్పబడింది. కాబట్టి పంచదశీమహామంత్రము వైదికమంత్రమే. ఈ మంత్రం అత్యంత రహస్యమైనది కాబట్టి పై రెండు ఉపనిషత్తులలోను గుప్తంగా చెప్పబడింది. కాని 'త్రిపురసుందరీ ఉపనిషత్తు'లో మాత్రం దీన్ని బహిరంగంగానే చెప్పటం జరిగింది.

## విద్యావర్ణోద్ధారము

**క్రోధీశః శ్రీకంఠారూఢః కోణత్రయం లక్ష్మీః ।**
**మాంస మనుత్తరరూఢం వాగ్భవకూటం ప్రకీర్తితం ప్రథమమ్ ॥ 10**
**శివహంస బ్రహ్మవియచ్చక్రాః ప్రత్యేక మక్షరారూఢాః ।**
**ద్వైతీయీకం కూటం కథితం తత్ కామరాజాఖ్యమ్ ॥ 11**
**శివతో వియతో ముక్తం తృతీయమిద మేవశక్తి కూటాఖ్యమ్ ।**
**హృల్లేఖానాం త్రితయం కూటత్రయేపి యోజ్యమన్తేస్యాత్ ॥ 12**

ఈ శ్లోకాలలో పంచదశీమహామంత్రం ఏరకంగా ఆవిర్భవించిందో వివరిస్తున్నారు. పంచదశీమహామంత్రాన్ని దర్శించి, ఉపాసించి, తరించి ఈ లోకానికి తెచ్చినవాడు మన్మథుడు. కాబట్టి ఆ మంత్రానికి అతడే ఋషి అని కొందరి వాదన. కాగా దక్షిణామూర్తి మూలపురుషుడు అని కొందరంటారు. భిన్నసంప్రదాయాలలో ఇంకా అనేకమందిని ఋషిగా చెప్పటం జరుగుతోంది.



Varivasya 01 (Final) 8-5-08 14

సౌందర్యలహరిలోని 32వ శ్లోకంలో శంకర భగవత్పాదులవారు పంచదశీ మహామంత్రాన్ని వివరిస్తూ ...

**శివశ్శక్తిః కామః క్షితి రథ రవి శ్శీతకిరణః**
**స్మరో హంసశ్శక్ర స్తదనుచ పరా మార హరయః ।**
**అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితాః**
**భజన్తే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్ ॥**

ఓ తల్లీ ! కకారము శివుడు, ఏకారము శక్తి, ఈకారము కాముడు, లకారము భూమి. ఇవి మొదటి ఖండము. హకారము రవి, సకారము చంద్రుడు, కకారము స్మరుడు (మన్మథుడు) హకారము హంస, లకారము ఇంద్రుడు. ఇవి రెండవ ఖండము. సకారము పరాశక్తి, కకారము మన్మథుడు, లకారము హరి. ఇవి మూడవ ఖండము. ఈ మూడు ఖండముల చివర మూడు హ్రీంకారములు. వెరసి పదిహేను అక్షరములతో పంచదశీమహామంత్రము ఒప్పారుతున్నది.

ఇంతకీ ఈ మంత్రం ఏ రకంగా ఆవిర్భవించింది? అంటే –ఇప్పుడు దేవియొక్క సూక్ష్మరూపాన్ని వర్ణిస్తున్నారు. సూక్ష్మరూపము మూడు విధాలుగా ఉంటుంది.

1. సూక్ష్మము – పంచదశీ మహామంత్రము
2. సూక్ష్మతరము – కామకలాక్షరము
3. సూక్ష్మతమము – కుండలిని

లలితా సహస్రంలోని 85, 86, 87 నామాలలో పంచదశీమహామంత్రాన్ని వివరించారు. **శ్రీమద్వాగ్భవకూటైకస్వరూప ముఖపంకజా, కంఠాదికటిపర్యంతం మధ్యకూటస్వరూపిణీ, శక్తికూటైకతాపన్న కట్యధోభాగధారిణః**

ఈ మంత్రం మొత్తం మూడు కూటములు లేదా ఖండములుగా ఉంటుంది. వాటిని 1. వాగ్భవకూటమి, 2. కామరాజకూటమి, 3. శక్తికూటమి అంటారు. పరమేశ్వరి యొక్క కంఠము నుంచి పైభాగము అంటే శిరస్సును వాగ్భవకూటమి అంటారు. శిరస్సునుంచే పరావాక్కు ఉత్పన్నమవుతుంది. నోటిద్వారా బయటకు వస్తుంది. అందుకే దీనిని వాక్కుయొక్కభాగము, వాగ్భవకూటమి అన్నారు. రెండవది కామరాజకూటమి. ఇది కంఠము దగ్గరనుంచి కటిప్రదేశము వరకు విస్తరించి



ఉంటుంది. ఈ శరీరభాగంతోనే జీవి తనకోరికలు అనుభవిస్తుంది. అందుకే దీనిని మన్మథభాగము, కామరాజకూటమి అన్నారు. మూడవది శక్తికూటమి. కటిప్రదేశంలో నుంచి క్రిందిభాగము అంతా శక్తికూటమి. జీవి సంచరించటానికి అవసరమైన శక్తినిచ్చే కాళ్ళు ఇక్కడ ఉంటాయి. అందుకే ఇది శక్తికూటమి అనబడుతున్నది. ఈ రకంగా పరమేశ్వరి శరీరాన్ని మూడు భాగాలుగా జేసి వాటిని వాగ్భవకూటమి, కామరాజకూటమి, శక్తికూటమి అన్నారు. పరమేశ్వరికి శరీరము ఏమిటి ? అనే అనుమానం రావచ్చు. నిరాకారుడైన పరబ్రహ్మ, సాధకులను ఉద్ధరింప గోరినవాడై ఒక రూపం దాల్చాడు. అదే పరమేశ్వరి. పరలోకానికి ఈశ్వరి. అధిపతి ఆ పరమేశ్వరి సూక్ష్మరూపమే పంచదశీమహామంత్రము.

పంచదశీమహామంత్రము దేవికి ఆత్మస్వరూపము. శ్రీవిద్యా సంప్రదాయానికి ఇది గాయత్రివంటిది. ఈ మంత్రాన్ని ఉపాసించినవారికి ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. చతుర్విధపురుషార్థాలకూ మూలమవటంచేత పంచదశీ మహామంత్రము "మూలమంత్రము" అనబడుతున్నది. ఈ మూలమంత్రము మూడు కూటములుగా ఉన్నది. ఆ కూటత్రయమే పరమేశ్వరిస్వరూపము. ఇక్కడ 'మూల' అనే శబ్దము కామకలాక్షరాన్ని (శ్రీ) చెబుతున్నది. కూటత్రయము అనటంచేత మూడు విధాలయిన అవయవాలు చెప్పబడుతున్నాయి. వివరంగా చెప్పాలంటే కామకళలో ఊర్ధ్వబిందువు, మధ్య బిందువు, నాదబిందువు. వీటినీ 'కూటత్రయము' అంటారు. కాబట్టే లలితా సహస్రంలో 88, 89 నామాలు **మూలమంత్రాత్మికా, మూలకూటత్రయ కళేబరా** అని చెప్పబడ్డాయి.

ప్రళయం సంభవించినప్పుడు సృష్టిఅంతా పరమేశ్వరునిలో లీనమై పోయింది. ఇది ఎలా జరిగింది ? అంటే ప్రళయం సంభవించినప్పుడు కర్మక్షయం అయిన జీవరాశి అంతా ముక్తినిపొందగా, కర్మక్షయంకాని జీవరాశి ఆ కర్మను తమతో మూటకట్టుకున్నదై, తనకర్మతో సహ మాయలో లీనమైపోయింది. ఆ తరువాత భూమి జలమునందు, జలము అగ్నియందు, అగ్ని వాయువునందు, వాయువు ఆకాశమునందు, ఆకాశము మాయయందు లీనమవగా, వీటన్నింటినీ తనలో లీనం చేసుకున్న మాయ, పరమేశ్వరునిలో లీనమైపోయింది. ఈ విధంగా సృష్టి అంతా పరమేశ్వరునిలో లీనమవగా, ఇప్పుడు ఎట్టి వికారాలు లేనిది, సత్యజ్ఞానానంద మయమైనది, పరిపూర్ణమైనది, సనాతనముగాఉన్నది, ఏకముగాఉన్నది, రెండవది

లేనిది అయిన పరబ్రహ్మస్వరూపము ఒక్కటేఉన్నది. నిరాకారమైన ఆ పరబ్రహ్మ స్వరూపంలో ఎడారులందు ఎండమావిలాగా, స్థాణువునందు దొంగవాడిలాగా, స్ఫటికంలోని రేఖలులాగా అనిపిస్తూ, తెలుపు, ఎరుపు, నలుపు గల సమాన త్రిగుణాలు కలిగి, అనిర్వచనీయమైన మూలప్రకృతి ఉన్నది. ఆ మూలప్రకృతిలో ప్రతిబింబించిన పరబ్రహ్మయే సాక్షిచైతన్యము.

ఈ పరమేశ్వరతత్త్వానికి రూపంలేదు. గుణంలేదు, లింగభేదం అసలే లేదు. ఇది తేజోమయమైన కాంతిపుంజము. బ్రహ్మాదులు దీన్నే 'పరమేశ్వరుడు' అంటారు. అది శివశక్తుల ఏకీకృతరూపము.

ఈ రకంగా సృష్టినంతటినీ తనలో నిక్షిప్తం చేసుకున్న ఆ పరమేశ్వరి ఇప్పుడు సృష్టిచెయ్యాలి అని సంకల్పించింది. సృష్టి ఎందుకుచెయ్యాలి ? ప్రళయం జరిగినప్పుడు కర్మక్షయం కాకుండా తనలోలీనమైపోయిన జీవకోటికి కర్మక్షయంచేసి, దానికి ముక్తికలిగించాలనే ఉద్దేశ్యంతో సృష్టిచెయ్యాలని సంకల్పించింది పరమేశ్వరి. ఇప్పుడు సృష్టి ప్రారంభమైంది. ముందుగా ఆ పరమేశ్వరి నుంచి సత్వగుణ ప్రధానమైన అవ్యక్తం వచ్చింది. అదేమాయ. ఈ మాయ పరమేశ్వరి అధీనంలోనే ఉంటుంది. మాయవల్లనే సృష్టిస్థితిలయాలు అన్నీ జరుగుతున్నాయి. ఇప్పుడు అవ్యక్తము నుంచి రజోగుణప్రధానమైన మహత్తత్త్వము పుట్టింది. అదే హిరణ్యగర్భుడు. మహత్తత్త్వము నుంచి తమోగుణప్రధానమైన అహంకారము పుట్టింది. అదే దేవి విరాడ్రూపము. ఈ రకంగా పరమేశ్వరి నుంచి అవ్యక్తము (మాయ), మహత్తత్త్వము (హిరణ్యగర్భుడు), అహంకారము (విరాడ్రూపము) ఆవిర్భవించినాయి.

ఈ అహంకారము నుంచే నామరూపాత్మకమైనజగత్తు ఆవిర్భవించింది. ముందుగా రూపాత్మకజగత్తు. అహంకారం నుంచి పంచభూతాలసూక్ష్మ రూపాలయిన తన్మాత్రలు ఆవిర్భవించాయి. అవే శబ్ద స్పర్శ రూప రస గంధాలు. ఆ తరువాత తన్మాత్రల స్థూలరూపాలయిన పంచభూతాలు ఆవిర్భవించినాయి. పంచభూతాలలో ముందుగాపుట్టింది ఆకాశము. ఆకాశము నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలము, జలము నుంచి భూమి, భూమి నుంచి ఓషధులు, ఓషధుల నుంచి వనస్పతులు, వనస్పతుల నుంచి అన్నము వచ్చింది. ఈ రకంగా రూపాత్మకమైన జగత్తు ఏర్పడింది. ఇక నామాత్మకమైన జగత్తు. అవ్యక్తము నుంచి ముందుగా ఓంకారము పుట్టింది. ఓంకారము నుంచి అకార ఉకార మకారాలు



వచ్చినాయి. వాటినుంచి అక్షరసమామ్నాయము వచ్చింది. అక్షరాల నుంచి పదాలు, వాక్యాలు, మంత్రాలు, వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, సంగీతము, సాహిత్యము వచ్చాయి. ఈ రకంగా పరమేశ్వరి నుంచి నామరూపాత్మకమైనజగత్తు ఏర్పడింది.

ఇప్పుడు పంచభూతాల పంచీకరణ జరిగింది. పంచభూతాలలో ముందుగా ఆకాశం పుట్టింది. ఆకాశంలో దానియొక్కలక్షణం శబ్దముమాత్రమే ఉన్నది. ఆకాశం నుంచి వాయువు వచ్చింది. వాయువు లక్షణం స్పర్శ. అందుచేత వాయువులో ఆకాశలక్షణమైన శబ్దము, వాయులక్షణమైన స్పర్శ ఉన్నాయి. వాయువు నుంచి అగ్ని వచ్చింది. అగ్నిలో ఆకాశలక్షణమైనశబ్దము, వాయులక్షణమైనస్పర్శ, అగ్ని లక్షణమైనరూపము ఉన్నాయి. అగ్ని నుంచి జలము వచ్చింది. జలమునందు ఆకాశలక్షణమైనశబ్దము, వాయులక్షణమైనస్పర్శ, అగ్నిలక్షణమైనరూపము, జలలక్షణమైనరసము ఉన్నాయి. జలము నుంచి భూమి వచ్చింది. భూమియందు పంచభూతాల యొక్క లక్షణాలన్నీ అంటే ఆకాశ లక్షణమైనశబ్దము, వాయులక్షణమైన స్పర్శ, అగ్నిలక్షణమైనరూపము, జలలక్షణమైనరసము, భూలక్షణమైనగంధము ఉన్నాయి. ఈ రకంగా ఆకాశమునందు – శబ్దము; వాయువునందు – శబ్దము, స్పర్శ; అగ్నియందు – శబ్దము, స్పర్శ, రూపము; జలమునందు – శబ్దము, స్పర్శ, రూపము, రసము; భూమియందు – శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము ఉన్నాయి. ఇదే పంచీకరణ. ఈ పంచీకరణలో మొత్తం పదిహేను భాగాలున్నాయి. **ఈ రకంగా పంచభూతాల పంచీకరణతో వచ్చిన పదిహేను భాగాలే, పంచదశీ మహామంత్రంలోని పదిహేను బీజాక్షరాలు.** పంచదశీ మహామంత్రము అంటే పంచభూతాలు అని అర్థం. ఈ సృష్టి అని అర్థం. ఈ జగత్తు అని అర్థం. సాక్షాత్తూ చరాచరజగత్తే పంచదశీమహామంత్రంగా ఆవిర్భవించింది. సంస్కృతభాషకు గల అక్షరాలు యాభై అని, మంత్రశాస్త్రానికి అక్షరాలు యాభైఒకటి అని గతంలో చెప్పుకున్నాం. **మాతృకా హృదయము** అనే గ్రంథంలో ...

**కకారాది క్షకారాంతా వర్ణాస్తే శివరూపిణః ।**
**సమస్త వ్యస్తరూపేణ షట్త్రింశత్ తత్త్వ విగ్రహా ॥**
**అకారాది విసర్గాంతాః స్వరాషోడశ శక్తయః ।**
**నిత్యాషోడశకాత్మనః పరస్పర మమీయతా ॥**

**శివశక్తి మయావర్ణా శబ్దార్థ ప్రతిపాదకా ।**
**శివస్వరః పరాధీనో నస్వతంత్రః పదాప్ససౌః ॥**

**స్వరాః స్వతంత్రా జాయంతే నశివస్తు కథాచన ॥**

అని చెప్పారు. వీటిలో అ నుంచి విసర్గ అంటే అః వరకు అచ్చులనీ, క నుంచి క్ష వరకు హల్లులని అంటారు. అచ్చులు శక్తి స్వరూపాలు హల్లులు శివస్వరూపాలు. అచ్చు స్వతంత్రత గలవి. హల్లులు స్వతంత్రత లేనివి. అంటే హల్లులు అచ్చులతో కలిస్తే ఒకరూపాన్ని సంతరించుకుంటాయి. హల్లులను విడిగా పలకలేము. అవి అచ్చులతో కలిస్తేనే పలకబడతాయి.

ఈ రకంగా ఉన్న అక్షరాలను మూడు భాగాలుగా విభజించటం జరిగింది.

1. అ నుంచి అః వరకు 16 అక్షరాలు మొదటి భాగము.

2. క నుంచి త వరకు 16 అక్షరాలు రెండవ భాగము.

3. థ నుంచి స వరకు 16 అక్షరాలు మూడవ భాగము.

వీటిలో హ ళ క్షలను వదలివేశారు. ఎందుకంటే హకారము ఆకాశ తత్త్వాత్మకము. సర్వత్రావ్యాపించి ఉంటుంది. ఇక ళ కారము. 'లళ యోరబేధః' లళలకు బేధం లేదు. ఈ రెండూ ఒక్కటే. గతంలో లకారాన్ని మూడవ భాగంలో చెప్పుకున్నాం. అందుచేత ళకారాన్ని వదలివెయ్యటం జరిగింది. ఇక క్షకారము సంస్కృతభాషలో లేదు. కాని శబరవర్మ వ్రాసిన **'శాబర తంత్రం'**లో క్షకారమున్నది. అంటే మంత్ర శాస్త్రంలో క్ష కారం ఉన్నదన్న మాట. ఇది క షల మిశ్రమము. అందుచేత క్షకారాన్ని కూడా వదలివేయుట జరిగింది. ఇప్పుడు హ ళ క్షలను వదలివేయగా అ నుంచి స వరకు 48 అక్షరాలే ఉంటాయి. వాటిని పైనచెప్పినట్లుగా ఒక్కొక్క భాగానికీ పదహారు అక్షరాల చొప్పున మూడుభాగాలుగా చేసి, వాటిలో సత్వరజస్తమోగుణాలు, త్రిమూర్తుల తత్త్వాలు అనగా సృష్టిస్థితిలయాలు, చంద్ర సూర్యాగ్నుల తత్త్వాలు, అవస్థాత్రయము, జాగ్రత్ స్వప్న సుషుప్తుల తత్త్వాలు చేర్చబడ్డాయి. వీటిలో షోడశ నిత్యలను కూడా చేర్చటం జరిగింది. ఎవరీ షోడశ నిత్యలు ? వీరిని గురించి **వశిష్ఠ సంహితలో** చెప్పటం జరిగింది.



**శృణుదేవి ప్రవక్ష్యామి నిత్యాషోడశకం తవ ।**
**నకస్య చిన్మయాఽఽఖ్యాతం సర్వతంత్రేషు గోపితం ॥**

**తత్రాదౌ ప్రథమానిత్యా మహాత్రిపురసుందరీ ।**
**తతః కామేశ్వరీనిత్యా నిత్యా చ భగమాలినీ ॥**

**నిత్యక్లిన్నా తథాచైవ భేరుండా వహ్నివాసినీ ।**
**మహావజ్రేశ్వరీ రౌద్రీ త్వరితా కులసుందరీ ॥**

**నిత్యా నీలపతాకా చ విజయా సర్వమంగళా ।**
**జ్వాలామాలిని చిద్రూపాః ఏతా నిత్యాస్తు షోడశః ॥**

ఈ షోడశ నిత్యలను గురించి **వామకేశ్వరతంత్రం**లోని ఖడ్గమాలలో కూడా చెప్పటం జరిగింది.

**కామేశ్వరీ, భగమాలినీ, నిత్యక్లిన్నే, భేరుండే, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి, శివదూతి, త్వరితే, కులసుందరి, నిత్యే, నీలపతాకే, విజయే సర్వమంగళే, జ్వాలామాలిని, చిత్రే మహానిత్యే** అని ఈ నిత్యలు వరుసగా

1. మహాత్రిపురసుందరి, 2. కామేశ్వరి, 3. భగమాలిని, 4. నిత్యక్లిన్న, 5. భేరుండ, 6. వహ్నివాసిని, 7. మహావజ్రేశ్వరి, 8. శివదూతి (రౌద్రి), 9. త్వరిత, 10. కులసుందరి, 11. నిత్యా, 12. నీలపతాక, 13. విజయ, 14. సర్వమంగళ, 15. జ్వాలామాలినీ, 16. చిద్రూప (చిత్ర)

వీటిలో పదహారవనిత్య మహాత్రిపురసుందరి. ఈ నిత్యను వశిష్ఠసంహితలో మొదట చెప్పగా, ఖడ్గమాలలో ఆఖరున చెప్పటం జరిగింది. శివదూతి అన్నా రౌద్రి అన్నా ఒక్కటే. అలాగే చిద్రూపా నిత్యనే ఖడ్గమాలలో చిత్ర అని చెప్పటం జరిగింది. ఈ షోడశనిత్యలు శుక్లపక్షపాద్యమి మొదలు పౌర్ణమి వరకు, కృష్ణపక్షపాద్యమి మొదలు అమావాస్య వరకు తిథులరూపంలో ఉన్నారు. వీరికే చంద్రకళలు అని పేరు. చంద్రకళలే పాద్యమి మొదలైన తిథులు అని **జ్యోతిశ్శాస్త్రం**లో చెప్పబడింది.

**ప్రతిపన్నామ విజ్ఞేయా చంద్రస్య ప్రథమాకలా**
**ద్వితీయాద్యా ద్వితీయాద్యాః పక్షయో శుక్లకృష్ణయో**

పాడ్యమి నుంచి అమావాస్య లేక పౌర్ణమి వరకు తిథులు పదిహేను. ఇవి రెండు భాగాలుగా శుక్లపక్షము, కృష్ణపక్షములందు ఉన్నాయి. అంటే ప్రతిమాసంలోనూ శుక్లపక్షంలో ఒకసారి, కృష్ణపక్షంలో ఒకసారి రెండు ఆ వృత్తులుగా ఉన్నాయి.

**దర్శాద్యాః పూర్ణిమాంతస్తు కలా పంచదశైవతు ।**
**షోడశీతు కలాజ్ఞేయా సచ్చిదానంద రూపిణీ ॥**

పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు కళలు పదిహేను. కాగా పదహారవ కళ సచ్చిదానందరూపిణి అయిన ఆ పరమేశ్వరి అయి ఉన్నది. అందుకే ఖడ్గమాలలో నిత్యాదేవతలను చెబుతూ చివరగా **"మహానిత్యే పరమేశ్వర పరమేశ్వరీ"** అన్నారు. మహానిత్య అంటే సాక్షాత్తు ఆ పరమేశ్వరియే అని దీని అర్థం. అయితే చంద్రకళలే నిత్యాదేవతలు. అంటే కళలు నిత్యాస్వరూపాలు. నిత్యలు తిథిస్వరూపాలు. చంద్రకళలు పదహారు. అవి 1. అమృత, 2. మానదా, 3. పూషా, 4. తుష్టి, 5. పుష్టి, 6. రతి, 7. ధృతి, 8. శశినీ, 9. చంద్రికా, 10. కాంతి, 11. జ్యోత్స్నా, 12. శ్రీ, 13. ప్రీతి, 14. అంగదా, 15. పూర్ణా, 16. పూర్ణామృతా.

పాడ్యమి దగ్గర నుండి పూర్ణిమ లేక అమావాస్యదాకా తిథులు పదిహేను. కృష్ణపక్షంలోను, శుక్లపక్షంలోను వీటి పేర్లు విడివిడిగా ఉంటాయి. అలాగే రాత్రిపూట, పగలుపూట తిథులపేర్లు విడివిడిగా ఉంటాయి. **తైత్తిరీయ బ్రాహ్మణం**లో ఈ తిథుల వివరాలను ఇవ్వటం జరిగింది. శుక్లపక్ష పగటి తిథులు వరుసగా ...

**సంజ్ఞానం విజ్ఞానం ప్రజ్ఞానం జానదభిజానత్**
**సంకల్పమానం ప్రకల్పమానం ఉపకల్పమానముపక్లప్తం**
**క్లప్తం శ్రేయోవశీయ ఆయస్సంభూతం భూతం ॥**

1. సంజ్ఞానము, 2. విజ్ఞానము, 3. ప్రజ్ఞానము, 4. జానతు, 5. అభిజానత్తు, 6. సంకల్పమానం, 7. ప్రకల్పమానం, 8. ఉపకల్పమానం, 9. ఉపక్లప్తం, 10. క్లప్తం, 11. శ్రేయం, 12. వశీయం, 13. ఆయత్, 14. సంభూతం, 15. భూతం

**దర్శా దృష్టా దర్శితా విశ్వరూపా సుదర్శనా**
**ఆప్యాయమానా ప్యాయమానా ప్యాయా సునృతా ఇరా**
**అపూర్వమాణా పూర్వమాణా పూరయంతీ పూర్ణా పూర్ణమాసి**



1. దర్శ, 2. దృష్టా, 3. దర్శితా, 4. విశ్వరూపా, 5. సుదర్శనా, 6. ఆప్యాయమానా, 7. ఆప్యాయమానా, 8. ఆప్యాయా, 9. సూనృతా, 10. ఇరా, 11. అపూర్వమాణా, 12. పూర్వమాణా, 13. పూరయంతీ, 14. పూర్ణా, 15. పూర్ణమాసీ. అదే విధంగా కృష్ణపక్షంలో పగటి తిథులు ....

**ప్రస్తుతం విష్టుతగ్ం సంస్తుతం కల్యాణం విశ్వరూపం**
**శుక్రం అమృతం తేజస్వి తేజః సమిద్ధం**
**అరుణం భానుమతు మరీచీ అభిసత్తు తపస్వితు ॥**

1. ప్రస్తుతం, 2. విష్టుతగ్ం, 3. సంస్తుతం, 4. కల్యాణం, 5. విశ్వరూపం, 6. శుక్రం, 7. అమృతం, 8. తేజస్వి, 9. తేజః, 10. సమిద్ధం, 11. అరుణం, 12. భానుమతు, 13. మరీచి, 14. అభిసత్తు, 15. తపస్వితు

కృష్ణపక్ష రాత్రి తిథులు ...

**సుతా సున్వతీ ప్రసుతా సూయమానా అభిసూయమానా**
**ప్రీతీ ప్రసా సంసా తృప్తి తర్పయంతీ**
**కాంతా కామ్యా కామజాతా ఆయుష్మతి కామధుఘా ॥**

1. సుతా, 2. సున్వతీ, 3. ప్రసుతా, 4. సూయమానా, 5. అభిసూయమానా, 6. ప్రీతీ, 7. ప్రసా, 8. సంసా, 9. తృప్తి, 10. తర్పయంతీ, 11. కాంతా, 12. కామ్యా, 13. కామజాతా, 14. ఆయుష్మతీ, 15. కామధుఘా.

ఈ విధంగా ఉన్న తిథులే నిత్యాస్వరూపాలు. నిత్యలు కళాస్వరూపాలు. ఇవన్నీ పంచదశీమహామంత్రంలో మూడు ఖండాలుగా ఉన్నాయి.

ఇక యోగినులు తొమ్మిది మంది. వారు 1. ప్రకటయోగిని, 2. గుప్తయోగిని, 3. గుప్తతరయోగిని, 4. సంప్రదాయయోగిని, 5. కులోత్తీర్ణయోగిని, 6. నిగర్భయోగిని, 7. రహస్యయోగిని, 8. అతిరహస్యయోగిని, 9. పరాపరరహస్యయోగిని.

ఈ యోగినులను కూడా ఇందాక చెప్పిన మూడుఖండాలలో చేర్చటం జరిగింది. ఇప్పుడు,

1. శివ, శక్తి, మాయ, శుద్ధవిద్య, జలము. అనే ఐదుతత్త్వాలకు సంబంధించినది మొదటిఖండము. ఇది అగ్నిఖండము.



Varivasya 01 (Final) 8-5-08 18

2. తేజస్సు, వాయువు, మనస్సు, పృథివి,ఆకాశము అనే ఐదుతత్త్వాలకు సంబంధించినది రెండవ ఖండము. ఇది సూర్యఖండము.

3. విద్య, మహేశ్వరి, పర, ఆత్మ, సదాశివ అనే ఐదుతత్త్వాలకు సంబంధించినది మూడవ ఖండము. ఇది సోమఖండము.

ఈ రకంగా పంచదశీమహామంత్రము సోమసూర్యానలాత్మకము అంటే అగ్నిఖండము, సూర్యఖండము, చంద్రఖండము అని మూడు భాగాలుగా ఉన్నది. ఈ మూడుఖండాలను మూడు హ్రీంకారాలు కలుపుతున్నాయి.

అన్ని కళలకు, ఖండాలకు అధిదేవత కామేశ్వరుడు. కాగా అధిష్ఠాత్రి కామేశ్వరి. ఈ రకంగా పంచదశీమహామంత్రంలోని బీజక్షరాలు చెప్పబడ్డాయి.

మొదటిది అగ్నిఖండం. ఇందులో **శివశక్తి కామక్షితిః** శివుడు, శక్తి, కాముడు, క్షితి అనే దేవతలకు సంబంధించిన **క ఏ ఈ ల** అనే నాలుగు బీజాక్షరాలు ఉన్నాయి.

రెండవది సూర్యఖండం. ఇందులో **రవి, శ్శీతకిరణ స్మరో హంస శ్శక్ర** అనే దేవతలకు సంబంధించిన **హ స క హ ల** అనే ఐదు బీజాక్షరాలు ఉన్నాయి.

మూడవది చంద్రఖండం. ఇందులో **పరా మార హరయః** అనే దేవతలకు సంబంధించిన **స క ల** అనే మూడు బీజాక్షరాలు ఉన్నాయి. ప్రతిఖండము తరువాత ప్రాణశక్తి అయిన హ్రీంకారము ఉన్నది. అంటే మొదటి ఖండంలో నాలుగు, రెండవ ఖండంలో ఐదు, మూడవ ఖండంలో మూడు వెరసి పన్నెండు బీజాలు కాగా ప్రతిఖండము చివర ఒక హ్రీంకారము. ఈ రకంగా మూడు ఖండాలకు మూడు హ్రీంకారాలు. వెరసి పంచదశీమహామంత్రానికి పదిహేను బీజాక్షరాలున్నాయి. ఇదే విషయాన్ని గౌడపాదులవారు తమ **సుభగోదయస్తుతి**లోని 19వ శ్లోకంలో చెప్పారు.

**స్మరో మారో మారః స్మర ఇతి పరో మార మదనః**
**స్మరానంగశ్చేతి స్మరమదన మారాః స్మరయితి**
**త్రిఖండః ఖండాంతే కలిత భువనేశ్యక్షరయుత**
**శ్చతుః పంచార్ణాస్తే త్రయ ఇతి చ పంచాక్షరమనుః ॥**

స్మర – కకార బీజం, మారో – ఏకార బీజం, మారః – ఈకార బీజం, స్మర – లకార బీజం. ఇది ప్రథమ ఖండం. అగ్నిఖండం.



పర–హకార బీజం, మార–సకార బీజం, మదన – కకార బీజం, స్మరానంగములు – హకార లకారములు. ఇది రెండవ ఖండం. సూర్యఖండం.

స్మరమదన – సకార బీజము, మార – కకార బీజం, స్మర – లకార బీజం, ఇది మూడవ ఖండము. చంద్రఖండము. ఈ మూడుఖండముల చివర భువనేశ్వరీ బీజమయిన హ్రీంకారమున్నది. ఇప్పుడు

**క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ॥**

అనేది పదిహేను అక్షరాలు గల మంత్రము. ఇదే పంచదశీమహామంత్రము. శ్రీవిద్యకు గాయత్రి వంటిది.

ఇప్పుడు ఈ మంత్రాన్ని భాస్కరరాయలవారు వివరిస్తున్నారు చూడండి.

క్రోధీశ (క్) శ్రీకంఠ (అ) వెరసి 'క' కారమవుతున్నది. కోణత్రయ (ఏ) లక్ష్మీ (ఈ) అనుత్తర రూధం (ల) ఈ మొత్తం కలిసి **క ఏ ఈ ల** అవుతోంది. ఇది ప్రథమకూటమి. అదే వాగ్భవకూటమి.

శివ (హ) హంస (స) బ్రహ్మ (క) వియత్ (హ) శక్ర (ల) ఈ మొత్తం కలిసి **హ స క హ ల** అవుతోంది. ఇది ద్వితీయకూటమి, అదే కామరాజకూటమి.

రెండవ కూటమిలో శివ(హ), వియత్ (హ) అంటే రెండు హకారాలను తీసివేస్తే మిగిలేది సకల. ఇదే మూడవ కూటమి, శక్తికూటమి.

ఈ రకంగా **క ఏ ఈ ల** వాగ్భవకూటమి. ఇందులో నాలుగు బీజాలున్నాయి.

**హ స క హ ల** కామరాజకూటమి. ఇందులో ఐదు బీజాలున్నాయి.

**స క ల** శక్తికూటమి. ఇందులో మూడు బీజాలున్నాయి.

ఈ మూడు కూటములయందు మొత్తం పన్నెండు బీజాలున్నాయి. వీటిలో ప్రతికూటమి చివర హ్రీంకారాన్ని చేర్చాలి. అంటే మూడు కూటములకు మూడు హ్రీంకారాలు ఉండాలి. ఇప్పుడు

**క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ।** అనేది పదిహేను అక్షరాలు కలిగిన మంత్రం. ఇదే **పంచదశీ మహామంత్రము.**

## హృల్లేఖాస్వరూప నిరూపణ

**హృల్లేఖయాః స్వరూపం తు వ్యోమాగ్ని ర్వామలోచనా ।**
**బింద్వర్థ చంద్రరోధిన్యో నాదనాదాంత శక్తయః ॥** 13

**వ్యాపికా సమనోన్మన్య ఇతి ద్వాదశ సంహతిః ।**
**బింద్వాదీనాం నవానాంతు సమష్టి ర్నాద ఉచ్యతే ॥** 14

'హృల్లేఖ' అంటే హ్రీంకారము అని అర్థం. హ్రీంకారంలో హకార, రకార, ఈకారాలున్నాయి. అంటే హ్, ర్, ఈ అనే మూడు అక్షరాలున్నాయి. ఆ తరువాత బిందువు, అర్ధచంద్రము, రోదిని, నాదము, నాదాంతము, శక్తి, వ్యాపిక, సుమన, ఉన్మన అనే తొమ్మిది అక్షరాలున్నాయి. ఈ రకంగా హ్రీంకారంలో మొత్తం పన్నెండు అక్షరాలున్నాయి. బిందువు నుంచి ఉన్మని వరకు ఉన్న తొమ్మిదింటినీ కలిపి నాదము అంటారు. అర్ధచంద్రము దగ్గర నుంచి ఉన్మని వరకు ఉన్న వాటిని సూక్ష్మనాదము అంటారు. ఈ సూక్ష్మనాదం మకారముయొక్క ప్రకంపనలను పైపైకి తీసుకుపోతుంది. ఇక్కడ వ్యోమ(హ్) అగ్ని(ర్). ఈ రెండూ కేవలం హల్లులు. వాటిమీద 'అ'కారం లేదు. వామలోచన (ఈ) ఆ తరువాత బిందువు దగ్గరనుంచి ఉన్నవి. సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమ ధ్వని విశేషాలు. ఇవి మిగిలిన అక్షరాలలాగా స్పష్టంగా పలకటానికి వీలైనవి కావు. వీణ మొదలైన తంత్రీనాదాలలాగా వినబడతాయి.

**ప్రథమేఽష్టాదశవర్ణా ద్వావింశత్యక్షరాణి మధ్యేస్యుః ।**
**ప్రథమేవ తుల్యమంత్యం సంఘాతే నాష్ట పంచాశత్ ॥** 15

అసలు పంచదశీ మహామంత్రంలో ఎన్ని అక్షరాలున్నాయి. అంటే ఇందులోని ప్రతి హల్లులోను రెండు అక్షరాల చొప్పున ఉంటాయి. ఉదాహరణకు క్+అ = క, ల్+అ = ల, హ్+అ = హ, స్ + అ = స కాగా హ్రీంకారంలో పన్నెండు అక్షరాలు. ఈ విధంగా లెక్క పెట్టినట్లైతే ప్రథమ కూటమిలో క-2 అక్షరాలు, ఏ-1, ఈ-1, ల-2, హ్రీం-12, మొత్తం 18 అక్షరాలు. ద్వితీయ కూటమిలో హ-2, స-2, క-2, హ-2, ల-2, హ్రీం-12, మొత్తం 22 అక్షరాలు. తృతీయ కూటమిలో స-2, క-2, ల-2, హ్రీం-12, మొత్తం 18 అక్షరాలు.



ఈ రకంగా చూసినట్లైతే 18+22+18 = 58 పంచదశీ మహామంత్రంలో మొత్తం 58 అక్షరాలున్నాయి. అయితే నిజంగా ఉండేవి తొమ్మిది అక్షరాలే.

**భూమిశ్చంద్ర శ్శివో మాయాశక్తిః కృష్ణాధ్య మాదనౌ ।**
**అర్ధచంద్రశ్చ బిందుశ్చ నవార్ణో మేరురుచ్యతే ॥**

1. భూమి-ల, 2. చంద్ర-స, 3. శివ-హ, 4. మాయ - ఈ, 5. శక్తి - ఏ, 6. కృష్ణాధ్య - రేఫ, 7. మాదన - క, 8. అర్ధచంద్ర - నాదము, 9. బిందువు.

ఒకసారి లెక్కపెట్టిన అక్షరాన్ని మళ్ళీ లెక్కలోకి తీసుకోకుండా ఉంటే వచ్చే అక్షరాలు తొమ్మిది.

## మంత్ర వర్ణకాలనిరూపణము

**మాత్రాద్వితయోచ్చార్యా కామలకా చ త్రికోణా చ ।**
**బిందురహిత హృల్లేఖా మాత్రాకాల త్రయోచ్చార్యా ॥** 16

**అన్యేషాం వర్ణానాం మాత్రాకాలో ఽర్ధ మాత్రయా సహితః ।**
**బిందోరర్థం మాత్రా పరేపరే చాపి పూర్వపూర్వార్ధాః ॥** 17

ఈ శ్లోకాలలో అక్షరాలను పలికే విధానము, ఎంత కాలంలో పలకాలి ? అనే విషయాలను వివరిస్తున్నారు. వేదంలో కూడా అక్షరాలను ఎలా పలకాలి ? అనే విషయాన్ని తైత్తిరీయోపనిషత్తులోని శిక్షావల్లిలోని రెండవ అనువాకంలో వివరించారు. వేదానికి నాలుగురకాల స్వరాలున్నాయి. అవి 1. అనుదాత్తము - క్రిందికి నొక్కి చెప్పటం, 2. ఉదాత్తము - సమానస్థాయిలో పలకటం, 3. స్వరితము - పైస్థాయిలో పలకటం, 4. దీర్ఘస్వరితము - పై స్థాయిలో దీర్ఘముగా పలకటం. అనిచెప్పి, ఇక అక్షరం పలకటానికి పట్టే కాలాన్ని వివరించారు. దీన్ని 'మాత్ర' అంటారు. మాత్ర అంటే కాలపరిమాణము అని అర్థం. ఒక అక్షరం పలకటానికి ఎంతకాలం పడుతుందో నిర్ణయించటమన్న మాట. మాత్ర అంటే 1/6వంతు సెకను కాలము అని నిర్ణయించబడింది. ఇవి మూడు రకాలుగా లెక్క పెట్టబడ్డాయి.

1. హ్రస్వము - మాత్రాకాలము అ, ఇ, ఉ మొదలైన అక్షరాలకు ఉచ్చారణ కాలము.

2. దీర్ఘము – రెండు మాత్రల కాలము.

3. ప్లుతము – మూడు మాత్రల కాలము.

ఇక్కడ కాలపరిమాణాన్ని లెక్క కట్టటానికి భాస్కరరాయలవారు ఇంకా లోతుకు వెళ్ళారు. మాత్రా కాలాన్ని అతి చిన్నభాగాలుగా చేశారు. అంటే 256 భాగాలుగా చేశారన్నమాట. ఒక్కొక్క భాగానికి 'లవము' అని పేరు పెట్టారు. 'లవము' అంటే కోత, కొడవలితో కోయటము అని అర్థం. "యోగినీ హృదయం"లో

**నళినీపత్ర సంహత్యాః సూక్ష్మ సూచ్యభివేదనే**
**దళేదళేతుయః కాలః సకాలో లవసంజ్ఞితః**
**అతిసూక్ష్మతమః కాలేనోపలభ్యోభ్యగూద్వహా ॥**

తామరపూవుల రేకులను ఒక కట్టగా, దొంతరగా, పెట్టి, సూదితో గ్రుచ్చినట్లైతే, ఒక్కొక్క దళంలోను ఆ సూది గ్రుచ్చుడు పడటానికి ఎంతకాలం పడుతుందో, దాన్ని 'లవము' అంటారు. ఇంతకన్న తక్కువ కాలాన్ని లెక్కపెట్టటం లేదా పరిశీలించటం జరగదు. ఇంత తక్కువ కాలప్రమాణాన్ని లవము అని లెక్క పెట్టారు భాస్కరరాయలవారు. ఇలాంటివి 256 లవములు కలిస్తే ఒక మాత్ర అన్నారు. దీని ప్రకారం **బిందోరర్ధం మాత్రా పరే పరే చాపి పూర్వ పూర్ధాః**

| | | |
|---|---|---|
| బిందువు | – | అర్ధమాత్ర (128 లవములు) |
| అర్ధచంద్రము | – | 64 లవములు |
| రోదిని | – | 32 లవములు |
| నాదము | – | 16 లవములు |
| నాదాంతము | – | 8 లవములు |
| శక్తి | – | 4 లవములు |
| వ్యాపిక | – | 2 లవములు |
| సుమన | – | 1 లవము |
| ఉన్మన | – | కాలపరిమాణము లేదు. |

కాని చక్రసంకేతం ప్రకారము మాత్రలో 512వ భాగము నిర్ణయించబడింది. ఈ మొత్తం కలిపితే 255 లవములు అవుతుంది. అనగా ఒక లవము తక్కువగా మాత్ర అన్న మాట.



**ఏకమాత్రో భవేద్రస్వో ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే ।**
**త్రిమాత్రస్తుప్లుతోజ్ఞేయో వ్యంజనం త్వర్ధమాత్రకం ॥**

ఈ రకంగా చూసినట్లైతే హ్రస్వానికి ఒక మాత్ర, దీర్ఘాక్షరానికి రెండు మాత్రలు, ప్లుతానికి మూడు మాత్రలు, పొల్లు అక్షరమునకు (హల్లు, వ్యంజనము) అర్ధమాత్ర, బిందువుకు – అర్ధ మాత్ర, అని కాలనిర్ణయం చేశారు.

దీని ప్రకారం కాలనిర్ణయం చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. ఉదాహరణకు 'క' అనే అక్షరం తీసుకోండి. ఇందులో 'క్' అనేది హల్లు, దానికి 'అ'కారం కలిసి 'క' అవుతుంది. దీనికి పట్టే కాలము గనక చూసినట్లైతే క్ – అర్ధమాత్ర, అ– ఒకమాత్ర వెరసి 1 1/2 మాత్రలు. ఈ రకంగా లెక్కపెట్టాలి. దీర్ఘానికి అంటే, ఏ, ఈ రెండు మాత్రలు. మరి హ్రీం కారానికి ఎంతకాలము ? అనే నిర్ణయం అతిజాగ్రత్తగా చూడాలి. ఇందులో

హ్ – అర్ధమాత్ర, ర్ – అర్ధమాత్ర, ఈ – రెండు మాత్రలు. ఇవి కాకుండా బిందువునుంచి ఉన్మనదాకా 255 లవములు, మొత్తంమీద హ్రీంకారాన్ని ఉచ్చరించటానికి మూడుమాత్రలు, 255 లవములు పడుతుంది. అంటే ఒక లవము తక్కువగా నాలుగు మాత్రలన్నమాట. ఈ రకంగా అక్షరాలకు కాలనిర్ణయం చేశారు భాస్కరరాయలవారు.

**సంహత్యై కలవోనో మాత్రా కాలోఽస్య నాదస్య ।**
**ఏకాదశ వాక్కూటే సార్ధా ఏకాదశో దితా మధ్యే ॥** 18
**సార్ధా అష్టౌ శక్తా వేకైక లవోనితా మాత్రాః ।**
**సంహత్యైక త్రింశన్మాత్రా మంత్రే లవత్రయన్యూనాః ॥** 19

ఈ రకంగా చెప్పినట్లైతే అసలు పంచదశీమహామంత్రం ఉచ్చరించటానికి ఎంత సమయంపడుతుంది ? ఈ మంత్రం మొత్తం మూడుభాగాలు లేదా మూడు కూటములుగా ఉన్నది. ఇప్పుడు విడివిడిగా ఒక్కొక్క కూటమిని ఉచ్చరించటానికి పట్టే కాలం చూద్దాం. ముందుగా వాగ్భవకూటమి. ఇందులో ఐదు అక్షరాలున్నాయి. **క ఏ ఈ ల హ్రీం.** వీటిలో

| | | |
|---|---|---|
| క (క్+అ) | – | 1 1/2 మాత్ర |
| ఏ (దీర్ఘము) | – | 2 మాత్రలు |

ఈ (దీర్ఘము) - 2 మాత్రలు
ల (ల్+అ) - 1 1/2 మాత్ర

హ్రీం - ఒక లవము తక్కువగా నాలుగు మాత్రలు. లేదా 3 మాత్రల 255 లవములు. మొత్తం లెక్కపెట్టినట్లైతే మొదటిదైన వాగ్భవకూటమి ఉచ్చారణ కాలము ఒక లవము తక్కువగా 11 మాత్రలు.

కామరాజకూటమి. ఇందులో ఆరు అక్షరాలున్నాయి. **హ స క హ ల హ్రీం** వీటిలో

హ (హ్+అ) - 1 1/2 మాత్ర
స (స్+అ) - 1 1/2 మాత్ర
క (క్+అ) - 1 1/2 మాత్ర
హ (హ్+అ) - 1 1/2 మాత్ర
ల (ల్+అ) - 1 1/2 మాత్ర

హ్రీం - ఒక లవము తక్కువగా నాలుగు మాత్రలు వెరసి రెండవదైన కామరాజకూటమిని ఉచ్చరించటానికి పట్టే కాలము ఒక లవము తక్కువగా 11 1/2 మాత్రలు మూడవదైన శక్తికూటమి. ఇందులో నాలుగు అక్షరాలున్నాయి. **స క ల** హ్రీం వీటిలో

స (స్+అ) - 1 1/2 మాత్ర
క (క్+అ) - 1 1/2 మాత్ర
ల (క్+అ) - 1 1/2 మాత్ర

హ్రీం - ఒక లవము తక్కువగా నాలుగు మాత్రలు.

వెరసి మూడవదైన శక్తి కూటమిని ఉచ్చరించటానికి ఒక లవము తక్కువగా 8 1/2 మాత్రల సమయం పడుతుంది. ఈ రకంగా చూసినట్లైతే ...

వాగ్భవకూటమికి - ఒక లవము తక్కువగా 11 మాత్రలు
కామరాజకూటమికి - ఒక లవము తక్కువగా 11 1/2 మాత్రలు
శక్తికూటమికి - ఒక లవము తక్కువగా 8 1/2 మాత్రలు

మొత్తంమీద పంచదశీ మహామంత్రాన్ని ఉచ్చరించటానికి మూడు లవములు తక్కువగా 31 మాత్రల కాలం పడుతుంది.



## వర్ణోత్పత్తి స్థాన వివరణ

**కంఠేచ కంఠతాలుని తాలుని దంతేషు మూర్ధ్ని నాసాయామ్ ।**
**స్పృష్ట వివారాద్యాంతర బాహ్యైర్యత్న్యై స్తదక్షరోత్పత్తిః ॥** **20**

ఈ శ్లోకంలో అక్షరాలు ఏ రకంగా ఉత్పత్తి అవుతాయో వివరిస్తున్నారు. ఈ విషయం పూర్తిగా తెలియాలి అంటే మనభాషని, వ్యాకరణాన్ని ఒక్కసారి చూడాలి. భాషింపబడేది భాష. వ్యక్తులు పరస్పర అభిప్రాయాలు తెలుసుకోవటానికి ఉపయోగ పడేది భాష. సంస్కృతభాషకు అక్షరాలు 50. కాగా మంత్రశాస్త్రంలో భాషకు అక్షరాలు 51. ఇందులో 'క్ష'కారము ఉంటుంది. అదే తెలుగుభాషకు అక్షరాలు 56. ఇక్కడ మనకు కావలసినది సంస్కృతభాషకుగల అక్షరాలు. **మాతృకాహృదయము** అనే గ్రంథంలో ...

**కకారాది క్షకారాంతా వర్ణాస్తే శివరూపిణః ।**
**సమస్త వ్యస్తరూపేణ షట్త్రింశత్ తత్త్వ విగ్రహా ॥**
**అకారాది విసర్గాంతాః స్వరాషోడశ శక్తయః ।**
**నిత్యాషోడశకాత్మనః పరస్పర మమీయతా ॥**
**శివశక్తి మయావర్ణా శబ్దార్థ ప్రతిపాదకా ।**
**శివస్వరః పరాధీనో నస్వతంత్రః పదాప్ససౌః ॥**
**స్వరాః స్వతంత్రా జాయంతే నశివస్తు కథాచన ।**

అని చెప్పారు. వీటిలో అ నుంచి విసర్గ అంటే అః వరకు అచ్చులనీ, క నుంచి క్ష వరకు హల్లులని అంటారు. అచ్చులు శక్తి స్వరూపాలు. హల్లులు శివస్వరూపాలు. అచ్చులు స్వతంత్రత గలవి. హల్లులు స్వతంత్రత లేనివి. అంటే హల్లులు అచ్చులతో కలిస్తే ఒకరూపాన్ని సంతరించుకుంటాయి. హల్లులను విడిగా పలకలేము. అవి అచ్చులతో కలిస్తేనే పలకబడతాయి.

దీనిని బట్టి అ నుంచి అః వరకు గలవి అచ్చులు. ఇవి 16. నాలుగు రకాలుగా ఉంటాయి.

1. **హ్రస్వములు :** కురచగా ఉండేవి. ఒక మాత్ర కాలంలోనే పలికేవి. అ, ఇ, ఉ, ఋ, ఌ, ఎ, ఒ

2. **దీర్ఘములు :** పొడవుగా ఉండేవి. రెండు మాత్రల కాలంలో పలికేవి. ఆ, ఈ, ఊ, ౠ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ

3. **వక్రములు :** వంకరగా వ్రాయబడేవి ఎ, ఏ, ఒ, ఓ

4. **వక్రతమములు :** మిక్కిలి వంకరగా వ్రాయబడేవి ఐ, ఔ

క నుంచి ళ వరకు గలవి హల్లులు. ఇవి మొత్తం 34. హల్లులు పొల్లుతో ఉండేవి. క్, గ్, మ్, ల్ మొదలైనవి. వీటినే వ్యంజనములు అని కూడా అంటారు. వీటిని విడిగా ఉచ్చరించటం కష్టమవుతుంది. ఈ హల్లులతో గనక మాట్లాడినట్లైతే ఆ భాష మనకి అర్థంకాదు. అందుచేత హల్లుకు అచ్చు కలిస్తేనే ఒక రూపం వచ్చి, భాష అర్థమవుతుంది. అచ్చుతో కలవని హల్లుకు స్పష్టమైన ఉచ్చారణ ఉండదు. పొల్లు హల్లులనే 'వ్యంజనములు' అంటారు. హల్లులను ఆరు రకాలుగా విభజించారు.

1. **పరుషములు** – కఠినముగా పలికేవి – క చ ట త ప
2. **సరళములు** – తేలికగా పలికేవి – గ జ డ ద
3. **స్థిరములు** – పరుష, సరళాలు కాక మిగిలిన హల్లులు
4. **అనునాసికములు** – ముక్కు సాయంతో పలికేవి ఙ, ఞ, ణ, న, మ
5. **అంతస్థములు** – అంగిలి సహాయంతో పలికేవి య, ర, ల, వ
6. **ఊష్మములు** – ఊది పలికేవి. శ, ష, స, హ

ఈ రకంగా ఉన్న అక్షరాలలో అచ్చులు శక్తి స్వరూపాలు, హల్లులు శివస్వరూపాలు. అచ్చులు స్వతంత్రత గలవి. అంటే అచ్చులను విడిగా పలకవచ్చు. హల్లులు స్వతంత్రత లేనివి. వీటిని విడిగా పలకలేము. ఈ హల్లులు అచ్చులతో కలిస్తేనే ఒకరూపాన్ని పొందుతాయి. ఇప్పుడు ఈ అక్షరాలు ఎక్కడ ఉత్పత్తి అవుతాయో చూద్దాం. ఉత్పత్తి అంటే పుట్టుక. ఏ అక్షరం ఎక్కడ పుట్టిందో తెలుసుకున్నందువల్ల ఉచ్చారణ సులభమవుతుంది. అక్షరాల ఉత్పత్తి స్థానాలు ఎనిమిది.

1. **కంఠ్యములు** – కంఠమునందు పుట్టినవి. అ, ఆ, క, ఖ, గ, ఘ, ఙ, హ.



2. **తాలవ్యములు** – దౌడలు ఉత్పత్తి స్థానాలుగా గలవి. ఇ, ఈ, చ, ఛ, జ, ఝ, ఞ, య, శ.

3. **మూర్ధన్యములు** – తల ఉత్పత్తి స్థానముగా గలవి. ఋ, ౠ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష.

4. **దంత్యములు** – దంతములసాయంతో పలికేవి. ఌ, త, థ, ద, ధ, న, ల, స.

5. **ఓష్ఠ్యములు** – పెదవులు ఉత్పత్తి స్థానములుగా గలవి. ౡ, ఉ, ఊ, ప, ఫ, బ, భ, మ.

6. **కంఠతాలవ్యములు** –కంఠము, దవుడలు ఉత్పత్తి స్థానముగా గలవి. ఎ, ఏ, ఐ.

7. **కంఠౌష్ఠములు** – కంఠము, పెదవులు ఉత్పత్తి స్థానములైనవి. ఒ, ఓ, ఔ.

8. **దంతౌష్ఠ్యములు** – దంతములు, పెదవులు ఉత్పత్తి స్థానములైనవి. వ.

ఇప్పుడు పంచదశీమహామంత్రంలోని అక్షరాలయొక్క ఉత్పత్తి స్థానాలను చూడండి.

1. మంత్రంలోని మూడు కకారాలు, ఐదు హకారాలు, కంఠమందు ఉత్పత్తి అవుతాయి.
2. ఏ – కంఠతాలవ్యము
3. ఈకారాలు నాలుగు – తాలవ్యములు
4. లకారములు 3, సకారములు 2 – దంత్యములు
5. రేఫలు మూడు – మూర్ధన్యములు
6. బిందువు నుంచి ఉన్మన వరకు గల తొమ్మిది – అనునాసికములు

ఇక ఈ అక్షరాలను ఏ విధంగా పలకాలి అంటే

కకారములు – స్పృష్టయత్నము
అకారము – సంవృతయత్నము
ఈ, ఏ కారములు – వివృతయత్నము

రేఫ, లకారములు – కొంచెము స్పృష్టయత్నము
హ, స కారములు – కొంచెము వివృతయత్నము
బింద్వాదినవకములు – సంవృతములు

ఇవన్నీ అంతర్యత్నాలు. ఇక,

కకారము – అల్పప్రాణవంతము
సకారము – మహాప్రాణవంతము
స్వరాలు – అనుదాత్తములు
రేఫ, లకారము – అల్పప్రాణవన్తాలు
హకారము – మహాప్రాణవంతము
బింద్వాదినవకము – మహాప్రాణవంతము

ఇక్కడ ఇంతకన్న వివరణ అవసరంలేదు. ఇంకా వివరణ గనక ఇస్తే ఇది వ్యాకరణ గ్రంథం అవుతుంది.

## వర్ణస్థితిరూప వివరణ

**ప్రళయాగ్నినిభం ప్రథమం మూలాధారా దనాహతం స్పృశతి ।**
**తస్మాదాజ్ఞాచక్రం ద్వితీయ కూటంతు కోటిసూర్యాభమ్ ॥** 21
**తస్మాల్లలాటమధ్యం తార్తీయం కోటిచంద్రాభమ్ ।**
**మాలామణి వద్వర్ణాః క్రమేణ భావ్యా ఉపర్యుపరి ॥** 22

ఈ శ్లోకాలలో మంత్రంలో ఉండే అక్షరాల స్థితి, వాటి రూపము వివరిస్తున్నారు. వీటిని తెలుసుకోవాలంటే ముందుగా శరీరంలో ఉండే షట్చక్రాలను గురించి తెలుసుకోవాలి. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్యలహరిలోని 9వ శ్లోకంలో

**మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం**
**స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశ ముపరి**
**మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్త్వా కులపథం**
**సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే ॥**



"ఓ తల్లీ ! భగవతీ ! నీవు మూలాధారంలో ఉన్న భూతత్త్వాన్ని, స్వాధిష్ఠాన చక్రంలోని అగ్నితత్త్వాన్ని, మణిపూరచక్రంలోని జలతత్త్వాన్ని, అనాహతచక్రంలోని వాయుతత్త్వాన్ని, విశుద్ధచక్రంలోని ఆకాశతత్త్వాన్ని, ఆజ్ఞాచక్రంలోని మనస్తత్త్వాన్ని, సుషుమ్నా మార్గం గుండా ఛేదించి, సహస్రారం చేరి, అక్కడ నీ భర్త అయిన సదాశివునితో కలిసి విహరిస్తుంటావు." అన్నారు. ఇక్కడ కుండలినీశక్తిని గురించి చెబుతున్నారు. ఆ శక్తి షట్చక్రాలను భేదించుకుని సహస్రారం చేరుతుంది అన్నారు.

లలితా సహస్రంలోని 96, 97, 98 నామాలలో **(అకులా, సమయాంతస్థా, సమయాచార తత్పరా)** సమయాచారాన్ని వివరించటం జరిగింది. ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీశక్తిని నిద్రలేపి, సహస్రారానికి చేర్చి, మళ్ళీ ఆశక్తిని ఆధారచక్రానికి చేర్చటమే సమయాచారము. శరీరంలో షట్చక్రాలున్నాయి. అవి

**మూలాధారం గుదస్థానం । స్వాధిష్ఠానం తు మేహనం**
**నాభిస్తు మణిపూరాఖ్యం । హృదయంచాబ్జ మనాహతం**
**తాలూమూలం విశుద్ధాఖ్యం । ఆజ్ఞాంచ నిటలాంబుజం ॥**
**తస్మాదూర్ధ్వమధోముఖం । వికసితం పద్మం సహస్రచ్ఛదం**
**నిత్యానందమయీ సదాశివపురీ । శక్తే నమశ్శాశ్వతం ॥**

మూలాధారచక్రము – గుదస్థానంలో ఉన్నది
స్వాధిష్ఠానచక్రము – లింగస్థానంలో ఉన్నది
మణిపూరచక్రము – నాభిస్థానంలో ఉన్నది
అనాహతచక్రము – హృదయస్థానంలో ఉన్నది
విశుద్ధిచక్రము – కంఠస్థానంలో ఉన్నది
ఆజ్ఞాచక్రము – భృకుటి స్థానంలో ఉన్నది
సహస్రదళపద్మము – వీటన్నింటికీ పైన ఉన్నది

ఈ చక్రాలలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క తత్త్వమున్నది.

1. ఆధారచక్రము – భూతత్త్వాత్మకమైనది
2. స్వాధిష్ఠానము – అగ్నితత్త్వాత్మకమైనది
3. మణిపూరము – జలతత్త్వాత్మకమైనది

4. అనాహతము - వాయుతత్త్వాత్మకమైనది
5. విశుద్ధిచక్రము - ఆకాశతత్త్వాత్మకమైనది
6. ఆజ్ఞాచక్రము - మనస్తత్త్వాత్మకమైనది

వీటన్నింటిపైన సహస్రదళపద్మమున్నది. అదే సహస్రారము. అక్కడ పరమేశ్వరి పరమశివునితో కలసి ఉంటుంది. ఈ చక్రాలకు విడివిడిగా దళాలుంటాయి. ఈ దళాలలో అక్షర సమామ్నాయముంటుంది.

| | **చక్రము** | **దళాలు** | **దళాల్లోని అక్షరాలు** |
|---|---|---|---|
| 1. | ఆధారచక్రము | 4 దళాలు | వ నుంచి స వరకు |
| 2. | స్వాధిష్ఠానము | 6 దళాలు | బ నుంచి ల వరకు |
| 3. | మణిపూరము | 10 దళాలు | డ నుంచి ఫ వరకు |
| 4. | అనాహతము | 12 దళాలు | క నుంచి ఠ వరకు |
| 5. | విశుద్ధిచక్రము | 16 దళాలు | అ నుంచి అః వరకు |
| 6. | ఆజ్ఞాచక్రము | 2 దళాలు | హ, క్ష |
| 7. | సహస్రారము | 1000 దళాలు | అన్ని అక్షరాలు |

షట్చక్రాలను గురించి చెప్పేటప్పుడు ముందు ఆధారచక్రం చెప్పకుండా విశుద్ధిచక్రం నుంచి ప్రారంభిస్తారు. ఇలా పైనుంచీ (సహస్రారం), క్రిందినుంచీ (ఆధార చక్రం) కాకుండా మధ్యలో విశుద్ధి నుంచి ఎందుకు ప్రారంభిస్తారు? అని అనుమానం వస్తుంది. దీనికి కారణము అకారాది క్షకారాంతము వర్ణాలు విశుద్ధిచక్రం నుంచే ప్రారంభమయి, ఆజ్ఞాచక్రంతో పూర్తవుతాయి. అందుచేత అదే క్రమంలో షట్చక్రాలను వివరించటం జరుగుతుంది. లలితా సహస్రంలో 469వ నామం దగ్గర నుంచి 542వ నామందాకా షట్చక్రాలను, వాటిలో ఉండే దేవతలను వివరించటం జరిగింది.

మానవశరీరంలో బ్రహ్మనాడి (సుషుమ్నానాడి)కి రెండువైపులా ఆధారచక్రం నుంచి ముక్కురంధ్రం దాకా ఇడా, పింగళా, నాడులు వ్యాపించి ఉంటాయి. వీటిలో ఎడమవైపు ఉండేది ఇడానాడి. ఇది చంద్రనాడి. పితృయానము, కుడివైపు ఉండేది పింగళానాడి. ఇది సూర్యనాడి. దేవయానము. ఈ నాడులలో సూర్యచంద్రులు ఉచ్ఛ్వాసనిశ్వాసల రూపంలో తిరుగుతుంటారు. ముందుగా చంద్రుడు తన కిరణాల



ద్వారా అమృతాన్ని ప్రసరింపచేస్తూ వెడుతుంటాడు. ఆ వెనుక వచ్చే సూర్యుడు ఆ అమృతపుబిందువులను హరించి వేస్తుంటాడు. ఈ రకంగా వీరిద్దరూ తిరుగుతూ ఆధారచక్రంలో కలుస్తారు. చంద్రసూర్యులు కలిసిన రోజు అమావాస్య. అంటే వారు ఆధారచక్రంలోకి వచ్చిన రోజు అమావాస్య. ఆ రోజు సమయాచారంలో కుండలినికి అర్చన ఉండదు. కాని కౌళులు మాత్రం ఆ రోజున విశేషఅర్చన చేస్తారు. సూర్యచంద్రులు ఆధారచక్రంలో కలిసిన రోజు అమావాస్య కాబట్టే ఆధార స్వాధిష్ఠానాలు అంధకారబంధురాలు అనబడతాయి.

చంద్రునికిరణాలనుండి జాలువారే అమృతపుబిందువులను ఆహారంగా తీసుకుని కుండలినీశక్తి సుఖంగా నిద్రిస్తూ ఉంటుంది. ఇప్పుడు దాన్ని జాగృతం చెయ్యాలి. ఎప్పుడైతే దానికి ఆహారం దొరకదో అప్పుడు ఆ శక్తి జాగృతమవుతుంది. అంటే చంద్రకిరణాలనుంచి అమృతపుబిందువులు జాలువారకూడదన్న మాట. అలా జరగాలంటే సూర్యచంద్రుల గమనం ఆగిపోవాలి. అంటే ఉచ్ఛ్వాసనిశ్వాసలను బంధించాలి. సాధకుడు ఎప్పుడైతే శ్వాసను బంధించాడో, అప్పుడు చంద్రగమనం ఆగిపోతుంది. దాంతో చంద్రకిరణాల నుండి అమృతపు జల్లులు జాలువారవు. కుండలినీ శక్తికి ఆహారం దొరకదు. నిరాహార అయిన కుండలిని జాగృతమై బుసలు కొడుతూ ఊర్ధ్వముఖంగా ప్రయాణంచేసి, సహస్రారం చేరుతుంది.

మూలాధారచక్రంలో కుండలినీశక్తి నిద్రావస్థలో ఉంటుంది. ఇక్కడ నుంచే సుషుమ్నానాడి బయలుదేరుతుంది. కుండలినీశక్తి నిద్రావస్థలో ఉన్నంతవరకు సిరిసంపదలు, భోగభాగ్యాలు, భార్యాపిల్లలు ఇదే నిత్యము అనిపిస్తుంది. కనిపించని పరబ్రహ్మ కోసం ప్రాకులాడటం అనవసరమనిపిస్తుంది. ఆ కుండలినీశక్తి మేల్కొనగానే మాయ తొలగిపోతుంది. నేను, నాది అనే భ్రాంతి నశిస్తుంది.

షట్చక్రాలలో రెండుచక్రాల తరువాత ఒక గ్రంథి ఉంటుంది.

ఆధార, స్వాధిష్ఠానాల తరువాత - బ్రహ్మగ్రంథి
మణిపూర, అనాహతాల తరువాత - విష్ణుగ్రంథి
విశుద్ధి, ఆజ్ఞాచక్రాల తరువాత - రుద్రగ్రంథి

ఉంటాయి. వీటినే గ్రంథిత్రయము అంటారు. శ్రీచక్రంలోని మూడు వృత్తాలు, పంచదశీ మహామంత్రంలోని మూడు హ్రీంకారాలు ఈ గ్రంథులతో పోల్చబడ్డాయి. 'గ్రంథి' అంటే చిక్కుముడి, కణుపు, అవయవ సంధి అని అర్థం. చిక్కుముడిగా

ఉండి విడదీయటానికి వీలుకాని స్థితిని గ్రంథి అంటారు. జాగృతమైన కుండలినీ శక్తి సుషుమ్నద్వారా బయలుదేరి ఆధారస్వాధిష్ఠానాలు దాటిన తరువాత బ్రహ్మగ్రంథిని చేరుతుంది. బ్రహ్మ అంటే సంకల్పము, సృష్టి, ప్రపంచ వ్యవహారానికి మూలమైన విషయాలు. ఇవన్నీ ఇక్కడ చిక్కుముడిగా పడి ఉంటాయి. మానవుడు నేను నాది అనే మాయలో పడి కొట్టుమిట్టాడుతుంటాడు. కుండలినీ శక్తిని నిద్రలేపి ఊర్ధ్వముఖంగా నడిపిస్తే ముందుగా అది బ్రహ్మగ్రంథిని భేదిస్తుంది. అంటే సాధకుడికి నేను, నాది అనే భావం పోగొట్టి స్వస్వరూపజ్ఞానం కలిగిస్తుంది. సృష్ట్యాది సంబంధాలను భేదించి పునర్జన్మరహితమైన ముక్తిని ప్రసాదిస్తుంది. అదే బ్రహ్మగ్రంథి భేదనము. ఈ రకంగా బ్రహ్మగ్రంథిని భేదించిన తరువాత మణిపూర, అనాహత చక్రాలను దాటి విష్ణుగ్రంథిని భేదిస్తుంది. అంటే పోషణకు సంబంధించిన సర్వజీవుల పాలనావ్యవహారము, పోషణ అనే భావాలు నశించటమే విష్ణుగ్రంథి భేదన. సాధకుడికి తనవల్లనే ఈ జగత్తంతా నడుస్తోందనే భావన నశిస్తుంది. అహంకారంవల్ల తానే ఈ పనులన్నింటికీ కర్తను అని భావిస్తాడు. ఈ భావన వల్ల ఆత్మానందం పొందటానికి ఆటంకం ఏర్పడుతుంది. ఆ భావనలు వదలటానికే విష్ణుగ్రంథి భేదన. విష్ణుగ్రంథిని భేదించిన తరువాత విశుద్ధి, ఆజ్ఞాచక్రాలను దాటి రుద్రగ్రంథిని చేరుతుంది. రుద్రుడు లయకారకుడు. కాబట్టి రుద్రగ్రంథిని భేదించినట్లైతే సర్వాన్నీ లయంచేసి సాధకుడికి ఆ దేవి అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. ఈ రకంగా అమృతత్వాన్ని పొందటమే రుద్రగ్రంథి భేదన.

మట్టితోను, శిలలతోను, లోహంతోనూ తయారుచేయబడిన విగ్రహాలు కాని, పుణ్యనదీ స్నానాలు కాని, క్షేత్రదర్శనం కాని మానవుణ్ణి ఉద్ధరించటానికి చాలాకాలం పడుతుంది. **'యోగీనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం'** కాని గ్రంథిత్రయాన్ని భేదించిన యోగులను దర్శించినంత మాత్రం చేతనే పుణ్యం కలుగుతుంది. వారిని స్పృశించినంత మాత్రం చేతనే సర్వపాపాలు హరిస్తాయి.

ఇప్పుడు మంత్రంలో ఉండే అక్షరాలస్థితి, రూపము చూడండి. మంత్రము మూడు కూటములుగా ఉంటుంది.

**1. ప్రథమకూటమి :** ఇది వాగ్భవకూటమి. ప్రళయాగ్నితో సమానమైన కాంతి గలది. ఇది మూలాధారము నుండి స్వాధిష్ఠాన మణిపూర పద్మాలను దాటి, అనాహత పద్మాన్ని తాకుతుంది. ఇది అగ్నిమండలము.



**2. ద్వితీయకూటమి :** ఇది కామరాజకూటమి. ఇది కోట్లకొలది సూర్యులయొక్క కాంతులతో ప్రకాశిస్తుంటుంది. అనాహత విశుద్ధి చక్రాలను దాటి ఆజ్ఞాచక్రం చేరుతుంది. ఇది సూర్యమండలము.

**3. తృతీయకూటమి :** ఇది శక్తికూటమి. కోట్లకొలది చంద్రులయొక్క చల్లదనాన్ని ప్రసరింపచేస్తుంది. ఇది ఆజ్ఞాచక్రం నుంచి సహస్రారందాకా వ్యాపించి ఉంటుంది.

ఇది చంద్రమండలము. మాలలో ఉన్న మణులలాగా ఒకదాని తరువాత ఇంకొకటిగా ఈ వర్ణాలుంటాయి.

**ఆధారోత్థితనాదో గుణ ఇవ పరిభాతి వర్ణ మధ్యగతః ।**

మూలాధారమునుంచి బయలుదేరిన వాయువు నాదముగా మారి, వర్ణముల మధ్యన చేరినదై, మణుల మధ్య దారంలాగా ప్రకాశిస్తుంది.

ఇక్కడ వాక్కుయొక్క స్వరూపాన్ని వివరిస్తున్నారు. వాక్కు పరమేశ్వరి స్వరూపం. కౌళాచారులు, సమయాచారులు అందరూ ఈ మాటను ఒప్పుకుంటారు. వాక్కుకు నాలుగు రూపాలున్నాయి. అవి 1. పరా 2. పశ్యంతీ 3. మధ్యమా 4. వైఖరీ

పరాస్థానం వాక్కుకు ప్రథమస్థానం. అక్కడ ఆలోచన పుడుతుంది. ఏదైనా విషయం చెప్పాలి అంటే ముందుగా ఆలోచన రావాలి. ఆ ఆలోచన పరాస్థానంలో (తలలో, మెదడులో) వస్తుంది. అక్కడ దానికి ఏ విధమైన రూపు ఉండదు. దీన్నే సహస్రార స్థానం అంటారు. ఇది పరావాక్కు. రెండవది పశ్యంతి. వాక్కు యొక్క రూపాలలో కౌళులకు, సమయులకు భేదం లేదు. కాని వాక్‌స్థానాలలో మాత్రం భేదం ఉంది. సమయాచారుల ప్రకారం పరావాక్కుకు స్థానం సహస్రారం. పశ్యంతీ స్థానం ఆధారచక్రం. అయితే కౌళాచారం ప్రకారం పరావాక్కు స్థానం ఆధారచక్రం. పశ్యంతీ స్థానం మణిపూరం. ఇక్కడనుంచి పైకి వెళ్ళినట్లైతే, మధ్యమ, వైఖరి స్థానాలలో గాని, ఆ రూపాలలోగాని వారికి తేడాలేదు. ఉన్న తేడా అల్లా పరా, పశ్యంతీ వాక్కుల స్థానాలలోనే.

సహస్రారంలో ప్రారంభమైన పరావాక్కు నెమ్మదిగా పశ్యంతిగా మారుతుంది. అంటే ఆధారచక్రం చేరుతుందన్నమాట. ఇక్కడే సృష్టిక్రమాన్ని వివరిస్తున్నారు భాస్కరరాయలవారు.

బిందువే పరారూపము. ప్రళయం సంభవించినప్పుడు నామరూపాత్మకమైన జగత్తు అంతా కనిపించకుండా పోతుంది. అంటే జగత్తు లయం అయిపోతుంది. భూమి జలంలోను, జలం అగ్నిలోను, అగ్ని వాయువులోను, వాయువు ఆకాశంలోను, ఆకాశం మాయలోను లీనమై పోతాయి. ఈ రకంగా రూపాత్మక జగత్తు లీనమై పోతుంది. అలాగే శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, అన్నీ వేదాలలో కలిసిపోతాయి. వేదాలు అకార, ఉకార, మకారాలలో కలిసిపోతాయి. అకార, ఉకార, మకారాలు మాయలో కలిసిపోతాయి. ఈ రకంగా నామరూపాత్మక జగత్తు అంతా మాయలో లీనమైపోతుంది. ఈ మాయ పరమేశ్వరుడిలో లీనమై పోతుంది.

సృష్టి ఆరంభమైనప్పుడు ఈ మాయ పరమేశ్వరుని నుంచి బయటకు వచ్చేస్తుంది. అదే శక్తి. త్రికోణరూపిణి. ఈ బిందువు, త్రికోణాలవల్లనే మళ్లీ నామరూపాత్మకమైన జగత్తు ఏర్పడుతున్నది. తత్త్వాలు ఏర్పడ్డాయి. నాలుగు వాగ్రూపాలు ఏర్పడ్డాయి. ఈ వాగ్రూపాలే నామాత్మకశాఖ. ఈ రకంగా వచ్చిన వాక్కు ముందు అవ్యక్తంగా ఉండి, రాను రాను వ్యక్తమవుతుంది. అవ్యక్తమైన వాక్కే పరావాక్కు.

ఏదైనా ఒకపని చెయ్యాలి అంటే ముందుగా ఆ పని చెయ్యాలనే కోరిక ఉండాలి. ఆ కోరికనే 'విచికీర్షా' అంటారు. అంటే పని చెయ్యటానికి ముందున్న స్థితి. ఏదో చెప్పాలి అనుకున్నాడు మానవుడు. అప్పుడు ముందుగా చెప్పాలి అనే ఆలోచన కలగాలి. ఆ కోరికనే పరావాక్కు అంటారు. ఈ కోరిక అనేది సహస్రారంలో పుడుతుంది. కాబట్టే సహస్రారము పరాస్థానమయింది. ఇది సమయమతస్థుల సంప్రదాయం. కాని కౌళుల సంప్రదాయానుసారం పరావాక్కు ఆధారచక్రంలో ఉత్పత్తి అవుతుంది.

పరావాక్కు అంటే స్వస్వరూప జ్ఞానమే. ఆ తరువాత ఆ వాక్కు ఆధారచక్రం చేరుతుంది. ఇది వాక్కుయొక్క రెండవదశ. ఇది పరదేవత అనబడుతుంది. పూర్తిగా అస్పష్టంగా ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లవాడి ఏడుపులాగా ఉంటుంది. అక్కడ నుంచి నెమ్మదిగా బయలుదేరి, మణిపూరం దాటి అనాహతపద్మం చేరుతుంది. ఇది మధ్యమావాక్కు. ఇది పూర్తిగా హల్లులతో కూడి ఉంటుంది. అనాహతం వరకు పూర్తిగా హల్లులే ఉంటాయని గతంలో చెప్పుకున్నాం. ఇది పూర్తిగా స్పష్టంగా ఉండదు. మాటలు వచ్చీరాని పిల్లవాడు మాట్లాడినట్లుగా ఉంటుంది. పూర్తిగా హల్లుతో కూడి ఉంటుంది. అనాహతం నుంచి ఈ వాక్కు విశుద్ధిచక్రం చేరుతుంది. విశుద్ధిచక్రానికి



గల పదహారు దళాలలోను అ నుంచి అః వరకు అచ్చులు ఉంటాయి. పూర్తిగా హల్లులతో కూడిన వాక్కు ఇక్కడకు వచ్చి, అచ్చులతో కలిసి, స్పష్టమైన రూపం పొంది, నోటిద్వారా బయటకు వస్తుంది. ఇది వైఖరీవాక్కు. చాలా స్పష్టంగా ఉంటుంది. లలితా సహస్రంలో 366 నుంచి 374వ నామందాకా ఈ వాక్స్వరూపాలను వివరించటం జరిగింది. ఈ వాగ్రూపాలలో,

1. స్థూలము - వైఖరీవాక్కు
2. సూక్ష్మము - మధ్యమావాక్కు
3. సూక్ష్మతరము - పశ్యంతీవాక్కు
4. సూక్ష్మతమము - పరావాక్కు

ఈ రకంగా కకారాది వర్ణాలతో కూడిన వాక్కు స్వరయుక్తంగా చెవులను చేరుతుంది. **సరిగమపదని**

స - షడ్జము, రి - రిషభము, గ - గాంధారము, మ - మధ్యమము, ప - పంచమము, ద - దైవతము, ని - నిషాదము. వీటిని సప్తస్వరాలు అంటారు. ఇవి వైఖరీ రూపంలో చెవిని చేరతాయి.

పరమేశ్వరి కంఠసీమలోని మూడు భాగ్యరేఖలు నానావిధాలైన మధురమైన రాగాలకు నిలయమైన షడ్జగ్రామ, మధ్యగ్రామ, గాంధారగ్రామాలకు ఉనికిగా ప్రకాశిస్తున్నాయన్నారు శంకర భగవత్పాదులవారు సౌందర్యలహరిలోని 69వ శ్లోకంలో

కాబట్టి నాదము అనేది సూక్ష్మతమము. కుండయందు మట్టి ఉన్నట్లుగానే వర్ణమందు నాదమున్నది అని మనం గ్రహించాలి. వాక్కుయొక్క రూపాలను గురించి యోగినీ హృదయంలో చెప్పబడింది. ఆసక్తిగలవారు నేను వ్రాసిన **శ్రీవిద్యా హృదయము** చూడగలరు.

## బింద్వాది నవకస్థానరూప వివరణ

**మధ్యేఫాలం బిందుర్దీప ఇవాభాతి వర్తులాకారః ॥ 23**

**తదుపరి గతోఽర్ధచంద్రోఽస్వర్ధః కాంత్యా తథా ఽఽ కృత్యా ।**

**అథరోధినీ తదూర్ధ్వం త్రికోణరూపాచ చంద్రికా కాంతిః ॥ 24**

నాదస్తు పద్మరాగవ దండద్వయ మధ్యవర్తినీవసిరా ।
నాదాంత స్తటిడిభః సవ్యస్థిత బిందుయుక్తలాంగలవత్ ॥ 25

తిర్యగ్బిందుద్వితయే వామోర్ధ్వచ్ఛృత్సిరా ఽఽకృతిఃశక్తిః ।
బిందూర్ధ్వచ్ఛృత్త్ర్యశ్రాకారధరా వ్యాపికా ప్రోక్తా ॥ 26

ఊర్ధ్వాధో బిందుద్వయ సంయుతరేఖాకృతిస్సుమనా ।
సైవోర్ధ్వబిందుహీనోన్మనా తదూర్ధ్వం మహాబిందుః ॥ 27

శక్త్యాదీనాం తు వపుః ద్వాదశ రవికాంతి పుంజాభమ్ ।
ఇత్యేనం వర్ణానాం స్థానం జ్ఞాత్వోచ్చ రేద్యత్నాత్ ॥ 28

ఇక్కడ బిందువు దగ్గరనుండి, ఉన్మన వరకు గల తొమ్మిది స్థానాలను వివరిస్తున్నారు. వీటిని గురించి యోగినీ హృదయంలో చెప్పబడింది.

అకులే విషు సంజ్ఞేచ శాక్తౌ వహ్నౌ తథాపునః ।
నా భావనా హతేశుద్ధే లంబికాగ్రే భ్రువోఽన్తరే ॥
బిందౌ తదర్ధం రోదిన్యాం నాదో నాదాంత ఏవచ ।
శక్తిః పునర్వ్యాపికాయాం సుమనోన్మ గోచరే ॥
మహాబిందౌ పునశ్చైవం త్రిధాచక్రంతు భావయేతు ।

శరీరంలో మేరుదండమున్నది. దీన్నే వెన్నుపూస అంటారు. దీని వెంబడి సుషుమ్నానాడి ఉన్నది. ఆ సుషుమ్నకు మొదట ఊర్ధ్వముఖంగాను, చివర అంటే సహస్రారం దగ్గర అథోముఖంగాను, రెండు సహస్రదళ పద్మాలు ఉంటాయి. ఈ రెండింటినీ సుషుమ్నానాడి కలుపుతూ ఉంటుంది. ఈ సుషుమ్నలో ముప్పై పద్మాలున్నాయి. క్రింద ఉన్న సహస్రదళ పద్మానికి, మూలాధారానికి మధ్యన అష్టదళ, షడ్దళ పద్మాలు రెండు ఉన్నాయి. ఈ రెండింటి మధ్య భాగాన్నే 'విషువు' అంటారు. ఆధారచక్రం నుంచి మహాబిందువు (సహస్రారము) వరకు 19 స్థానాలున్నాయి. ఇవి మొత్తం మూడు జట్లుగా ఉంటాయి. మొదటి జట్టులో తొమ్మిది, రెండవజట్టులో తొమ్మిది, మూడవ జట్టులో మహాబిందువు ఒక్కటే ఉంటుంది. పరమేశ్వరిని లేదా శ్రీచక్రాన్ని ముందుగా మొదటి జట్టులోను, తరువాత రెండవ జట్టులోను, ఆ తరువాత బిందువునందు భావన చెయ్యాలి.



**మొదటి జట్టు :**

1. అకులము – ఆధారచక్రానికి దిగువున ఉన్న సహస్రదళ పద్మము.
2. విషువు – అష్టదళము, షడ్దళముల మధ్య భాగము.
3. శక్తి – మూలాధారము, కుండలినీశక్తి ఉండే ప్రదేశము.
4. వహ్ని – స్వాధిష్ఠానము.
5. నాభి – బొడ్డు దగ్గరున్న మణిపూరము.
6. అనాహతము – హృదయస్థానము.
7. విశుద్ధిచక్రము – కంఠస్థానము.
8. లంబికాగ్రము – కొండనాలుక స్థానము.
9. భ్రువోన్తరము – భ్రుకుటి, ఆజ్ఞాచక్రము.

**రెండవజట్టు :** 1. ఇందు – బిందువు, 2. తదర్ధం – అర్ధచంద్రము, 3. రోదిని 4. నాదము, 5. నాదాంతము, 6. శక్తి, 7. వ్యాపిక, 8. సుమన, 9. ఉన్మన

**మూడవజట్టు :** ఇందులో ఒకేస్థానముంటుంది. అదే మహాబిందువు. ఇది శిరస్సుకు రెండు అంగుళాలపై భాగాన ఉంటుంది.

పరమేశ్వరిని అర్చించేవారిని మూడు రకాలుగా విభజించారు.

1. సకలులు – మొదటి జట్టులో పరమేశ్వరిని ఉపాసించేవారు.
2. నిష్కలులు – ఆ దేవిని మహాబిందువునందు అర్చించేవారు.
3. సకల, నిష్కలులు – ద్వైవిదీభావంతో రెండవ జట్టులో పరమేశ్వరిని అర్చించే వాళ్ళు.

రెండవ జట్టులోని చక్రాలను యోగినీహృదయంలో వివరించారు.

**బిందోరర్ధం మాత్రా పరేపరేచాపి పూర్వాపూర్వాః**

బిందువుకు అర్ధమాత్ర అంటే 128 లవములు. అక్కడ నుంచి మిగిలిన వాటికి, పై వాటితో సగము మాత్రమే ఉచ్చారణ కాలము.

**అర్ధచంద్రస్తథాకారః పాదమాత్రస్తదూర్ధ్వకే ।**
**జ్యోత్స్నాకారా తదాష్టాంశా రోదినీ త్ర్యస్త్రవిగ్రహా ॥**

బిందువు పైభాగాన అర్ధచంద్రమున్నది. పేరుకు తగ్గట్టుగానే దాని ఆకారము కూడా అర్ధచంద్రంగానే ఉంటుంది. దీని కాంతికూడా అష్టమినాటి చంద్రునిలాగానే ఉంటుంది. దీని ఉచ్చారణ పాదమాత్ర. అంటే మాత్రలో 1/4 వంతు. 64 లవములు అన్న మాట. అర్ధచంద్రం దాటిన తరువాత పైవైపుకు కోణమున్న త్రికోణముంటుంది. దీనిపేరు రోదిని. ఇది వెన్నెలవంటి కాంతిని ప్రసరిస్తుంటుంది. దీని ఉచ్చారణ కాలము మాత్రలో అష్టాంశము. అంటే 32 లవములు.

**బిందుద్వయాంతరే దండః శ్వేవరూపో మణిప్రభః ।**

**కలాంశో ద్విగుణాంశశ్చ నాదాంతో విద్యుదుజ్జ్వలః ॥**

రోదిని తరువాత కనులవలె ఉండే రెండు బిందువులున్నాయి. వీటిని 'తిర్యక్ బిందువులు' అంటారు. వాటిని కలుపుతూ మధ్యలో సన్నని రేఖ ఉంటుంది. ఇది మణిప్రభ కలిగి ఉంటుంది. ఎర్రని కాంతులతో ప్రకాశిస్తూ ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 'కలాంశ' అంటే 1/16 వంతు మాత్ర. 16 లవములు. ఇది అవ్యక్త నాదస్వరూపము.

**హలాకారస్తు సవ్యస్థ బిందు యుక్తో విరాజతే ।**

ఈ నాదానికి పైభాగాన పైకి ఎత్తి పెట్టిన నాగలిలాగా ఉండి, కుడివైపు ఉన్న బిందువుతో కలిసి, విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఇదే నాదాంతము. దీని ఉచ్చారణ కాలము నాదములో సగము. 8 లవములు.

**శక్తిర్వామస్థ బిందూర్ధ్వ స్థిరాకారా తథాపునః ।**

తిర్యక్ బిందువులలో ఎడమవైపు బిందువుకు పైభాగాన శక్తి ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 4 లవములు.

**వ్యాపికా బిందు విలసత్రికోణాకారతాంగతా ।**

శక్తి పైభాగాన ఊర్ధ్వశీర్షము గల త్రికోణము మాదిరిగా వ్యాపిక ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 2 లవములు.

**బిందుద్వయాంతరాలస్థా ఋజురేఖా మయీపునః ।**

పైన క్రింద రెండు బిందువులుండి, ఆ రెండింటినీ కలిపే సన్నని రేఖనే 'సుమన' అంటారు. దీని ఉచ్చారణ కాలము 1 లవము.



**బిందువిలస దృజురేఖాత థోన్మనా**

**శక్త్యాదీనాం వపుః స్ఫూర్జ ద్వాదశాదిత్య సన్నిభమ్ ॥**

ఆ బిందువు పైభాగాన ప్రకాశించే సన్నని రేఖయే ఉన్మన. దీనికి పై వైపున బిందువుండదు. ఉన్మనాస్థితిలో మనసు పనిచెయ్యదు. ఇక్కడ మనసుకు ఇంకొక రూపం వస్తుంది. ఆ రూపంతో మనసు ఇంకా పైకి వెళ్ళిపోతుంది. మనసుకూడా పని చెయ్యని స్థితి కాబట్టే దీనిని 'ఉన్మన' అంటారు. దీనికి ఉచ్చారణకాలము లేదు. కాని చక్రసంకేతము ప్రకారము ఉచ్చారణ కాలము మాత్రలో 512వ వంతుగా నిర్ణయించబడింది. అంటే లవములో సగమన్న మాట. ఈ విషయాలన్నీ **'యోగినీహృదయం'**లో చెప్పబడ్డాయి. శక్తి, వ్యాపిక, సుమనలు ద్వాదశాదిత్యులలాగా ప్రకాశిస్తుంటాయి. ఇప్పుడు ఇక్కడ భాస్కరరాయలవారు ఏం చెబుతున్నారో చూద్దాం.

1. నుదిటి మధ్య భాగంలో గుండ్రంగా 'బిందువు' ఉంటుంది. ఇది దీపంలా ప్రకాశిస్తుంటుంది. దీని ఉచ్చారణ కాలము 128 లవములు.

2. బిందువులు పైన 'అర్ధచంద్ర'ముంటుంది. అది అష్టమినాటి చంద్రునిలా ప్రకాశిస్తుంది. దీని ఉచ్చారణ కాలము 64 లవములు.

3. దానిపైన త్రికోణాకారంలో ఉండేది 'రోదిని'. ఇది వెన్నెలలు ప్రసరింప చేస్తుంటుంది. దీని ఉచ్చారణ కాలము 32 లవములు.

4. రోదినికి పైన, రెండువైపులా బిందువులు గల గీతలాగా ఉండి ఎర్రనికాంతులు ప్రసరించేది 'నాదము'. దీని ఉచ్చారణ కాలము 16 లవములు.

5. దానిపైన 'నాదాంతము' మెరుపువంటి కాంతిలో ప్రకాశిస్తుంటుంది. ఇది కుడివైపు బిందువుగల నాగలి రూపంలో ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 8 లవములు.

6. నాదాంతానికి పైన ఉండేది 'శక్తి'. రెండు బిందువుల మధ్య ఎడమవైపునుండి పైకి పోతున్న నాడిలా ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 4 లవములు.

7. శక్తిపైన కోణాకారంలో ఉండేది వ్యాపిక. దీని ఉచ్చారణ కాలము 2 లవములు.

8. పైన, క్రింద బిందువులుండి, మధ్యన నాడి కలది సుమన. దీని ఉచ్చారణ కాలము ఒకలవము.

9. సుమనకు పైభాగాన పైన బిందువులేనిది ఉన్మన. దీనికి ఉచ్చారణ కాలం చెప్పలేదు. కాని చక్రసంకేతము ప్రకారము మాత్రలో 512వ వంతు దీని ఉచ్చారణ కాలం. ఉన్మనకు రూపంలేదు. ఉన్మన పైన మహాబిందువుంటుంది.

శక్తి, వ్యాపిక, సుమన, ఈ మూడు ద్వాదశాదిత్యులలాగా ప్రకాశిస్తుంటాయి.

యోగినీ హృదయానికీ, వామకేశ్వర తంత్రానికీ రెండింటికీ కలిపి 'శేతుబంధము' అనే పేరుతో భాస్కరరాయలవారే వ్యాఖ్య వ్రాశారు.

యోగినీ హృదయానికి నేను వ్రాసిన వివరణయే **శ్రీవిద్యా హృదయము.**

ఈ రకంగా మంత్రంలో ఉన్న అక్షరాల ఉత్పత్తి స్థానము, ఉచ్చారణ కాలము తెలుసుకొని జపం చెయ్యాలి. ఇది వాచక జపలక్షణము. మానసిక జపానికి ఈ నియమాలు లేవు. మూడు కూటములందు బింద్వాది నవకమున్నప్పటికి, చివరి కూటమిలోని నవకానికే స్థానము, రూపము చెప్పబడింది. కాబట్టి ఇప్పుడు మొదటి రెండు కూటముల చివరనున్న బింద్వాది నవకాన్ని ఉచ్చరించవలసిన పద్ధతి చెబుతున్నారు.

## వర్ణోచ్చారణ ప్రకారము

**నాదః ప్రాథమికస్తు ద్వితీయకూటేన సాక ముచ్చార్యః ।**
**ద్వైతీయీకం నాదం తార్తీయేనోచ్చరే న్న పృథక్ ॥ 29**

**బింద్వాది నవక యోస్తుప్రాక్తన కూటద్వయస్థయోరనయోః ।**
**సమ్మేళనేన శబలం తార్తీయీకం విభావయే త్కూటమ్ ॥ 30**

**బింద్వాదిక సమానాంతం క్రమేణ తార్తీయ ముచ్చరేన్నాదం ।**
**ఉన్మన్యంతర్లీనం విభావయేదేత దుచ్చరణమ్ ॥ 31**

మంత్రజపం చేసేటప్పుడు మొదటి కూటమి యొక్క నాదాన్ని రెండవ కూటమితోను, రెండవ కూటమి యొక్క నాదాన్ని మూడవకూటమితోను కలిపి ఉచ్చరించాలి. అంటే ఇక్కడ ప్రథమ, ద్వితీయ కూటముల నాదాలకు ప్రత్యేకమైన కాలముగాని, స్థానముగాని లేదు. కాలము, స్థానము లేకపోయినప్పటికీ రూపము, ఆకారముల యొక్క భావన గురించి చెబుతున్నారు.



మొదటి రెండు కూటముల మాదిరిగానే మూడవ కూటమిలో కూడా బింద్వాది నవకము ఉన్నది అని భావించాలి.

మూడవకూటాన్ని ఉచ్చరించేటప్పుడు బిందువు మొదలు సుమనవరకు క్రమంగా ఉచ్చరించి, ఈనాదము ఉన్మనలో లీనమైనట్లుగా భావించాలి.

అసలు ఇక్కడ ఏం చెబుతున్నారో చూడండి. మంత్రాన్ని ఉచ్చరించటం ఎలా అనే విషయాన్ని వివరిస్తున్నారు. మంత్రాక్షరాలను ఉత్పత్తి చేసే స్థానము కంఠస్థానము. మూలాధారము మొదలైన చక్రాలతో ఉండేది. అక్షరస్థితి స్థానము. ప్రయత్నము అనేది రెండు రకాలు. 1. బాహ్యప్రయత్నము 2. అతర్యత్నము. ఈ నియమాలేవీ కూడా మానసిక జపానికి ఉండవు. మానసికంగా చేసే జపానికి నియమాలు పాటించవలసిన అవసరంలేదు. ఈ స్థానాలు, స్థితులు కేవలం భావనకోసం మాత్రమే. వాచిక జపంలోనే ఈ స్థితులు, స్థానాలు గుర్తుంచుకోవాలి. ఇక్కడ 'నాదము' అంటే బింద్వాదినవకము. మొదటి కూటమిలో వచ్చే నాదంతో రెండవ కూటాన్ని, రెండవ కూటమిలో వచ్చే నాదంతో మూడవకూటమిని కలిపి జపించాలి. మూడవ కూటమి తరువాత నాల్గవ కూటమిలేదు. అక్కడితో మంత్రం పూర్తి అవుతోంది. కాబట్టి మూడవ కూటమి చివర నాదం పూర్తిగా రావాలి. ఇంకా వివరంగా చెప్పాలి అంటే మొదటి రెండు కూటముల చివర నాదము పూర్తిగా రాకూడదు. మూడవ కూటమి తరువాతే నాదం రావాలి. మూడవ కూటమి చివర వచ్చే నాదము ఉన్మనలో లయం అయినట్లుగా భావించాలి. అంటే ఈ నాదము ఘంటానాదంలాగా ఉండాలి. ఘంట కొట్టటం ఆపగానే నాదం ఆగదు. అది అలా శబ్దతరంగాలుగా వస్తుంది. అలాగే మూడవకూటమి చివర ఈ నాదం రావాలి. మొదటి రెండు కూటముల తరువాత ఈ నాదం ఉండదు. తరువాత మంత్రాన్ని మూడు ఖండాలుగా విడివిడిగా చదవరాదు. మంత్రాన్ని ముక్కలు ముక్కలుగా కాకుండా ఒకే గుక్కలోనే చెప్పాలి. మొదటి రెండు కూటముల తరువాత దీర్ఘాలు తియ్యకుండా, మూడవ కూటమి చివరనే నాదం రావాలి.

## ఉచ్చారణకాలము

**ఆద్యేదశ మధ్యేతాః సార్ధాస్తృతీయ కూటేఽష్టౌ ।**
**ఏకలవోనా ఊనత్రింశన్మాత్రా మనోర్జపే కాలః ॥ 32**

ఇప్పుడు మంత్రాన్ని ఉచ్చరించటానికి ఎంత సమయం పడుతుంది. అనే విషయాన్ని వివరిస్తున్నారు. గతంలో 16, 17, 18, 19 శ్లోకాలలో అక్షరాలు పలకటానికి ఎంత సమయం పడుతుందో లెక్క పెట్టాం. దీని ప్రకారము మొదటి కూటమి ఉచ్చరించటానికి 11 మాత్రలు, రెండవ కూటమి ఉచ్చరించటానికి 11 1/2 మాత్రలు, మూడవ కూటమి ఉచ్చరించటానికి  8 1/2 మాత్రలు సమయం కావాలి. ఈ రకంగా మంత్రం మొత్తం ఉచ్చరించటానికి మూడు లవములు తక్కువగా 31 మాత్రల కాలం పడుతుంది. అయితే 29, 30, 31వ శ్లోకాలలో చెప్పిన ప్రకారం మొదటి రెండు కూటములకు నాదం ఉచ్చరించవలసిన అవసరంలేదు. కాబట్టి ఆ రెండు కూటమిలందు ఒక్కొక్క దానిలో 255 లవముల కాలం (ఒక లవం తక్కువగా ఒకమాత్ర) తగ్గిపోతుంది.

ప్రతికూటమికి చివరలో ఉన్న హ్రీంకారాన్ని ఉచ్చరించటానికి పట్టే కాలము ఒక్కసారి జాగ్రత్తగా చూడండి. హ్రీంకారంలో హ్-అర్ధమాత్ర, ర్-అర్ధమాత్ర, ఈ - రెండు మాత్రలు కాలం పడతాయి. ఆ తరువాత నాదము (బిందువు నుంచి ఉన్మనదాకా) 255 లవములు పడుతుంది. ఈ రకంగా లెక్కపెడితే మొదటి కూటిమికి ఒక లవము తక్కువగా 11 మాత్రలు లేదా 10 మాత్రల 255 లవములు. రెండవ కూటమికి - ఒక లవము తక్కువగా 11 1/2 మాత్రలు లేదా 10 1/2 మాత్రల 255 లవములు. మూడవ కూటమికి - ఒక లవము తక్కువగా 8 1/2 మాత్రలు లేదా 7 1/2 మాత్రల 255 లవములు సమయం కావాలి.

జపం చేసేటప్పుడు మొదటి రెండు కూటములలోను నాదం ఉండదు. అంటే ఒక్కొక్క కూటమిలోని 255 లవముల కాలము తగ్గిపోతుంది. అప్పుడు మొదటి కూటమికి 10 మాత్రలు, రెండవ కూటమికి 10 1/2 మాత్రలు, మూడవ కూటమికి 8 1/2 మాత్రలు (ఒక లవం తక్కువగా). వెరసి మంత్రం మొత్తం జపించటానికి ఒక లవము తక్కువగా 29 మాత్రల కాలం పడుతుంది. మూడవకూటమిలో హ్రీంకారంలో నాదం ఉంటుంది.



## కూటస్వరూప విశేష వర్ణన, చతుర్విధ బీజముల నిరూపణము

**వ్యష్టి సమష్టి విభేదాత్ అస్యాం చత్వారి బీజాని ।**
**సృష్టి స్థితి సంహారానాఖ్యారూపాణి భావనీయాని ॥ 33**

పంచదశీ మహామంత్రం మొత్తం మూడు కూటాలుగా ఉన్నది. దీనిలో బీజాలు కూడా వాగ్భవబీజము, కామరాజబీజము, శక్తిబీజము అని మూడు ఉన్నాయి. కాని ఈ మంత్రాన్ని మొత్తం నాలుగు బీజాలుగా గ్రహించాలి. వ్యష్టిగా మూడు బీజములు, సమిష్టిగా ఒక బీజము, మొత్తం నాలుగు. వ్యష్టిగా ఇవి సృష్టి, స్థితి, సంహారాలను సూచిస్తాయి. అయితే సమిష్టిగా 'అనాఖ్య' రూపంగా ఉంటాయి. అనాఖ్య రూపము అంటే తిరోదానము, అనుగ్రహము అని అర్దం. ఇందులో ప్రథమకూటమి సృష్టి రూపము. ద్వితీయ కూటమి స్థితిరూపము, తృతీయ కూటమి సంహార రూపము, సమిష్టిరూపము తిరోదాన అనుగ్రహరూపము. ఈ రకంగా **సృష్టి స్థితి సంహార అనాఖ్యా రూపాణి భావనీయాని** మంత్రాన్ని సృష్టి స్థితి సంహార తిరోదాన అనుగ్రహ రూపాలుగా భావించాలి అంటున్నారు భాస్కరరాయలవారు

అనాఖ్యము అంటే చెప్పబడనివి. పరమేశ్వరి పంచకృత్య పరాయణ. ఆవిడ ఈ చరాచర జగత్తును బ్రహ్మరూపంలో సృష్టిస్తుంది. విష్ణువు రూపంలో పోషిస్తుంది, రుద్రుని రూపంలో సంహారం చేస్తుంది. మహేశ్వరుని రూపంలో తిరోదానము, సదాశివుని రూపంలో అనుగ్రహము చేస్తుంది. తిరోదానము అంటే సంపూర్ణ నాశనము, అనుగ్రహము అంటే పూర్తిగా నాశనమయిపోయిన జగత్తును మళ్ళీ సృష్టించటానికి సుముఖంగా ఉండటం. వీటిని లలితా సహస్రంలో 264 నుండి 274వ నామం వరకు వివరించటం జరిగింది.

ఈ శ్లోకంలో **'సృష్టి స్థితి సంహారానాఖ్యా రూపిణి'** అన్నారు. అంటే పరమేశ్వరుడు చేసే పంచకృత్యములలోను సృష్టి, స్థితి, సంహారము ఇక్కడ చెప్పి 'అనాఖ్య' అంటే చెప్పనివి కూడా భావించాలి అన్నారు. ఇక్కడ చెప్పనివి తిరోదాన, అనుగ్రహాలు కాబట్టి వాటిని నాల్గవదైన సమిష్టి కూటమిగా భావించాలి.

**పుట ధామతత్త్వ పీఠాన్వయ లింగకమాతృ తత్సమష్టీనామ్ ।**
**రూపాంతరాణి బీజాన్యమూని చత్వారి చింతనీయాని ॥ 34**

ఈ రకంగా ప్రతిదాన్ని కూడా వ్యవష్టిగాను, సమిష్టిగాను నాలుగు కూటములుగా భావించాలి అంటున్నారు. అయితే వేటిని భావించాలి ? వాటిని ఇక్కడ వరుసగా చెబుతున్నారు చూడండి. 1. పుటములు 2. ధామములు 3. తత్త్వములు 4. పీఠాలు 5. అన్వయములు 6. లింగములు 7. మాతృకలు. వీటన్నింటినీ వ్యష్టిగా, సమిష్టిగా భావించాలి.

**1. పుటములు :** ఇవి మూడు 1. జ్ఞాత 2. జ్ఞానము 3. జ్ఞేయము. జ్ఞాత – తెలియువాడు, జ్ఞానము – తెలుసుకునే శక్తి, జ్ఞేయము – తెలుసుకొనదగినది. ఈ మూడు కలిసిన కూటమి నాల్గవది.

**2. ధామములు :** ధామము అంటే ఇల్లు, స్థానము, కాంతి, వెలుగు, శక్తి దేహము అని అర్థము. ఇవి నాలుగు రకాలు 1. చక్ర 2. నాథ 3. దశ 4. శక్తిత్రయము

**1. చక్రాలు :** 1 అగ్నిచక్రము, 2. సూర్యచక్రము, 3. సోమచక్రము, 4. బ్రహ్మచక్రము. షట్చక్రాలు చెప్పేటప్పుడు వస్తాయి.

**2. నాథులు :** 1. మిత్రేశనాథ, 2. షష్ఠీశనాథ, 3. ఉడ్డీశనాథ, 4. ఆశ్చర్యానంద నాథ, గురుపరంపరలో వస్తాయి.

**3. దశలు :** వీటినే అవస్థలు అంటారు. 1. జాగ్రదావస్థ, 2. స్వప్నావస్థ, 3. సుషుప్తి, 4. తురీయము. **లలితా సహస్రం**లో 256 నుంచి 263 వరకు గల నామాలలో వీటిని వివరించటం జరిగింది.

**4. శక్తులు :** ఇవి మూడు రకాలు

1. వామ, 2. జ్యేష్ఠ, 3. రౌద్రి, 4. శాంత.

1. ఇచ్ఛా, 2. జ్ఞాన, 3. క్రియా, 4. అంబిక.

1. కామేశ్వరి, 2. వజ్రేశ్వరి, 3. భగమాలిని, 4. త్రిపురసుందరి.

**3. ఆత్మలు :** 1. ఆత్మ, 2. అంతరాత్మ, 3. పరమాత్మ, 4. జ్ఞానాత్మ.

**4. తత్త్వములు :** 1 ఆత్మతత్త్వము, 2. విద్యాతత్త్వము, 3. శివతత్త్వము, 4. సర్వశక్తితత్త్వము.

**5. పీఠములు :** 1. కామగిరి, 2. పూర్ణగిరి, 3. జాలంధర, 4. ఓడ్యాణ పీఠములు. వీటిని లలితా సహస్రంలో 375 నుంచి 380 నామాలలో వివరించటం



జరిగింది. ఈ పీఠాలు పృథివి, వాయు, జల, అగ్నిరూపాలు అని యోగినీహృదయంలో వివరించారు.

| | |
|---|---|
| కామగిరి పీఠము | – భూతత్త్వము, పీతవర్ణము |
| పూర్ణగిరి పీఠము | – వాయుతత్త్వము, ధూమ్రవర్ణము |
| జాలంధర పీఠము | – జలతత్త్వము, శ్వేతవర్ణము |
| ఓడ్యాణపీఠము | – అగ్నితత్త్వము, రక్తవర్ణము |

వీటిమీద ఇంకా వివరాలు కావాలంటే నేను వ్రాసిన **'శ్రీవిద్యాసారథి'** లలితా సహస్రనామ భాష్యం 517, 518, 519 పేజీలు చూడండి.

**అన్వయములు :** వీటికే సమయములని, ఆమ్నాయములనీ కూడా పేరు. 1. ప్రాగామ్నాయము, 2. దక్షిణామ్నాయము, 3. పశ్చిమ్నాయము, 4. ఉత్తరామ్నాయము

**7. లింగములు :** 1. స్వయంభూలింగము, 2. బాణలింగము, 3. ఇతరములు, 4. పరమాత్మ లింగము. వీటిని యోగినీ హృదయంలోని చక్రసంకేతంలో 45,46,47 శ్లోకాలలో వివరించారు.

**1. స్వయంభూలింగము :** స్వయంగా ఉద్భవించినది. ఎవరిచేతా తయారు చేయబడినది కాదు. లౌకికంలో దీన్నే మహాలింగము అంటారు. ఇది హేమవర్ణం గలది. అ నుంచి అః వరకు స్వరములతోకూడి ఉంటుంది. మూడు శిఖరములు గలది. మూడు బిందువులు కూటత్రయముతో కూడినది. మూడు బిందువులంటే సున్నా, విసర్గ మొత్తం మూడు బిందువులు.

**2. బాణలింగము :** ఎరుపు రంగుగలది. క నుంచి త వరకు 16 వర్ణములచే చుట్టబడి త్రికోణాకారమై ఉన్నది.

**3. ఇతర లింగము :** తెలుపురంగు గలది. కడిమిచెట్టు పూలవలె గోళాకారంలో ఉంటుంది. థ నుంచి స వరకు 16 వర్ణములచేత పరివృతమై ఉంటుంది.

**4. పరాలింగము :** దీన్నే పరమాత్మ లింగము అంటారు. అ నుంచి క్ష వరకు అన్ని వర్ణములచేత సరివృతమై ఉంటుంది. ఇది పైన చెప్పిన మూడు లింగముల సమిష్టి రూపంగలది. చర్మచక్షువులకు కనిపించనిది. ఇంద్రియాలకు అగోచరమైనది. బిందురూపంలో ఉంటుంది. అంటే ఓడ్యాణ పీఠంలో బిందు మండలమందుంటుంది. సర్వానందమయ చక్రమందుండునది. లేక బ్రహ్మరంధ్రం దగ్గర ఉండేది. పరానంద

స్వరూపమైనది. విద్యానంద, విషయానంద, వాసనానందలకు అతీతమైనది. శాశ్వతమైనది.

**8. మాతృకలు :** ఇవి వాక్కు యొక్క స్వరూపాలైన 1. పర, 2. పశ్యంతి, 3. మధ్యమ 4. వైఖరులు. వీటిని గతంలో వివరించటం జరిగింది. అయితే మాత్రుకలు అంటే శక్తిత్రయము అనికూడా అర్థం చెప్పబడింది.

## ప్రతి అక్షర స్వరూప వివరణము

**ఏకైకస్మిన్కర్మణి సృష్ట్యాది విభేదతః త్రివిధే ।**
**బ్రహ్మాద్యా అధిపతయో భారత్యాది స్వశక్తిభిస్సహితాః ॥ 35**

సృష్టి అనేది మూడు భాగాలుగా ఉంటుంది. 1. సృష్టి, 2. స్థితి, 3. సంహారము. అయితే పంచదశీ మహామంత్రంలో ఒక్కొక్క కూటమి ఒక్కొక్క భాగం అవుతుంది.

ప్రథమ కూటమి – సృష్టిరూపము
ద్వితీయ కూటమి – స్థితిరూపము
తృతీయ కూటమి – సంహారరూపము
సమిష్టికూటమి – తిరోదాన అనుగ్రహ రూపము

అయితే ఇక్కడ సృష్టి, స్థితి, సంహారాలు ఒక్కొక్కటి మూడు విధాలు.

1. సృష్టి సృష్టి, సృష్టి స్థితి, సృష్టి సంహారము.
2. స్థితి సృష్టి, స్థితి స్థితి, స్థితి సంహారము.
3. సంహార సృష్టి, సంహార స్థితి, సంహార సంహారము.

**బ్రహ్మాదయస్త్రయో ఽమీభారత్యాద్యాశ్చ శక్తయ స్తిస్రః ।**
**ప్రత్యక్షర స్వరూపాః శాక్తార్థే వక్ష్యమాణయారీత్యా ॥ 36**

ఈ కర్మలన్నింటికీ త్రిమూర్తి ద్వంద్వము అధిపతులు. త్రిమూర్తి ద్వంద్వము అంటే త్రిమూర్తులు, త్రిశక్తులు అన్నమాట. శక్తి లేకపోయినట్లైతే పరమేశ్వరుడు సృష్టి కార్యంకూడా చెయ్యలేడు. కాబట్టి ప్రతికూటమిలోను త్రిమూర్తి ద్వంద్వము అంటే త్రిమూర్తులు, త్రిశక్తులు ఆరుగురినీ భావన చెయ్యాలి. వీరందరూ మంత్రంలోని ఒక్కొక్క అక్షరానికీ రూపమై ఉన్నారు. ఇక్కడ త్రిమూర్తులు – బ్రహ్మ, విష్ణువు,



రుద్రుడు. త్రిశక్తులు – భారతి, పృథివి, రుద్రాణి. వీళ్ళు ఆరుగురు మంత్రంలోని ఒక్కొక్క అక్షరానికి రూపాలు. అని ఎలా ? ముందుగా మొదటి కూటమి చూద్దాం.

**క ఏ ఈ ల హ్రీం**

**కకారో బ్రహ్మరూపశ్చ ఏకారో భారతీమతం**
**ఈకారో విష్ణురూపశ్చ లకారో పృథివీమతం**
**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥**

కకారము – బ్రహ్మ, ఏకారము – భారతి, ఈకారము – విష్ణువు, లకారము – పృథివి, హకారము – రుద్రుడు, రకారము – రుద్రాణి.

ఇక రెండవ కూటమి చూడండి. **హ స క హ ల హ్రీం**. ఇందులో రెండు హకారాలున్నాయి. ఇప్పుడు రెండవ హకారాన్ని ఇక్కడ నుంచి తీసివేసి, మూడవ కూటమి ముందు చేర్చండి. అప్పుడు రెండు, మూడు కూటములలో ఉండే అక్షరాలు ఒకటే అవుతాయి. హసకలహ్రీం.

**హకారో బ్రహ్మరూపశ్చ సకారో భారతీమతమ్**
**కకారో విష్ణురూపశ్చ లకారో పృథివీ మతమ్**
**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥**

హకారము – బ్రహ్మ, సకారము – భారతి, కకారము – విష్ణువు, లకారము – పృథివి, హకారము – రుద్రుడు, రకారము – రుద్రాణి.

ఇప్పుడు మూడు కూటముల చివర ఉన్న ఈంకారాన్ని శాంత, అంబికలయొక్క సమిష్టి రూపంగా భావించాలి. అదే తిరోదాన, అనుగ్రహములు.

## బింద్వాదినవక భావన

**హృల్లేఖా కామకళా సపరార్ధకలాఽఖ్యాకుండలిన్యుత్థాః ।**
**నాదాశ్చక్రత్రితయత్రితయాత్మానో విభావనీయాస్స్యుః ॥ 37**

హృల్లేఖ (హ్రీంకారము)లో కామకళాబీజము అంతర్భూతంగా ఉంటుంది. దానిలో సపరార్ధ కళ ఉంటుంది. అసలు 'కామకళ' అంటే ఏమిటి ? 'యోగినీ హృదయం'లో కామకలా స్వరూపాన్ని వివరించారు.



Varivasya 02 (Final) 8-5-08 33

**విశ్వాకార ప్రధాధార నిజరూప శివాశ్రయం ।**
**కామేశ్వరాంక పర్యంక నివిష్టమతి సుందరం ॥**

ముప్ఫైఆరు తత్త్వముల పరిణామము చెందిన ఆ పరమేశ్వరి యొక్క నిజ రూపము పరమేశ్వరుడు. తురీయ బిందువు. కామకల అనేది తురీయ బిందువు నుండే ఉత్పన్నమైంది. ఈ రకంగా, తురీయ బిందువునుండి ఉత్పన్నమైన కామబిందువు 'శివశక్త్యాత్మకము' అంటే శివశక్తులతో కూడినది. ఈ శివశక్తులే కామేశ్వరీ కామేశ్వరులు. అటువంటి కామేశ్వరునియొక్క అంకభాగాన కూర్చుని ఉంటుంది కామేశ్వరి. అందుచేతనే ఆమెను "కామేశ్వరాంకస్థా !", 'పరమశివ పర్యంక నిలయా ! అని అంటారు. మొత్తంమీద కామకళ అంటే శివశక్తుల యొక్క తత్త్వము. ఇది అని తత్త్వముల యొక్క సమ్మేళనము. తత్త్వాలు 96 అని, 51 అని, 36 అని, 24 అన్ని రకరకాలుగా చెప్పుకున్నాం. అవి ఎంత సంఖ్యలో ఉన్నప్పటికీ, అన్ని తత్త్వముల సమ్మేళనమే శివశక్తుల సమ్మేళనము. ఇప్పుడు శివశక్తుల తత్త్వం ఏమిటో తెలుసుకోవాలి. అది ఎలా ? గురువుద్వారానే జరగాలి. గురువుకు శుశ్రూష చేసి, ఎంతో కాలం వెచ్చించి, అహర్నిశలు శ్రమించి ఆ విషయాన్ని తెలుసుకోవాలి. అయాచితంగా వచ్చిన ధనంమీదగాని, అధికారంమీద గాని, ఏ మాత్రం శ్రమ పడకుండా వచ్చిన విషయం మీద గాని, మనకి ఏ మాత్రం గౌరవ భావం ఉండదు సరికదా చులకన భావం ఉంటుంది. అందుచేత కష్టపడి, పరిశ్రమ చేసి విషయాన్ని తెలుసుకోవాలి. అందుకే కామకళను గురించి గురువుద్వారా తెలుసుకోవాలి. కేవలం పుస్తక పరిజ్ఞానం పనికిరాదు. దీనికి ఇంకొక కారణం ఉన్నది. పుస్తకంలో వ్రాసినది మాత్రమే మనం చదవగలుగుతాం. మధ్యలో ఎక్కడైనా అర్థం కాకపోయినా, అనుమానం వచ్చినా ఏమీ చెయ్యలేం. అదే గురువు గనక అయినట్లైతే విషయాన్ని అర్థమయ్యేటట్లుగా చెప్పగలుగుతాడు. అనుమాన నివృత్తి చెయ్యగలుగుతాడు. అందుచేత విషయాన్ని గురువుగారి దగ్గరే తెలుసుకోవాలి. గురుముఖైక వైద్యము.

మొదటి కూటమిలోని హ్రీంకారంలో కామకళా బీజం ఉంది. అదే 'ఈ' దానిని ప్రథమకూటమిలో అగ్నికుండలిని అని, ద్వితీయకూటమిలో సూర్యకుండలిని అని, తృతీయకూటమిలో చంద్రకుండలిని అని అంటారు. బింద్వాదినవకము (బిందువుతో కూడిన నాదము) ఈ కుండలినిలోనే పుట్టింది. శ్రీచక్రంలో మొత్తం తొమ్మిది చక్రాలు లేదా ఆవరణలు ఉన్నాయి కదా. ఇప్పుడు ఒక్కొక్క నాదాన్ని



మూడు చక్రాలుగా భావన చెయ్యాలి. అందులో మొదటి కూటమి నాదము అష్టదళము, షోడశదళము, భూపురముల స్వరూపము. రెండవ కూటమి నాదము అంతర్దశారము, బహిర్దశారము, చతుర్దశారముల స్వరూపము. మూడవకూటమిలోని నాదము బిందువు, త్రికోణము, అష్టకోణముల స్వరూపము. ఈ విధంగా భావించాలి. ఇక్కడ శ్రీచక్రంలోని ఆవరణలు పైనుంచి క్రిందికి చెప్పబడ్డాయి. అంటే బిందువునుంచి భూపురందాకా చెప్పబడినాయి. శ్రీచక్రాన్ని మొత్తం మూడు భాగాలుగా చెబుతాం. 1. సృష్టిచక్రం, 2. స్థితిచక్రం, 3. సంహారచక్రం. పాఠకులయొక్క సౌలభ్యం కోసం వీటిని కొద్దిగా వివరించటం జరుగుతున్నది. అసలు శ్రీచక్రంలో ఉన్న ఆవరణలు లేదా చక్రాలు ఏవి ? 'రత్నాయర్ని' వ్రాసిన ఆవరణ దేవతాస్తుతిలో ...

**త్రైలోక్యయోనం వందే సర్వాశాపరిపూరకమ్**
**సర్వసంక్షోభణం చక్రం సర్వసౌభాగ్యదాయకమ్**
**సర్వార్థ సాధకం చక్రం సర్వరక్షాకరంపరమ్**
**సర్వరోగహరం చక్రం సర్వసిద్ధి ప్రదాయకమ్**
**సర్వానందమయచక్రం ఇతి చక్రక్రమం భజే ॥**

అన్నాడు. శ్రీచక్రంలో ఉన్న ఆవరణలపేర్లు చెబుతున్నాడన్నమాట.

1. ప్రథమావరణము – భూపురము – త్రైలోక్యమోహనచక్రము
2. ద్వితీయావరణము – షోడశదళము – సర్వాశాపరిపూరకచక్రము
3. తృతీయావరణము – అష్టదళము – సర్వసంక్షోభణచక్రము
4. చతుర్థావరణము – చతుర్దశారము – సర్వసౌభాగ్యదాయకచక్రము
5. పంచమావరణము – బహిర్దశారము – సర్వార్థసాధకచక్రము
6. షష్ఠావరణము – అంతర్దశారము – సర్వరక్షాకరచక్రము
7. సప్తమావరణము – అష్టకోణము – సర్వరోగహరచక్రము
8. అష్టమావరణము – త్రికోణము – సర్వసిద్ధిప్రదచక్రము
9. నవమావరణము – బిందువు – సర్వానందమయచక్రము

వీటిలో మొదటి మూడు ఆవరణలు సృష్టిచక్రము. తరువాత మూడు ఆవరణలు స్థితిచక్రము. చివరి మూడు ఆవరణలు సంహార చక్రము. ఇప్పుడు అనాహతంలో

పుట్టిన నాదము శ్రీచక్రంలోని మొదటి మూడు చక్రముల (సృష్టి చక్రముల) రూపము. ఆజ్ఞాచక్రంలో పుట్టిన నాదము శ్రీచక్రంలోని 4,5,6 చక్రములయొక్క (స్థితి) రూపము. బిందుస్థానంలో పుట్టిననాదము శ్రీచక్రంలోని చివరి మూడు చక్రాల (సంహార) రూపము. మూడవకూటమిలో వచ్చిన నాదము ఉన్మనలో లయం అవుతుంది. అందుకే అది సంహారరూపంగా భావించాలి. ఈ రకంగా బిందువునుండి ఉన్మన వరకు ఉన్న వాటిని (బింద్వాదినవకాన్ని) భావన చెయ్యాలి.

## జపకాల అవస్థాపంచకము

**ఇంద్రియదశకవ్యవహృతిరూపా యాజాగరావస్థా ।**
**తత్రప్రకాశరూపో హేతుర్భావ్యః తృతీయగే రేఫే ॥** **38**

పరమేశ్వరిని స్తుతి చేసేటప్పుడు **'జాగ్రస్వప్న సుషుప్తీనాంసాక్షిభూత్యై నమో నమః'** అంటాం. అంటే జాగ్రస్వప్న సుషుప్తులయందు సాక్షీభూతముగా ఉండేది. ఈ నామం లలితా అష్టోత్తరంలోనిది. అక్కడ మూడు అవస్థలే చెప్పారు. కాని అవస్థలు ఐదు. అవి 1. జాగ్రదావస్థ, 2. స్వప్నావస్థ, 3. సుషుప్తి, 4. తురీయము, 5. తురీయాతీతము. వీటన్నింటినీ లలితా సహస్రంలో 256 నుంచి 263వరకు నామాలలో వివరించటం జరిగింది. అయితే ఇక్కడ జపకాలంలో అవస్థాపంచకాన్ని వివరిస్తున్నారు.

భాస్కరరాయలవారు ఈ శ్లోకంలో జాగ్రదావస్థను వివరిస్తున్నారు. జాగ్రదావస్థ అంటే మేలుకొని ఉన్న అవస్థ. ఈ స్థితిని అనుభవించేది స్థూలదేహము. ఈ స్థితిలో ఉండే పురుషుణ్ణి వైశ్వానరుడు అంటారు. అంటే విశ్వంలోని నరులకందరికీ, విశ్వంలోని ప్రాణులన్నింటికీ ప్రతీక. భోగాలు అనుభవించటానికి ఈ దేహమే ఆధారము. జీవి ఈ శరీరంతోనే సుఖదుఃఖాలు అనుభవిస్తుంది. స్థూలదేహము ఎప్పుడూ జాగ్రదావస్థలోనే అనుభవం పొందుతుంది. అటువంటి స్థూలదేహానికి ప్రతినిధి వైశ్వానరుడు. జాగ్రదావస్థ ఇతని సంచార స్థానము. ఇతనికి ఏడు అంగాలు, పందొనిమిది నోళ్ళు ఉంటాయని మాండూక్యోపనిషత్తు చెబుతోంది.

**సప్తాంగాలు :** శిరస్సు, కన్ను, ప్రాణము, శరీరము, మూత్రస్థానము, పాదాలు, నోరు.



**ముఖాలు పందొనిమిది :** జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు – 5, ప్రాణాలు – 5, అంతఃకరణ చతుష్టయము 4 వెరసి 19.

జపం చేసేటప్పుడు జ్ఞానస్వరూపమైన ప్రకాశాన్ని మూడవకూటమిలో రేఫస్థానములో భావించాలి.

కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ప్రపంచ రూపంలో పరిణామం చెందటము అనేటటువంటి జాగ్రదావస్థకు కారణమైన సాక్షిని, మూడవకూటమిలోని 'ర'కారంలో భావన చెయ్యాలి. ఇక్కడ సాక్షి ఎవరు? మనం ఈ శ్లోకం మొదట్లో చెప్పుకున్నాం. ఆ పరమేశ్వరియే వీటన్నింటికీ సాక్షి. కాబట్టి, మంత్రాధిదేవత అయిన ఆ పరమేశ్వరిని మూడవకూటమిలోని 'ర'కారంలో భావన చెయ్యాలి.

**అంతఃకరణ చతుష్కవ్యవహారః స్వాప్ని కావస్థా ।**
**సాతార్తీయేకారాత్ బోధ్యాఽపి గళస్థలే చింత్యా ॥** **39**

ఈ శ్లోకంలో స్వప్నావస్థను వివరిస్తున్నారు. ఆత్మయొక్క రెండవపాదం తైజసుడు. స్వప్నావస్థ ఇతని సంచార స్థానము. స్వప్నంలో ఇంద్రియాలన్నీ మనసులో లయం అయిపోతాయి. అప్పుడు మనసు అనేక విషయాలను అనుభవిస్తుంది. ఈ స్థితిలో లేనివన్నీ తనకు తానే సృష్టించుకుని, తనివితీరా అనుభవిస్తుంది.

స్వప్నం చూసేవాడికి నిజంగా అది జరుగుతున్నది అనిపిస్తుంది. రకరకాల వస్తుసముదాయాన్ని పొందుతాడు. ఎనలేని ఆనందం అనుభవిస్తాడు. కొన్నిసార్లు భయపడతాడు. దుఃఖిస్తాడు. ఈ రకంగా జాగ్రదావస్థలో కలిగే అనుభవాలన్నీ, స్వప్నావస్థలో కూడా కలుగుతాయి. ఈ స్థితికి అధిపతి తైజసుడు. అతడికి కూడా వైశ్వానరుడికి వలెనే ఏడు అంగములు, పందొనిమిది నోళ్ళు ఉంటాయి.

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, వీటికి అంతఃకరణ చతుష్టయము అని పేరు. ఈ నాలుగింటితో జరిగే వ్యవహారమే స్వప్నావస్థ. ఇక్కడ కలిగిన జ్ఞాన ప్రకాశములను, మూడవ కూటమిలోని ఈ కారముతో భావించాలి. శరీరంలో ఇంద్రియాలన్నీ విశ్రాంతి తీసుకున్న సమయంలో అంతఃకరణ చతుష్టయము పని చేస్తుంది. అదే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. వీటివల్లనే ప్రపంచ వ్యవహారమంతా నడుస్తుంది. నిజంగా లేనటువంటివన్నీ మనసు ఊహించుకుని అనుభవిస్తుంది. ఈ స్థితిలో ఆ పరమేశ్వరి స్వరూపాన్ని, మూడవ కూటమిలోని

'ఈ' కారంతో భావించాలి. అనగా స్వప్నావస్థలో జనించిన చైతన్యప్రకాశమే, మూడవ హ్రీంకారమందలి కామకలగా భావించాలి. మూడవ హ్రీంకారము అంటే మూడవ కూటమిలోని హ్రీంకారము. అందులోని కామకళా అంటే 'ఈ' కారముగా భావించాలి.

**ఆంతరవృత్తే ర్లయతో లీనప్రాయస్య జీవస్య ।**
**వేదన మేవ సుషుప్తిః చింత్యా తార్తీయ బిందౌసా ॥ 40**

ఈ శ్లోకంలో సుషుప్త్యవస్థను వివరిస్తున్నారు. నిద్రించినప్పుడు ఏ కోరికలు లేనిది సుషుప్తి. అదే గాఢనిద్ర. ఈ స్థితిలో సంచరించేవాడు ప్రాజ్ఞుడు. ఇక్కడ అనుభవాలన్నీ ఏకమైపోతాయి. అంటే జాగ్రత్‌స్వప్నావస్థలలోని అనుభవాలన్నీ కరిగిపోతాయి. అంతేగాని నశించవు. ఆ అనుభవాలకు ప్రత్యేకత ఏమీలేదు. చేతనాశక్తి అంటే గ్రహణశక్తి పూర్తిగా నిలిచిపోతుంది. గతించిన అనుభవాలు ఎక్కడో నిలిచిపోతాయి. అసలు ఇతను జీవించి ఉన్నాడా ? లేదా ? అనిపిస్తుంది. ఈ స్థితిలో ఆనందమయుడై ఆనందాన్ని అనుభవిస్తాడు. ఈ ఆనందం స్తబ్దమైనది. తమోగుణ ప్రధానమైనది. ఇందులో అజ్ఞానము, అహంభావము, సుఖము ఉంటాయి. అందుకే ఇది బ్రహ్మానందం కాదు.

ఈ శ్లోకంలో భాస్కరరాయలవారు సుషుప్తిని వివరిస్తున్నారు. ఇంద్రియవృత్తులు, మనోవృత్తులు లేనటువంటి వృత్తిశూన్యమైన స్థితియే సుషుప్తి. "ఏమీలేదు" అనే జ్ఞానము ఈ స్థితిలో ఉంటుంది. ఆ జ్ఞానాన్ని మూడవకూటమిలోని బిందువునందు, లలాట స్థానంలో భావించాలి.

**తుర్యావస్థా చిదభివ్యంజకనాదస్య వేదనం ప్రోక్తమ్ ।**
**తద్భావనా అర్థచంద్రాదికం త్రయంవాప్య కర్తవ్యా ॥ 41**

యోగసాధనలో కుండలినీ శక్తిని సహస్రారానికి చేర్చిన స్థితే 'తురీయము' ఇది స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు అతీతమైనది.

చిత్తుయొక్క స్వరూపముచే స్ఫురింపబడుతున్నటువంటి నాదముయొక్క జ్ఞానమే తురీయస్థితి. ఆత్మసాక్షాత్కారానికి కారణమైన నాదముయొక్క అనుసంధానమే తురీయ స్థితి. దీన్ని అర్థచంద్రము, రోదిని, నాదములందు భావన చెయ్యాలి. అక్కడ వ్యాపించినట్లుగా భావించాలి.



**ఆనందైక ఘనత్వం యద్వాచామపి నగోచరో నృణామ్ ।**
**తుర్యాతీతావస్థా సా నాదాంతాది పంచకే భావ్యా ॥ 42**

పైన చెప్పిన నాలుగు స్థితులకు అతీతమైనది తురీయాతీత స్థితి. సాధకుడు తురీయాన్ని దాటితే అన్నింటినీ వదిలేస్తాడు. ఈ స్థితి పొందినవాడు సాక్షాత్తూ పరమేశ్వరుడే అవుతాడు. ఇక్కడ అన్ని కాలములయందు ఆనందమే ఉంటుంది.

ఈ శ్లోకంలో భాస్కరరాయలవారు ఈ తురీయాతీతమైన స్థితిని వివరిస్తున్నారు. సాధకుడు బ్రహ్మానంద స్వరూపుడై ఉండటమే తురీయాతీతావస్థ. అది ఇంద్రియాలచే వర్ణించటానికి వీలుకానిది. కేవలము అనుభవైక వేద్యము, జీవులయొక్క జ్ఞానేంద్రియాల చేతకాని, కర్మేంద్రియాలచేత కాని, మనసువల్లగాని ఈ స్థితి తెలియబడదు. అందుకే ఇది అనుభవైక వేద్యము. అంటే అనుభవంద్వారానే తెలుసుకోవాలి. ఈ స్థితియొక్క సాక్షిని అంటే పరమేశ్వరి స్వరూపాన్ని నాదాంతము, శక్తి, వ్యాపిక, సుమన, ఉన్మనలయందు భావన చెయ్యాలి.

ఇప్పుడు మొత్తం ఒకసారి చూడండి. జపం చేస్తున్నాం. జాగ్రదావస్థలో – రేఫ, స్వప్నావస్థలో – ఈకారము, సుషుప్తిలో – బిందువును, తురీయస్థితిలో – అర్థచంద్రము, రోదిని, నాదము, తురీయాతీతస్థితిలో – నాదాంతము, శక్తి, వ్యాపిక, సుమనల యందు భావన చేసి ఉన్మనలో లయం చెయ్యాలి. ఈ రకంగా జపం చేసేటప్పుడు మంత్రాధిదేవత అయిన పరమేశ్వరిని భావన చెయ్యాలి.

## శూన్యషట్కము

**తార్తీయాకే రేఫస్థానే బిందౌచ రోధిన్యామ్ ।**
**నాదాంత వ్యాపిక యోశ్చంద్రక తుల్యాని పంచశూన్యాని ॥ 43**
**ఉన్మన్యాంనీరూపం షష్ఠం చింత్యం మహాశూన్యమ్ ।**

ఈ శ్లోకంలో శూన్యషట్కాన్ని వివరిస్తున్నారు. మొత్తంమీద ఇక్కడ ఆరుచోట్ల శూన్యప్రదేశం ఉన్నది అంటున్నారు.

యోగి ఆజ్ఞాచక్రం దాటిన తరువాత మహానాదాన్ని దర్శిస్తాడు. అతడికి వాక్సిద్ధి కలుగుతుంది. మహానాదము నాగలిరూపంలో ఉంటుంది. అది శాంతమైనది.



Varivasya 02 (Final) 8-5-08 36

వరప్రదాయని, అభయ ప్రదాయని. శుద్ధ బుద్ధ ప్రకాశమైనది. వాయువుకు మహానాదము లయస్థానము.

ఆ శూన్యమందు, విసర్గకు క్రిందగా సహస్రదళపద్మమున్నది. అది పూర్ణచంద్రుని లాగా ప్రకాశిస్తుంటుంది. దాని కిరణాలు సూర్యకిరణాలలాగా ప్రకాశిస్తుంటాయి. అక్కడ అకారాది అన్ని వర్ణాలు ఉంటాయి. అది కేవలము ఆనందరూపమైనది. సహస్రదళకమలంలో కళంకం లేని చంద్రుడున్నాడు. ఆ చంద్రమండలము మధ్యన త్రికోణమున్నది. దానియందు మహాశూన్యమున్నది.

**తదంతః శూన్యం తత్సకల సురగణైః సేవితం చాతిగుప్తమ్ ।**

ఆ మహాశూన్యాన్ని దేవతలు అత్యంత రహస్యంగా సేవిస్తుంటారు. ఆ శూన్యము చాలా రహస్యమైనది. అతిప్రయత్నంమీదగాని దాన్ని పొందలేరు. అది పరమానంద మయమైన సంతానరాశి. పరమేశ్వరుడు అక్కడే ఉంటాడు. ఆయన సర్వాత్మస్వరూపి. అజ్ఞానాన్ని, మోహాన్ని పోగొడతాడు. సాధకుడికి పరమేశ్వరుడు సుధాధారలతో ఆత్మజ్ఞానాన్ని కలిగిస్తాడు. అప్పుడు సాధకుడు జీవాత్మ పరమాత్మల సమైక్యం సాధించి, పరమహంస అవుతాడు.

**శివస్థానం శైవాః పరమపురుషం వైష్ణవగణాః**
**లసంతీతీ ప్రాయోహరిహరపదంకేచిద పరే**
**పదం దేవ్యా దేవీ చరణయుగలాంభోజరసికా**
**మునీంద్రా మప్యంతే ప్రకృతి పురుష స్థానమమలమ్ ॥**

ఈ మహాశూన్యాన్ని శైవులు శివస్థానము అంటే అక్కడ శివుడుంటాడనీ, వైష్ణవులు విష్ణువుంటాడని, కొంతమంది అక్కడ హరిహరులు ఉంటారని, కాదు అక్కడ పరమేశ్వరి ఉంటుందనీ, అక్కడ ప్రకృతి పురుషులుంటారనీ, ఇలా రకరకాలుగా చెబుతారు. కాని అక్కడ ఉండేది మహాశూన్యం. అదే పరబ్రహ్మ. నిరాకారుడు, నిర్గుణుడు.

**ఇదంస్థానం జ్ఞాత్వా నియతనిజచిత్తో నరవరో**
**సభూయత్ సంసారే పునరపి న బుద్ధ స్త్రిభువనే ।**
**సమగ్రశక్తః సాన్నియమ మనసస్తస్య కృతినః**
**పదాకర్తుం ఖగరపి వాణీ సువిమలా ॥**



ఈ స్థానాన్ని తెలుసుకున్నవాడికి పునర్జన్మలేదు. ఈ లోకంతో సంబంధం ఉండదు. సంసారబంధనాలుండవు. పాపపుణ్యాలు లేవు. అతడికి ఇష్టార్థసిద్ధి కలుగుతుంది. ఇక్కడకు చేరిన యోగికి సాయుజ్యం లభిస్తుంది. ఈ విషయమంతా 'షట్చక్రనిరూపణం'లో చెప్పబడింది.

ఇప్పుడు భాస్కరరాయలవారు ఈ శ్లోకంలో శూన్యషట్కాలు వివరిస్తున్నారు. ఇవి మొత్తం ఆరు స్థానాలు. ఎక్కడుంటాయి. మంత్రంలోని మూడవ కూటమిలోని హ్రీంకారాన్ని తీసుకోండి. అందులో 1. హకారము, 2. రేఫ, 3. ఈకారము, 4. బిందువు, 5. అర్థచంద్రము, 6. రోదిని, 7. నాదము, 8. నాదాంతము, 9. శక్తి, 10. వ్యాపిక, 11. సుమన, 12. ఉన్మన. ఇవి మొత్తం 12. వీటిలో ఒక్కొక్కటి వదలి ఆ తరువాత ఉన్న దాన్ని తీసుకోవాలి. అంటే 2, 4, 6, 8, 10, 12 రేఫ, బిందువు. రోదిని, నాదాంతము, వ్యాపిక, ఉన్మన. వీటిలోని మొదటి ఐదింటిలోను ఐదు శూన్యములు ఉంటాయి. కాగా ఉన్మని మహాశూన్యము అవుతుంది. ఈ మహాశూన్యం దర్శించినవాడికి పునర్జన్మ ఉండదు. వీటిలో మొదటి ఐదు నెమలి పింఛంలో ఉండే చంద్రకారము కలిగి ఉంటాయి అంటున్నారు. అంటే ఆ సున్నాలను అనేక రంగులు గలవిగా భావించాలన్నమాట. ఎందుకంటే నెమలి పింఛంలో రకరకాల రంగులు కనిపిస్తాయి. ఇక ఉన్మనిలో ఉండేది ఆరవది. రూపం లేనటువంటిది. అదే మహాశూన్యము. సాధకుడు గనక ఇక్కడ చెప్పినట్లుగా భావించి సాధన చేసినట్లైతే, అతడు మహాశూన్యాన్ని దర్శించగలుగుతాడు.

## విషువనిరూపణ

**ప్రాణాత్మమానసానాం సంయోగః ప్రాణవిషువాఖ్యః ॥** **44**

ఈ శ్లోకం నుండి సప్తవిషువులను వివరిస్తున్నారు. ఈ విషువులు ఏడు రకాలుగా చెప్పబడుతున్నాయి. 1. ప్రాణవిషువము, 2. మంత్రవిషువము, 3. నాడీ విషువము, 4. ప్రశాంత విషువము, 5. శక్తివిషువము, 6. కాలవిషువము, 7. తత్త్వవిషువము.

### 1. ప్రాణవిషువము

ముందుగా ఈ శ్లోకంలో ప్రాణవిషువము వివరిస్తున్నారు.

'అ' కారానికి ప్రాణమని పేరు. ఆ 'అ'కారాన్ని తనయొక్క ప్రాణాది వాయువులతోను, మనస్సుతోను కలపటమే ప్రాణవిషువమనబడుతుంది. అయితే

ఇందులో కొంత అభిప్రాయభేదమున్నది. ప్రాణాది వాయువులు, జీవుడు, మనస్సు ఈ మూడింటియొక్క సంయోగమే ప్రాణవిషువము.

ప్రాణవాయువు, ఆత్మ, మనసులను కలపటమే ప్రాణవిషువము. ఇక్కడ మంత్రంలోని వాయుబీజమైన మొదటి కకారాన్ని ఆత్మ, మనసులతో మూలాధార మందు నాదోత్పత్తి స్థానంవరకు ఐక్యభావన చెయ్యాలి. క కారము ఉచ్చరించిన వెంటనే మనసులో ఉద్భవించిన ప్రకంపనమే ప్రాణము. ఆత్మప్రాణ మనస్సుల సంయోగమే ప్రాణవిషువము.

## 2. మంత్రవిషువము

**ప్రాథమిక కూటనాదేత్వనాహతాత్ బ్రహ్మరంధ్రాంతే ।**
**వృష్టి సమష్టి విభేదాత్ బీజచతుష్కస్య చ స్వస్య ॥ 45**
**ఐక్యేన నాదమయతా విభావనం మంత్రవిషువాఖ్యమ్ ।**

మంత్రముయొక్క మొదటి కూటమిలోని నాలుగు బీజాలు ఆధారనాదమందు లీనమైనట్లుగా భావించటమే మంత్రవిషువము. మంత్రం మొదటి కూటమిలో మొత్తం ఐదు అక్షరాలున్నాయి. వాటిలో హ్రీంకారము వదిలేస్తే మిగిలేవి నాలుగు. **క ఏ ఈ ల.** ఈ నాలుగు బీజాలను ఆధారచక్రం నుంచి ఉత్పన్నమైన నాదంతో కలపటమే మంత్రవిషువము అన్నారు. అయితే దీనిలో కూడా అభిప్రాయభేదమున్నది.

ప్రథమకూటనాదమున అంటే ప్రాణవిషువమందు పుట్టినటువంటి ప్రథమకూట నాదాన్ని వృష్టి, సమిష్టిభేదం చేత నాలుగు బీజాలకు అంటే మంత్రంలోని మొదటి కూటమిలో ఉన్న నాలుగు బీజాలు అని కాదు. మంత్రం మొత్తం వృష్టిగా మూడు బీజాలు, సమిష్టిగా ఒకటి మొత్తం నాలుగు బీజాలు. అనాహతం నుంచి బ్రహ్మరంధ్రందాకా ఆత్మలో ఐక్యముచేసి భావన చేయటము, మంత్రవిషువము అని వీరి వాదన. అయితే మొదట చెప్పినవారు తమ వాదనను సమర్థించుకుంటున్నారు.

**ఆధారోత్థితనాదేతు లీనం బుద్ధ్వా ఆత్మరూపకమ్**
**సంయోగేన వియోగేన మంత్రార్ణానాం మహేశ్వరి**
**అనాహతాద్యా ధారాంతం నాదాత్మత్వే విచింతనమ్ ॥**

ఓదేవీ ! ఆధారచక్రం నుంచి ఆవిర్భవించిన నాదంలో మంత్రముయొక్క అక్షరాలను విడివిడిగాను, కలిపి మనసును, బుద్ధిని ఐక్యం చెయ్యటమే మంత్ర



విషువము. అంతేకాని అనాహతముతో ఆరంభించబడిన నాదంతో కలుపరాదు. బీజాలను కలపటం – సంయోగము. విడివిడిగా పలకటం – వియోగము. ఇక్కడ ఆధారాంత బ్రహ్మరంధ్రము అంటే ఆధారచక్రం క్రింద ఉండే బ్రహ్మరంధ్రము. శరీరంలో చక్రాలు చెప్పేటప్పుడు శరీరంలో రెండు చోట్ల సహస్రదళ పద్మాలున్నాయి. ఒకటి ఆజ్ఞాచక్రం దాటిన తరువాత, రెండవది ఆధారచక్రానికి దిగువన అని చెప్పబడింది. కాబట్టి ఇక్కడ బ్రహ్మరంధ్రము అంటే క్రిందవైపున ఉన్న సహస్రారము మాత్రమే అని వీరి వాదన.

## 3. నాడీ విషువము

**ఆధారోత్థిత నాదస్యోచ్చారాత్ బ్రహ్మరంధ్రాంతమ్ ॥ 46**
**షట్చక్రాణాం గ్రంథీన్ ద్వాదశ భిందన్, సుషుమ్నయైవ పథా ।**
**నాడీనాదార్ణానాం సంయోగో నాడికావిషువమ్ ॥ 47**

శరీరంలో షట్చక్రాలున్నాయి. అవే 1. మూలాధారము, 2. స్వాధిష్ఠానము, 3. మణిపూరము, 4. అనాహతము, 5. విశుద్ధి చక్రము, 6. ఆజ్ఞాచక్రము. వీటిలో ప్రతిచక్రానికీ పైనా, క్రిందా రెండు గ్రంథులు ఉంటాయి. అంటే మొత్తం 12 గ్రంథులన్న మాట. సుషుమ్నానాడి ఆధారచక్రం నుంచి ప్రారంభమయి షట్చక్రాల గుండా ప్రయాణించి సహస్రారం చేరుతుంది. అంటే ఈ పన్నెండు గ్రంథులను భేదించుకుని సహస్రారం చేరుతుంది. ఈ మార్గంతో మంత్రంలోని అక్షరాలను, నాదాన్ని కలిపి భావన చేయటమే నాడీ విషువము.

## 4. ప్రశాంతవిషువము

**రేఫే కామకళార్ణే హార్దకళాయాంచ బింద్వాదౌ ।**
**నాదాంతావధి నాదః సూక్ష్మతరో జాయతే తత్ర ॥ 48**
**శక్తేర్మధ్యే తల్ల యచింతన ముదితం ప్రశాంత విషువాఖ్యమ్ ।**

మూలాధారంలో పుట్టినటువంటి నాదము రేఫ, ఈకారము, బిందువు, నాదము, నాదాంతము వరకు క్రమక్రమంగా సూక్ష్మము, సూక్ష్మతరము, సూక్ష్మతమము అయి శక్తిలో లీనమైపోతుంది. ఈ రకంగా ఆ నాదము శక్తిలో లీనమైనట్లు భావించటమే ప్రశాంత విషువము.

## 5. శక్తివిషువము

**శక్త్యంతర్గతనాదం సమనాయాం భావయేల్లీనమ్ ।**

**శక్తిస్థానాదూర్ధ్వం పునరప్యుజ్జీవితస్య నాదస్య ॥ 49**

నేలమీద వేసిన బంతిలాగా శక్తిలో లీనమైన నాదము వ్యాపికను దాటి సుమనలో లీనమైనట్లు భావించటమే శక్తివిషువము.

## 6. కాలవిషువము

**సమనాగత మున్మనాం ఏతేద్వేశక్తికాల విషువాఖ్యే ।**

సుమనలో లీనమైన నాదం ఉన్మనలో లీనమైనట్లుగా భావించటమే కాలవిషువము. సుమనలో లీనమైన నాదము అతిసూక్ష్మమైనది కాబట్టి ఇంకెటూ పోలేక, ఉన్మనలోనే లీనమవుతుంది.

## 7. తత్త్వవిషువము

**శ్రీవిద్యాకూటావయవేషు కకారాదిషూన్మనాంతేషు ॥ 50**

**అకులాదికోన్మనాంత ప్రదేశసంస్థేషు సకలేషు ।**

**అధ్యుష్టనిమేషోత్తర సప్తదాశాధిక శతత్రయాత్రుటిభి ॥ 51**

**ఉచ్చరితే నాదే సతి తస్యాన్తే తత్త్వవేదనం భవతి ।**

**తదిదం చైతన్యాభివ్యక్తి నిదానంతు తత్త్వవిషువాఖ్యమ్ ॥ 52**

పంచదశీ మహామంత్రంలో ఉన్న అక్షరాలన్నింటినీ ఆధారచక్రం నుంచి ఉన్మన వరకు గల పద్మాలలో 10817 త్రుటుల కాలంలో ఉచ్చరించి, ఆ నాదాన్ని ఉన్మన యందు లయం చేసినట్లైతే, సాధకుడికి జీవబ్రహ్మైక్యరూపమైన ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఈ రకంగా ఆత్మసాక్షాత్కారానికి మూలమైనది కాబట్టి దీన్ని 'తత్త్వవిషువము' అన్నారు.

ఇప్పుడు త్రుటి అంటే ఎంత కాలమో చూద్దాం. ఆరోగ్యవంతుడైన మానవుడి రెప్పపాటు కాలంలో 30వ వంతుకు 'పర' అని పేరు. దీనినే 'తత్త్వం' అనికూడా అంటారు. దానిలో నూరవ భాగము త్రుటి. అంటే మొత్తంమీద చూస్తే రెప్పపాటులో 3000 భాగము త్రుటి.



ఈ రకంగా సాధకుడు శ్రీవిద్యామంత్రమైన పంచదశీ మహామంత్రాన్ని ఉచ్చరించటం ఆధారచక్రం నుంచి ఆరంభించి, షట్చక్రాలగుండా ఆ నాదాన్ని ఉన్మనిలో లీనం చేసినట్లైతే, అతడికి ఆత్మసాక్షాత్కారం అవుతుంది.

## జపస్వరూప నిరూపణ

**ఏవ మవస్థాశూన్యే విషువంతిచ్చక్రాణి పంచషట్ సప్త ।**

**నవచ మనోరర్ధాంశ్చ స్మరతోఽర్ణోచ్చారణంతు జపః ॥ 53**

ఇంతవరకు చెప్పినట్లుగా అవస్థాపంచకము, శూన్యషట్కము, విషువసప్తకము, బింద్వాదినవకములు దృష్టిలో ఉంచుకుని మంత్రంలోని అక్షరాలను ఉచ్చరించటమే జపము అనబడుతుంది.

సాధకులను మూడు రకాలుగా చెప్పటం జరిగింది. దీనికి కారణం శరీరంలో 19 చక్రాలున్నాయి. అవి మూడు జట్లుగా ఉన్నాయి.

**అకులేవిషు సంజ్ఞే చ శాక్తేవహ్నౌ తథాపునః ।**

**నాభావనా హతేశుద్ధే లంబికాగ్రే భ్రువోంతరే ॥**

**బిందౌ తదర్థం రోదిన్యాం నాదో నాదాంత ఏవచ ।**

**శక్తిః పునర్వ్యాపికాయాం సుమన ఉన్మన గోచరే ॥**

**మహాబిందౌపునశ్చైవం త్రిధాచక్రంతు భావయేత్ ॥**

**మొదటి జట్టు :**

1. అకులము – ఆధారచక్రానికి దిగువన ఉన్న సహస్రదళము
2. విషువు – అష్టదళము, షడ్దళముల మధ్య భాగము
3. శక్తి – మూలాధారము
4. వహ్ని – స్వాధిష్ఠానము
5. నాభి – మణిపూరము
6. హతే – అనాహతము
7. శుద్ధే – విశుద్ధి
8. లంబికాగ్రే – కొండ నాలుక భాగము
9. భృవోంతరే – ఆజ్ఞాచక్రము

**రెండవజట్టు :** 1. బిందువు, 2. అర్ధచంద్రము, 3. రోదిని, 4. నాదము, 5. నాదాంతము, 6. శక్తి, 7. వ్యాపిక, 8. సుమన, 9. ఉన్మన.

**మూడవజట్టు :** ఇందులో ఒకేస్థానముంటుంది. అదే మహాబిందువు.

ఈ చక్రాలలోనే సాధకులు పరమేశ్వరిని ఆరాధిస్తారు. సాధకులు ఆరాధించే స్థానాన్ని బట్టి, వారిని వర్గీకరించటం జరిగింది.

**ఆజ్ఞాంతం సకలంప్రోక్తం తత్సకలనిష్కలం**
**ఉన్మన్యతం పరేస్థానం నిష్కళం చ త్రిథాస్థితం**

సాధకులు 1. సకలులు, 2. నిష్కలులు, 3. సకలనిష్కలులు అని మూడు రకాలుగా విభజించబడ్డారు.

**1. ఆజ్ఞాంతం సకలం ప్రోక్తం :** ఆధారచక్రం క్రింద ఉన్న సహస్రదళ పద్మం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న స్థానాలలో పరమేశ్వరిని ఆరాధించేవారు సకలులు. వీరికి ఐహిక వాంఛలే ఎక్కువ. **2. పరేస్థానం నిష్కళంతు :** పరాస్థానం అంటే మహాబిందువునందు పరమేశ్వరిని ఆరాధించేవారు నిష్కలులు. వీరు పూర్తిగా మోక్షవాదులు. **3. సకల నిష్కలం ఉన్మన్యంత్యం :** బిందువు దగ్గర నుండి ఉన్మన వరకు పరమేశ్వరిని ఆరాధించేవారు సకల నిష్కలులు. వీరిలో ద్వైదీభావం ఉంటుంది. ఒకసారి ఇహాన్ని గురించి, ఇంకొకసారి పరాన్ని గురించి మాట్లాడుతుంటారు.

వీరిలో ఆత్మసాక్షాత్కారము అనేది నిష్కలులకు మాత్రమే కావాలి. కాబట్టి ఇప్పటిదాకా భాస్కరరాయలవారు చెప్పిన జపవిధానం ఆత్మసాక్షాత్కారం కోసం ఉపయోగపడేది అని గుర్తించాలి.

మంత్రముయొక్క మొదటి కూటమిలో 18 వర్ణాలు, రెండవకూటమిలో 22 వర్ణాలు, మూడవ కూటమిలో 18 వర్ణాలు, వెరసి 58 వర్ణాలున్నాయని చెప్పుకున్నాం.

| **మొదటికూటమిలో వర్ణాలు** | | **రెండవకూటమిలో వర్ణాలు** | | **మూడవకూటమిలో వర్ణాలు** | |
|---|---|---|---|---|---|
| క్+అ | - 2 | హ్+అ | - 2 | స్+అ | - 2 |
| ఏ | - 1 | స్+అ | - 2 | క్+అ | - 2 |
| ఈ | - 1 | క్+అ | - 2 | ల్+అ | - 2 |
| ల్+అ | - 2 | హ్+అ | - 2 | హ్రీం | - 12 |
| హ్రీం | - 12 | ల్+అ | - 2 | | |
| | | హ్రీం | - 12 | | |
| మొత్తం | 18 | మొత్తం | 22 | మొత్తం | 18 |



ఈ రకంగా మొదటి కూటమిలో 18, రెండవకూటమిలో 22, మూడవ కూటమిలో 18 వెరసి 58 వర్ణాలున్నాయి. హ్రీంకారంలోని 12 వర్ణాలు ఒక్కసారి చూడండి. హ్, ర్, ఈ, బిందువు, అర్ధచంద్రము, రోదిని, నాదము, నాదాంతము, శక్తి, వ్యాపిక, సుమన, ఉన్మన వెరసి 12 వర్ణాలు.

జపం చేసేటప్పుడు మొదటి రెండు కూటములలోని హ్రీంకారంలోను బింద్వాది నవకములను వదలివెయ్యాలి. అప్పుడు మొదటి జట్టులో 9 వర్ణాలు, రెండవ జట్టులో 13 వర్ణాలు, మూడవ జట్టులో 18 వర్ణాలు, వెరసి 40 వర్ణములతోనే మంత్రజపం చెయ్యాలి.

**భాస్కరరాయేణ గురోః కరుణావశతః సమున్మిషితే ।**
**వరివస్యాతి రహస్యే పూర్వాంశః పూర్ణతామాప ॥** **54**

గురువుగారైన నృసింహానంద నాథునియొక్క అనుగ్రహంచేత 'భాసురానంద నాథ' దీక్షానామం గలిగిన భాస్కరరాయల వారిచేత వ్రాయబడిన "వరివస్యా రహస్యము" అనే రహస్యాతి రహస్యమైన విషయాలను తెలియచేసే శ్రీవిద్యాపరమైన గ్రంథంలో మొదటి భాగము పూర్తి అయింది.

అలాగే నా గురుపరంపర అయిన విరజానందనాథ, సదానందనాథ, శుకానందనాథుల కృపతో, సాక్షాత్తు దత్తావతారులు అయిన శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి అనుగ్రహంతో, నాకు చేతనైన వివరణ ఇస్తూ "పరమానందనాథ" దీక్షానామాంకితుడనైన, హరితస గోత్రీకుడనైన క్రోవి పార్థసారథి అను నేను వరివస్యా రహస్యము అనే ఈ గ్రంథంలోని మొదటి భాగాన్ని పూర్తి చేశాను.

# ద్వితీయ భాగము

## అర్థజ్ఞాన ఆవస్యకత

**నార్థజ్ఞానవిహీనం శబ్దస్యోచ్చారణం ఫలతి ।**
**భస్మని వహ్నివిహీనే న ప్రక్షిప్తం హవిర్జ్వలతి ॥ 1**

**అర్థజ్ఞాన మజానానాం నానావిధ శబ్దమాత్ర పాఠవతామ్ ।**
**ఉపమేయశ్చ క్రీవాన్మలయజభారస్య వోఢైవ ॥ 2**

**పురుషార్థానిచ్ఛద్భిః పురుషైరర్థాః పరిజ్ఞేయాః ।**
**అర్థానాదరభాజాం దైవార్థః ప్రత్యుతానర్థః ॥ 3**

ఏదైనా ఒక పని చెయ్యాలి అంటే ఆ పని ఎలా చెయ్యాలో, ఆ పని చేస్తే వచ్చే లాభం ఏమిటో మనకి తెలియాలి. అలాగే ఒక మంత్రాన్ని జపించాలి అంటే, ఆ మంత్రంలో ఎన్ని అక్షరాలున్నాయో, ఆ అక్షరాల స్పష్టత, ఆ మంత్రముయొక్క అర్థము మనకి పూర్తిగా తెలియాలి. అలా గనక కాకపోయినట్లైతే, ఒక అక్షరానికి బదులుగా ఇంకొక అక్షరం పలుకుతాం. తద్వారా ఉపాసకుడికి మంత్రజపంవల్ల మేలు జరగకపోగా, కీడు కూడా జరగవచ్చు. ఉదాహరణకు **రక్షమాం** అనే చోట పొరపాటుగా **భక్షమాం** అని చెప్పామనుకోండి. ఆ మంత్రాధి దేవత ఉపాసకుణ్ణి రక్షించకపోగా, అతడిని భక్షించివేస్తుంది. కాబట్టి మంత్రజపం చెయ్యాలంటే ముందుగా మంత్రంలోని అక్షరాల స్పష్టత, అర్థము కూడా పూర్తిగా తెలిసి ఉండాలి. లేకపోతే అర్థం లేని చదువు వ్యర్థమే అవుతుంది.

మంత్రంయొక్క అర్థం తెలుసుకోకుండా కేవలము అక్కడ ఉన్న పదాలను మాత్రం వల్లె వేస్తే ఉపయోగం ఏమీ వుండదు. బరువులు మొయ్యటానికి ఉపయోగించేది గాడిద. ఆ గాడిదమీద రాళ్ళు వేసినా, దుంగలు వేసినా, బట్టవేసినా తేడా ఏమీ ఉండదు. తాను మొయ్యగలిగిన బరువును మోసుకుపోతుంది. దాని ఫలితంగ దానికి కావలసిన తిండిపెడతాడు యజమాని. ఒక వేళ ఆ గాడిద మీద సువాసనలు వెదజల్లే మంచి గంధపు చెక్కలు వేశారనుకోండి. దానివల్ల ఆ గాడిదకు వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదు. ఏదైనా ఒక దేవతను స్తుతి చేస్తున్నామంటే, ఆ



సమయంలో ఆ దేవతయొక్క రూపం మన కళ్ళముందు మెదలాలి. అలాంటప్పుడు ఆ దేవత సాక్షాత్కారం త్వరగా జరుగుతుంది. అందుకే మంత్రంయొక్క అర్థం తెలుసుకుని జపం చెయ్యాలి. లేకపోతే చేసిన జపం అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

మంత్రజపంవల్ల ఫలితం ఏమిటనే అనుమానం వస్తుంది. ఆ జపంవల్ల మనకి ఏం కావాలో ముందుగా సంకల్పంలోనే చెబుతాం. లేకపోతే "ధర్మార్థ కామమోక్ష చతుర్విధ ఫలపురుషార్థ సిద్ధ్యర్థం" అంటాం. ఈ రకంగా మనం కోరిన ఫలితం రావాలి అంటే మంత్రంయొక్క అర్థం పూర్తిగా తెలియాలి. మంత్రార్థం తెలియకపోతే, జపం చేస్తున్నప్పుడు పిచ్చి ఆలోచనలు వస్తాయి. తద్వారా ఏకాగ్రత భగ్నమై, రావలసిన ఫలితం రాకపోగా, చెడు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. **'యద్భావం తద్భవతి'** మనం ఏం కోరితే అదే జరుగుతుంది. జపం చేసే సమయంలో దేన్ని గురించి అదే పనిగా ఆలోచిస్తుంటే, అదే జరుగుతుంది. కాబట్టి ఉపాసకుడు సాధుచిత్తుడై, మంత్రార్థం పూర్తిగా తెలుసుకుని మాత్రమే జపం చెయ్యాలి.

## భిన్నార్థాలు

**అథాతః పూర్ణగాయత్ర్యాః ప్రతిపాద్యోఽర్ధ ఆదిమః ।**
**భావార్థస్సంప్రదాయార్థో నిగర్భార్థ స్తురీయకః ॥ 4**

**కౌళికార్థో రహస్యార్థో మహాతత్త్వార్థ ఏవ చ ।**
**నామార్థ శ్శబ్దరూపార్థ శ్చార్థో నామైక దేశగః ॥ 5**

**శాక్తార్థ స్సామరస్యార్థ స్సమస్త సగుణార్థకౌ ।**
**మహావాక్యార్థ ఇత్యర్థాః పంచదశ్యాస్సుసమ్మితాః ॥ 6**

పంచదశీ మహామంత్రానికి 15 అక్షరాలున్నాయి. అలాగే 15 రకాలుగా ఆ మంత్రానికి అర్థం చెప్పబడింది. 1. గాయత్రి అర్థము, 2. భావార్థము, 3. సంప్రదాయార్థము, 4. నిగర్భార్థము, 5. కౌళికార్థము, 6. రహస్యార్థము, 7. మహాతత్త్వార్థము, 8. నామార్థము, 9. శబ్దార్థము, 10. నామైకదేశార్థము, 11. శాక్తార్థము, 12. సామరస్యార్థము, 13. సమస్తార్థము, 14. సగుణార్థము, 15. మహావాక్యార్థము.

# 1. గాయత్ర్యర్థము

## గయాన్ ప్రాణాన్ త్రాయత ఇతి గాయత్రీ

ప్రాణములను రక్షించునది గాయత్రి అని ఐతరేయ బ్రాహ్మణంలో చెప్పబడింది. గయలు అంటే ప్రాణాలు అని అర్థం.

**'త ద్యత్ప్రాణా న్త్రాయతే తద్గాయత్రీ'** ప్రాణరక్షణ చేయునది గాయత్రి అని బృహదారణ్యకోపనిషత్తు వివరించింది. **'తస్మాద్గాయంతం త్రాయతే యతః'** గానము చేయువానిని రక్షించునది. **'గీయతే తత్త్వమనయా గాయత్రీతి'** అని శంకర భాష్యం. ఈ మంత్రంలో దైవత్వం గానం చెయ్యబడింది. అందుచేత గాయత్రి అనబడుతుంది.

గాయత్రీ మంత్రం రెండు రకాలుగా ఉన్నది.

1. బ్రాహ్మణులకు ఉపనయనకాలంలో ఉపదేశించేది.
2. వేదాలలో నిగూఢమైనది. ఇదే పంచదశీ మహామంత్రము.

అందుచేతనే గాయత్రీమంత్రం బ్రాహ్మణులకోసం ఏర్పడగా పంచదశీ మహామంత్రం అన్ని వర్ణాలవారికోసం ఏర్పడింది అన్నాడు అగస్త్యమహర్షి. ఇంకా చెప్పాలి అంటే గాయత్రీమంత్రము, పంచదశీ మహామంత్రము రెండూ ఒక్కటే.

ఈ రెండింటి అర్థం కూడా ఒక్కటే.

శరీరాదులను రక్షించటంచేత గాయత్రి అని, తేజస్స్వరూపమవటంచేత సావిత్రి అని, వాగ్రూపం కావటంచేత సరస్వతి అని చెప్పబడుతోంది. **సవితృ ద్యోతనా త్సైవ సావిత్రీ పరికీర్తితా ।** ప్రపంచాన్ని సృజించి ప్రకాశింపచేస్తుంది కాబట్టి సావిత్రి అనబడుతోంది. **జాతః ప్రసవితృత్వాన్ వాగ్రూపత్వా త్సరస్వతీ** వాగ్రూపము గలది కాబట్టి సరస్వతి. ఇరవైనాలుగు అక్షరాలతో ఏర్పడ్డ ఛందస్సే గాయత్రి. ఛందస్సులు అనేకరకాలున్నాయి. కాని బ్రహ్మజ్ఞానానికి ద్వారం గాయత్రీ ఛందస్సు, ఆ గాయత్రియే సోమరసాన్ని తెచ్చి దేవతల కిచ్చింది ఛాందోగ్యోపనిషత్తులో.

ఒకసారి దేవతలంతా గాయత్రి, త్రిష్టుప్, జగతి ఛందస్సులను సోమాన్ని తీసుకురమ్మని పంపారు. వీటిలో త్రిష్టుప్, జగతి ఛందస్సులు సోమాన్ని తేలేక తిరిగి వచ్చేశాయి. అంతేకాకుండా తిరిగివస్తూ త్రోవలో అలసట కారణంగా తమలోని కొన్ని అక్షరాలను వదలివేశాయి. గాయత్రీ మంత్రం సోమం దగ్గరకు వెళ్ళి, దాన్ని రక్షించే వారందరినీ ఓడించి సోమాన్ని తెచ్చి దేవతలకిచ్చింది. తిరిగి వచ్చేటప్పుడు



త్రోవలో త్రిష్టుప్, జగతి, ఛందస్సులు వదలివేసిన అక్షరాలను కూడా తీసుకువచ్చింది. ఆ కారణంగా గాయత్రీ ఛందస్సు అన్నింటికన్నా గొప్పది అయింది. అంతేకాకుండా ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము మూడింటిలోనూ వ్యాప్తమై ఉన్నది. బ్రాహ్మణునికి అత్యంతావశ్యకమవటం చేత దాని గౌరవము ఇనుమడించింది. అందుచేతనే గాయత్రిని ఉపేక్షించినవాడు దేన్నీ పొందలేడు.

గాయత్రీ ఛందస్సులో 24 అక్షరాలు ఒక్కొక్క పాదానికి ఆరు చొప్పున నాలుగు పాదాలుగా ఉన్నాయి. ఇతర ఛందస్సులలో ఇంకా ఎక్కువ అక్షరాలున్నాయి. కాని వాటన్నింటిలోకి గాయత్రియే శ్రేష్ఠమైనది. స్థావరజంగమాత్మకమైన ప్రాణిసమూహ మంతా గాయత్రియే. వాక్కు – గాయత్రి, సమస్తప్రాణాలు – గాయత్రి, వాగ్రూపమైన గాయత్రి అందరి పేర్లనూ ఉచ్చరిస్తోంది. కాబట్టి గాయత్రి అందరిపేర్లలోనూ ఉన్నది. ఈరకంగా ప్రాణి జాతి అంతా గాయత్రియే. గాయత్రి అంటే ప్రాణులను రక్షించేది అని అర్థం. ఈ లక్షణాలుగల గాయత్రి ఈ పృథివే తప్ప వేరేకాదు. చరాచరాలన్నీ ఈ భూమిలోనే ఉన్నాయి. అందుచేతనే చరాచరజగత్తునంతటనూ గానంచేస్తూ, పాడుతూ, త్రాణంచేస్తూ – కాపాడుతూ ఉండే గాయత్రియే ఈ భూమి.

పృథివీ రూపమైన గాయత్రి శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాల సమూహము ఒక్కటే. పురుషుని శరీరరూపమైన గాయత్రి, పురుషుని హృదయ కమలంలో ఉండే పురుషుడు ఇద్దరూ ఒకటే. ఆ పురుషునిలోనే అంటే గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి అని చెప్పబడింది.

బృహదారణ్యకోపనిషత్తులో గాయత్ర్యోపాసన వివరిస్తూ "ఉపనిషత్తులో చెప్పిన 'భూమి, అంతరిక్ష్యం, ద్యౌః' ఈ మూడు పదాల్లోనూ మొత్తం ఎనిమిది అక్షరాలున్నాయి. ద్యౌః అనే పదంలో దకార యకారాలను రెండు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఇవి మూడులోకాల పేర్లు. గాయత్రీ మంత్రానికి పాదానికి ఎనిమిది అక్షరాలున్నాయి. మూడుపాదాలున్నాయి. కాబట్టి మూడు లోకాలు మొదటిపాదం. ఈ రకంగా మూడులోకాలను గురించి తెలుసుకున్నవాడు ముల్లోకాలను జయిస్తాడు.

ఉపనిషత్తులో చెప్పిన **'ఋచ యజూంసి సామాని'** అనే మూడుపదాల్లోనూ ఎనిమిది అక్షరాలున్నాయి. ఇవి గాయత్రికి రెండోపాదం. అంటే వేదాలు రెండవపాదమన్నమాట. ఈ విషయం తెలుసుకున్నవాడు త్రయీవిద్య అనగా వేదవిద్యవల్ల వచ్చే ఫలితాన్ని పొందుతాడు.

మంత్రంలో చెప్పిన 'ప్రాణ అపాన వ్యానం' అనే దాంట్లోని ఎనిమిది అక్షరాలు గాయత్రికి మూడవపాదం. ఇక్కడ వ్యా అనే అక్షరంలో వకార యకారాలను రెండు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఈ విషయం తెలుసుకున్నవాడు సమస్తాన్ని పొందుతాడు.

ఉపనిషత్ మంత్రంలో **'తురీయ దర్శితం పదం'** అనేది నాల్గవపాదము. 'దర్శితపదం' అనే పదానికి ఆదిత్యమండలాంతర్గతుడైన పురుషుడు కనిపిస్తున్నాడని అర్థం. అంటే అన్ని లోకాలకు పైన ఆధిపత్యం స్థాపించి ప్రకాశిస్తున్నాడు. ఈ రకంగా గాయత్రిలో నాల్గవపాదం తెలుసుకున్నవాడు కీర్తితో ప్రకాశిస్తాడు.

తురీయపదం సత్యంలో ప్రతిష్ఠితమై ఉన్నది. నేత్రమే సత్యం. ఏదైనా ఒక విషయాన్ని నేను చూశాను. నేను విన్నాను అని చెప్పినప్పుడు చూసినదాన్నే నమ్మటం జరుగుతుంది. అందుచేతనే నేత్రం సత్యం. తురీయపాదానికి ఆశ్రయమైన సత్యం బలంలో ప్రతిష్ఠితమై ఉన్నది. అందుకనే సత్యంకన్న బలం ప్రకాశమైనది. ప్రాణమే ఆ బలం. త్రిపదా గాయత్రి ప్రాణాలను రక్షిస్తుంది. గాయత్రి ప్రాణంలో ప్రతిష్ఠితమైఉన్నది. వాగాది ప్రాణాలను రక్షించేది గాయత్రి. గానము చేసేవాడిని రక్షించేది గాయత్రి. ఉపాసనచేసేవాణ్ణి రక్షించేది గాయత్రి.

ఉపనయన సమయంలో వటువుకు త్రిపదగాయత్రిని ఉపదేశిస్తారు.

**అస్యశ్రీగాయత్రీ మహామంత్రస్య విశ్వామిత్రఋషిః । గాయత్రీఛందః । శ్రీ సవితాదేవతా । యం బీజం । ఈం శక్తిః । ణం కీలకం । జపే వినియోగః ॥**

**న్యాసము** : **ఓంతత్సవితుర్బ్రహ్మాత్మనే । ధీమహి నత్యాత్మనే ।**
**వరేణ్యం విష్ణ్వాత్మనే । ధియో యోనః జ్ఞానాత్మనే ।**
**భర్గోదేవస్యరుద్రాత్మనే । ప్రచోదయాత్ సర్వాత్మనే ॥**

**ధ్యానము** : **ముక్తావిద్రుమహేమనీల ధవళచ్ఛాయై ర్ముఖై స్త్రీక్షణైః**
**యుక్తా మిందునిబద్ధరత్న మకుటాం తత్వార్థ వర్ణాత్మికాం ।**
**గాయత్రీం వరదాభయాం కుశకశా శ్శుభ్రం కపాలం గదాం**
**శంఖం చక్ర మథారవిందయుగళం హస్తై ర్వహంతీం భజే ॥**

**మంత్రము** : **ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం । భర్గోదేవస్య ధీమహి । ధియోయోనః ప్రచోదయాత్ ॥**



ఇది త్రిపదగాయత్రి. అయితే కొన్ని శాఖలవారు అనుష్టుప్ ఛందస్సులో ఉండే గాయత్రిని ఉపాసిస్తారు.

**తత్సవితు ర్వృణీ మహే । వయం దేవస్య భోజనం । శ్రేష్ఠం వై సర్వధాతమమ్। తురంగ భగస్య ధీమహి ॥**

వాక్కే అనుష్టుప్. వాక్కే శరీరంలో ఉండే సరస్వతి. కాబట్టి వాక్స్వరూపమైన సరస్వతిని వీరికి ఉపదేశిస్తున్నామని వీరికి నమ్మకం.

గాయత్రీ ఉపాసకుడు ఆవులు, గుర్రాలు, భూమి దానంగా తీసుకున్నా దానివల్ల కలిగే దోషం మొదటి పాదాన్ని జపిస్తే పోతుంది.

వేదవిద్యతో సమానంగా దానం తీసుకున్నా ఆ దానం వల్లవచ్చే పాపం మంత్రంలోని రెండవపాదాన్ని జపం చేస్తే పోతుంది.

"లోకంలో ఉన్న ప్రాణాలన్నీ దానం తీసుకున్నా, ఆ పాపం మూడవపాదం జపం చేస్తే పోతుంది. అంటే గాయత్రిమహిమ చాలా గొప్పది" అని చెప్పబడింది.

**శుద్ధ గాయత్రీ ప్రత్యక్షరం బ్రహ్మైక్య బోధితా ।**

శుద్ధగాయత్రిలోని ప్రతి అక్షరము పరబ్రహ్మను గురించే బోధిస్తున్నది. అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని వివరిస్తుంది.

**మహా మంత్రస్య చాపస్య స్థానే స్థానే పదే పదే ।**
**గూఢో రహస్య గర్భేన న్తో ప దేశ సముచ్ఛయః ॥**

గాయత్రీ మహామంత్రంలోని ప్రతి అక్షరంలోనూ, ప్రతిస్థానమందు మహా రహస్యమున్నది.

గాయత్రీ మంత్రాన్ని ఉపాసన చేసేవారికి ఇహపరసుఖాలు పూర్తిగా లభిస్తాయి. హృదయపద్మమందు అధిష్టించి ఉన్న గాయత్రిని ఉపాసన చేసేవారు ధర్మాధర్మ విముక్తులై ముక్తిని పొందుతారు.

గాయత్రీమంత్రానికి 24 అక్షరాలున్నాయి. ప్రజాపతి సంవత్సర స్వరూపుడు. అతడే కాలస్వరూపుడు. సంవత్సరానికి 12 మాసాలు. మాసానికి రెండు పక్షాలు. ఈ రకంగా 24 పక్షాలుంటాయి. ఆ 24 పక్షాలే గాయత్రీమంత్రంలోని 24 అక్షరాలు. సంవత్సరానికి మూడుకాలాలు.



Varivasya 02 (Final) 8-5-08 43

1. వేసవి కాలము, 2. వర్షాకాలము, 3. శీతాకాలము. వీటి స్వరూపంగానే గాయత్రీ మంత్రము మూడుపాదాలుగా ఉన్నది. మంత్రంలోని మూడుపాదాలు 1. భూలోకం, 2. భువర్లోకం, 3. సువర్లోకాలకు ప్రతీక. అందుచేతనే ఆ పాదాలను లోకాలకు అన్వయించి ధ్యానించాలి.

**1. మొదటిపాదము :** భూలోక సమన్వయము. భౌతికమైన సృష్టిరూపంలో ధ్యానం చెయ్యాలి.

**2. రెండవపాదము :** భువర్లోక సమన్వయము. అంటే శక్తి మయాత్మకరూపంలో ధ్యానం చెయ్యాలి.

**3. మూడవపాదము :** సువర్లోక సమన్వయము. అంటే ప్రజ్ఞామయాత్మక దృష్టితో ధ్యానం చెయ్యాలి.

ఈ విధంగా ధ్యానం చేసేటప్పుడు ముందు ద్రవ్యాత్మక లోకానికి అధిష్టాన దేవతలయిన అష్టవసువుల అనుగ్రహం కలుగుతుంది. ఆ తరువాత శక్తి మయాత్మక లోకానికి అధిష్టానదేవతలయిన ఏకాదశరుద్రుల అనుగ్రహం కలుగుతుంది. అటుపైన ప్రజ్ఞామయాత్మకలోకానికి అధిష్టానదేవతలయిన ద్వాదశాదిత్యుల అనుగ్రహం కలుగుతుంది.

గాయత్రీ మంత్రంలోని ప్రతి అక్షరానికీ ప్రత్యేకమైన అర్థం ఉన్నది. ఇప్పుడా అర్థాన్ని వివరిస్తున్నాం.

| | | |
|---|---|---|
| ఓమ్ | – | బ్రహ్మ |
| భూః | – | ప్రణవస్వరూపము |
| భువః | – | దుఃఖనాశనము |
| స్వః | – | సుఖస్వరూపము |
| తత్ | – | ఆ |
| సవితుః | – | తేజస్సుచే ప్రకాశించు |
| దేవస్య | – | దేవునియొక్క |
| వరేణ్యం | – | శ్రేష్ఠమైన |
| భర్గః | – | పాపనాశనమైన తేజమును |



| | | |
|---|---|---|
| ధీమహి | – | ధ్యానింతును |
| యః | – | ఏదైతే |
| నః | – | మా యొక్క |
| ధియః | – | బుద్ధులను |
| ప్రచోదయాత్ | – | ప్రేరేపించునో, ఆ తేజస్సును ధ్యానింతును. |

పంచదశీ మహామంత్రము గాయత్రీమంత్రము రెండూ ఒక్కటే అని చెబుతూ భాస్కరరాయలవారు తమ వరివశ్యా రహస్యంలోని 7,8,9,10 శ్లోకాలలో పంచదశీ మహామంత్రానికి గాయత్రీ మంత్రార్థం నిరూపించారు.

పంచదశీ మహామంత్రంలోని కకారానికి సర్వజగత్తునూ సృష్టించాలనే కోరిక గల బ్రహ్మ అని అర్థం. గాయత్రీ మంత్రంలోని మొదటి మూడుపదాలకు బ్రహ్మ అని అర్థం. పంచదశిలో రెండవఅక్షరమైన ఏ కారానికి గాయత్రీ మంత్రంలోని సవితుః – శ్రేష్టమైన అని అర్థం. మూడవ అక్షరమైన ఈ కారము గాయత్రీ మంత్రంలోని భర్గోదేవస్యధీ అయిన పరమేశ్వరుణ్ణి సూచిస్తుంది.

ఈ రకంగా శ్రీవిద్యలోని ప్రథమకూటమిలోని అక్షరాలు గాయత్రీమంత్రంలోని ప్రథమపాదంచే తెలియబడు జగత్కారణభూతులైన కామేశ్వరీ కామేశ్వరులను చెబుతోంది. వారిద్దరి సామరస్యమే పరమశివుడు. అతని పరిణామమే ఈ జగత్తు. అతడే సమస్త బుద్ధులకు ప్రేరకుడు. త్రిగుణాతీతుడు. ప్రణవస్వరూపుడు.

గాయత్రీమంత్రంలోని మహి అనే శబ్దము శ్రీవిద్యలోని ల కారాన్ని సూచిస్తున్నది. ల కారమనేది పృథివీ బీజం. కాబట్టి దానినుంచి పంచభూతాత్మకమైన జగత్తు తెలుస్తుంది. ఈ జగత్తంతా పరమేశ్వరునివల్ల సృష్టించబడింది. ఆ పరమేశ్వరుని ప్రతిబింబమే మహాత్రిపురసుందరి.

గాయత్రీమంత్రంలోని చివరి రెండుపాదాల అర్థం శ్రీవిద్యలోని హ్రీం కారము ఒక్కటే. ఈ రకంగా గాయత్రి, పంచదశీ మహామంత్రాల అర్థం ఒక్కటే.

దేవీభాగవతంలోని 12వ స్కంధంలో గాయత్రీమంత్రాన్ని వివరించారు. ఈ మంత్రానికి 24 మంది ఋషులు, 24 ఛందస్సులు, 24 మంది దేవతలు, 24 శక్తులు, 24 రంగులు, 24 వర్ణతత్త్వాలు 24 వర్ణముద్రలు చెప్పబడ్డాయి.

ఈ రకంగా ఉన్న గాయత్రీ మంత్రం బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులందరిచేత జపించబడుతోంది. అయితే

**ఓంకారవ్యాహృతిపూర్వాం గాయత్రీం బ్రాహ్మణో జపేత్**
**త్రిష్టుభం చైవ రాజన్యో జగతీం వైశ్య ఏవ చ.**

ఓంకారవ్యాహృతి పూర్వకమైన గాయత్రిని – బ్రాహ్మణులు, త్రిష్టుప్ ఛందస్సులో – క్షత్రియులు, జగతీ ఛందస్సులో – వైశ్యులు ఈ మంత్రాన్ని జపిస్తారు. అంతేకాకుండా మంత్రశాస్త్రంలో ప్రతి మంత్రానికి గాయత్రి ఉంటుంది.

**కాత్యాయనాయవిద్మహే కన్యకుమారి ధీమహి తన్నో దుర్గిః ప్రచోదయాత్।**
**మహాదేవ్యై చ విద్మహే । విష్ణుపత్న్యైచ ధీమహి తన్నో లక్ష్మీః ప్రచోదయాత్॥**

గాయత్రీమంత్రం అత్యంత మహిమోపేతమైనది.

పూర్వకాలంలో ఒకసారి అనావృష్టి వచ్చింది. దాదాపుగా పదిహేను సంవత్సరాలు వర్షపు చుక్కైనా కురవలేదు. పాడిపంటలు లేవు. చెట్లు చేమలుకూడా అంతరించి పోయాయి. భరించలేని కరువు. పశువులు గడ్డిలేక చచ్చిపోతున్నాయి. పసిపిల్లలకు పాలులేవు. ఆకలికి తాళలేక కొందరైతే మృతకళేబరాలను పీక్కుతినే స్థితికి వచ్చారు. ఇంతదాకా ఎందుకు పిల్లలకు పాలు ఇవ్వలేక, వారిని పెంచలేక గొంతు పిసికి చంపేసిన వారు కూడా ఉన్నారు. మొత్తం మీద ఘోరకలి విలయ తాండవం చేస్తోంది. ఆ రోజుల్లో కొంతమంది పండితులు ఒకచోటచేరి ఈదుర్భర స్థితి నుంచి తప్పించుకోవటానికి మార్గం లేదా ? అని ఆలోచించసాగారు. చివరకు వారికి గౌతముడు గుర్తు వచ్చాడు.

గౌతముడు ఒక మహర్షి. మహాతపస్సంపన్నుడు. పరదేవతను ఆరాధిస్తూ ఉండేవాడు. ఆవిడయొక్క కరుణవల్ల విత్తనాలు చల్లగానే అవి మొలకెత్తి ఫలితాన్ని ఇచ్చేటట్లుగా వరం పొందాడు. కాబట్టి ఇప్పుడు మనమంతా గౌతముడిని శరణువేడితే ఆ మహర్షి మనలను కరుణిస్తాడు అని ఆలోచించి గౌతముడి ఆశ్రమానికి ప్రయాణమయ్యారు.

కుటుంబ సమేతంగా వచ్చిన ఇంతమంది పండితులను చూసి, వారికేదో ఆపద వచ్చిందని గ్రహించి, వారిని ఆహ్వానించి ఆతిథ్యమిచ్చాడు గౌతముడు. ఆ



తరువాత జరిగిన విషయం తెలుసుకుని, ప్రజలు ఆకలిదప్పులకు అల్లాడుతున్నారన్న మాట విని విచారించి ఆ పరదేవతను ప్రార్థించాడు.

**నమో దేవి ! మహావిద్యే ! వేదమాతః ! పరాత్పరే !**
**వ్యాహృత్యాది మహామంత్రరూపే ! ప్రణవరూపిణి !**
**సామ్యావస్థాత్మికే ! మాతః ! నమో హ్రీంకార రూపిణి**
**స్వాహా స్వధా స్వరూపే ! త్వాం నమామి సకలార్థదామ్**
**భక్తకల్పలతాం దేవీం అవస్థాత్రయ సాక్షిణీం**
**కుర్యాతీత స్వరూపాం చ సచ్చిదానంద రూపిణీం**
**సర్వవేదాంత సంవేద్యాం సూర్యమండల వాసినీం**
**ప్రాతర్బాలాం రక్తవర్ణాం మధ్యాహ్నే యువతీం పరాం**
**సాయాహ్నే కృష్ణవర్ణాం తాం వృద్ధాం నిత్యం నమామ్యహమ్॥**

ఆదేవత మహిమవల్ల వచ్చిన వారందరికీ నివాసం ఏర్పాటుచేసి, గతంలో దేవత తనకిచ్చిన వరమహిమ వల్ల వారందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాడు. ఇంతకాలం అన్న పానాదులు లేక, అవి ఎలా ఉంటాయో కూడా మరచిపోయిన వాళ్ళకి ఆపరదేవత దయవల్ల పంచభక్ష్యాలతో సమృద్ధిగా ఆహారం దొరికింది. ఆ ఆనందానికి తట్టుకోలేక అన్నదానం చేసి తమ ప్రాణాలని నిలబెట్టిన గౌతముణ్ణి వేనోళ్ళ కొనియాడారు. ఆ పరమేశ్వరిని పరిపరివిధాల స్తుతించారు. పండితులంతా యజ్ఞయాగాలు చెయ్య నారంభించారు. ఆశ్రమానికి ఎటు చూసినా నూరు యోజనాల వరకు ఆశ్రితులున్నారు. అందర్నీ సంరక్షిస్తున్నాడు గౌతముడు.

కొంతకాలానికి నారదుడు వచ్చి గౌతముడు చేస్తున్న పనికి మెచ్చుకుని “మహర్షీ! ఆపదకాలంలో వీళ్ళని ఆదుకున్నావు. వారికోసం ఆ పరాశక్తి ఇచ్చిన వరప్రభావం ఉపయోగించటం వల్ల నీశక్తి మరింతగా పెరిగింది. తనకున్న శక్తితో పదిమందికీ ఎవరైతే ఉపకారం చేస్తారో వారి శక్తి ద్విగుణీకృత మౌతుందని చెప్పబడింది. ఇప్పుడు నీకూ అంతే జరిగింది. ఇంద్రాది దేవతలంతా నువు చేస్తున్న పనిని వేనోళ్ళ కొనియాడుతున్నారు” అన్నాడు. ఈ మాటలు విన్న పండితులకు ఈర్ష్య కలిగింది. గౌతముడికి ఇంత పేరు రావటం వాళ్ళు సహించలేక పోయారు. ఎలాగైనా సరే గౌతముడి ప్రతిష్ఠకు మచ్చ కలిగించాలి అనుకున్నారు.

వానలు పడటం మొదలు పెట్టాయి. క్రమంగా నేల చల్లబడింది. ఏరులు పారాయి. నదులు పొంగాయి. విత్తనాలు మొలకెత్తుతున్నాయి. పండితులు కూడా వెళ్ళిపోవటానికి సన్నద్ధమౌతూ మాయాగోవును ఒకదాన్ని సృష్టించారు. అది వచ్చి ఆశ్రమ ప్రాంగణంలోని పంటను, ఆహారాన్ని నాశనం చెయ్యటం మొదలుపెట్టింది. అది చూసిన గౌతముడికి కోపం వచ్చింది. ఆవును కొట్టటం ఇష్టంలేక అదిలించాడు. అంతే ఆ అదిలింపుకు మాయాగోవు కింద పడి చచ్చిపోయింది. ఇదంతా చాటునుంచి చూస్తున్న పండితులు "గౌతముడు గోవును చంపాడు. గోహత్య మహాపాతకం. ఇంక ఇతడి ఇంట భోజనం చెయ్యటం కూడా పాపం. మేం వెళ్ళిపోతున్నాం" అని బయలుదేరారు. మాయ తెలియని గౌతముడు వారిని బ్రతిమాలాడు. ఈ పాపం పోయే ఉపాయం చెప్పమన్నాడు. అప్పుడు వారు గౌతముడికి అసాధ్యమయ్యేపని ఏదాయని ఆలోచించి చివరకు గంగను తెచ్చి గోవుమీద ప్రవహింపచేస్తే ఈ పాపం పోతుందన్నారు.

గౌతముడు చాలా సంవత్సరాలు శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై గౌతముడి కోర్కె ప్రకారం తన జటాజూటం నుంచి రెండు బొట్లు విదిల్చాడు. అంతే చచ్చిన గోవు లేచినుంచుంది. ఈరకంగా గౌతముని చేత తేబడింది కాబట్టి గౌతమి అనీ, గోవును బ్రతికించటానికి వచ్చింది కాబట్టి గోదావరి అనీ ఆనదికి పేరు వచ్చింది.

ఆవు లేచి నుంచోగానే 'గౌతముడు మాయాగోవును బ్రతికించాడు' అని గెలిచేశారు పండితులు. దివ్య దృష్టితో అసలు విషయం తెలుసుకున్న మహర్షి వారిమీద కోపించి "ఇక నుంచీ గాయత్రీజపం మీకు నిష్ఫలమవుతుంది. వేదాధ్యయనం, యజ్ఞకర్తవ్యం మీకు ఉండవు. మీరంతా ధర్మహీనులు, నీతిదూరులు అయి భ్రష్టుపట్టిపోతారు. వావీ వరుసా లేకుండా పశువుల్లా ప్రవర్తిస్తారు. తరతరాలకు మీగతి ఇంతే" అని శపించాడు.

చేసిన తప్పు క్షమించమని పండితులంతా ప్రాధేయపడగా ద్వాపరయుగంలో పరమేశ్వరి అంశతో యదువంశంలో నందగోవుని ఇంట శ్రీకృష్ణుడు పుడతాడు. అతని జన్మతో మీకు శాపవిమోచన మవుతుంది అన్నాడు.

ఈ రకంగా పండితులు చేసిన తప్పుకు శిక్ష అనుభవించి, పరమేశ్వరి దయవల్ల మళ్ళీ గాయత్రీ అనుష్ఠానం చేసి బ్రహ్మతేజస్సును పొందారు. గాయత్రీ జపం చేసినవాడు బ్రహ్మతేజస్సుతో వెలుగొందుతాడు.



ఓం భూర్భువస్సువః ఇది వ్యాహృతిత్రయము

(ఓం భూః, ఓం భువః, ఓం సువః)

భూః, భువః, సువః, మహః, జనః, తపః, ఓగ్ంసత్యం ఇవి సప్తవ్యాహృతులు గాయత్రీమంత్రాన్ని, బ్రహ్మచారి, గృహస్థులు – ప్రణయత్రయ సహితముగాను, వానప్రస్థులు – పంచప్రణవ సహితముగాను, సన్యాసులు – ఏకప్రణవ మంత్రమును, జపించాలని వసిష్ఠాది మహర్షులు చెప్పారు.

ప్రణవత్రయము అంటే – వ్యాహృతిత్రయము ముందు ఒకటి, మొదటి పాదము ముందు ఒకటి, తురీయపాదము ముందు ఒకటి. మొత్తం మూడు ప్రణవాలు.

పంచప్రణవాలు అంటే ఆద్యంతములయందు ప్రణవాలు రెండు, గాయత్రీ మంత్రపాదత్రయాదిన ఉన్న ప్రణవాలు మూడు. మొత్తం ఐదు.

ఏకప్రణవము అంటే గాయత్రీ మంత్రంలోని మూడుపాదాలూ వ్యాహృతి త్రయములో కలిసిపోతాయి. వ్యాహృతిత్రయము అకార ఉకార మకారములలో కలిసిపోతుంది. ఇప్పుడు మిగిలేది ఓంకారము ఒక్కటే. ఇదే యతులు ఉపాసించతగినది.

గాయత్రీ మంత్రానికి ఎంత అర్థం ఉన్నదో పంచదశీ మంత్రంలోగల ఒక పాదానికే అంత అర్థం ఉంది. కాబట్టి పంచదశిని ఒకసారి జపిస్తే పూర్ణగాయత్రిని మూడుసార్లు జపించిన ఫలితం వస్తుంది. గాయత్రీ మంత్రంలోని మొదటి మూడు పదములకు సృష్టికర్త అయిన బ్రహ్మ అని అర్థము.

గాయత్రీ మంత్రంలో ఓంకారము తరువాత భూః భువః సువః అని మూడు వ్యాహృతులున్నాయి. వీటికి త్రికము అని పేరు. ఈ త్రికము అనేకార్థ బోధకము. అనేక భావనలకు, అనేక దిశలకు సంకేతము. ఇవి త్రిమూర్తులకు, సృష్టిస్థితి లయాలకు ప్రతీకలు. సత్వరజస్తమో గుణాలనే త్రివిధ గాయత్రి అంటారు.

భూః – బ్రహ్మ, భువః – ప్రకృతి, సువః – జీవుడు. ముల్లోకాలకూ ఈ త్రికము సంకేతము. అగ్ని వాయు సూర్యులకు ప్రతీక. విరాడ్రూపమైన భగవంతుని సంబంధమైన జ్ఞానాన్ని ప్రకాశింపచేసేది వ్యాహృతి.

భూర్భువస్సువః అనేవి బ్రహ్మయొక్క జ్ఞానదేహము నుంచి వ్యవహరింపబడటం చేత దీనికి వ్యాహృతులని పేరు వచ్చింది. భూర్భువస్సువములు బ్రహ్మస్వరూపము.

జలము ఓంకార రూపము. బ్రహ్మలేనిదే సృష్టిలేదు. వ్యాహృతులనుంచే అగ్ని, వాయువు, సూర్యుడు ఉద్భవించారు. ఈ వ్యాహృతులను జపించిన వారు సర్వవేద పారాయణ చేసిన ఫలితము పొందుతారు. వేదసారము ఉపనిషత్తులు. ఉపనిషత్సారము గాయత్రి సారము (వ్యాహృతిత్రయము)

**వ్యాహృతిత్రయము :** 1) ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి.
2) భూలోక, భువర్లోక, సువర్లోకములు.
3) కరణము, శరీరము, సంసారము.

స్వర్గ నరకాలు మానవుడే స్వయంగా సృష్టించుకుంటాడు. సత్త్వరజస్తమో గుణాలు బంధహేతువులు. వీటిని చక్కగా ఉపయోగించుకుంటే ముక్తికి కారణ మవుతాయి. త్రిమూర్తులయొక్క సృష్టి స్థితిలయల యొక్క తత్త్వము వ్యాహృతముల యందు నిగూఢమై ఉన్నది.

**తత్ :** గాయత్రీ మంత్రంలో తత్ అనే శబ్దము పరమాత్మనుద్దేశించి చెప్ప బడుతోంది. కాని పరమాత్మ రూపమైన వస్తువు సాధకుని దీక్షపైన, అతని కళ్ళలోని వెలుగుపైన ఆధారపడి ఉంటుంది. శబ్ద స్పర్శ రూప రస గంధములనబడే తన్మాత్రల చేత పరబ్రహ్మను సాధించటం సాధ్యంకాదు. అంతరాత్మ ద్వారానే అది సాధ్యం.

తచ్ఛబ్దముతో స్వయంభువమగు పరమాత్మ నిర్దేశింపబడిందని శంకర భాష్యలో చెప్పబడింది. ఓం తత్ సత్ అనే మూడు శబ్దములు పరబ్రహ్మ నిర్దేశకములవటం చేత 'తత్' బ్రహ్మస్వరూపము.

**సవితు :** సవిత్ర శబ్దానికి సూర్యుడని అర్థము, సూర్యుడు ప్రత్యక్ష దైవము. తేజస్వరూపి, పరమాత్మ తేజము స్థూలనేత్రాలకు సూర్యనారాయణమూర్తిగా గోచరిస్తుంది. ప్రకాశించే సూర్యగోళమే సూర్యుడు కాదు. తేజోమయుడైన సృష్టికర్తయే. 'సవిత' పరమాత్మ కనేక శక్తులు, రూపాలు ఉన్నాయి. వాటిలో తేజశ్శక్తులను సవిత అంటారు. అటువంటి సవితనే గాయత్రీ మంత్రంలో ఉపాసన చేస్తారు.

సవిత ప్రాణులను సృష్టిస్తుంది. సర్వభావాలను కలిగిస్తుంది. పరమాత్మయొక్క ముఖం తేజోమండలంచేత కప్పబడి ఉంటుంది. సూర్యమండలంలోనే అవ్యయుడైన పరమాత్మను ధ్యానించాలి.



సూర్యునివల్లనే సృష్టి జరుగుతున్నది. అతడే స్థితికర్త. అతని యందే లోకాలు లయమవుతున్నాయి. అతని తేజస్సు నాశరహితమైనది. త్రివేదరూపి, తేజోమయుడు, సప్తాశ్వరథము మీద పయనిస్తూ ఉంటాడు. త్రిమూర్త్యాత్మకుడైన సవిత్యునకు భిన్నమైన దేవుడు లేడు. ప్రాణము, చంద్రుడు, విద్యుత్తూ అన్నీ సూర్యుడే. సమస్త ప్రపంచమును సృష్టించి, పాలించి లయమొందించువాడు సూర్యుడే. బంగారు గడ్డము, బంగారు కేశములు కలిగి సూర్యమండలంలో కనిపిస్తున్నాడు. అతని కాలిగోరు నుంచి శిఖవరకు కాంతులచే ప్రకాశిస్తున్నాయి. లోకాలకు నేత్రమువంటివాడు, సృష్టి స్థితి లయాలకు కారణమైనవాడు, త్రివేద స్వరూపి, త్రిగుణ స్వరూపి, త్రిమూర్త్యాత్మకుడు అయిన సవిత్యునకు నమస్కారము.

**వరేణ్యమ్ :** స్వీకరించటానికి, దానము చెయ్యటానికి యోగ్యమైన దానిని వరేణ్యమంటారు. ధర్మము, కర్తవ్యము, అధ్యాత్మతత్త్వము, సచ్చిదానంద స్వరూపము, సత్యం శివం సుందరంవైపు మనలను నడిపించగల తత్త్వమే వరేణ్యమ్.

ఈశ్వర సంబంధమైన వరేణ్యశక్తి గాయత్రి యందున్నది. దీనివల్ల గాయత్రీ మంత్రోపాసకుని దృష్టి కోణము శ్రేష్ఠమవుతుంది. సంసారానికి భయపడనివారు, మోక్షగాములు సూర్యమండలంలో ఉన్న భర్గనామ తేజస్సును ప్రార్థించాలి. వరేణ్యము అంటే జనన మరణాది భయము నశించుటకు ప్రార్థింపతగినది. వరేణ్యము అంటే ప్రార్థించుటకు అర్హమైనది. అభేద జ్ఞానముచే తెలియతగినదే వరేణ్యము. సమస్త తేజములకన్నా శ్రేష్ఠమైనది, వర్ణింపతగినది, స్వర్గము, మోక్షము కోరువారు ప్రార్థింపతగినది.

**భర్గ :** చెడు నుండి, అజ్ఞానాంధకారము నుండి తప్పించి రక్షించే పరమేశ్వరుణ్ణి 'భర్గ' అంటారు. వరేణ్యశక్తి ఎంత అవసరమో భర్గ శక్తికూడా మనకు అంతే అవసరము. జీవితంలో మంచి చెడు అనే విషయాలు రెండున్నాయి. సద్విషయాలలో దైవశక్తులు, చెడ్డ విషయాలలో అసురశక్తులు ఉంటాయి. కాబట్టి చెడు విషయాలలో జాగర్త వహించవలసి ఉంటుంది.

సూర్యభగవానుని ఆత్మరూపము సర్వప్రాణులు ప్రార్థింపతగినది. చైతన్య లక్షణమైనది, తేజమైనది అయిన భర్గము (తేజస్సు) సేవింపదగినది. కాంతి రూపమవటం చేత భర్గ అని, పూర్ణ రూపముచే పురుషుడని, సర్వప్రాణి రూపి అవటంచేత ఆత్మ అని చెప్పబడుతుంది. ఈ భర్గము హృదయాకాశములోనూ,

బయట సూర్యమండలంలోనూ ప్రకాశిస్తుంది. సప్త స్ఫులింగములతో ప్రకాశించు అగ్ని, కాలాగ్ని రూపంలో ప్రకాశిస్తూ భర్గ అనే పేరుతో విరాజిల్లుతుంటుంది. ఈ భర్గము అన్నిటికన్న శ్రేష్ఠమైనది. పరిపూర్ణమైనది. అందుచేత పురుషుడని చెప్పబడుతుంది. సంసారపరమైన భయాన్ని తొలగించి, శుభాన్ని కలిగించటం చేత శివుడని చెప్పబడుతుంది. జనన మరణాది దుఃఖాలకు మూలకారణమైన పాపాలను నశింపచేసేదే భర్గము. ఆ విద్యను, దానివలన కలిగే పాపకార్యములను నశింపచేసే భర్గము స్వయంప్రకాశమైన బ్రహ్మతేజము. స్వప్రకాశముచే బాహ్యాంభ్యంతర ప్రపంచముల నుండి అంధకారమును తొలగచేయునది భర్గము. తేజోరూపమైన భర్గమే పరబ్రహ్మము. ఈశ్వరస్వరూపము, పురుష వాచ్యము, సత్యము, ధర్మరూపము, నాశరహితము అయిన భర్గమే ముక్తిహేతువైన విష్ణుతేజము. అదే శివుడని, శక్తి అని, సూర్యుడు అని, అగ్ని అని అంటారు. తేజోబలములను కోరువారికి భర్గోపాసన మిక్కిలి అవసరము. శారీరక, మానసిక, ఆర్థిక, చారిత్రక పుష్టి కలిగించునది భర్గము.

**దేవస్య :** సర్వప్రాణులలోను ఆత్మరూపమున ప్రకాశిస్తూ, కీర్తించబడుచూ, సర్వవ్యాప్తమైన వానిని దేవుడు అంటారు. సర్వప్రకాశుడు, చైతన్యరూపుడు, అఖండమైనవాడు, ఏకరూపము గలవాడు దేవుడు. ఒక్కదేవుడే సమస్త ప్రాణులలోనూ వ్యాపించి ఉండే ఆత్మ. అతడే కర్మలకు ప్రభువు. సర్వ కర్మలకు నివాస భూతుడు. స్వర్గమున ప్రకాశించేవాడు; ఎవరైతే అతణ్ణి ధ్యానిస్తారో, అతని హృదయంలో నివశించేవాడు దేవుడు.

**ధీమహి :** ధ్యానం చెయ్యటాన్నే ధీమహి అంటారు. మనం దేన్నయితే ధ్యానిస్తున్నామో, దానియందు మనస్సు లగ్నమవుతుంది. అప్పుడే ఆకాంక్ష అధికమవుతుంది. దానివల్లనే ప్రయత్నం జరుగుతుంది. దీనివల్లనే అభీష్టసిద్ధి జరుగుతుంది. అప్పుడే ధ్యానము సఫలమవుతుంది.

**ధియః :** 'ధీ' అంటే బుద్ధి. 'ధియః' అంటే బుద్ధులను ధర్మాది విషయకమే బుద్ధి. ధారణ చేసేదే బుద్ధి.

**యః :** యః అనే శబ్దానికి ఎవడైతే, ఏదైతే అని అర్ధము. ఈ సంకేతము పరమాత్మకు వర్తిస్తుంది. గాయత్రీమంత్రంలో ఇంతవరకు వర్ణించబడిన పరమాత్మయే ఇక్కడ చెప్పబడుతోంది. యఃశబ్దము ఆత్మరూపము. ఈ శుద్ధాత్మయే పరమాత్మ. అందుచేతనే యః శబ్దము దేవుని నిర్దేశిస్తుంది.



**నః :** నః అంటే మాయొక్క అని అర్థం. పరమాత్మ నుంచి మంచి బుద్ధి లభించటం తనకొక్కడికే కాక మానవ సమాజానికే కావాలనీ సూచించటానికే మాయొక్క (నః) అని చెప్పబడింది. దీనివలన గాయత్రీ మంత్రోపాసన చేసేవారు విశ్వమానవాళి యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వసుదైక కుటుంబం కోసం ధ్యానం చేస్తారు.

**ప్రచోదయాత్ :** ప్రచోదయాత్ అంటే ప్రేరేపించుట, పెంపొందించుట. గాయత్రీ మంత్రము చెయ్యటంలో ఉద్దేశ్యము లోకంలోని జనులందరికీ మంచి బుద్ధిని ప్రసాదించమని ప్రార్ధించటమే. ప్రచోదయాత్ అంటే మంచి బుద్ధిని ప్రేరణ చెయ్యమని పరమాత్మను ప్రార్ధించటం.

**కామయతే స కకారః కామో బ్రహ్మైవ తత్పరస్యార్థః ।**
**సవితుర్వరేణ్య మితివై సవితుః శ్రేష్ఠం ద్వితీయవర్ణార్థః ॥ 7**

పంచదశీ మహామంత్రంలోని క కారానికి సమస్త జగత్తునూ సృష్టించాలనే కోరిక గల బ్రహ్మ అని అర్థం. గాయత్రీ మంత్రంలోని మొదటి మూడు పదాలకు బ్రహ్మ అని అర్థం. రెండవ అక్షరమైన ఏకారము గాయత్రీ మంత్రంలోని సవితుః శ్రేష్ఠమైన అని అర్థం. మూడో అక్షరమైన ఈకారము గాయత్రీ మంత్రంలోని భర్గోదేవస్యధీ పరమేశ్వరుణ్ణి సూచిస్తుంది.

**యదేకాదశ మాధారం బీజం కోణత్రయాత్మకమ్ ।**
**బ్రహ్మాండాది కటాహాంతం జగ ద్వాపిచ దృశ్యతే ॥**

ఈ రకంగా శ్రీవిద్యలోని ప్రథమ కూటమిలోని రెండు అక్షరములూ, గాయత్రీ మంత్రంలోని ప్రథమ పాదముచేత తెలియబడు జగత్కారణభూతులైన కామేశ్వరీ కామేశ్వరులను చెబుతున్నది. వారిద్దరి యొక్క సామరస్యమే పరమశివుడు. అతని పరిణామమే జగత్తు. అతడే సమస్త బుద్ధులకూ ప్రేరకుడు, త్రిగుణాలకూ అతీతుడు. ప్రణవ స్వరూపుడు.

**సర్వాంతర్యామి దధద్భర్గోదేవస్య ధీతితుర్యార్థః ।**
**పృథ్వీ మహీలకారః తృతీయ తుర్యాంఘ్రిబోధికామాయా ॥ 8**

గాయత్రీ మంత్రంలోని మహి అనే శబ్దము శ్రీవిద్యలోని లకారాన్ని సూచిస్తుంది. లకారము పృథివీ బీజం కాబట్టి, దానినుంచి పంచ భూతాత్మకమైన జగత్తు తెలుస్తుంది.

ఈ జగత్తంతా పరమేశ్వరుని వల్ల సృష్టించబడింది. ఆ పరమేశ్వరుని ప్రతిబింబమే మహా త్రిపురసుందరి.

**"ధియో యోనః ప్రచోదయాత్, పరోరజసిసావదోం"** అను గాయత్రీ మంత్రంలోని చివరి రెండు పాదాల అర్థము, శ్రీవిద్యలోని హ్రీంకారార్థమూ ఒక్కటే.

**"తృతీయ తుర్యాంఘ్రి బోధికామాయాం"** అంటే గాయత్రీ మంత్రంలోని మూడు, నాలుగు చరణములచే చెప్పబడు అర్థము, హ్రీంకారార్థము ఒక్కటే. మూడవ పాదము **"ధియో యోనః ప్రచోదయాత్"** అంటే పరమేశ్వరుడు సర్వాంతర్యామియై మా బుద్ధులను ప్రేరణ చేయుగాక.

**"పరోరజసిసావదోం"** అనే నాల్గవ పాదానికి త్రిగుణాతీతుడైన పరమేశ్వరుడు, మాటలచేత వర్ణింపశక్యము కానివాడు, లక్షణములచేత మాత్రమే చెప్పదగినవాడు, ఓంకార స్వరూపుడు అని అర్థము. **'యతో వాచో నివర్తంతే'** అంటే మాటలచేత చెప్పనలవి కానివాడు.

**"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ, వేదైశ్చ సర్వైరహమేవ వేద్య"** అంటే లక్షణముల చేత తెలియ తగినవాడు. మాయాబీజమైన హ్రీంకారానికి హృదయమని అర్థము. ఈ కారానికి సర్వాధారుడు, సర్వాంతర్యామి అయిన శివుడు అని అర్థము. ఈ రకంగా పూర్ణ గాయత్రీ మంత్రంయొక్క అర్థం శ్రీవిద్యలోని ప్రథమకూటమిలో చెప్పబడింది.

జగత్తును సృష్టించాలనే కోరిక గల కామేశ్వరుడు, జగత్తుకు కారణభూతురాలయిన కామేశ్వరి, వీరిద్దరి సామరస్య స్వరూపమయిన పరమశివతత్త్వము, సర్వ ప్రపంచరూపంగా పరిణమించి సర్వాంతర్యామి అయి, సర్వాధారమయింది. కాబట్టి మన బుద్ధి, ప్రవృత్తులను పరబ్రహ్మతత్త్వమందు ప్రేరణ చేయగాక అని శ్రీవిద్యలోని మొదటి కూటానికి అర్థము.

**త్రిపదీ త్రివర్ణ బోధ్యా తుర్యస్తదుపరి షడక్షరీ గమకః ।**
**అథ తార్తీయే వర్ణద్వితీయం త్రిపదీ షడక్షరీ గమకమ్ ॥** 9

గాయత్రీ మంత్రంలోని "తత్సవితుర్వరేణ్యం" అనే మూడుపదాల అర్థము శ్రీవిద్యలోని రెండవ కూటమియొక్క మూడు అక్షరములకు (హసక) చెప్పబడింది.



గాయత్రిలోని "భర్గోదేవస్య ధీమహి" అనే ఆరు అక్షరాల అర్థం రెండవ కూటమిలోని హకారం చెబుతున్నది. గాయత్రీ మంత్రంలోని తత్సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీ అనే పదాల అర్థం శ్రీవిద్యలోని మూడవకూటమిలోని స క అనే అక్షరాలకు వర్తిస్తుంది.

**కూటద్వితయే శేషం పూర్వవదున్నే యమితితు విద్యాయాః ।**
**గాయత్ర్యర్థ స్త్రిపురోపనిషది కథితః తద్దైవ భాగవతే ॥** 10

శ్రీవిద్యలోని రెండు, మూడు కూటములందు గల 'లహ్రీం' అనే రెండు అక్షరాలకూ, గాయత్రీ మంత్రంలోని 'మహిధియోయోనః ప్రచోదయాత్। పరోరజసి సావదోం భాగానికి గల అర్థమే చెప్పబడింది.

## 2. భావార్థము

**వామేచ్ఛే బ్రహ్మభారత్యౌ జ్యేష్ఠా జ్ఞానే హరిక్షితీ ।**
**రౌద్రీక్రియే శివాపర్ణే ఇత్యేతన్మిథునత్రయమ్ ॥** 11

**త్రిభిః కూటైః క్రమాద్వాచ్యం ఈకారత్రితయేన తు ।**
**ఏతత్త్రయం సమష్ట్యాత్మ వాచ్యం శాంతాంభికాత్మకమ్ ॥** 12

ఇప్పుడు ఈ శ్లోకంలో పంచదశీ మహామంత్రానికి భావార్థం వివరిస్తున్నారు. భావార్థం చూడబోయే ముందు అసలు సృష్టి ఏ రకంగా జరిగిందో చూద్దాం. నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు పరబ్రహ్మ. అటువంటి పరబ్రహ్మ సృష్టి చెయ్యాలనే సంకల్పంతో తనను తాను రెండు భాగాలుగా చేసుకున్నాడు. అవే ప్రకాశాంశ, విమర్శాంశ. వీరే శివశక్తులు. కామేశ్వరీ కామేశ్వరులు. ప్రకృతి పురుషులు. వీరివల్లనే ఈ చరాచర జగత్తంతా ఆవిర్భవించింది. వీరే త్రిమూర్తులు, త్రిశక్తులుగా అవతరించి సృష్టి కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇప్పుడు ప్రకాశాంశ మూడు రూపాలయింది. అవే వామ, జ్యేష్ఠ, రౌద్రీశక్తులు. ఇవి పురుష రూపంలో బ్రహ్మ, విష్ణు, రుద్రులయినారు. ఈ మూడు శక్తులు కలిపి సమిష్టిగా 'అంబిక' అనబడుతుంది. అలాగే విమర్శాంశ కూడా మూడురూపాలు అయింది. అవే ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు. ఇవి స్త్రీ రూపాలు. వీరే సరస్వతి, లక్ష్మీ, కాళి స్వరూపాలు. ఈ మూడు శక్తులు కలిసి సమిష్టిగా 'శాంత' అనబడుతుంది.

ఇప్పుడు 11వ శ్లోకంలో చెప్పినట్లుగా

| | |
|---|---|
| వామ, ఇచ్ఛా | – బ్రహ్మ, భారతి |
| జ్యేష్ఠా, జ్ఞాన | – విష్ణువు, పృథివి |
| రౌద్రీ, క్రియా | – (శివుడు) రుద్రుడు, గౌరి |

ఈ రకంగా వ్యష్టిగా మూడు మిథునాలు కాగా, సమిష్టిగా శాంత, అంబికలు నాల్గవ మిథునము అవుతున్నారు.

బ్రహ్మ విష్ణువు రుద్రుడు వీరిని వీరేంద్రులు అంటారు. లలితా సహస్రంలో **మహా వీరేంద్ర వరదా** అని 494వ నామము. మహావీరేంద్రులు అంటే వీరులైన వారిలో కూడా శ్రేష్ఠులు. చాలా గొప్ప పండితులు. ఒకే మాటకు రెండు వైపులా అర్థం చెప్పి వాదించగలవారు అని అర్థం.

మహావీర అంటే సోమయాగంలో ఉపయోగించే పాత్ర. మహావీరము అనేది పానపాత్ర విశేషము. మహావీరులు అంటే ఎడతెరపి లేకుండా బ్రహ్మానందాన్ని అనుభవించేవారు. అన్నింటికీ సాక్షి ఆ పరబ్రహ్మే అని తెలిసినవారు. తురీయస్థితి తెలిసినవారు.

శ్రీవిద్యోపాసకులను వీరులు అంటారు. వారిలో కూడా మహావీరులు మనువు, చంద్రుడు, కుబేరుడు మొదలైనవారు. అలాగే సరస్వతి, పృథివి, గౌరి. వీరిని యోగినులు అంటారు. యోగిని అంటే మంత్రసిద్ధి పొందిన సన్యాసిని, తురీయస్థితి తెలిసిన స్త్రీ, చరాచర జగత్తుకు కారణము ఆ పరమేశ్వరస్వరూపమే అని తెలిసిన సన్యాసిని.

ఇప్పుడు ఈ శ్లోకంలో పంచదశీ మహామంత్రానికి అర్థం. ఈ 'త్రిమూర్తి ద్వంద్వమే' అంటున్నారు. ఎలాగో చూద్దాం. అందులో ....

**కకారో బ్రహ్మ రూపశ్చ ఏకారో భారతీమతమ్**
**ఈకారో విష్ణు రూపశ్చ లకారో పృథివీమతమ్**
**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥**

కకారము – బ్రహ్మ, ఏకారము – భారతి, ఈకారము – విష్ణువు, లకారము – పృథివి, హకారము – రుద్రుడు, రకారము – రుద్రాణి.



అంటే ప్రథమకూటమిలో ఉన్న అక్షరాలకు అధిపతులు త్రిమూర్తి ద్వంద్వము. అనగా త్రిమూర్తులు, త్రిశక్తులు. అలాగే రెండు మూడు కూటములయందు కూడా లెక్కపెట్టాలి. రెండవ కూటమిలో రెండు హకారాలున్నాయి. వాటిలో రెండవదాన్ని అక్కడ నుంచి తీసివేసి, మూడవ కూటమికి ముందు చేర్చాలి. అప్పుడు రెండు, మూడు కూటముల యందుండే అక్షరాలు ఒకటే అవుతాయి హసకల హ్రీం. ఇలా ఏర్పడిన ఈ కూటములలోని అక్షరాలకు దేవతలు ఎవరో చూడండి.

**హకారో బ్రహ్మరూపశ్చ సకారో భారతీ మతమ్**
**కకారో విష్ణురూపశ్చ లకారో పృథివీ మతమ్**
**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥**

హకారము – బ్రహ్మ, సకారము – భారతి, కకారము – విష్ణువు, లకారము – పృథివి, హకారము – రుద్రుడు, రకారము – రుద్రాణి.

ఈ రకంగా పంచదశీ మహామంత్రంలోని మూడు కూటములయందు ఉన్న అక్షరాలకు అధిదేవతలు త్రిమూర్తి ద్వంద్వము తప్ప వేరుకాదు. ప్రతికూటమి చివర హ్రీంకారమున్నది. ఇప్పటివరకు ఇందులోని హకార, రకారాలనే చెప్పాం. మరి ఈం కారము ఏమైంది? గతంలో మనం వామ, జ్యేష్ఠ, రౌద్రశక్తులే త్రిమూర్తులనీ సమిష్టిగా వీరిని 'అంబిక' అంటారని అలాగే విమర్శశక్తి భాగాలయిన ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులే త్రిశక్తులనీ, సమిష్టిగా వీరిని 'శాంత' అంటారని చెప్పుకున్నాం. ఇప్పుడు హ్రీంకారంలో ఉన్న ఈం కారమే ఈ మూడు వ్యష్టిరూపముల యొక్క సమిష్టి రూపమైన శాంత, అంబికలు. ఈరకంగా పంచదశీమహామంత్రంలోని ప్రతికూటమి లోని అక్షరాలకు దేవతలు త్రిమూర్తి ద్వంద్వము. కాగా ఈం కారము శాంత అంబికల స్వరూపమైన నాల్గవ మిథునము. అంటే ప్రతికూటమికి దేవత వ్యష్టిగాను, సమిష్టిగాను త్రిమూర్తి ద్వంద్వమే. అవే ప్రకాశాంశ విమర్శాంశలు. శివశక్తులు, కామేశ్వరి కామేశ్వరులు. అంటే పంచదశీమహామంత్రానికి అధిదేవత ఆ పరమేశ్వర స్వరూపము తప్ప వేరుకాదు.

**యద్వాగేస్సకల బ్రహ్మప్రభృతీనాం త్రయంత్రయమ్ ।**
**త్రికూటవాచ్యం మాయాయాః తురీయం మిథునం మతమ్ ॥ 13**

ఈ విషయాన్నే ఈ 13వ శ్లోకంలో వివరిస్తున్నారు. మూడు కూటములయందు బ్రహ్మ, భారతి, విష్ణువు, పృథివి, రుద్రుడు, రుద్రాణి. ఈ మూడు మిధునములు చెప్పబడగా ఈం కారమునందు నాల్గవదైన శాంత, అంబికల యొక్క మిధునము చెప్పబడింది.

**వామేచ్ఛాద్యాష్షడీంకార ఇతి సప్తభిరక్షరైః ।**

**త్రిరావృత్తైరియం విద్యా సంజాతా తేన తన్మయీ ॥** 14

వామ, జ్యేష్ఠ, రౌద్రీ శక్తులు, ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు ఇవి ఆరు అక్షరాలకు సరిపోగా, ఏడవది ఈ కారము. ఈ రకంగా మూడు ఆవృతులు చెప్పబడ్డాయి. అంటే మంత్రంలో పైన చెప్పినట్లుగా మూడు కూటములలోను చెప్పబడ్డాయి. అంటే, ఒక మాటను పదేపదే చెప్పటం జరిగింది. కాబట్టి పంచదశీ మహామంత్రానికి దేవత ఆ పరమేశ్వరి తప్ప వేరు కాదు.

**'సత్యం సత్యం పునః సత్యం.'** ఇది ముమ్మాటికీ నిజము.

**వామాది సప్తశక్తీనాం సమష్టిః పరదేవతా ।**

**షట్త్రింశ త్తత్త్వరూపాఽస్మాన్మాత్రయాఽపి న భిద్యతే ॥** 15

వామాది సప్తశక్తుల యొక్క స్వరూపమే పరదేవత. వామాది సప్తశక్తులు అంటే వామ, జ్యేష్ఠ, రౌద్ర, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు ఆరు. వీటి సమిష్టిరూపం శాంత అంబికల రూపం. అది ఏడవది. ఈ సప్తశక్తుల స్వరూపమే పరమేశ్వరి. ఆవిడ 36 తత్త్వముల స్వరూపము. 36 తత్త్వములు అంటే 1. శివుడు, 2. శక్తి, 3. సదాశివుడు, 4. ఈశ్వరుడు, 5. శుద్ధవిద్య, 6. మాయ, 7. కళ, 8. విద్య, 9. రాగము, 10. కాలము, 11. నియతి, 12. పురుషుడు, 13. ప్రకృతి, 14. అహంకారము, 15. బుద్ధి, 16. మనస్సు, 17. చెవి, 18. చర్మము, 19. కన్ను, 20. నాలుక, 21. ముక్కు, 22. మాట, 23. చేయి, 24. కాలు, 25. పాయువు, 26. ఉపస్థ, 27. శబ్దము, 28. స్పర్శ, 29. రూపము, 30. రసము, 31. గంధము, 32. ఆకాశము, 33. వాయువు, 34. అగ్ని, 35. నీరు, 36. పృథివి.

పైన చెప్పిన సప్తశక్తుల స్వరూపము, 36 తత్త్వముల స్వరూపము అంతా పరమేశ్వరియే. ఆవిడే పంచదశీ మహామంత్రానికి అధిదేవత.



ఈ జగత్తంతా శివశక్తుల స్వరూపమే. వేదంలోనే కాదు. పురాణాలలో కూడా ఈ విషయం చెప్పబడింది. శివుడు లేకుండా శక్తిగాని, శక్తి లేకుండా శివుడుగాని ఉండరు.

**పరోఽపి శక్తిరహితః శక్త్యాయుక్తో భవేద్యపి ।**

**సృష్టి స్థితిలయాన్ కర్తు మశక్తః శక్త ఏవహి ॥**

పరుడు కూడా శక్తిరహితుడైనట్లైతే సృష్టి, స్థితి, లయాలు చెయ్యలేడు. శక్తితో కలిస్తేనే వాటిని చెయ్యగలుగుతాడు. మానసోల్లాసము అనే గ్రంథంలో ...

**యేఽపి బ్రహ్మాదయోదేవా భవంతి వరదాయినః ।**

**త్వద్రూపం శక్తిమాసాద్యతే భవంతి వరప్రదః ॥**

**తస్మాత్ త్వయేవ సర్వత్ర కర్మణాం ఫలదాయినీ ॥**

శివుడు, శక్తి ఈ ఇద్దరూ వేరు వేరు కాదు. ఇద్దరూ ఒక్కటే. శివుడు లేకుండా శక్తి గాని, శక్తి లేకుండా శివుడుగాని ఉండరు.

**తంతుమాన్ పటః** – నూలుపోగులు కలది వస్త్రము. **మృద్వాన్ ఘటః** – మట్టితో తయారైనది కుండ. అలాగే శక్తి గలవాడే శివుడు. శివుడే శక్తి. శక్తే శివుడు. ఇద్దరూ ఒక్కటే. ఉపాసకులు కేవలము తమ వాసనాభేదములచేత భేదాలు సృష్టిస్తున్నారు. 'పరిమళ' అనే గ్రంథంలో చెప్పినట్లుగా

**అలేఖ్యవిశేష ఇవ గజవృషభయోర్ద్వయోః ప్రతిభాసమ్ ।**

**ఏకాస్మిన్నేవార్ధే శివశక్తి విభాగ కల్పనాం కుర్మః ॥**

ఒక బొమ్మను చూసి కొందరు శివుడు అన్నారు. మరి కొందరు శక్తి అన్నారు. ఉన్నది మాత్రం ఒకే బొమ్మ. మీ మీ భావనలను బట్టి దాన్ని పిలుస్తున్నారు అంతే. అదే పరమేశ్వర తత్త్వము. 'మాతృకా హృదయము' అనే గ్రంథంలో మనం మాట్లాడే భాషలో కూడా

**కకారాది క్షకారాంతా వర్ణాస్తే శివరూపిణః ।**

**అకారాదివి సర్గాంతాః స్వరాః షోడశ శక్తయః ॥**

అ నుంచి అః వరకు ఉండే అచ్చులు శక్తిరూపాలు. క నుంచి క్ష వరకు హల్లులు శివరూపాలు. ఈ రెండూ కలిస్తేనే కాని అక్షరం పూర్తి కాదు. రుద్రయామళంలో చెబుతారు చూడండి.

**శక్తిః ప్రాణశ్చ జీవశ్చ మంత్రోనాదః శివోరవిః**

మంత్రశాస్త్రంలో కూడా శక్తియే ప్రాణము, జీవము అవుతున్నది. అందుకే శంకర భగవత్పాదులవారు తమ సౌందర్యలహరిలోని మొదటి శ్లోకంలో

**శివ శక్త్యాయుక్తోయది భవతి శక్తః ప్రభవితుం**
**న చే దేవం దేవో నఖలు కుశలః స్పన్దితు మపి ।**
**అతస్త్వా మారాధ్యాం హరిహర విరఞ్చాదిభిరపి**
**ప్రణన్తుం స్తోతుం వా కథ మకృతపుణ్యః ప్రభవతి ॥**

అమ్మా ! ఓ పరమేశ్వరీ ! సర్వమంగళకారకుడైన శివుడు కూడా జగన్నిర్మాణ శక్తివైన నీతో కూడితేనే కాని ఈ జగత్తులను నిర్మించలేడు. నీతో కలువకపోయినట్లైతే అతడు కదలటానికి కూడా శక్తి లేనివాడవుతాడు. కాబట్టి త్రిమూర్తులచేత కూడా పూజింపబడే నీకు నమస్కరించాలన్నా, నిన్ను పూజించాలన్నా, నిన్ను స్తుతించాలన్నా, కనీసం నీ పేరు తలచాలన్నప్పటికీ కూడా, గత జన్మలలో పుణ్యం చెయ్యనివాడు సమర్థుడు కాదు. అంటే పూర్వజన్మ సుకృతం లేనిదే నిన్ను అర్చించటం కాదు కదా, కనీసం నీ పేరు తలచటానికి కూడా అర్హత ఉండదు అన్నారు.

కాబట్టి శివుడే శక్తి, శక్తే శివుడు. వీరిద్దరి స్వరూపమే మంత్రము. శివశక్తులు అంటే ప్రకాశాంశ, విమర్శాంశలే. ఆ రెండింటి కలయికయే పరమేశ్వర స్వరూపము. అదే మంత్రము. అదే జగత్తు. అంటే నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు అయిన పరబ్రహ్మ ఈ జగత్తును సృష్టించటం కోసం తనను తాను రెండు భాగాలుగా చేసుకున్నాడు. అందులో ఒకటి స్త్రీ, రెండవది పురుషుడు. స్త్రీ రూపమే శక్తి. రెండవ రూపము పురుషుడు. అదే శివుడు. కాబట్టి శివశక్తుల రూపమే పరమేశ్వర స్వరూపము. ఆ శివశక్తుల రూపమే చరాచర జగత్తు. అంటే ఈ జగత్తంతా కూడా పరమేశ్వర రూపమే. ఇంకా వివరంగా చెప్పాలంటే చరాచర జగత్తు, పరమేశ్వరి, ఆమెకు ప్రతిరూపమైన మంత్రము, ఈ మూడు ఒకటే. అంటే 1. పరమేశ్వరి, 2. జగత్తు, 3. మంత్రము. ఈ మూడు ఒకటే అని చెప్పటమే పంచదశీ మహామంత్రానికి "భావార్థము." అంతేకాదు. శక్తి ధర్మస్వరూపము. శివుడు అధర్మ స్వరూపుడు. పరమేశ్వర స్వరూపానికి ధర్మాధర్మాలు అనేవి ఉండవు. పాపపుణ్యాలు అసలే ఉండవు. అందుకే లలితా సహస్రంలోని 255వ నామం **ధర్మాధర్మ వివర్జితా!** అని చెప్పబడింది.



అయితే ఏది ధర్మం ? ఏది అధర్మం ? ఇష్టాన్ని పొందించేది ధర్మం. అయిష్టాన్ని కలిగించేది అధర్మం. ఇది ఒకవ్యక్తికి కాదు. సంఘాన్ని, లోకాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలోచించాలి. ఈ రకంగా ధర్మాధర్మాలు లేనివాడు శివుడు. జీవి తానుచేసిన కర్మను అనుభవించటం కోసం అనేక జన్మలు ఎత్తుతుంటాడు. ఈ రకంగా జీవికి జనన మరణాలను ప్రసాదింపచేసేది శక్తి. సంసార లంపటంలో పడేస్తుంది. అందుకే ఆవిడ విషము. జనన మరణాదులు లేనివాడు శివుడు. అమృతతుల్యుడు. పరమేశ్వరుని శరీరంనుంచే ఈ చరాచరజగత్తంతా ఆవిర్భవించింది. అందుకే ఆవిడ **"విశ్వరూపా"** అనబడుతున్నది. పంచదశీ మహామంత్రం ఆ పరమేశ్వరియొక్క రూపం. పరమేశ్వరి రూపం ఈ విశాల విశ్వం. కాబట్టి పంచదశీ మహామంత్రము, పరమేశ్వరి, చరాచర జగత్తు. ఈ మూడు ఒక్కటే అని గ్రహించాలి. (ఇక్కడ పరమేశ్వరి అంటే శివశక్తుల స్వరూపము) అందుకే శ్రీవిద్య **"విశ్వరూపిణీ విద్య"** అవుతున్నది.

మంత్రంలోని ప్రతి అక్షరానికీ ఒక దేవత ఉన్నది. ఆ దేవత పరమేశ్వరి ప్రతిరూపము. అందువల్లనే శ్రీవిద్యకు, దేవతకు, ఈ విశాల విశ్వానికీ, భేదము లేదని చెప్పబడింది. ఇదే ఈ శ్లోకాలకు అర్థము.

అసలు సృష్టి అనేది ఏ రకంగా జరిగిందో చూద్దాం. ఇక్కడ ప్రకాశ బిందువు, విమర్శబిందువు, మిశ్రమ బిందువులను వివరిస్తూ కామకళా నిరూపణము, బిందుత్రయము మొదలైన విషయాలను పుణ్యానంద మునీంద్రులు తన **'కామకలావిలాసము'** అనే గ్రంథంలోని మొదటి పాదంలో వివరించాడు.

పుణ్యానంద మునీంద్రుడు ఒకరోజు సాయంత్రం తన ఆశ్రమ ప్రాంగణంలో కూర్చుని ఉండగా, ఆకాశంలో రెండు హంసలు ఆశ్రమం మీదుగా వెడుతూ ఉన్నాయి. అందులో ఆడుహంస తన భర్తతో "నాథా ! లోకంలో ఏ విషయాన్ని తెలుసుకోవటం వల్ల అన్ని విషయాలు తెలుస్తాయో, దాన్ని వివరించవలసింది" అని అడిగింది. ఆ మాటలు విన్న మగహంస "దేవీ ! కుమ్మరివాడు మట్టిని తెచ్చి, తొక్కి దానితో కుండలు, బానలు, చట్లు ఇలా అనేకమైన పాత్రలు తయారుచేస్తాడు. కాని ఆ పాత్రలన్నింటిలోనూ ఉండేది మట్టే. అలాగే కంసాలివాడు బంగారాన్ని కరిగించి అనేక రకాలైన ఆభరణాలు తయారుచేస్తాడు. ఇక్కడ ఆభరణాలు వేరైనా, వాటన్నింటిలోనూ ఉండేది బంగారమే" అన్నది. ఆ మాటలు వినగానే ఆడహంస "స్వామీ ! తెలిసింది. ఈ చరాచర జగత్తుకూ ఆధారము ఆ పరమేశ్వరుడే. కాబట్టి, అతణ్ణి గురించి తెలుసుకున్నట్లైతే, సర్వమూ తెలుస్తుంది." అన్నది. ఇలా

మాట్లాడుకుంటూ, ఆ హంసలు వెళ్ళిపోయాయి. వాటి సంభాషణ శ్రద్ధగా ఆలకించిన పుణ్యానందముని ఆ హంసలు దహరాకాశంలో ఉండే శివశక్తులుగా భావించి, వారిచ్చిన సందేశం ఆధారంగా 'కామకలావిలాసము' అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ గ్రంథం మొత్తం 1. తురీయపాదము 2. అవిద్యాపాదము 3. విద్యాపాదము 4. ఆనందపాదము అని నాలుగు భాగాలుగా, 55 సూత్రాలతో ఉంటుంది. శ్రీవిద్యోపాసకులకు "కామకలావిలాసము" ఉత్తమోత్తమమైన గ్రంథము. దీనికి నేను తెలుగులో వ్రాసిన వ్యాఖ్యయే **"శ్రీవిద్యా సర్వస్వము"** ఇందులో 1 నుంచి 8 వరకు సూత్రాలు తురీయపాదము. అందులో ప్రకాశబిందువు, విమర్శ బిందువు, మిశ్రమ బిందువు కామకళ నిరూపించబడ్డాయి.

సృష్టి ప్రారంభంలో నామరూపాలు లేవు. ఉన్నది ఒక్కటే పరమేశ్వర స్వరూపం. అదే ప్రకాశాంశ. ఈ ప్రకాశబిందువు సృష్టికి ఆదివస్తువు. అందుకనే దానిని సర్వ కారణంగా చెప్పటం జరిగింది. విమర్శశక్తి ప్రకాశబిందువులో అంతర్లీనంగా ఉన్నది. ఈ విమర్శశక్తియే సృష్టికి కారణము. ప్రకాశ, విమర్శ బిందువులే శివశక్తులు, కామేశ్వరీ కామేశ్వరులు. ఇక్కడ రెండు రూపాలు లేవు. ఉన్నది ఒక్కటే. ఈ జగత్తును సృష్టించటం కోసం ఆ రూపము రెండుగా మారింది. చిన్న విత్తనంలో అతిపెద్దదయిన మఱ్ఱిచెట్టు ఎలా దాగిఉన్నదో, అలాగే విమర్శశక్తి లోపల భావిజగత్తంతా దాగి ఉన్నది. ఈ సృష్టికి కారణం ఎవరు ? అన్నప్పుడు శివశక్తులు ఇద్దరూ కారణమే. వారిద్దరూ కలిస్తేనే ఈ జగత్తు సృష్టించబడుతుంది. అంతే కాని, వీరిద్దరిలో విడివిడిగా ఏ ఒక్కరికీ ఆ శక్తిలేదు.

ప్రకాశబిందువు బ్రహ్మస్వరూపం. ఇది చంద్రమండలము. దీని బీజం అకారము. విమర్శబిందువు శక్తి స్వరూపం. అగ్నిమండలం. దీని బీజం హకారము. వీరిద్దరి సామరస్యమే 'అహం' అనే శబ్దము. ఇదే పరబ్రహ్మ స్వరూపము. అహం అనే జ్ఞానానికి నిర్మలమైన శక్తి అద్దంలాంటిది. అద్దంలో మన ప్రతిబింబాన్ని చూసినప్పుడు, అది మనమే, అని ఎలా తెలుసుకుంటామో, అలాగే పరమేశ్వరుడు తన ఆత్మరూపిణిని చూసి, నేను సర్వపరిపూర్ణుణ్ణి అనుకుంటున్నాడు. శక్తికి శివ సంబంధం లేనిదే ఈ జగత్తును సృష్టించలేదు. అలాగే శివుడికి పరాశక్తి సంయోగం లేనిదే స్వరూపజ్ఞానం కలగదు. కాబట్టి శివశక్తులు అనబడే కామేశ్వరీ కామేశ్వరుల వల్లనే ఈ జగత్తు సృష్టించబడుతున్నది.



పరబ్రహ్మ స్వరూపం "నిజ సుఖమైనది", సుఖము రెండు రకాలు 1. క్షణికము 2. శాశ్వతము. క్షణికమైన సుఖము వస్తువులవలన, ప్రాణులవలన పొందేది. కేవలము ధనార్జన, స్త్రీ సంభోగము వల్లనే సుఖమున్నదనుకొంటే అది తప్పు. ఈ సుఖాలేవీ శాశ్వతం కావు. శాశ్వతమైనది బ్రహ్మానందం. అదే నిత్యము, సత్యము. దీన్నే 'నిజసుఖము' అంటారు. శక్తిని ఆరాధించటంవల్లనే ఈ సుఖం వస్తుంది. ఆ శక్తికి ఆద్యంతాలు లేవు. ఆమె అవ్యయ, నిత్య. ఆమెతో పోల్చటానికి వేరే రూపంలేదు. వస్తువూ లేదు. ఆమెతో సమానమైనది కాని, అంతకన్న అధికమైనది కాని వేరే ఏదీలేదు. అందుకే ఆ పరాశక్తి 'నిరుపమాకార' అని చెప్పబడింది. ప్రకాశబిందువు నుండి విడివడి, సృష్టికి ప్రారంభము అవుతున్నది. అందుకే అది మూలశక్తి.

అసలు ఉన్నది ఒక్కటే బిందువు. అదే పరబ్రహ్మ. దానిలో నుంచి, సృష్టి ప్రారంభ సమయంలో విమర్శ బిందువు బయటకు వచ్చింది. ప్రకాశబిందువు యొక్క ప్రతిబింబమే విమర్శబిందువు. ప్రకాశబిందువు బింబము, విమర్శబిందువు ప్రతిబింబము. ఇదే మాయ. ఇంతవరకు మనం చెప్పుకున్నట్లుగా ప్రకాశబిందువు శివస్వరూపం, చంద్రమండలం, అకారరూపం. విమర్శబిందువు శక్తి స్వరూపం, అగ్నిమండలం, హకార రూపం. ఈ రెండు బిందువుల సంయోగంచేత మూడవదయిన సూర్యబింబము ఆవిర్భవిస్తున్నది. శక్తి అద్దం వంటిది. శివుడు శక్తిని చూసినప్పుడు, శివుని తేజస్సు వలన శక్తిలో ఈశ్వర ప్రతిబింబమే ప్రకాశిస్తున్నది. అప్పుడు శివశక్తులు రెండు, ఈ రెండింటి సమ్మేళనమువలన ఏర్పడిన మూడవ బింబము అంటే 'అ' 'హం' ఈ రెండూ కలిసి 'అహం' ఉత్పన్నమైంది. ఇది ఉత్పత్తికి దృష్టాంతము.

సూర్యుడి ఎదురుగా అద్దం పెట్టినట్లైతే, సూర్యబింబం అద్దం గుండా పరావర్తనము చెంది, దగ్గరలో ఉన్న గోడమీద పడుతుంది. ఇప్పుడు 1. సూర్యబింబము, 2. అద్దంలో ప్రతిబింబము, 3 గోడ మీద ఉన్న కాంతి బింబము అని మూడు బింబాలవుతాయి. మూడవ బింబం రావటానికి సూర్యుడు, అద్దము రెండూ సమానమైన కారణాలే. వీటిలో ఏది లేకపోయినా మూడవ బింబము రాదు. అలాగే సృష్టికి శివశక్తులిద్దరూ కారణమవుతున్నారు.

ఈ విధంగా తనలో లీనమైన జగత్తును బయటకు పంపాలి అనే సంకల్పం పరమాత్మలో కలిగినప్పుడు తనలో ఉన్న శక్తిని చూడటానికి ఆ శక్తికి అభిముఖంగా

ఉండి తన రూపంతో ఆ శక్తిలో ప్రవేశించి, శుక్లరూపంగా మారుతుంది. అప్పుడు బిందువులో రక్తరూపంలో ఉన్న శక్తి ప్రవేశిస్తుంది. అందువల్ల ఆ బిందువు మిశ్రమ బిందువు అవుతుంది. దానియందు హార్ధకళారూపమయిన ఒక పదార్థ విశేష ముంటుంది. ఈ విషయము గురుముఖైక వేద్యము. అంటే గురువుగారి ద్వారా తెలుసుకోవాలి. ఈ మిశ్రమబిందువు శివశక్తుల సామరస్యముతో కూడినది. దానినే **కామ, రవి, అగ్నిషోమ** మొ॥ పేర్లతో పిలుస్తున్నారు. ఈ మిశ్రమ బిందువులో శుక్లము చంద్రుడు, రక్తము అగ్ని. ఈ కారణంవల్లనే అమావాస్యనాడు రాత్రి సమయంలో సూర్యుడు చంద్రునిలో ప్రవేశిస్తాడు అని వేదం చెబుతున్నది. అందుచేతనే ఈ సమిష్టి లేదా మిశ్రమ బిందువును 'సూర్యుడు' అంటారు. ఈ రకంగా బిందువు, విసర్గ, హార్దకళ ఈ మూడు కలిపి 'కామకళ' అంటారు. వీటినే కామ, విసర్గ, హార్ద కళల మిశ్రమము అంటారు. వీటిలో మొదటిదయిన కామ, చివరదానిలోని కళ. ఈ రెండింటినీ కలిపితే 'కామకళ' అవుతుంది. ఇదే సమస్త సృష్టికీ బీజమవుతుంది. ఈ కామకళకే 'అహం' అని పేరు. అహం అనేది చిత్తస్వరూపము. చిత్తము జ్ఞానస్వరూపము. ఆ జ్ఞానము విమర్శయుక్తము. ఈ రకంగా విచారించటంవల్ల అహమనేది ఆత్మస్వరూపము, శివశక్త్యాత్మకము అని తెలుస్తోంది.

చతుర్దశభువనాలు నామము, రూపము అనే రెండు వస్తువులను కలిగి ఉన్నాయి. అందులో నామము శబ్దమయము. ఆ శబ్దము యాభై అక్షరాల సమూహము. ఈ అక్షరాలలో మొదటిది అకారము. చివరిది హకారము. అక్షరాలలో చివరిది క్షకారమైనప్పటికి అది క, ష ల మిశ్రమం కాబట్టి, దాన్ని వదలి వేయటం జరిగింది. ల ళ యోరభేధః అనే సూత్రం ప్రకారము లకార ళకారాలకు భేదం లేదు. కాబట్టి ళ కారాన్ని కూడా వదలివేసి, హకారమే చివరి అక్షరంగా తీసుకోవటం జరిగింది. ఇప్పుడు 'అహం' అంటే అకార హకారాల మధ్యన గల అక్షరాలన్నీ ఇందులోనే ఇమిడి ఉన్నాయి. కాబట్టి సకల లోకాలలోని శబ్ద జాలమంతా ఇందులో ఇమిడి ఉన్నది.

ఇక రూపాన్ని చూస్తే దీనికి చంద్ర సూర్యాగ్నులు కారణ వస్తువులు. అకారము చంద్రమండలము. అంటే అ నుంచి అః వరకు 16 అక్షరాలు చంద్రకళలు. హకారము అగ్నిమండలము. య ర ల వ శ ష స హ ళ క్ష. ఈ పది అక్షరాలు అగ్నికళలు. ఈ చంద్రాగ్నుల సమ్మేళనమే 'అహం'. ఈ రెండింటికీ మధ్యన ఉన్నది



సూర్యమండలము అని గుర్తించాలి. సూర్యకళలు పన్నెండు. ఇవి క నుండి ఠ వరకు పై నుంచి క్రిందికి, డ నుంచి భ వరకు క్రింది నుంచి పైకి రెండు ఆవృత్తులుగా చెప్పబడతాయి. కాగా క నుంచి మ వరకు గల ఇరవై ఐదు అక్షరాలలోను ఇరవై ఐదవదైన మకారము షోడశీకళగా చెప్పబడుతున్నది. చక్రార్చనలో చంద్రసూర్య అగ్నికళలను ఆవాహన చేసేటప్పుడు ఈ విషయం గ్రహించగలరు.

కామకళకు మూలభూతమైన బిందువు పరమాత్మ. ఇంతవరకు చెప్పిన ప్రకాశ విమర్శ మిశ్రమ రూప బిందువులను కామకళా స్వరూపమైన మహాత్రిపురసుందరి అంటున్నారు. ప్రకాశ విమర్శాంశలయిన కామేశ్వరీ కామేశ్వరులు అహమనే అక్షరాల సంయోగ రూపమైనటువంటి మిశ్రమ బిందువైన సూర్యమండలముగా ఉన్నారు. యోనిచక్రానికి మూడువైపులా మూడు బిందువులున్నాయి. దానిమధ్యలో ఉన్నది సంవిద్బిందువు. ఆ సంవిద్బిందువే పరాశక్తి.

కామకళకు అహం అని పేరు. ఇది శివశక్తుల స్వరూపము. అందుచేతనే వారిద్దరి నుంచి ఏర్పడ్డ ప్రతి చిన్న వస్తువు నుండి పెద్ద వస్తువుదాకా నేను, నేను అనే 'అహం' పదం వస్తున్నది. ఉదుంబర బీజం (మేడి గింజ) నుంచి వచ్చిన చెట్టు, కాయ, కాండము, కొమ్మ, ఆకు అన్నింటికీ ఉదుంబరమనే పేరు వచ్చినట్లుగానే, అహం నుంచి ఆవిర్భవించిన వాటన్నింటికీ అహం (నేను) అనేది వస్తున్నది.

**అహకారౌ శివశక్తీ శూన్యాకారౌ పరస్పరాశ్లిష్టౌ ।**
**స్ఫురణ ప్రకాశరూపౌ ఉపనిషదుక్తం పరంబ్రహ్మ ॥** **16**

**విశ్వసిసృక్షావశతః స్వార్థాం శక్తిం విలోకయద్బ్రహ్మ ।**
**ఇందుర్భవతి తమిందుం ప్రవిశతి శక్తిస్తు రక్తబిందుతయా ॥** **17**

**ఏతద్బిందు ద్వితీయం విసర్గ సంజ్ఞం హకార చైతన్యమ్ ।**
**మిశ్రస్తు తత్సమష్టిః కామాఖ్యో రవిః అకారచైతన్యమ్ ॥** **18**

**ఏషా అహంపద తుర్యస్వర కామకళాది శబ్దనిర్దేశ్యా ।**
**వాగర్థ సృష్టిబీజం తేన అహంతామయం విశ్వమ్ ॥** **19**

**అంత్య ప్రథమే మధ్యచతుర్థే మంత్రేఽపితౌ వ్యక్తౌ ।**
**తేనాంబామనుజగతా మభేద ఏవాత్ర భావార్థః ॥** **20**

అకారము శివరూపము, హకారము శక్తిరూపము అని గతంలో చెప్పుకున్నాం. ఇవి శూన్యమైన రూపం కలవి. ఈ రెండూ ఒకదానితో ఒకటి కలిసి స్ఫురణ ప్రకాశరూపాలైనాయి. ఈ రెండే ఉపనిషత్తులలో ప్రతిపాదించిన పరబ్రహ్మ స్వరూపము. సృష్టి ప్రారంభానికి ముందు చరాచర జగత్తునంతటినీ ఆక్రమించి ఉన్న పరమేశ్వర స్వరూపం ఇదే.

ఈ పరబ్రహ్మ జగత్తును సృష్టించాలనే కోరిక గలవాడై, తనలో లీనమై ఉన్న శక్తిని చూసి బిందువుగా మారాడు. ఆ బిందువులోకి శక్తి రక్తబిందువుగా ప్రవేశించింది. ఈ రెండు బిందువులే 'విసర్గ' అనబడతాయి. ఆ విసర్గయే హ కారానికి ప్రాణము. ఈ రెండు బిందువుల కలయికచే ఏర్పడిన సమిష్టిబిందువే – 'మిశ్రమబిందువు' అదే 'కామ' అనే పేరుగల రవిస్వరూపము. అది అకారానికి ప్రాణమువంటిది. ఇది అహం అనీ, కామకళ అని పిలువబడుతున్నది. నామరూపాత్మకమైన సృష్టికి ఇదే బీజము. కాబట్టి ఈ విశ్వమంతా "అహంతామయము."

పంచదశీ మహామంత్రంలో మూడవ కూటమిలోని మొదటి అక్షరమైన సకారంలోనూ, రెండవ కూటమిలోని నాల్గవ అక్షరమైన హకారంలోనూ గతంలో చెప్పిన అకార హకారాలు అభివ్యక్తమవుతున్నాయి.

సకారంలో అకారము భావించాలి. అందువల్ల పరదేవతా రూపమైన కామకళకు, పంచదశీ మహామంత్రానికీ, ముప్పది ఆరు తత్త్వాలకు ప్రతిరూపమైన జగత్తుకూ భేదం లేదు. ఇవన్నీ ఒకటే. ఈ రకంగా పరదేవతా, మంత్రము, జగత్తు అన్నీ ఒకటే అని చెప్పటమే పంచదశీమహామంత్రానికి భావార్థము. దీనిమీద ఇంకా వివరణ కావాలంటే కామకలావిలాసము, యోగినీ హృదయము చూడండి. వీటికి నేను వ్రాసిన వ్యాఖ్యలు **"శ్రీవిద్యా సర్వస్వము" "శ్రీవిద్యా హృదయము".**

కామకళనే పరాశక్తి అంటారు. సృష్టికాలంలో బయటకు వచ్చినప్పుడు మహాత్రిపురసుందరి అని పిలువబడుతుంది. సంహార కాలంలో పరబ్రహ్మలో ఐక్యమై ఓంకారమనబడుతున్నది. అంటే పరమేశ్వరిగా వ్యవహరించబడుతున్నది.

ఈ రకంగా చరాచర జగత్తు, పరమేశ్వరి, పంచదశీ మహామంత్రము. ఈ మూడూ ఒకటే అని చెప్పటమే భావార్థము.



## 3. సంప్రదాయార్థము

**వ్యోమాది జనకహకార సలార్ణైః ఘటనేన పంచభూతమయీ ।**
**పంచచతుస్త్రిద్వ్యేకకశబ్దాది గుణాత్మ పంచదశవర్ణా ॥ 21**

పంచభూతములయొక్క బీజములతో కూర్చబడిన ఈ విద్య పంచభూతాత్మకము అంటున్నారు ఈ శ్లోకంలో. అది ఎలా ? ఇప్పుడు ఈ జగత్తు ఎలా సృష్టించబడిందో చూద్దాం. మొదటగా అవ్యక్తము, అవ్యక్తము నుంచి మహత్తత్త్వము, మహత్తత్త్వము నుంచి అహంకారము, అహంకారము నుంచి పంచభూతాల సూక్ష్మరూపాలయిన తన్మాత్రలు, తన్మాత్రల నుంచి పంచభూతాలు ఆవిర్భవించినాయి. ఇది రూపాత్మకమైన సృష్టి. అలాగే నామాత్మకమైన సృష్టి కూడా జరిగింది. ఇందులో ముందుగా ఓంకారము వచ్చింది. ఓంకారం నుంచి అకార, ఉకార, మకారాలు వచ్చినాయి. వాటి నుంచి పదాలు, మాటలు, వాక్యాలు, మంత్రాలు, వేదాలు, వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు, సంగీతం, సాహిత్యం ఆవిర్భవించినాయి. ఇది నామాత్మకమైన సృష్టి. ఇప్పుడు మనం రూపాత్మకమైన సృష్టిని చూద్దాం. అహంకారం నుంచి ముందుగా పంచతన్మాత్రలు వచ్చినాయి. ఆ తరువాత వాటి స్థూలరూపాలయిన పంచభూతాలు ఆవిర్భవించినాయి. పంచభూతాలలో ముందుగా వచ్చింది ఆకాశము.

**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నిర్ ఆపః ఆపః పృథివీ**

ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలము, జలము నుంచి భూమి ఆవిర్భవించినాయి. నామాత్మక జగత్తు, రూపాత్మక జగత్తు అన్నప్పుడు ఆ రెండూ విడివిడిగా ఉండవు. కలిసే ఉంటాయి. ఎక్కడైతే నామము ఉంటుందో, అక్కడ ఒక రూపం ఉంటుంది. అలాగే ప్రతిరూపానికి ఒకపేరు అంటూ ఉంటుంది. ఈ రకంగా పేరు లేకపోయినట్లైతే, ఆ రూపాన్ని గుర్తించటం కష్టమవుతుంది. ఇక మంత్రశాస్త్రంలోకి వచ్చినట్లైతే సృష్టికి ఆధారమైన ప్రతిదానికీ ఒక బీజాక్షరం చెప్పబడింది. బీజాక్షరం అంటే ఏదో క్రొత్త అక్షరంకాదు. చదువరులైన మీకు తెలియని అక్షరం అంటూ ఎక్కడా లేదు. భాషకు ఉన్నవి యాభై అక్షరాలు. మంత్రశాస్త్రంలో అక్షరాల సంఖ్య యాభైఒకటి. ఈ అక్షరాలే తలకట్టు, దీర్ఘము, గుడి, గుడిదీర్ఘము. ద్విత్తము, సంయుక్తాక్షరము వగైరా, వగైరా కావటంచేత అనేకమవుతున్నాయి. బీజాక్షరాలు అంటే ఈ అక్షరాలేకాని క్రొత్తవి ఏవీలేవు. అని

చదువరులు గుర్తించాలి. ఈ జగత్తులో ప్రతిదానికీ ఒక బీజమున్నది అని చెప్పుకున్నాం కదా ! ప్రతిదేవతకూ ఒక బీజమున్నది. ఓంకారము – పరమేశ్వర బీజం, శ్రీం – లక్ష్మీబీజం, ఐం – వాగ్బీజం, క్లీం – మన్మథ బీజం, సౌః – శక్తి బీజం. అలాగే పంచభూతాలకు కూడా ప్రత్యేకమైన బీజాలున్నాయి.

**హకారో వ్యోమ సంభూతం కకారస్తు ప్రభంజనం**
**రేఫాదగ్నిః స్సకారశ్చ జలతత్త్వసముద్భవ**
**లకారత్ పృథివీజాతా తస్మాద్విశ్వమయీచసా ॥**

హకారము – ఆకాశబీజము, కకారము – వాయుబీజము, రకారము – అగ్నిబీజము, సకారము – జలబీజము, లకారము – పృథివీ బీజము.

ఈ రకంగా పంచభూతాల బీజాలయిన హ క ర స ల అక్షరములచేతనే పంచదశీ మహామంత్రము ఏర్పడింది. అంటున్నారు. అయితే ఇక్కడ ఒక చిన్న అనుమానం వస్తుంది. పంచభూతముల బీజాలతో ఈ మంత్రం ఏర్పడితే, పంచదశి మహామంత్రంలో ఐదు బీజాలే ఉండాలి. అంతేగాని పదిహేను అక్షరాలు ఎలా వస్తాయి? దీనికి సమాధానం కావాలి అంటే, సృష్టిక్రమంలోకి మళ్ళీ ఒకసారి వెళ్ళాలి. ఇందాక మనం పంచభూతాలు ఏర్పడ్డాయి అన్నాం. అయితే ఆ పంచభూతాలు 'పంచీకరణ' చెందటం వల్ల ఈ జగత్తు ఆవిర్భవించింది. ఈ 'పంచీకరణ'ను చాలా జాగ్రత్తగా చూడండి. ముందుగా పంచభూతాల లక్షణాలను చూద్దాం.

1. ఆకాశ లక్షణము – శబ్దము, 2. వాయు లక్షణము – స్పర్శ, 3. అగ్ని లక్షణము – రూపము, 4. జల లక్షణము – రసము, 5. పృథివీ లక్షణము – గంధము.

ఈ సృష్టిలో ముందుగా ఆకాశం వచ్చింది. దానిలో ఉన్న లక్షణము శబ్దము ఒక్కటే. ఆ తరువాత ఆకాశం నుంచి వాయువు వచ్చింది. వాయువులో ఆకాశం లక్షణమైన శబ్దము, వాయువు లక్షణమైన స్పర్శ రెండూ ఉన్నాయి. ఆ తరువాత వాయువు నుంచి అగ్ని వచ్చింది. అగ్నిలో తన లక్షణమైన రూపంతోపాటుగా, ఆకాశలక్షణమైన శబ్దము, వాయులక్షణమైన స్పర్శకూడా ఉన్నాయి. అగ్ని నుంచి జలం వచ్చింది. జలంలో ఆకాశలక్షణమైన శబ్దము, వాయులక్షణమైన స్పర్శ, అగ్ని



లక్షణమైన రూపము ఉన్నాయి. ఆ తరువాత జలం నుంచి భూమి వచ్చింది. ఇప్పుడు భూమిలో ఆకాశ లక్షణమైన శబ్దము, వాయు లక్షణమైన స్పర్శ, అగ్ని లక్షణమైన రూపము, జల లక్షణమైన రసము, భూమి లక్షణమైన గంధము ఉన్నాయి. ఈ రకంగా చూసినట్లైతే ఆకాశం అన్ని భూతాలలోనూ ఉన్నది. కాబట్టి అది ఐదు భాగాలు. వాయువు నాలుగు భాగాలు. అగ్ని మూడు భాగాలు, జలం రెండు భాగాలు. భూమి ఒక భాగమే. ఈ భూమి అనేది భూమిలోనే ఉంది. మిగిలిన నాలుగు భూతాలలోను లేదు. ఇప్పుడు పంచభూతాలు మొత్తం ఎన్ని భాగాలయినాయో చూడండి. ఆకాశం – 5, వాయువు – 4, అగ్ని – 3, జలం – 2, భూమి – 1. వెరసి 15 భాగాలు. పంచభూతాలు పంచీకరణ జరిగినప్పుడు అవి మొత్తం 15 భాగాలయినాయి. ఈ పదిహేను భాగాలే పంచదశీ మహామంత్రంలోని 15 బీజాలు. ఈ విషయాన్ని గనక గ్రహించగలిగినట్లైతే పంచభూతాల రూపాంతరమే పంచదశీ మహామంత్రము అని తెలుస్తుంది.

ఈ విధంగా చెప్పినప్పుడు మంత్రంలో ఉన్న 15 బీజాలు పంచభూతాల బీజాలే కావాలి. అదికూడా ఎలా అంటే

1. ఆకాశం – ఐదు భాగాలున్నది. కాబట్టి మంత్రంలో ఆకాశ బీజమైన హ కారాలు ఐదు ఉండాలి.
2. వాయువు – నాలుగు భాగాలున్నది. కాబట్టి మంత్రంలో వాయుబీజమైన క కారాలు నాలుగుండాలి.
3. అగ్ని – మూడు భాగాలున్నది. అందుచేత అగ్ని బీజమైన ర కారాలు మూడు ఉండాలి.
4. జలము – రెండు భాగాలున్నది. కాబట్టి జలబీజమైన స కారాలు రెండు ఉండాలి.
5. పృథివి – ఒక భాగము కాబట్టి పృథివీ బీజమైన ల కారము ఒకటి ఉండాలి.

ఈ రకంగా పంచదశీ మహామంత్రంలోని అక్షరాలు ఉండాలి. అంటే హకారాలు – 5, కకారాలు – 4, రకారాలు – 3, సకారాలు – 2, లకారము – 1. ఉండాలన్నమాట. మరి మంత్రంలోని అక్షరాలు అలాగే ఉన్నాయా ?



Varivasya 03 (Final) 8-5-08 56

**తత్తజ్జనకైర్వర్ణైః తత్తత్సంఖ్యైస్తు తద్గుణాజాతాః ।**
**కామకళాభిశ్చతసృభిరాసీత్పుర్యన్ శ్చతుర్విధోనతుకైః ॥** 22

ఇప్పుడు ముందుగా 'హ'కారాలను చూద్దాం. ఇవి మొత్తం ఐదు ఉండాలి. మంత్రంలో గనక చూసినట్లైతే, రెండవ కూటమిలో రెండు హకారాలున్నాయి. హ స క హ ల ఇవి కాకుండా మూడు హ్రీంకారాలలోను మూడు హకారాలున్నాయి. వెరసి ఐదు హకారాలు మంత్రంలో ఉన్నాయి.

అయితే రెండవ కూటమిలో చెప్పిన రెండవ హకారము కామకళ అని గుర్తించాలి. అలా అయినప్పటికీ అది ఆకాశబీజమే. ప్రతి శబ్దానికీ రెండు అర్థాలుంటాయి. 1. వాచ్యార్థము 2. లక్ష్యార్థము.

ఈ రెండవ హకారానికి వాచ్యార్థము ఆకాశము కాగా లక్ష్యార్థము కామకళ.

ఇక పంచభూతాలలో రెండవది వాయువు. **కకారస్తు ప్రభంజనః** అన్నారు. అంటే కకారము వాయుబీజము. మంత్రంలో వాయుబీజములు అంటే కకారాలు నాలుగుండాలి. అయితే మంత్రంలోని ఒక్కొక్క కూటమిలోను ఒక్కొక్కటి చొప్పున మూడు కూటములయందు మూడు కకారములున్నాయి. అంతేగాని నాలుగు కకారాలు లేవు. మరి ఇది ఏ విధంగా సరిపోతుంది ? అనే అనుమానం వస్తుంది. ఇక్కడ 'క'కారమునకు బదులుగా, వాయుబీజంగా 'ఈ'కారాన్ని తీసుకోవాలి అని భాస్కరరాయలవారి వివరణ. ఆ రకంగా గనక తీసుకున్నట్లైతే, మూడు హ్రీం కారములందు మూడు, మొదటి కూటమిలో ఒకటి. మొత్తం నాలుగు 'ఈ'కారాలున్నాయి. ఇక అగ్ని బీజము 'ర'కారము. పంచీకరణలో అగ్ని మూడు భాగాలున్నది. కాబట్టి మంత్రంలో మూడు 'ర'కారాలుండాలి. మూడు హ్రీంకారాలలోను మూడు రకారాలున్నాయి. ఇక జలబీజము 'స'కారము. ఇవి రెండు ఉండాలి. రెండవకూటమిలో ఒకటి, మూడవకూటమిలో ఒకటి సకారమున్నది. ఇక చివరగా 'ల' కారము. ఇది పృథివీ బీజము. మంత్రంలో ఒక్కటే ఉండాలి. కాని మంత్రంలోని మూడుకూటములందు మూడు లకారాలున్నాయి. ఉండవలసినది ఒక 'ల'కారము. ఉన్నది మూడు లకారాలు.

**భువనత్రయ సంబంధాత్ ఆసీత్త్రేధా లకారోఽపి ।**
**యేయే యద్వ్యజ్జనకాః తేషాం తేషాం త ఏవార్థాః ॥** 23



ఇక్కడ మూడు లకారాలను కలిపి ఒకటిగానే తీసుకోవాలి. ఈ మూడు లకారాలు భూలోక, భువర్లోక, సువర్లోకాలకు ప్రతీక. అంటే లకారము చరాచర జగత్తుకూ ప్రతీక అని అర్థం.

ఈ రకంగా పంచదశీ మహామంత్రంలోని బీజాక్షరాలన్నీ పంచభూతాలకు ప్రతీకలు. కాగా మంత్రంలో ఉన్న 'ఏ'కారము పరమేశ్వర స్వరూపము.

మంత్రంలో కకారాలు మూడు ఉన్నాయి. వాటిని ఎక్కడా చెప్పలేదు. మరి వాటి సంగతి ఏమిటి ? అనే సందేహం కలుగుతుంది.

**కకారత్రయ వాచ్యాస్తు సకలాః ప్రళయాః కలాః ।**
**విజ్ఞానకేవలాశ్చేతి త్రిప్రకారా ఉపాసకాః ॥** 24

ఈ శ్లోకంలో కకారాలను వివరిస్తున్నారు. మూడు కకారాలచేత మూడు రకాలైన ఉపాసకులు చెప్పబడుతున్నారు. పరమేశ్వరిని అర్చించే వారిని వారి వారి అర్చనా విధానాన్ని బట్టి మూడురకాలుగా విభజించారు.

మొదటి రకం వారు పూర్తిగా లౌకికమైన విషయాలలో మునిగి తేలుతుంటారు. సిరిసంపదలు, భోగభాగ్యాలు ధనధాన్యాలే వీరి ధ్యేయం.

రెండవ రకంవారు పూర్తిగా జ్ఞానులు. మోక్షసాధనయే వీరి పరమావధి.

మూడవ రకంవారు పై రెండు లక్షణాలను కలిగి ఉంటారు. సత్సంగము జరిగినప్పుడు "బ్రహ్మ ఒక్కటే సత్యం. ఈ జగత్తు అంతా మిధ్య" అనుకుంటారు. అది అయిపోగానే మళ్ళీ సంసార లంపటంలో కూరుకుపోతారు.

మానవ శరీరంలో 19 చక్రాలున్నాయి. యోగినీ హృదయంలోని చక్రసంకేతంలోని 25, 26 శ్లోకాలలో ...

**అకులేవిషు సంజ్ఞేచ శాక్తౌ వహ్నౌ తథాపునః ।**
**నాభావనా హతాశుద్ధే లంబికాగ్రే భ్రువోంతరే ॥**
**బిందౌ తదర్థం రోన్యాం నాదోనాదాంత ఏవచ ।**
**శక్తిర్ పునర్వ్యాపికాయాం సుమనా ఉన్మనగోచరే ॥**
**మహాబిందౌ పునశ్చైవం త్రిధాచక్రంతు భావయేత్**

మానవశరీరంలో మేరుదండమున్నది. దాని వెంబడి సుషుమ్నానాడి ఉన్నది. సుషుమ్నకు పైన, క్రిందా కూడా సహస్రదళ పద్మాలున్నాయి. ఈ మధ్యలో 17 చక్రాలున్నాయి. సహస్రదళ పద్మాలతో కలిపినట్లైతే అవి మొత్తం 19 చక్రాలవుతాయి. వీటిని మూడు జట్లుగా చెబుతారు. 1) ఆధారచక్రానికి దిగువన ఉన్న సహస్రారము నుంచి ఆజ్ఞాచక్రము వరకు 9 చక్రాలు. 2) బిందువు నుంచి ఉన్మన వరకు 9 చక్రాలు. 3) మహాబిందువు.

పరమేశ్వరిని ఆరాధించేవారు ఈ చక్రాలలోనే ఆరాధిస్తారు. వారు ఆరాధించే స్థానాన్ని బట్టి సాధకులను మూడు రకాలుగా విభజించటం జరుగుతుంది. వీటిలో మొదటి జట్టులో పరమేశ్వరిని ఆరాధించేవారు పూర్తిగా అజ్ఞానులు. వీరు కేవలము సంసార లంపటంలో పడి కూరుకుపోయి ఉంటారు. వీరు సకలలు. మూడవ స్థానమైన మహాబిందువు నందు పరమేశ్వరిని ఆరాధించేవారు జ్ఞానులు, మోక్షగాములు. వీరు నిష్కలులు, విజ్ఞానకేవలులు. రెండవ జట్టులో పరమేశ్వరిని ఆరాధించేవారు సకల నిష్కలులు. వీరు ద్వైదీభావంలో ఉంటారు. ఈ సాధకులను ఉత్తములు, మధ్యములు, అధములు అని; ప్రమాతలు, సాధకులు, పశువులు అని; శుద్ధ, మిశ్రమ, అశుద్ధులు అని; సకలులు, సకలనిష్కలులు, నిష్కలులు అని వివిధ రకాలైన పేర్లతో పిలుస్తారు. ఈ పేర్లన్నీ పర్యాయపదాలే.

స్వపరభేదాలు కలిగి, నేనే పరమేశ్వరుడను అనే భావన లేకుండా కేవలము కర్మయందు మాత్రమే ఆసక్తులైనవారు అధములు, పశుప్రాయులు. ఏ రకమైన భేదభావన లేకుండా సమస్త జీవరాశియందు పరమేశ్వరుని దర్శించగలవారు, తానే పరమేశ్వరుణ్ణి అని భావించేవారు ఉత్తములు.

పరిపక్వమైన కర్మలు కలవారై, కర్మ జ్ఞానమార్గాలయందు సాధారణ ప్రవృత్తి గలవారు. వీరు కర్మలు చేస్తుంటారు. అంతా పరమేశ్వరమయం అంటూ ఉంటారు. వీరు మధ్యములు. యోగినీ హృదయంలో చెప్పినట్లుగా .....

**అశుద్ధ శుద్ధమిశ్రాణాం ప్రమాతౄణాం పరం వపుః ।**
**క్రోధీశత్రితయేనాస్య విద్యాస్థేన ప్రకాశితం ॥**

ఇక్కడ 'క్రోధీశ' అంటే క కారము. ఈ మాటతో ఉపాసకత్రయము చెప్పబడ్డది. అంటే మూలమంత్రంలో మూడు కకారాలున్నాయి. ఈ మూడు కకారాలు మూడు



రకాలైన ఉపాసకుల్ని సూచిస్తున్నాయి. ఈ రకంగా పంచదశీ మహామంత్రంలోని అన్ని బీజాలకు అర్థం చెప్పబడింది.

**అకారైర్దశ సంఖ్యాకైః ఉచ్యన్తే జీవరాశయః ।**
**విద్యాయాః ప్రాణభూతస్సన్ తద్వాచ్యేకాదశ స్వరః ॥** **25**

మంత్రంలో మొత్తం 15 అక్షరాలున్నాయి. వాటిలో హ్రీంకారాలు మూడు పోతే మిగిలినవి 12. వీటిలో ఈకారము, ఏకారము అచ్చులు. వీటినికూడా వదలి వేసినట్లైతే మిగిలినవి 10 హల్లులు.

| | | |
|---|---|---|
| మొదటి కూటమిలో | – | క ల |
| రెండవ కూటమిలో | – | హ స క హ ల |
| మూడవ కూటమిలో | – | స క ల |

మొత్తం 10 అక్షరాలు. ఇవి హల్లులు (వ్యంజనాలు). వీటిని పలకటానికి అచ్చుల సాయం కావాలి. ప్రతి హల్లును పలకటానికి ఒక అచ్చు సాయం కావాలి. ఈ పది హల్లులయందు ఉన్న అకారాలకు అర్థం చెబుతున్నారు ఈ శ్లోకంలో.

మూలమంత్రంలో ఉన్న పది అకారాలకు జీవరాశి అని అర్థం. జీవరాసి అనంతమైనది. కాబట్టి దానికి ఉపలక్షణంగా పది చెప్పబడింది. అయితే మూడవ కూటమిలో ఉన్న 'స'కారములోని అకారాన్ని ప్రకాశ స్వరూపంగా చెప్పనప్పటికీ, అది అకారంలోని ధ్వని అంశకి మాత్రమేకాని వర్ణానికి మాత్రం కాదా అని గుర్తించాలి. మంత్రంలోని రెండవ అక్షరము 'ఏ'కారము పంచదశీ మహామంత్రానికి ప్రాణభూతమైనది. యోగినీహృదయంలో ఏకారాన్ని వివరిస్తూ

**శ్రీకంఠ దశకం తద్వదవ్యక్త స్యహి వాచకః**
**ప్రాణరూప స్థితోదేవీ తద్వదేకాదశః స్వరః**
**ఏకః సన్నేవ పురుషో బహుధా జాయతే హి సః**

శ్రీకంఠదశకం అంటే అకారాలు. ఇవి పది. మంత్రంలోని అచ్చులను, హల్లులను వేరు చేయగా, పది అకారాలున్నాయి అన్నాం కదా. మిగిలినవి హల్లులు. వీటిలో అకారాలు పది. మూడవ కూటమిలోని మొదటి అక్షరమైన సకారములోని అకారము వైఖరీ అంశగల జీవుడు.

ప్రాణరూపుడైన పురుషుడు శరీరమంతా వ్యాపించి ఉన్నాడు. అందుచేతనే శరీరము చేష్టలు కలిగి పని చేస్తున్నది. పురుషుడు (జీవుడు) ఒక్కడే అనంతమైన శక్తి గలవాడు. తత్త్వములయందు ప్రాణాన్ని విడిగా చెప్పలేదు. ఎందుకు ? అంటే పురుషుడు ప్రాణరూపుడు, పురుషుణ్ణి గనక చెప్పినట్లైతే ప్రాణాన్ని గురించి చెప్పినట్లే. ఈ రకంగా ప్రాణరూపుడైన పురుషుడు అచ్చులయందు పదకొండవదిగా ఉన్నాడు. అదే 'ఏ'కారము ప్రాణస్వరూపము. పంచదశీ మహామంత్రంలోని అక్షరాలకు వివరణ కాదివిద్యను అనుసరించే చెప్పబడింది.

**బిందుభిః త్రిభిరుచ్యన్తే రుద్రేశ్వర సదాశివాః ।**

**శాన్తిశ్శక్తిశ్చ శంభుశ్చ నాదత్రితయ బోధనాః ॥ 26**

మూడు బిందువులచేత రుద్రుడు, ఈశ్వరుడు, సదాశివుడు చెప్పబడ్డారు. మూడు నాదములచేత శాంతి, శక్తి, శంభువు చెప్పబడుతున్నారు. ఇదే విషయాన్ని యోగినీహృదయంలో చెబుతూ ....

**రుద్రేశ్వరసదేశాఖ్యా దేవతామిత విగ్రహాః ॥**

**బిందుత్రయేణ కథితా అమితా మితవిగ్రహాః ।**

**శాంతిశ్శక్తిశ్చ శంభుశ్చ నాదత్రితయ బోధనా ॥**

రుద్రుడు తేజోమయుడు. అందుచేతనే రుద్రశబ్దము తేజస్సుకు పర్యాయపదము. ఇక్కడ పురుష దగ్గర నుండి మాయవరకు గల ఏడు తత్త్వాలను తీసుకోవాలి. అవి తేజస్తత్త్వములు. పురుషుడు, నియతి, కాలము, రాగము, అవిద్య, కలా, మాయ. ఈశ్వరుడు తిరోదానకర్త. సదాశివుడు అనుగ్రహకర్త. సదాశివుడు అనుగ్రహభావంతో జగత్తంతా ఉంటాడు. 'ఇదమహం' అనేది ఈశ్వరతత్త్వము. 'అహమిదం' అంటే నేనే ఈ విశ్వమంతా అయిఉన్నాను. 'ఇదమహం' ఈ విశ్వమంతా నేనే అయి ఉన్నాను. వీటిలో మొదటి దానికి నేను ఈ విశ్వమంతా ఆవరించి ఉన్నాను. రెండవ దానికి ఈ విశ్వమంతా నాలోనే ఉన్నది అని అర్థం. ఈ రెండింటికీ మధ్య గల భేదమే మాయ. పరమేశ్వరుడు మాయా సంబంధము గలవాడై పురుషుడు అవుతున్నాడు. ఈ పురుషుడే గతంలో ఏకారంతో చెప్పబడ్డాడు. బ్రహ్మ, శక్తి, శివుడు వీరు దేశకాల వస్తువులచేత అపరిచ్ఛిన్న స్వరూపులు.



వాగ్భవ బీజముపై నున్న బిందువుతో శాంతి, కామరాజ బీజముపై నున్న బిందువుతో శక్తి, పరాబీజముపై నున్న బీజముతో శివుడు సూచించబడుతున్నారు అని **అమృతానందుల**వారు తమ **దీపికావ్యాఖ్య**లో వ్రాశారు. ఈ ముగ్గురికీ తేడాలేదు. ఈ ముగ్గురూ అర్ధచంద్రమునుండి ఉన్మన వరకు గల చక్రాలను సూచిస్తారు. వీరి లక్షణము శివశక్తుల సామరస్యము. నిర్విశేష బ్రహ్మ – సృష్టి సంకల్పంతో శివుడు, సృష్టి ప్రారంభ సమయంలో శక్తిగా 36 తత్త్వాలుగా అవుతున్నాడు. ఈ విధంగా పరమశివునిచేత విద్యయందు 36 తత్త్వాలు ప్రతిపాదించబడినాయి.

**ఏవం సప్తత్రింశత్సంఖ్యాక పదైః మహావిద్యా ।**

**షట్త్రింశత్ తత్త్వానాం తత్త్వాతీతస్య చాభిధాత్రయమ్ ॥ 27**

మూలవిద్యలో 37 పదాలున్నాయి. వీటినే 37 బీజములు అంటారు. అవి వరుసగా హకారాలు – 5, ఈకారాలు – 4, రేఫలు – 3, సకారాలు – 2, లకారాలు – 3, కకారాలు – 3, అకారాలు – 10, బిందువులు – 3, నాదములు–3, ఏకారము–1, వెరసి 37. వీటిలో తత్త్వాలు–36 కాగా 37వది పరబ్రహ్మ స్వరూపము.

తత్త్వాలు – 36. వీటిలో పంచభూతాలు – 5, తన్మాత్రలు – 5, జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు – 5, మనస్సు, బుద్ధి, అహంకారము – 3, ప్రకృతి, పురుషుడు – 2, కళ, విద్య రాగము, కాలము, నియతి – 5, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు – 4, శివుడు, శక్తి – 2, వెరసి 36.

ఈ తత్త్వాలన్నీ శ్రీవిద్యలో సమన్వయం చెందుతాయి. అందుచేతనే మంత్రానికీ, జగత్తుకు, పరమేశ్వరికి భేదంలేదు అని చెప్పబడుతోంది.

**జన్యజనకయోః భేదాభావాత్ వాచ్యస్య వాచకేనాపి ।**

**బ్రహ్మణి జగతో జగతిచ విద్యాభేదస్తు సంప్రదాయార్థః ॥ 28**

కార్యకారణాలకు, నామరూపాలకు, బ్రహ్మకు జగత్తుకు ఏ విధంగా తేడా లేదో అలాగే ఈ జగత్తుకు విద్యకు కూడా అభేదము అని చెప్పబడుతోంది.

ఈ విధంగా మంత్రము, దేవత, జగత్తు, బ్రహ్మము అన్నీ ఒకటే. ఇవి కేవలము రూపాంతరాలే కాని వీటి మధ్య తేడాలేదు అనే విషయం గురుశిష్య పరంపరా రహస్యంగా చెప్పబడుతోంది. ఇదే గురుసంప్రదాయము. ఈ కారణంచేతనే దీనిని సంప్రదాయార్థము అన్నారు.

## 4. నిగర్భార్థము

**పరమశివే నిష్కళతా తదభిన్నత్వం స్వదేశికేంద్రస్య ।**

**తత్కరుణాతః స్వస్మిన్నపి తదభేదో నిగర్భార్థః ॥** **29**

నిష్కలమైనటువంటి పరిశుద్ధమైన ఆ పరమశివునితో సమానమైనవాడు గురువు. ఆ గురువే పరబ్రహ్మ స్వరూపము. అటువంటి గురువుయొక్క కరుణవల్ల శిష్యుడుకూడ పరమేశ్వరునితో సమానమవుతున్నాడు. ఇది నిగర్భార్థము.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః ।**

**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః ॥**

అంటే గురువే సాక్షాత్తు పరమేశ్వర స్వరూపము అని అర్థం. అటువంటి గురువుయొక్క కరుణ పొందినట్లైతే శిష్యుడుకూడా పరమేశ్వర సమానుడవుతాడు. మొత్తం మీద గురువు, శిష్యుడు, పరమేశ్వరుడు ఈ ముగ్గురూ ఒకటే అని సిద్ధాంతము. శివుడు గురుపరంపరద్వారా శిష్యునిలో ప్రవేశిస్తాడు. అలాగే శిష్యుడు గురుపరంపర ద్వారా శివునిలో ప్రవేశిస్తాడు.

గురువు శిష్యునిలో బ్రహ్మరూపంలో ప్రవేశించటమనేది జన్మజన్మల పుణ్యఫలం. అహంకార మమకారాలు లేనటువంటి గురుభక్తివల్ల మాత్రమే ఇది సాధ్యపడుతుంది. గురువు అంటే కేవలము "మానవ చర్మం ధరించిన పరమేశ్వరుడు" అని గుర్తుంచుకోవాలి.

యోగినీహృదయంలో నిగర్భార్థాన్ని వివరిస్తూ ....

**నిగర్భార్థో మహాదేవీ శివసర్వాత్మ గోచరః ।**

నిగర్భము – పూర్తిగా దాగి ఉన్నది. అతిరహస్యము. నిగూఢమైనది. ఇతర అర్థాలకన్నా పరమరహస్యమైనది అని అర్థం.

శివుడు – అవాఙ్మానస గోచరుడైన పరబ్రహ్మ. గురువు–పరబ్రహ్మను ఆత్మతో దర్శించినవాడై సకల ఆగమార్థాలు తెలుసుకున్న జ్ఞాని.

ఆత్మ – గురువు యొక్క దయవల్ల సంసార బంధనాలు తెంచుకుని శివైక్యానుభవం పొందిన శిష్యుడు.



ఈ ముగ్గురూ భేదము లేకుండా దేనియందు గోచరిస్తారో, అది నిగర్భము. శివ గురు ఆత్మలచేతనే గోచరమయ్యేది.

**తత్ప్రకారం చ దేవేశీ దిఙ్మాత్రేణ వదామితే ।**

**శివ గుర్వాత్మనా మైక్యానుసంధానా త్తధాత్మకం ॥**

శివుడు, గురువు, ఆత్మలయొక్క ఐక్యము అభ్యాసము వల్లనే పొందదగినది. గర్భహేతువైన సామరస్య సుఖం ఏ రకంగా ఇతరులకు అర్థంకాదో, అలాగే ఆత్మ, శివ తాదాత్మ్యముకూడా ఇతరులకు అర్థం కావు. అది అనుభవైక వేద్యము.

**నిష్కలత్వం శివేబుద్ధ్వా తద్రూపత్వం గురోరపి ।**

**తన్నిరీక్షణ సామర్థ్యా దాత్మానశ్చ శివాత్మతాం ॥**

**భావయేద్భక్తి నమ్రస్సన్ శంఖే చోన్మేషా కళంకితః ॥**

గురువుయొక్క నిష్కలత్వము తెలుసుకుని, గురువుకు శుశ్రూష చేసి, ఆయన అనుగ్రహమువలన సకల పాపములు పోగొట్టబడి శిష్యుడు జ్ఞానము పొందుతున్నాడు. గురువు అంటే కేవలము మానవచర్మము ధరించిన అష్టపాశబద్ధుడు కాదు. అష్టపాశములు అంటే ....

**ఘృణాశంకాభయం లజ్జా జుగుప్సాచేతి పంచమీ ।**

**కులం శీలం చ వృత్తం చేత్యష్టౌ పాశాః ప్రకీర్తితాః ॥**

నింద, అనుమానము, భయము, సిగ్గు, ద్వేషము, కులము, శీలము, నడవడి. అనేవి అష్టపాశాలు. **పాశ బద్ధ పశుప్రోక్తా పాశవిముక్త స్సదాశివః.** ఈ పాశాలకు బద్ధుడైనవాడు పశువు. విముక్తి పొందినవాడు సాక్షాత్తు పరమేశ్వరుడు.

## 5. కౌళికార్థము

పరదేవత, మంత్రము, యంత్రము (శ్రీచక్రము), గురువు, శిష్యుడు. ఈ ఐదుగురు ఒక్కటే. వీరి మధ్య భేదం లేదు. అంటున్నారు భాస్కరరాయలవారు. ఈ ఐదుగురి మధ్యన తేడా లేకపోవటం ఏమిటి ? అది ఎలా సాధ్యం ? అని మన అనుమానం. దానికి సమాధానంగా ఈ ఐదింటికీ ఒకే రకమైన లక్షణాలు లేదా పోలికలు ఉన్నాయి. అంటే ఇవన్నీ సమాన ధర్మాలు కలిగి ఉన్నాయి అంటున్నారు.



Varivasya 03 (Final) 8-5-08 60

అది ఏ రకంగా ? అంటే గణేశ, గ్రహ, నక్షత్ర, రాశి, యోగినీరూపాలు వీటన్నింటికీ సమాన ధర్మాలు అంటున్నారు. అదెలాగో చూద్దాం.

## 5.1 దేవత - గణేశత్వం

**మాతానిరుపమ తేజోమయ్యా స్వస్యా మరీచి రూపాణాం ।**
**ఆవరణ దేవతానామీశిత్వా దుచ్యతే గణేశీతి ॥** 30

ముందుగా గణేశత్వము అంటే ఏమిటో చూద్దాం. గుణాలకు అధిపతి గణపతి. ఆ దేవత సాటిలేని తేజస్సుతో, తన నుండి వెలువడిన కాంతి కిరణములే ఆవరణ దేవతలుగా గలది. ఆ దేవతా గణాలన్నింటికీ ఈమె అధికారిణి. అందుచేత ఆమెకు గణేశత్వము వచ్చింది. యోగినీ హృదయంలో

**ఏకాదశాధిక దేవతాత్మతయా పునః గణేశత్వ మహాదేవ్యాః**

శ్రీచక్రంలో

| | | | |
|---|---|---|---|
| 1. | భూపురంలోని ప్రథమరేఖలో అణిమాది సిద్ధులు | - | 10 |
| 2. | భూపురంలోని రెండవరేఖలో బ్రాహ్మీ మొదలైన శక్తులు | - | 8 |
| 3. | భూపురంలోని మూడవరేఖలో ముద్రా దేవతలు | - | 10 |
| 4. | షోడశదళంలో ఆకర్షణ దేవతలు | - | 16 |
| 5. | అష్టదళంలో అనంగకుసుమ మొదలగువారు | - | 8 |
| 6. | చతుర్దశారంలో సర్వసంక్షోభిణ్యాదులు | - | 14 |
| 7. | బహిర్దశారంలో సర్వసిద్ధి ప్రదాదులు | - | 10 |
| 8. | అంతర్దశారంలో సర్వజ్ఞాదులు | - | 10 |
| 9. | అష్టకోణంలో వశిన్యాదులు | - | 8 |
| 10. | త్రికోణంలో కామేశ్వర్యాదులు | - | 3 |
| 11. | ఆయుధ దేవతలు కామేశ్వరికి | - | 4 |
| 12. | ఆయుధ దేవతలు కామేశ్వరునికి | - | 4 |
| 13. | అంగదేవతలు | - | 6 |
| | మొత్తం దేవతా గణాలు | - | 111 |



ఈ గణాలన్నింటికీ, ఆ పరమేశ్వరియే అధిష్ఠాత్రి. అందుచేతనే ఆమెకు గణేశత్వం వచ్చింది.

## 2. దేవత - నవగ్రహత్వం

**ఇచ్ఛాది త్రిసమష్టిర్గుణత్రయాధ్యా ఉ నలేన్దు రవినేత్రా ।**
**ఏవం నవభిర్యోగాత్ గ్రహరూపేత్యుచ్యతే మాతా ॥** 31

ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తులు, సత్వరజస్తమోగుణాలు, సూర్యచంద్రాగ్నులు. వెరసి తొమ్మిది. నవగ్రహాలు తొమ్మిది. అందుకే దేవి నవగ్రహరూప అయింది.

యోగినీ హృదయంలో **స సోమరవి పావకైః ఇచ్ఛాజ్ఞానక్రియాభిశ్చ, గుణత్రయయుతైః పునః గ్రహరూపచాసాదేవీ.**

రవిచంద్రాగ్నులు, త్రిశక్తులు, త్రిగుణాలు కలిపి దేవికి నవగ్రహత్వం వచ్చింది.

## 3. దేవత - నక్షత్రరూపం

**ఇంద్రియదశకే నాంతఃకరణచతుష్కేణ విషయదశకేన ।**
**ప్రకృతి పురుష గుణతత్త్వైః జాతా నక్షత్రరూపిణీ మాతా ॥** 32

జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు – 5, ఇంద్రియ విషయములు –10, మనస్సు బుద్ధి చిత్తము అహంకారము –4, సత్వరజస్తమో గుణాలు – 3 మొత్తం 27. నక్షత్రాలు – 27. కాబట్టి దేవతకు నక్షత్రరూపం వచ్చింది. ఇంద్రియ విషయాలు అంటే ఏమిటి ? ముందుగా జ్ఞానేంద్రియాలు.

| | | | |
|---|---|---|---|
| 1. | త్వక్కు (చర్మము) | – | స్పర్శ |
| 2. | చక్షువు (కన్ను) | – | దర్శనము, రూపము |
| 3. | శ్రోత్రము (చెవి) | – | శబ్దము వినుట |
| 4. | జిహ్వ (నాలుక) | – | రసము |
| 5. | నాసిక (ముక్కు) | – | గంధము |

అలాగే కర్మేంద్రియాలు

| | | | |
|---|---|---|---|
| 1. | కాళ్ళు | – | నడచుట |
| 2. | చేతులు | – | ఇచ్చుట, గ్రహించుట |

3. నోరు – మాట్లాడటము
4. పాయువు – విసర్జన
5. ఉపస్థ – ఆనందము

అయితే యోగినీ హృదయంలో ఇంద్రియాలు – 10, ఇంద్రియ విషయాలు – 10, మనస్సు, బుద్ధి, అహంకారము – 3, ప్రకృతి (వ్యక్తము, అవ్యక్తము) – 2, అంతఃకరణకు అధిష్ఠానమైన కూటస్తుడు – 1 వెరసి 27. వీటివల్ల దేవతకు నక్షత్రరూపం వచ్చింది అన్నారు.

## 4. దేవత - యోగినీరూపం

**నరపతి రవికాష్ఠా షట్సముద్ర ద్విసంఖ్యైః**
**అకడబవహ పూర్వైరక్షరై ర్వేష్టితాభిః ।**
**దరలకసహ వర్ణాద్యాకినీభిస్తు షడ్భిః**
**ఘటిత తనురితీయం కథ్యతే యోగినీతి ॥** **33**

ఈ శ్లోకంలో పరదేవతకు యోగినీరూపం చెబుతున్నారు. యోగినులు ఆరు మంది. వీరినే డ ర ల క స హ అంటారు. అంటే 1. డాకిని, 2. రాకిని, 3. లాకిని 4. కాకిని, 5. సాకిని, 6. హాకిని. వీరు శరీరంలోని షట్చక్రాలలో ఉన్నారు.

**మూలాధారం గుదస్థానం స్వాధిష్ఠానం తు మేహనం**
**నాభిస్తుమణి పూరాఖ్యాం హృదయం చాబ్జమనాహతం**
**తాలుమూలం విశుద్ధాఖ్యాం ఆజ్ఞాంచ నిటలాంబుజం ॥**

ఈ చక్రాలను చెప్పేటప్పుడు విశుద్ధి చక్రం నుంచి చెప్పటం జరుగుతుంది. పై శ్లోకానికి అర్థం ఇప్పుడు చూడండి.

1. నరపతి (16మంది మహారాజులు) – విశుద్ధిచక్రంలోని 16 దళాలు.
2. రవి (ద్వాదశాదిత్యులు) – అనాహతంలోని 12 దళాలు.
3. కాష్ఠా (దశదిశలు) – మణిపూరంలోని 10 దళాలు.
4. షట్ (ఆరు) – స్వాధిష్ఠానంలోని 6 దళాలు.
5. సముద్ర (నాలుగు సముద్రాలు) – ఆధారచక్రంలోని 4 దళాలు.
6. ద్వి (రెండు) – ఆజ్ఞాచక్రంలోని 2 దళాలు.



ఈ ఆరు చక్రాలలోను ఉన్న దళాలలో ఆయా శక్తులు పరివేష్ఠించి ఉండగా, ఆ పద్మము యొక్క కర్ణిక యందు యోగిని ఉంటుంది.

1. విశుద్ధిచక్రానికి పదహారు దళాలు. ఆ దళాలయందు అ నుంచి అః వరకు శక్తులు పరివేష్ఠించి ఉండగా, దాని కర్ణికయందు వజ్రేశ్వరి అనే దేవత ఉంటుంది. ఆమెనే డాకినీ అంటారు.

2. అనాహత చక్రానికి పన్నెండు దళాలు. ఆ దళాలయందు క నుంచి ఠ వరకు శక్తులు పరివేష్ఠించి ఉండగా, దాని కర్ణికయందు 'వామదేవి' అనే దేవత ఉంటుంది. ఆమెనే 'రాకినీ' అంటారు.

3. మణిపూర చక్రానికి పది దళాలు. ఆ దళాల యందు డ నుంచి ఫ వరకు శక్తులు పరివేష్టించి ఉండగా, దాని కర్ణికయందు 'వయోవస్థా వివర్జితా' అనబడే దేవత ఉంటుంది. ఆమెనే 'లాకినీ' అంటారు.

4. స్వాధిష్ఠాన చక్రానికి ఆరు దళాలు. ఆ దళాలలో బ నుంచి ల వరకు శక్తులు పరివేష్టించి ఉండగా, దాని కర్ణికయందు 'సిద్ధేశ్వరీ' అనే దేవత ఉంటుంది. ఆమెను 'కాకినీ' అంటారు.

5. ఆధారచక్రానికి నాలుగు దళాలు. ఆ దళాలలో వ నుంచి స వరకు శక్తులు పరివేష్టించి ఉండగా, దాని కర్ణికయందు 'సిద్ధవిద్యాదేవి' అనే దేవత ఉంటుంది. ఆమెను 'సాకినీ' అంటారు.

6. ఆజ్ఞాచక్రానికి రెండు దళాలు. ఆ దళాలలో హ, క్ష అనే శక్తులు పరివేష్టించి ఉండగా, దాని కర్ణికయందు 'సిద్ధమాత' అనే దేవత ఉంటుంది. ఆమెను హాకిని అంటారు.

ఈ రకంగా యోగినులతో కూడి ఉన్నది కాబట్టి దేవతకు యోగినీరూపం వచ్చింది.

## 5. దేవత - రాశిరూపము

**పఞ్చభిర్నాగ కూర్మాద్యైః ప్రాణాపానాది పఞ్చభిః ।**
**జీవాత్మ పరమాత్మభ్యాం చైషా రాశిస్వరూపిణీ ॥** **34**

వాయువులు పది, జీవాత్మ, పరమాత్మ వెరసి 12. రాశులు 12. ఈ రకంగా దేవతకు రాశి స్వరూపం వస్తోంది. అయితే వాయువులు పది అన్నారు అవి ఏవి ?

అంటే ప్రాణవాయువులు - 5, (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు) ఉపవాయువులు - 5, (నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనుంజయములు)

### 1. విద్య (మంత్రము) - గణేశత్వము

**అకథాది షోడశాక్షరాత్మక తార్తీయక కామవాగ్భవైః ।**
**ఘటితాచ పరాది వాగ్గణైరితి విద్యాపి గణేశరూపిణీ ॥** 35

ఈ శ్లోకం నుంచి విద్యకు గణేశాది రూపాలు వివరిస్తున్నారు.

1. అకారాది వర్ణాలు (అ నుంచి అః వరకు)- 16 శక్తికూటమి
2. క నుంచి త వరకు - 16 వర్ణాలు కామరాజకూటమి
3. థ నుంచి స వరకు - 16 వర్ణాలు వాగ్భవకూటమి
4. పర, పశ్యంతీ, మధ్యమ, వైఖరి - నాలుగు గణాలు
5. వ్యష్టి సమిష్టి భేదంచేత విద్యా స్వరూపము.

(వామ, జ్యేష్ఠ, రౌద్రి, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా, శాంత, అంబిక)

ఈ రకంగా వర్ణ గణ స్వరూపం కలది కాబట్టి మంత్రానికి గణేశత్వం లభించింది.

### 2. విద్య - నవగ్రహత్వం

**బిందుత్రయ నాదత్రయ తదన్యకూటత్రయైః గ్రహత్వమిహ ।**

మంత్రంలో బిందువులు మూడు, నాదములు మూడు, బిందువులు, నాదములు లేని కూటములు 3, వెరసి - 9, గ్రహాలు - 9. కాబట్టి మంత్రానికి నవగ్రహత్వం వచ్చింది.

### 3. విద్య - నక్షత్రరూపము

**నక్షత్రత్వంచ దశాకారాణాం వ్యఞ్జనైః అపార్థక్యాత్ ॥** 36

సంప్రదాయార్థంలో విద్యకు 37 వర్ణాలు చెప్పబడ్డాయి. అందులో శ్రీకంఠములు, అంటే అకారాలు - 10 తీసివేయగా, మిగిలినవి - 27. నక్షత్రాలు - 27. కాబట్టి మంత్రానికి నక్షత్రరూపం వచ్చింది.



### 4. విద్య - యోగినీరూపము

**హృల్లేఖాభిస్తిసృభిః తదన్యకూటైస్తు యోగినీ యోగాత్ ।**

యోగినులు ఆరుగురు. మంత్రంలో హ్రీంకారాలు - 3. అవి లేనటువంటి కూటములు - 3. వెరసి - 6. కాబట్టి మంత్రానికి యోగినీరూపం వచ్చింది.

### 5. విద్య - రాశిరూపము

**రాశీభూతాప్యేషాతిసృణాం పూర్వాక్షరైరైక్యాత్ ॥** 37

మంత్రంలోని ప్రతికూటమిలోను చివర హ్రీంకారమున్నది. అందులో హకార, రకార, ఈకారాలు, హ్రీంకారానికి ముందున్న లకారము వెరసి 4 అక్షరాలు. ఇలా మూడు కూటములందు 3×4 = 12 అక్షరాలున్నాయి. రాశులు 12. కాబట్టి మంత్రానికి రాశి రూపం వచ్చింది.

**దేవ్యా రూపాంతరత్వేన విద్యాయా త్తదభేదతః ।**
**గణేశ గ్రహనక్షత్ర యోగినీ రాశిపీఠతా ॥** 38

దేవతయొక్క రూపాంతరమే విద్య. కాబట్టి విద్యకూ దేవతకు భేదం లేదు. విద్య కూడా గణేశ, గ్రహ, నక్షత్ర, యోగినీ, రాశి స్వరూపిణి అయింది.

## 3. శ్రీచక్రము - గణేశాది రూపాలు

ఇప్పటివరకు దేవతకు, మంత్రానికి గణేశాది రూపాలు చెప్పి, ఇప్పుడు శ్రీచక్రానికి చెబుతున్నారు.

### 1. శ్రీచక్రము - గణేశత్వము

**రేఖాదళకోణగణైః ఘటనాచ్చక్రే గణేశత్వం ।**

శ్రీచక్రంలో భూపురంలోని రేఖలు - 3, వృత్తత్రయంలోని వృత్తాలు - 3, పద్మాలలోని దళాలు - 24, త్రికోణాలు - 43, ఇవన్నీ గణాలుగా చెప్పబడ్డాయి. ఈ గణాలకు అధిపతి కాబట్టి, శ్రీచక్రానికి గణేశత్వము వచ్చింది.

## 2. శ్రీచక్రము నవగ్రహత్వము

**త్రైలోక్యమోహనాద్యైః నవభిశ్చక్రై గ్రహత్వంచ ॥ 39**

శ్రీచక్రంలో తొమ్మిది ఆవరణలున్నాయి. త్రైలోక్య మోహనచక్రము నుంచి సర్వానందమయ చక్రంవరకు వీటినే చక్రాలు, ఆవరణాలు అంటారు. గ్రహాలు 9. కాబట్టి శ్రీచక్రానికి నవగ్రహత్వం వచ్చింది.

## 3. శ్రీచక్రము - నక్షత్ర రూపము

**వృత్తత్రయ ధరణీత్రయ, మన్వస్రాణాం విభజ్యగణనేన ।**
**సప్తభిరితరైశ్చక్రైః చక్రే నక్షత్రరూపత్వమ్ ॥ 40**

శ్రీచక్రంలో వృత్తాలు - 3, భూపురంలోని రేఖలు - 3, చతుర్దశారంలో కోణాలు - 14. మిగిలిన చక్రాలు - 7 (షోడశదళం, అష్టదళం, బహిర్దశారం, అంతర్దశారం, అష్టకోణం, త్రికోణం, బిందువు) వెరసి 27, నక్షత్రాలు - 27. కాబట్టి శ్రీచక్రానికి నక్షత్రం రూపం వచ్చింది.

## 4. శ్రీచక్రము - యోగినీరూపము

**స్థితి సంహృతి చక్రేద్వే పద్మేద్వే నృత్తభూగృహేచద్వే ।**
**ఏవం షడ్భిర్యోగా చ్ఛ్రీచక్రం యోగినీరూపమ్ ॥ 41**

బిందువు, త్రికోణము, అష్టకోణము - ఈ మూడు కలిపి సంహారచక్రం. అంతర్దశారం, బహిర్దశారం, చతుర్దశారం - ఈ మూడు కలిపి స్థితిచక్రం. అష్టదళం, షోడశదళం, భూపురం - ఈ మూడు కలిపి సృష్టిచక్రం. ఇప్పుడు స్థితిచక్రం, సంహార చక్రం, అష్టదళం, షోడశదళం, వృత్తత్రయం, భూపురం వెరసి - 6. యోగినులు -6, కాబట్టి శ్రీచక్రానికి యోగినీ రూపం వచ్చింది.

## 5. శ్రీచక్రము - రాశిరూపము

**పంచచతుశ్శక్త్యనలాః బిందుర్వృత్తంచ భూబింబం ।**
**ఏవం ద్వాదశ సంఖ్యైః ఘటనాత్ చక్రస్య రాశిత్వమ్ ॥ 42**

రాశులు - 12. శ్రీచక్రంలో శక్తి కోణాలు - 5, శివకోణాలు - 4. బిందువు, వృత్తత్రయము, భూపురం. వెరసి 12. కాబట్టి శ్రీచక్రానికి రాశి రూపం వచ్చింది.



**చక్రం విద్యాక్షరైరేవ జననాత్ తదభేదవత్ ।**
**దేవ్యా రూపాంతరత్వాచ్చ తేనయుక్తోక్త రూపతా ॥ 43**

శ్రీచక్రము అనేది కేవలము పంచదశీ మహామంత్రంలో ఉన్న అక్షరాలవల్లనే ఏర్పడింది. కాబట్టి మంత్రానికీ శ్రీచక్రానికీ తేడాలేదు. అలాగే మంత్రానికీ, దేవతకూ తేడాలేదు. కాబట్టి మంత్రము, దేవత, శ్రీచక్రము ఈ మూడూ ఒకటే. అని తెలుస్తుంది.

**యావన్మాతృక ముదితాని ఏకసమేతాని పంచాశత్ ।**
**పీఠాని పునర్గణితాన్యోజా పూకాని చత్వారి ॥ 44**

**గణపగ్రహ భాదీనాం శశినిధి తారర్తు సూర్యసంఖ్యానాం ।**
**మేళనతః పీఠాని జ్ఞేయాన్యేతేషు పంచ పంచాశత్ ॥ 45**

సంస్కృత భాషకు అక్షరాలు - 50. అయితే మంత్రశాస్త్రంలో అక్షరాలు - 51 అని గతంలో చెప్పుకున్నాం. ఇప్పుడు మాతృకాపీఠాలు - 51. ఇక్కడ కా - కామగిరి, పూ - పూర్ణగిరి, జా - జాలంధర, ఓ - ఓడ్యాణ పీఠాలు - 4. ఈ మొత్తం కలిపి పీఠాలు - 55. అలాగే గణేశత్వం - 1, గ్రహాలు - 9, రాసులు - 12, యోగినులు-6, నక్షత్రాలు 27 వెరసి - 55. ఇవే 55 పీఠాలు అని గుర్తించాలి.

## మంత్రం నుంచే శ్రీచక్రం వచ్చింది

**కత్రితయాదీకారాత్ బిందుర్జాత స్తదగ్రిమేచక్రే ।**
**హృల్లేఖాభిస్తత్పరచక్రత్రితయం హకారాభ్యాం ॥ 46**

**ఏకారేణచ తత్పరచక్రే జాతే సకారాభ్యాం ।**
**చతురస్రాణి లకారైరేవం విద్యాక్షరేణ చక్రజనిః ॥ 47**

అసలు మంత్రంలోని అక్షరాలవల్లనే శ్రీచక్రము ఏర్పడింది. అని చెబుతున్నారు. ఇదే విషయాన్ని తంత్ర శాస్త్రాలలో కూడా ప్రతిపాదించటం జరిగింది.

పంచదశీ మహామంత్రంలోని అక్షరాలను ఒకసారి లెక్కపెట్టిన వాటిని మళ్ళీ లెక్క పెట్టకుండా, అంటే పునరావృత్తి లేకుండా చూస్తే మొత్తం తొమ్మిది అక్షరాలే వస్తాయి.

**భూమిశ్చంద్రః శివో మాయాశక్తిః కృష్ణమాదనౌ ।**
**అర్ధచంద్రశ్చ బిందుశ్చ నవార్ణో మేరురుచ్యతే ॥**



Varivasya 03 (Final) 8-5-08 64

1. భూమి – లకారము, 2. చంద్ర – సకారము, 3. శివ – హకారము, 4. మాయా – ఈకారము, 5. శక్తి – ఏకారము, 6. కృష్ణమాద్య – రేఫ, 7. మాదన – కకారము, 8. అర్ధచంద్రము – నాదము, 9. బిందువు – బిందువు.

ఈ తొమ్మిది అక్షరాల సముదాయమే పంచదశీ మహామంత్రము. దీనినుంచే శ్రీచక్రము పుట్టింది.

**1. లకారము :** పృథివీ బీజము. దీనివల్ల భూపురం పుట్టింది.

**2. సకారము :** చంద్రబీజము. దీనివల్ల చంద్రకళలుండే షోడశదళం పుట్టింది.

**3. హకారము :** శివబీజము. అష్టమూర్త్యాత్మకము. దీనివల్ల అష్టదళం పుట్టింది.

**4. ఈకారము :** మాయాబీజము. దీనివల్ల చతుర్దశ భువనాత్మకమైన చతుర్దశారము పుట్టింది.

**5. ఏకారము :** శక్తిబీజము. దీనివల్ల దశావతారాలకు ప్రతీకగా బహిర్దశారం పుట్టింది.

**6. రకారము :** అగ్నిబీజము. దీనివల్ల అగ్నికళలతో కూడిన అంతర్దశారం పుట్టింది.

**7. కకారము :** మన్మథ బీజము. వసుకోణాత్మకము. దీనివల్ల అష్టకోణము పుట్టింది.

**8. అర్థచంద్రము :** త్రిగుణాత్మకము. దీనివల్ల త్రికోణము పుట్టింది.

**9. బిందువు :** పరబ్రహ్మాత్మకము. దీనినుంచి బిందువు పుట్టింది.

అయితే భాస్కరరాయలవారు మాత్రం ....

1. సర్వానందమయమైన బిందువు : మూడు కకారములు, ఏ కారమువల్ల పుట్టింది.

2. సర్వసిద్ధిప్రదచక్రము (వసుకోణము), సర్వరోగహర చక్రము (త్రికోణము) మూడు హ్రీంకారాల వల్ల పుట్టినాయి.

3. సర్వరక్షాకరచక్రము (అంతర్దశారము) సర్వార్థసాధకచక్రము (బహిర్ద శారము), సర్వసౌభాగ్యదాయక చక్రాలు (చతుర్దశారాలు) : రెండు హకారాలు, ఈకారము వల్ల పుట్టినాయి.



4. సర్వసంక్షోభణచక్రము (అష్టదళము), సర్వాశా పరిపూరక చక్రము (షోడశ దళము) – రెండు సకారాల వల్ల పుట్టినాయి.

5. త్రైలోక్యమోహనచక్రము (భూపురము) : లకారము నుండి పుట్టింది. అన్నారు. మొత్తంమీద శ్రీచక్రము అనేది మంత్రాక్షరాల నుంచే పుట్టింది.

**ఏతత్త్రితయా భిన్న స్వగురుస్తదభేద భావనాదార్ఢ్యాత్ ।**
**తేన గణేశాదిమయః తద్దయయా చ స్వయం తథా రూపః ॥ 48**

**ఇత్థం మాతా విద్యాచక్రం స్వగురుః స్వయంచేతి ।**
**పఞ్చానామపి భేదాభావో మంత్రస్య కౌళికార్థోఽయమ్ ॥ 49**

తన గురువు దేవతకన్న, పంచదశీ మంత్రంకన్నా, శ్రీచక్రంకన్నా వేరు కాదు. వీరందరితోనూ గురువు భిన్నుడు కాదు అని చెప్పటం చేత గురువుకూడా గణేశత్వము, నవగ్రహత్వము, రాశిరూపము, నక్షత్రరూపము, యోగినీరూపము పొందుతున్నాడు.

ఈ రకంగా గణేశాది రూపాలు పొందిన దేవత, మంత్రము, యంత్రములతో గురువుకు తేడా లేదు అని తెలుసుకున్న శిష్యుడుకూడా గణేశాది రూపాలు పొందుతున్నాడు.

ఈ విధంగా దేవత, విద్య, శ్రీచక్రము, గురువు, శిష్యుడు. ఈ ఐదుగురు గణేశాది రూపాలు పొందటం వల్ల అభిన్నులు అని చెప్పటమే కౌళికార్థము.

## 6. రహస్యార్థము

ఇక్కడ కుండలినీ శక్తిని వివరిస్తున్నారు. ఆధారచక్రంలో సర్పాకారం ధరించి స్వయంభూలింగానికి మూడున్నర చుట్లుగా చుట్టుకుని, అథోముఖంగా నిద్రావస్థలో ఉంటుంది కుండలినీ శక్తి. వామకేశ్వర తంత్రంలో కుండలినీ శక్తిని గురించి ఇలా చెప్పారు.

**భుజంగాకార రూపేణ మూలాధారం సమాశ్రితా ।**
**శక్తిః కుండలినీ నామ బిసతంతు నిభాసుభా ॥**

కుండలినీ శక్తి ఆధారచక్రంలో, నోటితో తోకను కరచి పట్టుకున్న సర్పాకారంలో అథోముఖంగా నిద్రిస్తూ ఉంటుంది. చంద్రకిరణాల వల్ల స్రవించే అమృతపుధారలే

దీనికి ఆహారం. నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తిని గనక జాగృతం చేసినట్లైతే, అది గ్రంథిత్రయాన్ని ఛేదించుకుని సహస్రారానికి చేరి, అక్కడ తన భర్త అయిన పరమశివునితో కలిసి సుఖిస్తుంది. ఆ సమయంలో సాధకుని శరీరంలోని 72వేల నాడీ మండలము, అమృతపు దారలతో తడిసిపోతుంది. అప్పుడు అతని ఆనందము అనిర్వచనీయము, అనుభవైక వేద్యము. ఈ విషయాన్ని శంకర భగవత్పాదులవారు తమ సౌందర్యలహరిలోని 9వ శ్లోకంలో వివరించారు.

**మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం**
**స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశ ముపరి**
**మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్త్వా కులపథం**
**సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే ॥** **9**

ఓ తల్లీ ! భగవతీ ! నీవు మూలాధారంలో ఉన్న భూతత్త్వాన్ని, స్వాధిష్ఠాన చక్రంలోని అగ్నితత్త్వాన్ని, మణిపూరచక్రంలోని జలతత్త్వాన్ని, అనాహతచక్రంలోని వాయుతత్త్వాన్ని, విశుద్ధచక్రంలోని ఆకాశతత్త్వాన్ని, ఆజ్ఞాచక్రంలోని మనస్తత్త్వాన్ని, సుషుమ్నా మార్గం గుండా ఛేదించి, సహస్రారం చేరి, అక్కడ నీ భర్త అయిన సదాశివునితో కలిసి విహరిస్తుంటావు.

ఈ శ్లోకంలో కుండలినీశక్తిని వివరిస్తున్నారు శంకరభగవత్పాదులవారు. అసలు ఎవరీ కుండలినీ శక్తి ? ఈవిడే పరమేశ్వరి. ఆ పరమేశ్వరి ఆధారచక్రంలో కుండలినీ రూపంలో ఉంటుంది. వామకేశ్వర తంత్రం, బహురూపాష్టకాలలో

**ధ్యాయేత్ కుండలినీందేవీం స్వయంభూలింగవేష్టితాం**
**శ్యామాం సూక్ష్మాం సృష్టిరూపాం సృష్టి స్థితి లయాత్మికాం**
**విశ్వాతీతాం జ్ఞానరూపాం చింతయే దూర్ధ్వ వాహినీం ॥**
**"ధ్యాయేత్ కుండలినీం దేవీం ఇష్టదేవస్వరూపిణీం**
**సదాషోడశ వర్షీయాం పీనోన్నత పయోధరాం**
**నవయౌవ్వన సంపన్నాం సర్వాభరణ భూషితాం**
**పూర్ణచంద్రప్రభాం రక్తాం సదా చంచలలోచనాం"**



కంకాళమాలినీ తంత్రంలో,

**కోటిచంద్ర ప్రతీకాశాం పరబ్రహ్మ స్వరూపిణీం**
**చతుర్భుజాం త్రినేత్రాంచ వరదాభయకరాం తథా**
**తథా పుస్తక వీణాంచ ధారిణీం సింహవాహినీం**
**గచ్ఛంతీం స్వాపనాం భీమాం నానారూప ధరాత్మికాం"**

ఆమె స్వయంభూలింగానికి మూడున్నరచుట్లుగా చుట్టుకుని అధోముఖంగా, సూక్ష్మరూపంలో ఉంటుంది. ఆమె నవయవ్వనసంపన్న, సర్వాభరణభూషిత, సృష్టి, స్థితి, లయకారిణి. రుద్రయామళంలో కుండలినీ స్తవము ఉన్నది.

**జన్మోద్ధార నిరక్షీయ తరుణీ వేదాది బీజాదిమా**
**నిత్యంచేతసి భావ్యతే భువికథా సద్వాక్య సంచారిణీ**
**మాంపాతు ప్రియదాన భావకపదం సంఘాతయే శ్రీధరే**
**ధాత్రి త్వం స్వయమాది దేవవనితా దీనాతి దీనం పశుమ్ ॥**

ఓ పరాత్పరీ ! శివుని అర్ధాంగి అయిన ఓ పార్వతీ ! నీవు సర్వకాల సర్వావస్థల యందు ఉపనిషద్వాక్యములందు సంచరిస్తుంటావు. ఓంకార స్వరూపిణివి. నిత్యయవ్వనవు. మానవుల జన్మలనుద్ధరించటానికి సదా మెలకువతో ఉంటావు. అటువంటి నిన్ను ఎల్లప్పుడు నేను సేవిస్తూ ఉంటాను.

**రక్తభామృత చంద్రికా లిపిమయీ సర్పాకృతిర్నిద్రితా**
**కుండల్యా కులమార్గ ముక్తనగరీ మాయాకుమార్గాశ్రియా**
**యద్యేవం భజతి ప్రభాత సమయే మధ్యాహ్న కాలేథవా**
**నిత్యం యః కులకుండలీ జప పదాంభోజం ససిద్ధోభవేత్ ॥**

ఓ తల్లీ ! నీవు రక్తవర్ణంతో ప్రకాశిస్తూ సర్పాకృతిలో నిద్రిస్తుంటావు. నేను త్రికాలములందు నిన్ను సేవిస్తుంటాను. నీవు జాగ్రదావస్థలోకి వచ్చినప్పుడు నీ కరుణాదృక్కులు నామీద ప్రసరింపచేయవలసినది. అంటూ ఎనిమిది శ్లోకాలలో కుండలినీశక్తిని ప్రార్థించారు.



Varivasya 03 (Final) 8-5-08 66

ఇప్పుడు కుండలినీ శక్తియే పరదేవత అంటున్నారు భాస్కరరాయలవారు.

**ద్వాదశ షోడశ దశభిః తపన శశిదహన కళాభిః ఆకీర్ణైః ।**
**పంచాశద్భిర్వర్ణైః అభిన్న దేహా కులీన కుండలినీ ॥ 50**
**బిసతన్వీ తటిదాభా మూలాధారస్థ పద్మశృంగాంతాత్ ।**
**భిత్త్వా మూలహృదాజ్ఞాగత వహ్నిరవీందు మండలత్రితయం ॥ 51**
**వ్యోమని: చిచ్ఛశి మండల మధ్యేత్ అకులేన సంగమ్య ।**
**ఉభయాంగ సంగ జన్యం ప్రవాహయన్తి సుధాపూరం ॥ 52**
**స్వయమపి తత్పానవశాత్ మత్తా భూత్వా పునశ్చతేనైవ ।**
**మార్గేణ (సుషుమ్నా) పరావృత్త్య స్వస్మింస్థానే సుఖం స్వపితి ॥ 53**
**సాక్షాద్విద్యైవైషా న తతో భిన్నా (శివా) జగన్మాతా ।**
**అస్యాః స్వాభిన్నత్వం శ్రీవిద్యాయాః రహస్యార్థః ॥ 54**

**చంద్రకళలు - 16** : 1. అమృతకళ, 2. మానదా, 3. పూషా, 4. తుష్టి, 5. పుష్టి, 6. రతి, 7. ధృతి, 8. శశినీ, 9. చంద్రిక, 10. కాంతి, 11. జ్యోత్స్నా, 12. శ్రీ, 13. ప్రీతి, 14. అంగదా, 15. పూర్ణా, 16. పూర్ణామృతా.

**అగ్నికళలు - 10 :** 1. ధూమ్రా, 2. ఊష్మా, 3. జ్వలిని, 4. జ్వాలినీ, 5. విస్ఫులింగినీ, 6. సుశ్రీ, 7. సురూపా, 8. కపిలా, 9. హవ్యవాహిని, 10. కవ్యవాహిని.

**సూర్యకళలు -12 :** 1. కం భం తపినీ, 2. ఖం బం తాపినీ, 3. గం ఫం ధూమ్రా, 4. ఘం పం మరీచీ, 5. ఙం నం జ్వాలినీ, 6. చం ధం రుచి, 7. ఛం దం సుషుమ్నా, 8. జంథం భోగదా, 9. ఝంతం విశ్వా, 10. ఞం ణం బోధినీ, 11. టం ఢం ధారిణీ, 12. ఠం డం క్షమా.

ఇప్పుడు చంద్రకళలు 16, అగ్నికళలు 10, సూర్యకళలు 12. ఈ సూర్యకళలను క నుంచి ఠ వరకు అనులోమంగాను, డ నుంచి భ వరకు విలోమంగాను చెప్పాలి. అప్పుడు అవి 24 అవుతాయి. ఈ ప్రకారం లెక్కపెడితే అగ్నికళలు 10, చంద్రకళలు 16, సూర్యకళలు 24 వెరసి 50 అక్షరాలు 50 అంటే మూలాధారంలో ఉన్న కుండలినీశక్తి మాతృకా వర్ణరూపిణి అవుతున్నది.



ఇడ పింగళనాడుల గుండా సూర్యచంద్రులు తిరుగుతుంటారు. అవే ఉచ్ఛ్వాస నిశ్వాసలు. ఇప్పుడు చంద్ర కిరణములనుండి జాలువారిన అమృతబిందువులను ఆహారంగా తీసుకుని సుఖంగా నిద్రిస్తూ ఉంటుంది కుండలినీ శక్తి. కాబట్టి దానికి ఆహారం దొరకకపోతే నిద్ర లేస్తుంది. అందుచేత సాధకుడు ప్రాణాయామం చేసి ఉచ్ఛ్వాన నిశ్శ్వాసల నాపినట్లైతే కుండలినీశక్తి నిద్రనుంచి మేల్కొని లలితా సహస్రంలో చెప్పినట్లుగా ....

**మూలాధారైక నిలయా బ్రహ్మగ్రంథి విభేదినీ**
**మణిపూరాంతరుధితా విష్ణుగ్రంథి విభేదినీ**
**ఆజ్ఞాచక్రాంతరాళస్తా రుద్రగ్రంథి విభేదినీ**
**సహస్రారాంబుజారూఢా సుదాసారాభివర్షిణీ ॥**

గ్రంథిత్రయాన్ని దాటి సహస్రారం చేరుతుంది. ప్రాణాయామం చేసినప్పుడు సాధకుడియొక్క స్వాధిష్ఠాన చక్రంలో అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఈ అగ్ని యొక్క వేడి సుషుమ్నగుండా సహస్రారం చేరుతుంది. సహస్రారము చంద్రలోకము. అక్కడ చంద్రుడికి వృద్ధి క్షయాలుండవు. అతడు ఎల్లవేళలా పూర్ణచంద్రుడు. ఆ చల్లదనానికి అక్కడ అమృతం అంతా ఘనీభవిస్తుంది. ఆ రకంగా ఘనీభవించిన అమృతం స్వాధిష్ఠానాగ్ని వల్ల వేడెక్కి ద్రవరూపం చెందుతుంది. ఆధారచక్రంలో జాగృతం చెందిన కుండలినీ శక్తి సుషుమ్నానాడి గుండా పైకి పోయి, సహస్రారం చేరి, సహస్రదళ కమలం యొక్క కర్ణికను తన నోటితో కరచి పట్టుకుంటుంది. ఆ పంటిగాట్ల ద్వారా అక్కడ ద్రవరూపం చెందిన అమృతం క్రిందికి జాలువారి, యోగిశరీరంలోని 72వేల నాడీమండలాన్ని తడుపుతుంది. అప్పుడు అతడు పొందే ఆనందము అనుభవైక వేద్యము.

ఈ కుండలినీశక్తియే పరమేశ్వరి. అందుకే ఆమె సహస్రారం చేరి తన భర్త అయిన పరమేశ్వరునితో సుఖిస్తుంది అన్నారు శంకరభగవత్పాదులవారు తమ సౌందర్యలహరిలో. ఆ తరువాత, తిరిగి వచ్చి మళ్ళీ మూలాధారచక్రంలో నిద్రావస్థలోకి వెడుతుంది. ఈ కుండలినీశక్తిని గ్రహించటము అంటే ఆత్మజ్ఞానము పొందటమన్నమాట.

ఈ రకంగా కుండలినీశక్తి, పరదేవతా, మంత్రము పరమేశ్వరుడూ ఒకటే అని తెలుసుకోవటమే రహస్యార్థము.

యోగినీరూపంలో దీన్నే "సర్వ రహస్యార్థము" అని వివరించారు. సంస్కృతంలో ఏ కారానికి మూడు గీతలు ఉంటాయి. అందుచేత అదే త్రికోణంగా చెప్పబడింది. మూలాధారంలో త్రికోణమున్నది. దానియందు విద్యుత్ కాంతులు వెదజల్లే కుండలినీ శక్తి 38 కళలతో కూడి ఉన్నది.

చంద్రకళలు 16, సూర్యకళలు 12, అగ్నికళలు 10 వెరసి 38. మంత్రంలో మొదటి కూటమి – అగ్నిమండలము, రెండవ కూటమి – సూర్య మండలము, మూడవ కూటమి – చంద్రమండలము.

ఈ విధమైన శ్రీవిద్య కుండలినీ రూపమైనది. ఆధారచక్రంలో కుండలినీశక్తి స్వయంభూలింగానికి మూడున్నర చుట్లు చుట్టుకుని, అథోముఖంగా నిద్రిస్తుంటుంది. సాధకుడు ప్రాణాయామం చేసి, దాన్ని జాగృతం చేస్తే అది గ్రంథిత్రయాన్ని ఛేదించి సహస్రారం చేరి, అక్కడ సుధాధారలు కురిపిస్తుంది. ఆ సుధాధారలతో ఆజ్ఞనుంచి ఆధారచక్రందాకా, అన్ని చక్రాలలో ఉండే అక్షరాలను తడుపుతుంది. ఈ రకంగా బ్రహ్మానందం అనుభవించి, తిరిగి ఆధారచక్రం చేరి నిద్రిస్తుంది. కుండలినియే సాధకుని ఆత్మ. ఈ విధంగా స్థిరమైన భావన ఉండటమే సర్వరహస్యార్థము. విద్య, కుండలిని, ఆత్మ ఈ మూడింటికీ తేడాలేదు.

## 7. మహాతత్త్వార్థము

**వాగింద్రియైరగమ్యే తత్త్వాతీతే మహత్తరేఽణుతరే ।**
**వ్యోమ్నోఽప్యుపరి స్థితిమతి విశ్వాభిన్నే చిదానందే ॥ 55**
**బ్రహ్మణి పరే నియోజ్యః స్వాత్మాతదభేద సంప్రాప్త్యై ।**
**ఏషమహాతత్త్వార్థః శ్రీవిద్యాయాః శివేనోక్తః ॥ 56**

ఇంద్రియాలచే తెలుసుకోవటానికి వీలు కానిది, అన్ని తత్త్వాలకు అతీతమైనది, అన్నింటికన్న పెద్దది, అన్నింటికన్న చిన్నది, జగత్తుకన్న వేరుకానిది, చిదానంద స్వరూపము అయిన బ్రహ్మతో అభేదము పొందటానికి తాను ఏకం కావాలి. అంటే ఆత్మకన్న తాను వేరుకాదు. "నేను ఆత్మ పురుషుణ్ణి" అనే భావన రావాలి. అజ్ఞానంతో వచ్చిన సంశయాలను, గురువుగారి వల్ల తీర్చుకుని, ఆత్మసాక్షాత్కారము పొందటమే మహాతత్త్వార్థము.



పరమేశ్వరి నిరాధారా – ఆధారము లేనిది, నిరంజనా – పై పూతలు లేనిది. నిర్లేపా – మాయలేదు. ఈ రకంగా పరమేశ్వర స్వరూపం నిరాకారము, నిర్గుణము. లలితా సహస్రంలో 132 నుంచి 195వ నామందాకా పరమేశ్వర తత్త్వాన్ని వర్ణించటం జరిగింది. ఈ పరబ్రహ్మ తత్త్వము ఉన్న చోటికి **న చక్షుర్ గచ్ఛతి, న నాగ్గచ్ఛతి నోమనః** కళ్ళు వెళ్ళలేవు. వాక్కు వెళ్ళలేదు. మనస్సు వెళ్ళలేదు. అంటే ఇంద్రియాల ద్వారా దాన్ని తెలుసుకోలేము. **అణోరణీయాం మహతో మహీయాం** అది అన్నిటికన్న సూక్ష్మమైనది. పెద్దవాటికన్నకూడా పెద్దదైనది. కంటికి కనిపించనిది. అవాఙ్మానస గోచరమైనది. ఆకాశానికి కూడా కారణమైనది. అవ్యక్తమైనది. శాశ్వతమైనది. సచ్చిదానందమైనది. జగత్తు అంతా వ్యాపించినది. వెలుగులకు వెలుగు, కాంతులకు కాంతి. ఇటువంటి పరమాత్మను గురించి సాధకుడు గురువుగారి బోధలవల్ల, శాస్త్రపఠనమువల్ల, తెలుసుకుని దానిలో ఐక్యత పొందటాన్నే మహాతత్త్వార్థము అంటారు. ఈ రకంగా జీవుడికీ, పరమేశ్వరుడికీ అభేదము చెప్పటమే మహాతత్త్వార్థము.

1. భావార్థము, 2. శాస్త్రార్థము, 3. వాచ్యార్థము, 4. లక్షణార్థము, 5. ఆప్తవాక్యము, 6. ధ్వన్యర్థము అనేవి శివుడికి మాత్రమే చెప్పారు అంతేకాని శక్తిని గురించి కాదు అని కొందరివాదన. శివశక్తులకు తేడాలేదు. వారిద్దరూ ఒకటే. కాబట్టి శివుణ్ణి గురించి చెప్పారు అంటే శక్తిని గురించి చెప్పినట్లే అని గుర్తుంచుకోవాలి.

## 8, 9 నామార్థ, శబ్ద రూపార్థములు

**తత్తద్వర్ణార్థేయం తత్తద్వర్ణ స్వరూపేయం ।**
**ఇతితు శ్రీవిద్యాయాః నామార్థః శబ్దరూపార్థః ॥ 57**

శ్రీవిద్యలో ప్రతి అక్షరానికి అర్థం పరదేవతయే. ప్రతి అక్షరము పరదేవతా స్వరూపమే. ఇదే నామార్థ, శబ్దరూపార్థము.

## 10. నామైక దేశార్థము

**నామైక దేశరూపః కల్యాణేకాక్షరీ శిత్రీచాపి లలితాచ ।**
**ఇత్థం నామత్రిశతీ వాచ్యార్థః తత్తదక్ష రస్యాపి ॥ 58**

నామైక దేశమాత్రే నామగ్రహణస్య లోకసిద్ధత్వాత్ ।
నామోపస్థితి గమ్యః ప్రోక్తో నామైక దేశార్థః ॥ 59

తిథిమిత బిందుగణోత్తర గజ రసగిరిదస్రరామ సంఖ్యాకాః ।
అర్థాభవంతి యోగాత్ నామ్నో నామైక దేశస్య ॥ 60

ఏదైనా ఒకపేరు చెప్పాలి అంటే పేరు మొత్తం చెప్పవలసిన పనిలేదు. అందులో ఒకటి రెండు అక్షరాలు చెప్పినట్లైతే మొత్తం పేరు చెప్పినట్లే. ఉదాహరణకు సత్య అంటే సత్యభామ. సత్తిగాడు అంటే సత్యనారాయణ. భీమ అంటే భీమసేనుడు. కాబట్టి పేరు మొత్తం చెప్పకుండా అందులోని కొద్ది భాగాన్ని చెప్పినా సరిపోతుంది. **నామైక దేశే నామగ్రహణం** అనే సూత్రాన్నిబట్టి పేరులో ఒక భాగాన్ని తీసుకున్నట్లైతే పేరు మొత్తాన్ని తీసుకున్నట్లే. ఈ సూత్రం మీద ఆధారపడే లలితాత్రిశతి చెప్పటం జరిగింది. త్రిశతి అంటే మూడు వందల నామాలు. పంచదశీమహామంత్రంలో పదిహేనుఅక్షరాలు. వీటిలో ఒక్కొక్క అక్షరాన్ని తీసుకుని, ఆ అక్షరం మొదట వచ్చేట్లుగా 20 నామాల చొప్పున 15×20 = 300 నామాలు చెప్పారు. ఈ ప్రకారం గనక మంత్రంలోని అక్షరాలకు అర్థం చెప్పినట్లైతే కొన్ని కోట్ల అర్థాలు వస్తాయి. ఎందుచేత అంటే ప్రతినామానికీ ఒక అర్థం ఉంటుంది. ఈ విధంగా అర్థం చెప్పటమే నామైక దేశార్థము.

## 11. శాక్తార్థము

వాక్కామ శక్తికూటైః అవయవశో విగ్రహోమాతుః ।
ప్రతిపాద్యోత్రా కంఠాత్ ఆమధ్యాదాచ పాదాగ్రాత్ ॥ 61

వేధోభారత్యౌ మాధవలక్ష్మ్యౌ రుద్రపార్వత్యౌ ।
రేఫాంత వర్ణ షట్కస్యార్థాన్ క్రమశో విజానీయాత్ ॥ 62

శాక్తార్థము రెండు రకాలుగా ఉంటుంది. 1. అవయవార్థము 2. శక్తి సమూహార్థము

అవయవార్థము అంటే దేవి అవయవాల వర్ణన. శ్రీవిద్యలో శరీరాన్ని మూడు భాగాలుగా చేశారు. అలాగే మంత్రాన్నికూడా మూడు భాగాలుగా చేసి వాటినే



మూడు ఖండాలు లేదా మూడు కూటములు అన్నారు. శరీర భాగాలకు ఉన్న పేర్లతోనే ఈ కూటములను పిలవటం జరుగుతున్నది. అవే 1. వాగ్భవ కూటమి, 2. కామరాజ కూటమి, 3. శక్తికూటమి. లలితా సహస్రంలో

శ్రీమద్వాగ్భవకూటైక స్వరూప ముఖపంకజా
కంఠాదికటిపర్యంతం మధ్యకూటస్వరూపిణీ
శక్తికూటైక తాపన్నకప్యధోభాగధారిణీ

అని చెప్పటం జరిగింది.

2. శక్తసమూహార్థము అంటే మంత్రంలోని అక్షరాలకు త్రిమూర్తులను, త్రిశక్తులను అర్థంగా గ్రహించటము. దీన్ని గతంలో చెప్పాం. అయినప్పటికీ ఒక్కసారి మళ్ళీ చూద్దాం.

వామేచ్ఛా బ్రహ్మభారత్యౌ జ్యేష్ఠాజ్ఞాన హరిక్షితి ।
రౌద్రిక్రియాశివాపర్ణే ఇత్యే తన్మి ధునత్రయమ్ ॥

వామ – బ్రహ్మ, ఇచ్ఛా – భారతి, జ్యేష్ఠా – హరి, జ్ఞాన – క్షితి, రౌద్రి – శివుడు, క్రియా – అపర్ణ. ఈ రకంగా త్రిమూర్తి ద్వంద్వాన్ని చెప్పటం జరిగింది.

కకారోబ్రహ్మరూపశ్చ ఏకారోభారతీమతమ్
ఈకారో విష్ణురూపశ్చ లకారో పృథివీ మతమ్
హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥

క – బ్రహ్మ, ఏ – భారతి, ఈ – విష్ణువు, ల – పృథివి, హ – రుద్రుడు, రకారము – రుద్రాణి.

ఈ విధంగా మూడు కూటములలోను లెక్కించటాన్నే శక్తి సమూహార్థము అంటారు.

తాఏతాస్సకలా అపి కామకలా ఏవ నతతో అన్యాః ।
సామానాధికరణ్యాత్ ఈకారేణాయమ్ అర్థో అస్య ॥ 63

అయమేవ కూటయోరపి పరయోరర్థః పరంతు తార్తీయే ।
ద్వైతీయా కద్వైతీయాక హకారస్సకారతః పూర్వం ॥ 64

**అన్వయితవ్యోఽక్షరశః శక్తేః శాక్తై ర్విభావ్యత్వాత్ ।**
**వామేచ్ఛాదిక శక్తిమయత్వోక్తేః ఏష శాక్తార్థః ॥** 65

ఇక్కడ బ్రహ్మ మొదలైన వారందరినీ కామకళలుగానే భావించాలి.

రెండవ కూటమిలోని రెండవ హకారాన్ని అక్కడ నుంచి తీసివేసి మూడవ కూటమికి ముందు చేర్చాలి. అప్పుడు రెండు, మూడు కూటములు సమానమవుతాయి అప్పుడు

**హకారో బ్రహ్మరూపశ్చ సకారో భారతీమతమ్**
**కకారో విష్ణురూపశ్చ లకారో పృథివీమతమ్**
**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్యతే ॥**

హ - బ్రహ్మ, స - భారతి, క - విష్ణువు, ల - పృథివి, హ - రుద్రుడు, రకారము - రుద్రాణి. ఈ రకంగా అర్థం చెప్పటమే శాక్తార్థము.

## 12. సామరస్యార్థము

**కహయోర్లసయోరర్థౌ శివశక్తీ శుద్ధయోరచో ।**
**ఉభయోస్సమరస భావో హృల్లేఖాయాః పరంబ్రహ్మ ॥** 66

**బ్రహ్మైవ శివశ్శక్తిశ్చేతి ప్రత్యేక కూటార్థః ।**
**శివశక్తి సామరస్యాత్ విద్యాయా ఏష సామరస్యార్థః ॥** 67

మంత్రంలో మొత్తం 15 అక్షరాలున్నాయి. వాటిలో మూడు హ్రీంకారాలు. అవి పోతే మిగిలేవి - 12. వాటిలో కకారాలు - 3, హకారాలు - 2 శివరూపాలు. లకారాలు - 3, సకారాలు - 2, ఈకారము - 1, ఏకారము - 1, వెరసి - 7 శక్తిరూపాలు. హ్రీంకారాలు ఉభయాత్మకాలు. లలితా త్రిశతిలో ఈ విషయం చెప్పారు.

**కత్రయం హద్వయం చైవ శైవభాగ ప్రకీర్తితః ।**
**శక్త్యక్షరాణి శేషాణి హ్రీంకార ముభయాత్మకః ॥**

పంచదశీ మంత్రంలో కకారాలు - 3, హకారాలు - 2 శివస్వరూపాలు. హ్రీంకారాలు ఉభయాత్మకాలు. కాగా మిగిలినవి (లకారాలు - 3, సకారాలు - 2, ఈకారము - 1, ఏకారము - 1) శక్తి స్వరూపాలు.



కాబట్టి ప్రతికూటమిలోను పరబ్రహ్మయే శివశక్తి స్వరూపము. ఈ రకంగా శివశక్తుల సామరస్యమే శ్రీవిద్యకు సామరస్యార్థము.

## 13. సమస్తార్థము

**కనదీప్తావితి ధాతోః ప్రకాశకత్వం కకారార్థః ।**
**అధ్యయనార్థకతా ఏజః స్యాదేకార స్తదీయ కరణార్థః ॥** 68

**వర్ణద్వయమేళనతః ప్రకాశికా బుద్ధిరిత్యర్థః ।**
**ఈ వ్యాప్తావితి ధాతోః తస్యాః వ్యాప్తిః తృతీయవర్ణార్థః ॥** 69

**తస్యా లహర్యాధిక్యం తన్నిర్మాణం మకారార్థః ।**

మంత్రంయొక్క మొదటి కూటమిలో

కం - ప్రకాశం అని, క అంటే ప్రకాశము అని అర్థం. కాబట్టి క అనే అక్షరానికి ప్రకాశము అని అర్థం చెప్పబడింది. ఏ అనగా బుద్ధి అని, జ్ఞాపకజ్యోతి అని అర్థం. ఈ రెండు అక్షరాలవల్ల ప్రకాశించే బుద్ధి అని అర్థం. ఇక మూడవ అక్షరం ఈ అంటే వ్యాప్తి చేయునది. 'లహరి' అంటే ఆధిక్యతను ఇచ్చేది. మొత్తం మీద ప్రథమకూటమికి అర్థం సూక్ష్మమైన బుద్ధిని జ్ఞానాన్ని ప్రసాదించాల్సింది.

**హనహింసాయామితి హం శౌర్యం ప్రత్యర్థి హననకరణత్వాత్ ॥** 70

**సంభోగ సాధనం ధనముపభోగార్థాత్ స్మృతేః మనోతేర్వా ।**
**కముకాన్తావితిధాతోః ఇచ్ఛావిషయో అఙ్గనాదిః కమ్ ॥** 71

**ఏషాం గమనం మధ్యమహోజ్జం గత్యర్థ ధాతుజన్యం హమ్ ।**
**తస్యాతిశయో లహరీ తత్ర శ్లిష్టస్తవర్ణ దీర్ఘేణ ॥** 72

**ఈకార స్తస్యార్థః కీర్తిః సర్వాసు దిక్షు దీప్తత్వాత్ ।**
**ఈ దీప్తావితి ధాతోః నిర్మితిరనయోః మకారార్థః ॥** 73

ఈ శ్లోకాలలో రెండవ కూటమిలోని హకారానికి అర్థము. శత్రునాశనం చెయ్యగల శౌర్యము. సకారానికి భోగసాధనమయిన ధనము, కకారానికి - కోరికల విషయాలయిన కాంతా కనకాలు, హకారానికి - పైన చెప్పినవన్నీ ప్రాప్తించాలని

అర్థం. ల హ్రీం - ఇవి ఎక్కువగా రావాలి; ఈకారము - కీర్తి. మొత్తంమీద శత్రునాశనం చెయ్యగల శౌర్యము, భోగసాధనమయిన ధనము, కోరికలను తీర్చగల కాంతాకనకాలు, కీర్తి అన్నీ ఎక్కువగా ప్రాప్తించాలి అని అర్థం.

**వాగ్భవ కూటస్యార్థః సూక్ష్మమతి వ్యాపనాధిక్యమ్ ।**
**శౌర్యధన శ్రీయశసామ్ ఆధిక్యమ్ కామరాజార్థః ॥** 74

సునిశితమైన బుద్ధిని ఎక్కువగా ఇవ్వాలి అని మొదటిదైన వాగ్భవ కూటమికి, శౌర్యము, ధనము, స్త్రీలు, కీర్తి ఎక్కువగా ఇవ్వాలి అని రెండవదయిన కామరాజ కూటమికి అర్థం.

**ఏతే సమ్యక్కలయతి సకలా హరతేః హృకారస్స్యాత్ ।**
**నిఖిల జగత్సంహర్త్రీత్యర్థః తస్యాపి వర్ణస్య ॥** 75

**ఈకారః ప్రశ్లిష్టః సృష్టి స్థితి రూప దీప్తికర్త్ర్యర్థః ।**
**యద్వా హృది ఖేదహరే ప్రకాశతే తేన మాతా హ్రీః ॥** 76

ఈ కూటమిలోని 'సకల' అనే మూడు అక్షరాలకు కలిపి, తనలో లీనము గావించుకొనుట అని అర్థం. ఇక్కడ చెప్పిన హ్రీంకారంలో, హృకారానికి - సంహరించుట అని, ఈకారానికి సృష్టి స్థితి సంహారకారిణి అని అర్థం. దానికే దహరాకాశవర్తిని అని కూడా అర్థం.

**సకలాంతేన పదేన హ్రీకారే కర్మధారయః కార్యః ।**
**తస్య విశేష్యో మస్స్యాత్ నాదార్థస్సంవిదర్థోవా ॥** 77

**ధాతోః బహ్వర్థత్వాత్ బహుళ గ్రహణాత్ పృషోదరాదిత్వాత్ ।**
**ఆకృతి గణపాఠేన స్వేచ్ఛానుగుణాత్ ఉణాది కల్పనతః ॥** 78

మొత్తంమీద పంచదశీమహామంత్రానికి అర్థం ఏమిటి అంటే సృష్టి స్థితి సంహారకారిణి, దహరాకాశవర్తిని అయిన ఓ పరదేవతా నాకు సూక్ష్మమైన బుద్ధిని, జ్ఞానాన్ని శత్రునాశనం చెయ్యగల శౌర్యపరాక్రమాలను, భోగసాధనమయిన ధనాన్ని, కోరికలు తీర్చగల కాంతాకనకాలు, కీర్తి ప్రతిష్టలు ఎక్కువగా ప్రసాదించవలసింది.



**ఛందసి సర్వవిధీనాం వైకల్పికతా వశాదముష్య మనోః ।**
**సిద్ధైః కథితే అర్థే అస్మిన్ వైయాకరణాను శాసనానుమతిః ॥** 79

**బహుతర సమాసయోగాత్ సమస్త పురుషార్థ సాధనత్వోక్తేః ।**
**సంక్షేపాత్సారోక్తేః శ్రీవిద్యాయాః సమస్తార్థః ॥** 80

ఈ పంచదశీ మహామంత్రము అన్ని రకాలయిన వ్యాకరణ శాస్త్రాల సమ్మతి గలది. వ్యాకరణాలు తొమ్మిది.

1. పాణిని, 2. కలాపము, 3. సుపద్మము, 4. సారస్వతము, 5. ప్రాతిశాఖ్యము, 6. కుమారవ్యాకరణము, 7. ఐంద్రము, 8. వ్యాఘ్ర భౌతికము, 9. శాకటాయనము. ఈ రకంగా అన్ని వ్యాకరణములచేత అంగీకరింపబడినది. ఛందో శాస్త్రానికి అనుగుణంగా ఉన్నది. అగస్త్యాది మహర్షుల చేత వివరంగా వివిధ రకాలయిన అర్థాలు చెప్పబడింది. అందుచేతనే ఇది 'సమస్తార్థము' అని చెప్పబడింది.

## 14. సగుణార్థము

**కోవిధిరేకారో హరిరకార ఈశస్తువార్థమీడపదమ్ ।**
**ద్విస్వరమధ్యగతస్య డకారస్యలకార ఆదేశః ॥** 81

**తేన ఋగ్వేదాత్మత్వం సూచితమాద్యస్య కూటస్య ।**
**క్రమోశోఽగ్రిమకూటయుగే తేన యజుస్సామతా సిద్ధా ॥** 82

**హ్రీమితి నామవిశేష్యం నపుంసకం బ్రహ్మలక్షకత్వేన ।**
**విధి హరిగిరిశైరీడ్యం బ్రహ్మేతి ప్రథమ కూటార్థః ॥** 83

మంత్రంలోని మొదటి కూటమిలో ఉన్న కకారానికి బ్రహ్మ అని అర్థం. అలాగే ఏ కారానికి హరి అని అర్థం. ఏ కారానికి, ఈ కారానికి మధ్యన ఉన్న 'అ'కారానికి రుద్రుడు అని అర్థం. ఈ, ల - స్తోత్రము అని అర్థం. ఇక్కడ హ్రీం అంటే పరబ్రహ్మ అని అర్థం. మొత్తంమీద త్రిమూర్తులు పరబ్రహ్మను స్తోత్రం చేస్తున్నారు. ఎందుకు చేస్తున్నారు ? అంటే మొదటి కూటమికి - ఋగ్వేదము, రెండవ కూటమికి - యజుర్వేదము, మూడవ కూటమికి - సామవేదము అని అర్థం. హ్రీంకారము

ఉభయాత్మకః, హ్రీంకారం నపుంసకం. పరబ్రహ్మ. అందుచేత "వేదస్వరూపమైన ఆ పరబ్రహ్మను త్రిమూర్తులు స్తుతిస్తున్నారు" అని మొదటి కూటమికి అర్థం.

**హసకంతు హసద్వదనం మతం కకారస్య వదనవాచిత్వాత్ ।**
**యద్వాహస ఆనందః కస్సూర్యో హస్తు చన్ద్రస్స్యాత్ ॥** 84
**ఏతౌలౌ నయనే యస్య తత్కహలం రవీన్దు నేత్రమితి ।**
**తేన ప్రకాశకత్వాత్ చిద్రూపత్వం చ నిగదితం భవతి ॥** 85
**విధి హరి గిరి శేద్యత్వే హేతూ ఏతే హసత్వకహలత్వే ।**
**తేనాత్యమితానందం చిద్బ్రహ్మేతి ద్వితీయ కూటార్థః ॥** 86

ఇక రెండవ కూటమిలో కకారానికి – ముఖము అని అర్థం. హస – ఆనందము అని అర్థం. కకారమునకు – సూర్యుడు, హకారానికి – చంద్రుడు అని అర్థం. ల కారానికి నేత్రములు అని అర్థం. అందుచేతనే 'హస' అంటే ఆనందమయమైన ముఖము అని అర్థం.

కహలం అంటే సూర్యచంద్రులు నేత్రములుగా కలది అని అర్థం. హసకహలం ప్రకాశిస్తున్న చిద్రూపము అని అర్థం. ఈ రకంగా ఆనందంతో ప్రకాశిస్తున్నది, సూర్యచంద్రులు నేత్రాలుగా గలది, బ్రహ్మ విష్ణు రుద్రులచే కొనియాడబడుతున్నది అంటే ఆ పరబ్రహ్మ తప్ప వేరు కాదు అని గ్రహించాలి.

**కలయాసహితం సకలం బ్రహ్మేతి తృతీయ కూటార్థః ।**
**ఇత్థం గుణ గణ కథనాత్ విద్యాయా ఏష సగుణార్థః ॥** 87

'సకలం' అంటే సకల కళలతోను కూడుకున్నది అని అర్థం. అందుచేత మూడవ కూటమికి సకల కళాపరిపూర్ణుడైన పరబ్రహ్మ అని అర్థం.

"వేదస్వరూపమయినది. ఆనందమయమైన ముఖము గలది, సూర్యచంద్రులు కనులుగా గలది, సకల కళలతోను కూడినది, త్రిమూర్తులచేత కూడా స్తుతించబడేది అయిన పరబ్రహ్మకు నమస్కరిస్తున్నాను" అని పంచదశీమహామంత్రానికి అర్థం.

ఈ రకంగా అన్ని గుణాలు చెప్పారు కాబట్టే ఇది సగుణార్థమైంది.



## 15. మహావాక్యార్థము

**విధి హరి శివ వచనా అపి కకార ఏకార ఈకారః ।**
**సృష్టి స్థితి భఙ్గాత్మక తత్తత్కృత్య జనకత్వ లక్షణకాః ॥** 88
**ఈశ్వర వాచీకారో వక్తిలకార స్సదాశివం తాభ్యామ్ ।**
**లక్షణయాత్రత్ర తిరోధానానుగ్రహ కృత్యకారితా గదితా ॥** 89

ఇక్కడ మహావాక్యార్థాన్ని వివరిస్తున్నారు. అసలు మహావాక్యాలంటే ఏమిటి ? అవి ఏం చెబుతున్నాయి ? అనే విషయాలను ముందుగా చూద్దాం. వేదం నాలుగు భాగాలుగా ఉంటుందని గతంలో చెప్పుకున్నాం. 1. సంహితలు, 2. బ్రాహ్మణాలు, 3. అర్యణ్యకాలు, 4. ఉపనిషత్తులు. వీటిలో నాల్గవ భాగము ఉపనిషత్తు. ఇది వేదము యొక్క అంతమందుంటుంది. కాబట్టి, వీటిలో ఉండేదంతా వేదాంతమే. అదే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యా పరిశీలకులైన విద్వాంసులకు కర్మ, జన్మ, మరణాలను లేకుండా చేసేది. ఆజన్మాది మరణాదికమైన దానిని నశింపచేసేది. బ్రహ్మపదార్థ లాభాన్ని కలుగజేసేది. నాలుగు వేదాలకు కలిపి 1180 ఉపనిషత్తులున్నాయి. వాటిలో ముఖ్యమైనవి 108. వీటిలో వేదాంతోపనిషత్తులు 24. మొత్తం ఉపనిషత్తులలో మరీ ముఖ్యమైనవి 10 అని తేల్చారు శంకర భగవత్పాదులవారు. అవి ...

**ఈశ కేన కఠ ప్రశ్న ముండక మాండూక్య తిత్తిరి**
**ఐతరేయంచ ఛాందోగ్యం బృహదారణ్యకం దశః**

ప్రతి ఉపనిషత్తుతోను పరబ్రహ్మతత్త్వాన్నే ప్రతిపాదించారు. నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు పరబ్రహ్మ. ఆదిమధ్యాంతములు లేనివాడు, శాశ్వతమైనవాడు, స్వతంత్రుడు, ధర్మాధర్మాలు, పక్షపాతములేనివాడు, నిమిత్తమాత్రుడు, ఆనంద స్వరూపుడు. సృష్టి స్థితిలయాలకు అతడే కారకుడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము నిండి ఉన్నవాడు. చరాచర జగత్తంతా ఆవరించి ఉన్నవాడు, సర్వవ్యాపి.

ఈ విధంగా ఉపనిషత్తులు పరబ్రహ్మస్వరూపాన్ని ప్రతిపాదించటంలో చాలా వరకు సఫలీకృతం పొందినాయి. ఉపనిషత్తుల సారమంతా మహావాక్యాలలో ఉంది. మహావాక్యాలు నాలుగు. ఈ మహావాక్యాలు నాలుగు వేదాలకు సంబంధించినవి.

1. ప్రజ్ఞానం బ్రహ్మ – ఐతరేయోపనిషత్తు – ఋగ్వేదము
2. అహంబ్రహ్మాస్మి – బృహదారణ్యకం – శుక్లయజుర్వేదము
3. తత్త్వమసి – ఛాందోగ్యం – సామవేదము
4. అయమాత్మాబ్రహ్మ – మాండూక్యోపనిషత్తు – అధర్వణవేదము

ఈ మహావాక్యాలలో చరాచర జగత్తంతా పరబ్రహ్మ స్వరూపం. ఆ పరబ్రహ్మ ఎవరోకాదు నువ్వే. అంటూ ఈ మహావాక్యాలు పరబ్రహ్మను ప్రతిపాదించినాయి.

జీవాత్మ పరమాత్మ రెండూ వేరుకాదు. ఆ రెండూ ఒక్కటే. నువ్వే పరబ్రహ్మ స్వరూపానివి అంటూ అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించటమే మహావాక్యార్థము.

పరమాత్మకు 1. తటస్థ లక్షణము, 2. స్వరూప లక్షణము అని రెండు లక్షణాలున్నాయి. ముందుగా తటస్థ లక్షణాన్ని చూద్దాం. **యతోవా ఇమాని భూతాని జాయంతే యేనజాతాని జీవంతి** ఎవరివల్లనైతే సృష్టి స్థితి సంహారాలు జరుగుతున్నాయో, అతడే పరబ్రహ్మ. ఇది తటస్థ లక్షణము.

కకారము – బ్రహ్మ, ఏకారము – విష్ణువు, అకారము – రుద్రుడు. ఈ మూడూ సృష్టి స్థితి లయాలకు కారణమయిన త్రిమూర్తులను చెబుతున్నాయి. ఈకారము – ఈశ్వరుడు. హకారము – సదాశివుడు. సృష్టి స్థితి లయము, తిరోదానము, అనుగ్రహము అనే ఐదు పంచకృత్యములు. ఈ విషయాలన్నీ లలితా సహస్రంలో 264 నుండి 274 వరకు **సృష్టికర్త్రీ, బ్రహ్మరూపా, గోప్త్రీ, గోవిందరూపిణీ, సంహారిణీ, రుద్రరూపా, తిరోదానకరి, ఈశ్వరి, సదాశివా, అనుగ్రహదా, పంచకృత్య పరాయణా** గల నామాలలో వివరించారు. ఇదంతా పరమేశ్వరుడి లక్షణము. ఇది మొదటి కూటమి అర్థము.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మేత్యుక్తం ద్వితీయ కూటేన ।**
**హస ఆనందః సత్యం కం హం అనన్తం చ లం జ్ఞానం ।**
**ఇత్థం బ్రహ్మ తటస్థ స్వరూప లక్షణయుగేన నిర్ణీయ ॥** **90**
**తదభేదో జీవగణే ప్రోక్తశ్శక్తిమయే తృతీయ కూటేన ।**
**జాగ్రత్స్వప్న సుషుప్త్యాఖ్య కలాత్రితయేన సాహిత్యాత్ ॥** **91**



**సకల పదం జీవపరం బ్రహ్మపరం శక్తిబీజం స్యాత్ ।**
**సామానాధికరణ్యాత్ తల్లక్షిత శుద్ధయోః అభేదార్థః ॥** **92**
**అత్యల్పమిదం కథితం యత్సర్వం ఖల్విదం బ్రహ్మ ।**
**ఇత్యేవం బోధయితుం సకలపదం వా తృతీయ కూటగతం ॥** **93**
**ఏవమవాన్తర వాక్యైః జీవబ్రహ్మ స్వరూప మభిధాయ ।**
**తదభేదో వర్ణిత ఇత్యేష మహాపూర్వ వాక్యార్థః ॥** **94**

పరబ్రహ్మ స్వరూపము సత్యము, జ్ఞానము అనంతము అని రెండవ కూటార్థంగా చెబుతున్నారు.

హస – ఆనందము, కకారానికి – సత్యము, హకారానికి – అనంతము, లకారానికి – జ్ఞానము అని అర్థం. మొత్తంమీద సత్యము, జ్ఞానము, అనంతము, ఆనందము అయిన పరబ్రహ్మ అని రెండవ కూటార్థం చెప్పబడింది. ఇది బ్రహ్మ స్వరూప లక్షణము. ఈ రకంగా మొదటి రెండు కూటములచేత తటస్థ, స్వరూప లక్షణాలను చెప్పి, మూడవకూటమితో జీవబ్రహ్మైక్యం చెబుతున్నారు.

బ్రహ్మము జగత్స్వరూపము. జగత్తు జీవరూపము 'సకల' అనే పదానికి జగత్తులోని సకల జీవరాసులు ప్రతీక. జీవులకు మూడు కళలు లేదా అవస్థలు ఉన్నాయి. అవే జాగ్రస్స్వప్న సుషుప్తులు. కాబట్టి **సకలజీవ పరంబ్రహ్మ పరం.** సకల జీవులు బ్రహ్మరూపులు. బ్రహ్మము సకలజీవ రూపము. ఈ రెండింటికీ భేదం లేదు అని భావించటమే మహావాక్యార్థము. మూడవ కూటమిలోని హ్రీంకారము శక్తిని సూచిస్తుంది. ఇక్కడ **స క ల హ్రీం** అంటే సర్వమూ బ్రహ్మమయమని అర్థము. ఈ రకంగా జగత్స్వరూపము, జీవస్వరూపము, బ్రహ్మస్వరూపము, విద్యాస్వరూపము అన్నీ ఒకటే అని భావించటమే మహావాక్యార్థము.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు బ్రహ్మవిద్యను బోధిస్తూ **తత్త్వమసి** అంటాడు. తత్ అంటే పంచకృత్యములు గల, పరబ్రహ్మ, త్వం అంటే అవస్థాపంచకం గల జీవుడు ఒకటేను అని అర్థం. అవస్థలు ఐదు. వీటినే అవస్థా పంచకము అంటారు. అవే జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయము, తురీయాతీతము. ఈ అవస్థలు గల జీవుడు, పంచకృత్యములు గల బ్రహ్మ ఇద్దరూ ఒక్కటే, వేరుకాదు.



Varivasya 04 (Final) 8-5-08

## మంత్రానికి ఇన్ని అర్థాలు కావాలా ?

**శక్త్యా లక్షణయావా యేయేర్థాః దర్శితా మనోరస్య ।**
**తేషు న కోఽపి వివాదః ప్రత్యక్షత్వేన సిద్ధత్వాత్ ॥ 95**

పంచదశీ మహామంత్రానికి చెప్పిన అర్థాలు యదార్థాలా ? కాదా ? అని అనుమానం అవసరం లేదు. అవన్నీ ప్రామాణికాలే.

**యోగినీహృదయం**లో పంచదశీ మహామంత్రానికి సర్వమంత్ర మయత్వం చెబుతూ

**వాగురామూలవలయే సూత్రాద్యాః కవలీకృతః ।**
**తథామంత్ర సముస్తాశ్చ విద్యయా మత్ర సంస్థితా ॥**

వాగురా అంటే చేపలు పట్టేవల. ఈ వలకు మధ్య ఒక కడియం వంటి వలయముంటుంది. దాన్ని ఆధారంగా చేసుకునే దారాలు వ్రేలాడుతుంటాయి. ఆ దారాల చివర ఇనుపగుళ్ళు ఉంటాయి. ఈ దారాలన్నింటికీ ఇనుప కడియం ఏ రకంగా మూలమో, అదే రకంగా సమస్త మంత్రాలకీ శ్రీవిద్య మూలం. అన్ని మంత్రాలు శ్రీవిద్యలోనే ఉన్నాయి.

**గురుక్రమేణ సంప్రాప్త స్సంప్రదాయార్థ ఈరితః**

ఈ రకంగా సంప్రదాయార్థము మొదలైనవన్నీ ఆదినాథుడైన పరమేశ్వరుని దగ్గర నుంచి, సాధకుని వరకు, గురుపరంపరగా వచ్చినాయని భైరవుడు భైరవికి పంచదశీమహామంత్రాన్ని ఉపదేశించాడు. అలాగే **కామకలావిలాసం**లో శ్రీవిద్య ఉత్తమోత్తమమైనది, మోక్షసాధకము అని చెప్పబడింది. లలితా త్రిశతి ఫలశృతిలో ఎవరికైతే మరుజన్మ ఉండదో, ఎవరైతే సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడో అతనికే శ్రీవిద్య లభిస్తుంది. అని చెప్పబడింది.

**యే పునరిహ భావార్థాదయః షడర్థా మనోరుక్తాః ।**
**తేషు యదిశక్తి భక్తీ నహి సంభవతః తథాఽపి కా హానిః ॥ 96**

**అస్తామన్యావృత్తి ర్విలక్షణాతత్ గ్రహస్తు మనోః ।**
**శివవచనేన భవిష్యతి యద్వైషా శక్తి రేవాస్తు ॥ 97**



**ఏతస్మాదయమర్థో బోద్ధవ్య ఇతీశ్వరే చ్ఛాత్వాత్ ।**
**ప్రతిపద మర్థవిశేషా జ్ఞానేఽప్యాస్తాం అఖండ వాక్యస్య ॥ 98**

ఒకవేళ మంత్రానికి భావార్థము మొదలైన ఆరు అర్థాలు అసంభవమైనప్పటికీ ఇబ్బంది లేదు. మంత్రార్థం చెప్పేటప్పుడు గాని, మేము వ్రాసేటప్పుడుగాని వ్యాకరణ సూత్రాలు పట్టించుకోవలసిన పనిలేదు. ఇక్కడ భావానికే ప్రాధాన్యత ఇవ్వాలి. **వరివస్యా రహస్యము** అనే ఈ గ్రంథంలో మంత్రానికి అర్థాలు చెప్పినవాడు భాస్కరరాయలు. ఆయన మహాపండితుడు. జ్ఞాని. ఈ అర్థాలన్నీ ఆయన అనుభవించి, దర్శించి చెప్పినవి. కాబట్టి వీటిలో సందేహం అవసరంలేదు. శబ్దాలకు మించి ఇంకొక శక్తి ఉన్నది. అదే పరమేశ్వరానుగ్రహము. పరమేశ్వరానుగ్రహమున్న వారి నోటి నుంచి వచ్చినమాట జరిగి తీరుతుంది. ఈ శబ్దానికి ఈ అర్థం అని సిద్ధపురుషుడు చెప్పినప్పుడు, ఆ అర్థం ఉండి తీరుతుంది. ఈ పదానికి, ఈ అర్థము అని తెలియటమే శక్తి. అదే పరమేశ్వర కృప. ఆ కృప లేనిదే ఎంత పాండిత్యము ఉన్నప్పటికీ ఉపయోగముండదు.

**అర్థోప్య ఖండరూపః విశిష్టమతిరిక్తమితిహి సిద్ధాంతః ।**
**ఆసేచనక వ్యాప్త్యాదిపదవదాస్తాం పదత్వమపి ॥ 99**

**ఏకస్యానేకార్థా దృష్టా హరి సైంధవాదిషు పదేషు ।**
**అన్యతమైకావగతౌ ప్రకరణ తాత్పర్యయోః విశేషకతా ॥ 100**

మంత్రం చేసేటప్పుడు మంత్రంలోని ప్రతి అక్షరానికీ మాటకీ, పదానికీ, అర్థం తెలియాలా? అనే ప్రశ్న వస్తుంది. అలా అవసరలేదు. మొత్తంమీద అర్థం ఏమిటో తెలిస్తే చాలు. పంచదశీ మంత్రానికి అర్థం ఓ పరమేశ్వరా! బుద్ధి, జ్ఞానము, ధనధన్యాలు, భోగభాగ్యాలు, కీర్తి ప్రతిష్ఠలు, శౌర్య పరాక్రమాలు నాకు సమృద్ధిగా ఇవ్వవలసినది" అని మంత్రజపం చేసేవాడికి ఈ మాత్రం తెలిస్తే చాలు.

ఒకే పదానికి అనేకమైన అర్థాలుంటాయి. అలాంటప్పుడు అక్కడ ఏ అర్థం సరిపోతుందో సందర్భ సహితంగా చూసి గ్రహించాలి. హరి లక్ష్మిని పెండ్లియాడె అన్నప్పుడు హరి అంటే విష్ణువు అని అర్థం చెప్పాలి అంతేగాని తనకు తెలుసు కదా అని హరి అంటే కోతి అని చెప్పరాదు.

**ప్రకృతేతు సర్వబోధస్యేష్టత్వాన్నో విశేషకాకాంక్షా ।**
**అథవా సకలార్థే ష్వపి శక్త్యైక్యం పుష్పవంత పదవదిహా ॥** **101**

**యత్రప్రతిపదమర్ధస్థాన్ ప్రత్యస్యాస్తు వాక్యత్వమ్ ।**
**కతిచిదవాన్తర వాక్యం, సమాసవాక్యమ్, మహావాక్యమ్ ॥** **102**

మంత్రానికి ఇన్ని అర్థాలు చెప్పారు కదా ! మరి జపకాలంలో ఏ అర్థం భావించాలి ? అన్నప్పుడు శాస్త్రప్రకారము ఇక్కడ చెప్పిన వాటిలో ఏ అర్థాలు మీకు జపకాలంలో స్ఫురించినా మాకు ఆనందమే. అలా కాదని, అన్ని అర్థాలు గనక స్ఫురించినట్లైతే మరీ ఆనందము. కొన్ని చోట్ల ప్రతిపదార్థం చెప్పబడింది. కొన్నిచోట్ల వాక్యానికి అర్థం చెప్పబడింది. అయితే మంత్రమంతా ఒకే వాక్యం కాబట్టి అనేకార్థాలు చెప్పటం దోషంకాదు అన్నారు భాస్కరరాయలవారు.

**ఏకస్యానేకార్థే వినియోగాదర్థ బాహుళ్యమ్ ।**
**వేదే బహుళం స్వీకృతమ్ అత్రత్వేకత్ర వినియోగాత్ ॥** **103**

**అఖిలార్థ బోధ నియమో నియమాదృష్టం ప్రకల్పయతి ।**
**సిద్ధే ప్రమాణ దార్ఢ్యే సకలం కల్ప్యం హి తదవిరోధాయ ॥** **104**

వేదంలో శ్రీసూక్తానికి, దాన్ని ఉపయోగించే సమయాన్నిబట్టి అర్థం చెబుతున్నారు. దేవికి అభిషేక మంత్రంగా శ్రీసూక్తం చెబుతారు. షోడశోపచార పూజలో చెబుతారు. ఈ రకంగా అర్థాలు మారతాయి. అలాగే పంచదశీ మహామంత్రానికి అనేకార్థాలు ఉన్నాయి. మంత్రముయొక్క అన్ని అర్థాలు పరదేవత యందే ఉంటాయి.

ఈ రకంగా మంత్రానికి ఇన్ని అర్థాలు చెప్పటంవలన సమస్తమైన కర్మోపాసన వలన కలిగే ఫలము పూర్తిగా దక్కుతుంది. అనేకమైన అర్థాలు మంత్రానికి ఉన్నాయని తెలియటం, అవి ఒకే కాలంలో స్ఫురించటంవల్ల విశేషమైన ఫలితం వస్తుంది. ఇంత గొప్పదైన మంత్రాన్ని నేను జపిస్తున్నానని తెలిసినప్పుడు సాధకుని జపం ఫలిస్తుంది.



## జపఫలితం వెంటనే వస్తుందా ?

**యాగస్య స్వర్గం ప్రతిసంసిద్ధే హేతు హేతుమద్భావే ।**
**తదనుపపత్తిం నిరసితుమ లౌకికాపూర్వమితి క్లుపమ్ ॥** **105**

మంత్రజపం చేస్తే ఫలితం వెంటనే వస్తుందా ? అంటే జ్యోతిష్టోమయాగం చేస్తే స్వర్గలోకం ప్రాప్తిస్తుంది. అయితే అది రావటానికి కొంత సమయం పడుతుంది. అలాగే మంత్రానికి చెప్పిన అర్థాలు సత్యమైనవి అని మనస్ఫూర్తిగా నమ్మి జపం చేసినట్లైతే, సాధకుడికి ఫలితం తప్పక వస్తుంది. అయితే వెంటనే రాదు. కొంత సమయం పడుతుంది.

## అంతరంగ సాధన

**విద్యావర్ణే యత్తోద్ధారః కాల స్తదుచ్చారః ।**
**ఉత్పత్తిస్థానం అథోయత్నో రూపం స్థితి స్థానమ్ ॥** **106**

**అకారః స్వరూపం విభావ్యమర్థాః అన్తరఙ్గాణి ।**
**ఋషయశ్ఛందో దైవత వినియోగౌ బీజశక్తి కీలాని ॥** **107**

**న్యాసోధ్యానం నియమాః పూజాదీని బహిరంగాణి ।**
**బాహ్యాన్యఙ్గాని పునః ప్రాయో లోకే ప్రసిద్ధకల్పాని ॥** **108**

**దుర్లభ మాంతర మఙ్గం ప్రాయోఽన్తరముఖజనైః తదాదృత్యమ్ ।**
**తోషాయైషా తేషాం అతః ప్రదిష్టా రహస్య వరివస్యా ॥** **109**

**ఏతాముత్సృత్య జడైః క్రియమాణా బాహ్యాడంబరోపాస్తిః ।**
**ప్రాణవిహీనేవ తనుః విగలిత సూత్రేవ పుత్తలికా ॥** **110**

**బీజాన్మూలం మూలాత్ క్షేత్రస్య అంతస్థ బాహ్యావిస్తారౌ ।**
**యద్యప్యనయోస్సామ్యం ప్రాధాన్యమథాపి చ అన్తరఙ్గస్య ॥** **111**

మంత్రములోని అక్షరాల నియమము, కాలము, ఉచ్చారణ, అక్షరాల ఉత్పత్తి స్థానాలు, వాటి ప్రయత్నము, అక్షరాల రూపము, వాటి ఆకారము, ఊహించతగిన అర్థము అన్నీ ఆంతరంగికాలు.

ఇక ఋషి, ఛందస్సు, దేవత, శక్తి, బీజము, కీలకము, న్యాసము, ధ్యానము, పూజ. ఇవి బహిరంగ సాధనాలు.

అంతరంగ సాధనాలు అందరికీ సాధ్యంకావు. అవి అంతర్ముఖం కాగలిగిన వారికే సాధ్యమవుతాయి. బహిరంగ సాధనాలు తేలిక. అందుచేతనే ఈ వరివస్య అంతా అంతర్ముఖులకోసం చెప్పబడింది.

అంతరంగ సాధన లేకుండా కేవలము బాహ్యపూజ అనేది కేవలము ఆడంబరమే అవుతుంది. అది దారం లేని బొమ్మ వంటిది. ప్రాణం లేని దేహం వంటిది.

మంచి నేలలో మంచి విత్తనాన్ని పాతినట్లైతే, భూమిలో వ్రేళ్ళు ఏర్పడి పెద్ద చెట్టు అవుతుంది. అదే విధంగా ఉత్తముడైన గురువుచేత, శరీరము అనే క్షేత్రంలో కామకలాక్షరమనే బీజాన్ని పాతినట్లైతే, అది మూలమవుతుంది. చెట్టుకు ఎప్పుడూ వ్రేళ్ళు బలంగా ఉండాలి. అలా అయితే ఒకవేళ బయట కొమ్మలు విరిగిపోయినా, మళ్ళీ చెట్టు చిగురిస్తుంది. కాబట్టి సాధకుడు భావనోపనిషత్తులో చెప్పినట్లుగా అంతరంగ సాధన ఎక్కువగా చెయ్యాలి. ఈ సాధన జపం లేని పూజలు పునాది లేని గోడలు. వాటివల్ల ఉపయోగం ఏమాత్రం లేదు.

## గురుకృప

**సద్గురుకులతః కృపయా లబ్ధా కామాని యం సూతే ।**
**నిజబుద్ధి మాత్రజన్యా పాపం కన్యా యథా స్వీయా ॥ 112**

**అకథాసనం హళక్షాన్తరం సమాసాద్య మామకం జ్ఞానమ్ ।**
**మామకమేవానన్దం మహ్యం దదతో జయంతి గురుచరణాః ॥ 113**

**గురుచరణైక సహాయో భాస్కరరాయో జగన్మాతుః ।**
**వరివస్యాతి రహస్యం వీరనమస్యం ప్రజగ్రంథ ॥ 114**

కాబట్టి గురువుయొక్క కృపాకటాక్ష వీక్షణాలు పూర్తిగా పొందాలి అంటున్నారు భాస్కరరాయలవారు. **నగురోరధికం తత్త్వం నగురోరధికం తపః ।**



గురువును మించిన తత్త్వం లేదు. గురువును మించిన తపస్సు లేదు. అన్నిటికన్నా ఉత్తముడు గురువు. భగవంతుడికి కోపం వస్తే, గురువు రక్షిస్తాడు. అదే గురువుకు కోపం వస్తే భగవంతుడు కూడా రక్షించలేడు. కాబట్టి సర్వోన్నత స్థానంలో ఉండేవాడు గురువు. అటువంటి సద్గురువు మూలంగా లభించిన విద్యవల్ల, సాధకుని కోరికలన్నీ తీరతాయి. అంటే గురువు నిర్మల మనస్కుడు, సచ్చరితుడు అయి ఉండాలి. మన దగ్గర నుంచి ఏదో ఆశించి మనకు మంత్రం చెప్పకూడదు. ధనధాన్యాలు, భోగభోగ్యాలు ఇవేవీ మననుండి ఆశించకూడదు. మంత్రోపదేశం చేసే గురువు సిద్ధపురుషుడైతే మంచిది. లేదా మంత్రాన్ని అక్షర లక్షలు జపం చేసినవాడై ఉండాలి. కనీసం లక్షసార్లైనా జపం చేసుండాలి. లేకపోతే గురువుగారిచ్చే శక్తిపాతానికి అర్థం ఉండదు. మంత్రం తీసుకోబోయే ముందే ఈ విషయాలన్నీ ఆలోచించుకోవాలి. మంత్రోపదేశం చేసిన గురువు మనకన్న వయసులో చిన్నవాడైనా, బంధువైనా, ఇంకెవరైనా సరే అతడియందు చులకన భావం పనికిరాదు. గురువుగారికి పైన చెప్పిన సత్ప్రవర్తన, నిస్వార్థము, భగవంతునియందు భక్తి తత్పరత అనేవి ఉండి తీరాలి. అప్పుడే మంత్రం మంచి ఫలితాన్నిస్తుంది. లేకపోతే గురువువల్లనే ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది.

నేను చాలా గ్రంథాలు చదివాను. నాకు శాస్త్రపాండిత్యం చాలా ఉంది. ఈ మంత్రం గురించి నాకు తెలుసు. కాబట్టి నేనే స్వయంగా మంత్రం తీసుకుంటాను అనుకోరాదు. అలా తీసుకున్న మంత్రాలు మంచి ఫలితాలనివ్వవు. గురువు ప్రత్యక్షంగా మంత్రం చెప్పకపోయినా, కనీసం ఈ మంత్రం ఫలానాచోట ఉన్నది. "దాన్ని తీసి నువ్వు జపం చెయ్యి" అనే మాటయినా చెప్పాలి. మంచి గురువు దగ్గర తీసుకున్న మంత్రం అన్నివిధాలా ఉపకరిస్తుంది. కాబట్టి, మంచి గురువును ఆశ్రయించి, ఆయన కృపకు పాత్రులై, వారిదగ్గర మంత్రోపదేశం పొంది, ఆ గురువును దైవసమానంగా పూజించాలి. ఆయన చెప్పిన ప్రకారమే కఠోరమైన సాధన చెయ్యాలి. అప్పుడే మంత్రం మంచి ఫలితాన్నిస్తుంది.

ఈ రకంగా నాకు దివ్యమైన శ్రీవిద్యను ప్రసాదించి, ఆత్మజ్ఞానం పొందేటట్లుగా అనుగ్రహించిన నా గురువులకు నమస్కారము. అంటూ గురువందనం చేసి,



Varivasya 04 (Final) 8-5-08 76

భాస్కరరాయలవారు తమ గురువులయొక్క సహాయము సంపాదించుకుని, జ్ఞానులచేత కూడా నమస్కరింపదగిన **వరివస్యా రహస్యము** అనే గ్రంథాన్ని పూర్తి చేశారు. అదే విధంగా నా గురుపరంపర అయిన విరజానందనాథ సదానందనాథ, శుకానంద నాథుల యొక్క కృపతో, సాక్షాత్తు దత్తావతారులైన అవధూత, దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారి ఆశీస్సులతో

**హరితస గోత్రీకుడు శ్రీ క్రోవి పురుషోత్తమ శర్మ,**

**శ్రీమతి లక్ష్మీ నరసమ్మగార్ల పౌత్రుడు**

**శ్రీ క్రోవి కృష్ణమూర్తి శ్రీమతి సత్యపర్వత వర్ధనమ్మగార్ల జ్యేష్ఠపుత్రుడు**

**'పరమానందనాథ' దీక్షానామధేయుడు అయిన క్రోవి పార్థసారథి**

**సర్వజనామోదము పొందునట్లుగా, అత్యంత సులభశైలిలో వ్రాసిన**

**"వరివస్యా రహస్యము" అను వ్యాఖ్యాన గ్రంథము సమాప్తము.**

***సర్వేజనా స్సుఖినోభవంతు***

***సమస్త సన్మంగళాని భవంతు***

***ఓం తత్సత్***